# అక్షరధార

{దీర్ఘ కావ్యం}

శైలజామిత్ర

శ్రీ రమణ మురారి కనుగొనెనో కదా ఈ భువిని
పలుకుల ననుసరించి వాణి సుస్వర మాధుర్యంతో
తన వీణానాదంతో సృష్టినంతా స్పర్శించదలచి
నా అక్షరాల మాలను ఆశ్రయించినదన్న తలపుతో
కదిలెడి నా కలము నిత్యం మోకరిల్లె కదా ఆ పాదాలకు
నులివెచ్చని నా హృదయం పరువుగా పరచిన ఈ సమయం
నన్ను నీ బిడ్డగా కనికరించుమా వాగ్దేవి సరస్వతీ!

ఓ ప్రకృతీ! పిలిచావా?
ఎన్ని కలాల సంస్కృతిని నింపుకున్న నీవు
నన్నెందుకు రమ్మన్నావు?
ఆలపించడానికా? లేక ఆనందించడానికా?

నీ వక్షస్థలంపై విరబోసుకున్న చెట్లు చిరునవ్వులు చూపించడానికా?
నిన్ను అనుసరిస్తూ, నీతోనే జీవిస్తున్న
పక్షి సంతతి బాగోగులు అప్పజెప్పడానికా?
వేర్లలో గుండెను దాచుకుని భూమాతనే ప్రాణంగా ఎంచుకోడానికా?

చినుకు పడినా లేకున్నా
మండుటెండలు భయపెట్టినా
ఎవరికో అడ్డంకని చేతులు కాళ్ళు తెగ్గోసినా
చిరునవ్వులు చిందిస్తూ ,

నీడనిస్తూ, కాపుకాస్తూ, నీరసంగా ఉన్నా
నిలువెత్తుగా ఎదిగి
కాయలు మొగ్గలై
మొగ్గలు పువ్వులై

ఉదయించే సూర్యోదయాన్ని స్వాగతించే
నీ సంస్కారాన్ని నేర్పడానికా?
నా ఎదుట నిలిచిన రాత్రి నిశ్శబ్దమైపోతోంది
నన్ను కాదన్న మేఘం పల్లవి పాడుతోంది

నేను సుతారంగా కదిలిపోదామనే అనుకుంటాను.
వెంటనే కన్నీరులా మారిపోతాను.
పూలరెక్కలతో వర్షగమనాన్నై అవతరిస్తాను.

నాపై ఒదిగిపోతున్న పరిమళవీచిక ఊహలా రూపుచెంది

గగన హృదయంలా మారి ప్రాణంలా నిలిచిపోతాను.
ఎన్ని ఆలోచనల అల్లికో కదా నా రూపమైంది ఈ నాటికి!
అమృత సరస్సులై తప్పని ప్రళయస్థితిని ఆపాదించుకుని
సుగమ గీతికలా అవతరించింది మరో సృష్టి

ఇది ప్రకృతి విడిది చేసిన కాలాతీత లిప్త!
వెలుగుకై మనిషి జీవితం చేసే ఒక దీక్ష!
ఒకరోజు ఎందుకో
చుక్కలు విరిసిన ఆకాశాన్ని కప్పుకుని విశ్రమించా

నా పాలనేత్రంలోంచి కనిపించే ఆకాశానికి కించిత్ గర్వం కలిగిందేమో
ఎద ఎదలో కనిపించే జ్యోత్స్నాకృతి మనోభూమికలో చేరింది.
అమాంతం నన్ను ఆలింగనం చేసుకుంది
కొండల వెనుక దాక్కున్న సూర్యబింబం మూతిముడిచి

నీలాకాశపు వంపూ మీదుగా నా ముఖపత్రాన్ని స్పృశించింది
నక్షత్రాలన్నీ విరబోసిన చెట్టుమీదుగా వాలింది!
తమ పూర్వస్మృతుల సౌరభంతో అవనిjైంం కవితjైంం
గగనమై సృజన కావ్యమై అగ్నిబీజ హాసంతో కలగలిసి

వర్తమాన దిశకు అంకురార్పణ చేసిన ఒక ముద్ర!
వర్గ రూపాల్లో త్రికరణశుద్ధిగా కనిపించే సమాజ రౌద్రం!
ఉలిక్కిపడ్డా !నా ప్రమేయం లేకుండా నా వంటిపై
వెన్నెల తారాట్లాడటం చూసి!

గుండె ప్రస్థానంలో అడుగు సమంజసమే!
మాటల శతపత్రపు జ్వాలలో చల్లని సెగలు సామాన్యమే!
అయినా భూమి తన చుట్టూ తాను తిరుగుతోందనే అనుకుందాం!
దిశదిశల నిశారూపాల్లో రవిచంద్రులు

స్థానచలన భ్రాంతిని పొందారనే నిశ్చయించుకుందాం!
మనోనేత్రం ఒక్కసారి తెరచి చూసానా
ఎపుడో అదృశ్యంగా పాతుకుపోయిన నా కంటివేర్లు
కిసలయ పుష్పాలను జతచేసుకుని

చరచరా పాకే చప్పుడులో తెలియని సంగీతం!
ఆవేదనల నురగలు అదిరిపడేటంతటి సనాతన కొమ్మల స్వైర్యవిహారం!
కిసుక్కున వేలు తెగింది!
బొటబొటా భూమిని పావనం చేస్తున్న నా రక్తం
దప్పికతో పిడచకట్టుకుపోతున్న పక్షులకు దాహం తీర్చింది!

మనిషి ఆరుపుకే సంగీతమనే ఆలోచనలో శరీరాల్ని ఎండకు ఉంచింది

చలికి ముడుచుకున్న ప్రపంచానికై అన్వేషణ ప్రారంభించి ఉంచిన
నా హృదయం చెలియలి కట్టగా మారి చినుకులై కురిసింది!
వసంతం వచ్చిందాని చెట్టుతొర్రలోంచి తొంగిచూసిన కోయిల

ఇక రాదని గ్రహించి తన పాటను తాను అందుకుంది
ప్రకృతి మాత జుట్టువిరబోసుకుని ఘర్జిస్తూ, ఘోషిస్తూ,
సప్త సముద్రాలను సైతం లంఘిస్తూ
లొంగిపోని సముద్ర కెరటాలను ఆపి వెనక్కు పంపింది

మనిషి నిలుచున్న నీడ చెట్టుకు అర్థం!
ఉదయారుణ రూపంతో జీవితం అన్నింటికీ సంసిద్ధం!
ఎంత ధైర్యం ఆకాశానికి ?
నా పైనే నీటిని కుమ్మరిస్తుందా?

తళతళలాడే నా చుక్కల చీరనే సవాలు చేస్తుందా?
అనుభూతుల సవ్వడిలో సమార్ద్రమైన మనసు
పొరలు పొరలుగా, తెరలు తెరలుగా
దేవతల రాక్షసుల దృశ్యమాన సౌశీల్యవంతుల ఛాయలుగా

ఆత్మను చుట్టుకున్న ముసుగుతో మనిషి వ్యక్తిత్వం
ప్రకృతితో పోల్చితే నిలబడే తాహతుందా?
ఏపుగా పెరిగిన పచ్చని పైరును
ఒక్కసారిగా కోసి హృదయానికెత్తుకున్నట్లు

సాహసకృత్యాలు చేయిస్తుందా?
కళ్ళు, చెవులు ఎవరి ఆధీనంలో లేవు కదా
నాగరికతల మాటెందుకు మరి?
శిలలు కలలై కలలన్నీ రాతి బొమ్మలై నిలుచుంటే

రేఖా చిత్రాల సంగతెందుకు మరి?
నీల దుకూలం కప్పుకుని నిద్రిస్తున్న
చీకటికి ఎందుకంత మొండితనం?
నింగి సైతం తలవొంచి నేలను చుంబిస్తుందే?

అలాంటిది ప్రకృతితోనే సవాలు విసురుతుందా?
అందుకే చీకలంటే ఎవరికీ పడదు
ఒంటరిగా ముద్దగా మారిపోవడం తప్ప మరేం మిగిలిందని?
వెలుగులో చెట్టుకింద కొమ్మల రెప్పల కన్నీటిని తుడిచి

చీకటి గెలుస్తుందా? ససేమిరా!
బంగారు పూల వస్త్రాన్ని కప్పుకున్న
ఒళ్లయితే సిగ్గుతో చచ్చిపోతోంది కానీ
ప్రకృతి చలనం లేకుంటే ఎవరికైనా న్యాయనిర్ణేత కావచ్చు!

అందుకే నా పరుగుల పట్టుచీర తనకు ..
తన ఉరుకుల తెరగల ఛాయాచిత్రలు నీకు..!
ఉల్కల చమ్కీల చిరునవ్వులు అచ్చంగా నాకు!
ఒకానొక ఆసామి

అడవిలో విశ్రాంతి కోరుకుంటున్నాడు
గాయపడిన అడవి కట్లుకట్టుకుంటోంది!
గొంతెత్తి ఏడుస్తున్న గాలిని ఓదార్చుతూ!
వెన్నెల నీదే! వెలుగు నీదే!

గాయాల గేయాలెందుకు ఇంక?
మనసును వ్యాపార నిమగ్నం చేయడానికా?
దిక్కుల దృక్కులు చెమ్మగిల్లి మధుపరాగమవ్వడానికా?
ఆకాశం వంగి నేల తల్లిని చుంబిస్తోంది

నేల మురిసి ముద్దై ఆనందంతో కన్నీరు పెడుతోంది!
ఏ నాగరికత అయినా ఎదిగిన వృక్షాన్ని నరికేస్తామా?
ఆధునికత సౌధాలనుండి నీడలన్నింటినీ వదిలేస్తామా?
పగిలిన గుండెముక్కలు!

నేలపై కదిలే మట్టి బొమ్మల రీతిలో
ఆవేదన ఆవరణలో ఒక్క శేమిటి?
ధ్వనులున్నాయి! ప్రతిధ్వనులున్నాయి!
ప్రతిరూపాలున్నాయి! పనికిరాని రూపాయిలున్నాయి!

అంకిత తత్వంలేని జీవితాన్ని అహిలా చుట్టుకున్న
అహంకారం చుట్టుకున్న ఆకాశాన్ని వదిలించకుంటుందా?
ముడుచుకుని పడుకున్న ఆత్మల్ని లేపి
కాలాన్ని  సుదీర్ఘమైన తోరణంలా మార్చగలమా?

చెట్టు ఎక్కడున్నా నీడ తప్పదు!
జీవితం ఎక్కడున్నా ఊహ తప్పదు!
ఇది ఆది తుది లేని, అంతం లేని ఒక వ్యథ!
ఎవరికి వారే మేల్కొన్నట్లున్న వెలుగుచూపుల ప్రబోధ!

అసంఖ్యాక తారలు ఆకాశంలో ఉన్నా పగలు కనిపించవు!
వేలకు వేల శరీరాల్ని తాకే నేల చీకట్లో కనిపించదు
స్పర్శ చీకటిలో కొంత భాగం! వెలుగులో కొంత భాగం!
నిరీక్షించే పక్షి సమయాన్ని ఎవరో అమృతమూర్తి వచ్చి

ధైర్యమిస్తారనే ఆలోచన పగిలిన అద్దం ముక్కల్లాంటి స్వప్నంలో
అనుమానపు రేఖల స్పష్టత లేదు.
నిదుర వస్తే సంతోషంగానే ఉంటుంది.
అయితే ప్రపంచాన్ని మరచిపోవడం మాత్రం కలగానే మిగిలిపోతుంది.

ఉదయం తలుపు తెరవగానే తిరుగుతున్న మనుష్యుల్లో
జీవం లేదు. ఎవరి ఆసరా లేకుండా నడుస్తున్న శవాల్లా అనపిస్తోంది
మనసుతో పనిలేదు. చేతిలోని భాష తైలమేననేది కనిపిస్తోంది.
ఉన్నది ఒకటే సత్యం సూర్యుడు

వదిలి వెళ్లేది ఒకటే వాస్తవం జీవుడు
ఉషస్సు తొలిసారిగా కనిపించడానికి
మనం ఆకాశాన్ని చేరుకోనక్కరలేదు
బతుకంతా యశస్సును సాధించడానికి

మన వయస్సును తాకట్టు పెట్టక్కర్లేదు
కటిక చీకటిలో కనిపించనిది ఒక్క నేలతల్లి మాత్రమే
వెలుగులేకున్నా ప్రతిఫలించేది ఒక్క మానవత్వం మాత్రమే!
ఆత్మలు ముడుచుకుని పడుకున్నాయని అనుకుంటాం కానీ

అంతరాత్మలు ముడుచుకోవడం మొదలుపెట్టాక
ఆత్మలన్నీ వెండితెరపై నటిస్తున్నాయి.
నేల మాళిగల్లో దాక్కుని చెట్టులోనో, పుట్టలోనో
జీవించడమే కాదు పిల్లలతో సహా కాపురాలే చేస్తున్నాయి

అసలు మనిషి మనిషిగా ఎపుడు జీవించాడని?
ఆర్ద్ర భావనకు విడిగా ప్రపంచం ఎక్కడుందని?
ఎవరో దూరంగా నిలుచున్నారు
వృక్షం నడిచి వస్తోందా? లేక

నిర్భయం నీడలా కదిలి వస్తోందా?
చెల్లా చెదురైన కేశ రాజాలతో కలిసి
బొప్పి కట్టిన పాలభాగాన్ని చేతితో రుద్దుకుంటూ
విసిరే వాయు ఛురకలను తప్పించుకుంటూ

దెబ్బతిన్న భుజాలను మోస్తూ
అడుగులో అడుగేస్తూ
అనుమానిస్తూ.. అనుసరిస్తూ
మౌనముద్రలా వచ్చే బింబం ఎవరిది?

ఎక్కడా చూసినట్లు లేదే?
అయినా ఆడిన మాట తప్పని ఆగంతుకులు ఎవరున్నారని?
ఒక్కసారి చూసి మరొకసారి చూద్దాం అనుకునే
మానవులు ఎక్కడున్నాయని?

అమృతం అమ్మతనంలో ఉందా?
అమ్మ అనుకునే మన మనసులో ఉందా?
అమ్మాయి అమ్మయినట్లు

అమ్మ అమృతం అయినట్లు

ఎంత కష్టాన్నైనా తట్టుకుని నిలగలిగే మూర్తి
శాంతి సహన దీప్తి!
చేతులు కాల్చుకోవడం నుండి
కాలిపోతున్న గుండెను మోస్తున్న స్ఫూర్తి!

ఆకలికి దారిద్ర్యానికి ఎంతో వ్యత్యాసం ఉంది
ఆకలి ఒకరోజు కాకుంటే మరొకరోజు తీరిపోతుంది
దారిద్ర్యం మనల్ని దుస్తుల్లా అనుసరిస్తూనే ఉంటుంది
తప్పటడుల నుండి తప్పటడుగుల వరకు

చేతుల్ని అందుకుని గమనం సాగించిన సాహసమతి!
ఆలౌకికమైన ఆనందాన్ని అందిస్తున్న ఏకైక రసస్ఫూర్తి!
ఏం చేద్దాం?
గాజుపాత్రాల్లాంటి పాత్రలతో సంసారమాయె!

మమకారంతో వండిన వంటకాలాయె!
సుతిమెత్తని గుండెల్ని పిండి చేసి ఆ సారాన్ని
ఏక బిగిన తాగి వంటపట్టించుకున్న పరిణామాలాయె!
వరదలని, బురదని, ఊపిరి ఆడటంలేదని

తృటిలో ప్రాణాలు వదిలిన జీవితాలకు పరదర్శకాలాయె!
అరగదీసిన గంధం సుగంధంగా మారి
చేతికి అంది, గుండె ముక్కల్ని ఏరుతూ
అతికించడానికి అవస్థలు పడేకంటే ఆవేదన ఏముందని?
చరిత్ర ఎవరినీ వదలదు
కావాలని వెంటపడినవారినీ వదలదు
వద్దని పారిపోయినవారినీ వదలదు
ఎన్నో రహస్యాలను ఆ పాతతాలూకు శిథిలాలలో దాచి ఉంచిందట

మనవళ్ళకు, ముని మనవరాళ్ళకు కథలుగా చెప్పాలని
తెలివిగా చేజారిన స్వప్నమవుతుంది!
ఏమీ తెలియకున్నా ఏదో తెలిసినట్లు ప్రవర్తించి
భావితరాలకు వాస్తవబింబమవుతుంది!

ఏది చూసినా ఎక్కడో చూసినట్లుంది
పూర్వజన్మ తాలూకు స్వస్థలమా?
లేక తిరిగి తిరిగి మరచిపోయిన పరిచయ స్వరమా?
చూసిన మనిషిని ఎక్కడో చూసినట్లు

మాట్లాడిన మాటలు ఎపుడో మాట్లాడినట్లు
నడిచిన స్థలాలన్నీ నాతో ఎప్పటినుండో ఉన్నట్లు
తాకిన స్పర్శలన్నీ సుపరిచితమయినట్లు

ఏదో కాస్త అస్పష్టత! మరికాస్తంత అస్వస్థత!

సంస్కారం! సౌశీల్యత! సౌభాగ్యం!
ఇదివరకెన్నడూ లేనంత ఆకాశమంత ఎత్తుగా!
వర్తమానం భవిష్యత్ తో కలిసినంత ఆనందంగా!
కంటి రెప్పలు బరువైతే కలత కాదనే నీతి రాజనీతి

కంటికి  కనిపించేదంతా ద్వంద్వరీతి
మనసంతా అంధకారమైన వృక్షమైనపుడు
మండుటెండల స్వభావంతో
తిమ్మిర్లు ఎక్కే చూపులతో
మబ్బులు కమ్మినట్లున్న ఆలోచనలతో
ఆత్మ నేత్రం తెరిచే ఉందని చెపితే నమ్మేవారెవరు?
దేశమంతా నాదే అనే వాదనలను భరించేవారెవరు?
మానవీయత వసంతరాగం పాడుతుంటే కాదనేవారెవరు?

దానవత్వం కళ్యాణి రాగం పాడుతుందంటే వినేవారెవరు?
ఎపుడూ నడిచే ఆ దారిలో
మెరుపు మెరిసే సరికి  మాటరాలేదు!
కాలాన్ని మింగేసేలా ఆచూపులు

ఎవరికి వారుగా  నిలవనీయడం లేదు!
వృక్షాలను రక్షించాలని,
కోరికలను జయించాలని
శిశిరాన్ని చూస్తూ ఆనందించాలని,

గ్రీష్మాన్ని తప్పక భరించాలని
అనుకుని భారంగా నడుస్తున్న ఆ రూపం
నేల గుండెలో పూలు పూయించింది
కన్నీరు పన్నీటిగా మార్చింది

ఆ మాటలు వినిపించలేదూ?
నీడ మాట్లాడుతూనే ఉంది
శిఖలు ఎపుడు తప్పుకున్నాయో ఏమో
అందరినీ వదిలి వెళ్ళిపోయాయి .

ఇప్పటిదాకా ప్రకృతిని అనుసరించిన ఆ దృశ్యాలు
ఇంతలో ఏమయిపోయినట్లు..?
దీపం నాదంటే నాతోనే ఉండపోతుందా?
దీపం ఇంటిదని ముట్టుకుంటే ఊరుకుంటుందా?
దీపం అలవాటైందేనని నూనెలేకుండా వెలుగుతుందా?
వత్తిలేకుండా దీపం ఉంటుందా?
అన్నింటికంటే ముందుగా ప్రమిద లేకుండా దీపం ఎక్కడిది?
ఎవరైనా అంతే!

వేళ్ళు అయిదయినా ఆరయినా
వరుసగా ఒకలే తీరులో ఉంటే పనికిరావు!
గుండె రూపం అంతా ఒకేలా ఉన్నా సరే
గుప్పెటను మించిపోదు

ఈ రోజు మనదే!
రేపు మనదే అనడానికి తార్కాణాలు లేవు
ఇకపై వచ్చేరోజులన్నీ ఆశీర్వదిస్తేనే ఆయువు పెరుగుతుంది
కలిసి నిలుస్తాయి! శక్తులన్నీ ఏకమవుతాయి!

చల్లని సూర్యుడూ! వెన్నెల చంద్రుడూ
మనిషిలో లేకపోలేదు
రాబోయే క్షణాలన్నీ నవ్వుతుంటేనే ఆనందం మనదవుతుంది
రోజులన్నీ రోజాలయితే ఎవరు కాదంటారు?

క్షణాలన్నీ నక్షత్రాలయితే ఎందుకు వద్దంటారు?
నీలాకాశం కన్నీటి పరమవుతుందంటే
కాంతి రేఖలు ఒలమి పాలవుతున్నాయంటే
భయం ఛాయలు ఎందుకున్నాయంటే

నిజం కాంతులు ఎంతకాలం వెలుగుతాయంటే సమాధానం లేదు!
గాలిలో అమాయకత్వం ఉందా అంటే లేదనాలి
తెరలుతెరలుగా తుమ్మెదల రa◌ా◌ంకార నాదాన్ని నిద్రలేపి
గుండె పొరలలో చేరి పాడుతున్న స్పర్శ రాగం

పగలడానికి వీల్లేనంత ఎదలో సన్నని ధ్వని!
మనో ప్రదర్శన ముందు ప్రయత్నం తెగిపడినట్లు
మట్టిలో మౌనం ముచ్చటైన నికుంజం!
మనం అనుకుంటాం ఎవరి జాగ్రత్త వారిదే!

అనుకోకున్నా సరే ఎవరి జీవితం వారిదే!
చేతివేళ్ళు కూడా అందివ్వలేని ప్రాయం
పాదరసం గుళికలా హృదయాలను రంజింపజేసే గీతం!
చేతివేళ్లతో హెచ్చరించే వయోధికం

మెరుపుల్లా దూసుకుని వచ్చి నిండుప్రాణాలు
తీస్తుందనేది గతాను గతం!
వెన్నెల స్నేహంలా నవ్వుతూ వచ్చే
ఎడారి అడవిని ఆశ్రయించడం విడ్డూరం!
ప్రశ్నించడం అజ్ఞానం!

సమాధానం తెలుసుకోవడం తిరోగమనం!
సుమధుర ఫలాల్ని అందిస్తోందని చెట్టు విర్రవీగదు

చేదు నిజాల్ని తెలియజేస్తోందని మందు అహం చూపదు
వాస్తవంలో జీవిస్తున్నానని బతుకు తలదించుకోదు

బంధామృత జిహ్వాల నడుమ తారాడే భుజకీర్తి దృశ్యం!
వేదనం, కన్నీటినివేదనం రెంటినీ
స్పృశించిన శీర్షం తనువృశైలం
నేడు గగన తలంపై పారిజాతపుష్పమై ద్విగుణీకృతం అవుతుంటే

కాల మహా వేదికపై కనిపించేవి రెండే సత్యం, స్థైర్యం!
చెట్టు మౌనంగా ఉందని భాషలేదని అనుకోవడం కద్దు!
పక్కవీధిలో చెట్టు నరుకుతున్నారని చెప్పిన విషయం
ఎన్ని చెట్లకు చేరుతుందో తెలియని మనమే ఒక మొద్దు!

విజయం చెట్లకు పూసే పండ్లు కాదు
అపజయం నేలను రాల్చే ప్రాణం కానేకాదు.
మంచో చెడో, కూడా తెలియని మింటి చిత్రాలు
మనకు తెలిసిన మనిషి, మాను, చెట్టు, పిట్ట,

ఓటమి అంగీకరిస్తేనే కదా ప్రకృతి ఉగ్రరూపం!
ప్రతి కదలిక విజయానికి దారయతేనే కదా
సూర్యచంద్రుల అభినివేశం!
అందమైన తాజ్ మహల్ ప్రకృతి ఒడిలోనే ఉంది

భయానకమైన అడవులు ప్రకృతితోనే నిండి ఉంది
ప్రేమ మనిషిలో అంతర్భాగమైతే
ప్రకృతి అణువణువు ప్రేమమయమే!
చినుకురాలినా, గ్రీష్మం మండిపడినా

వసంతం నవ్వినా, శిశిరం అల్లరిచేసినా
అంతా స్వేచ్ఛాకాంతికోసం పరితపించే అనురాగమే!
నాకు తెలుసు మేఘమా!
నేలంటే నీకెంత ప్రేమో!

పిడుగులు కురిపించి బిడ్డల్ని భయపెడతావు
మెరుపులు మెరిపించి ఆకాశంలోకి చూడద్దంటావు
ఎంత విలయతాండవం చేసినా నీ కళ్లల్లో మెరుపులు
ఎంత అమాయకంగా నన్ను అలరిస్తాయో నీకు తెలియదు

నేను నీ ప్రేయసిని. నీతోనే నిత్యం నన్ను నేను
ఆవిష్కరించుకునే దాకా గమ్యం తెలియని బానిసని!
పొగలంటావు. దుమ్ము సెగలంటావు
ఏదయితేనేం? బతుకుపై ఆశ పతాకాలే కదా?

ఆశయినా, ఆశయమైనా కన్నీరుపెడితేనే కదా

తాదాత్మ్యం చెందేది.
కోపమయినా, ఆనందమయినా మాట్లాడితేనే కదా
బయటపడి నిరీక్షణా దిశల పరిణితిని సాధించేది.

అద్దంలో నీడలవలె మనసులో బొమ్మలు
వడగండ్ల వంతులతో కదిలిపోయే మబ్బుల తాలూకు
చిత్ర విచిత్రాకృతులతో వచ్చిపోయే బంధుగులు!
అగ్ని దేవతను అక్షరాలా ఆవిష్కరించే కణకణలాడే మట్టిపూలు!

ఉదయం ఒక నియంత
సాయంత్రం ఒక దిగంత
రాత్రి రోజును ఆసాంతం భరించే మాత!
నియంతల హంతకుల గుండెల్ని గోరీకట్టేసి

కత్తికో ఖండగా తెగనరికిన భాగాలన్నీ
రోడ్డుకు వారగా పడేస్తే
కనిపించని ఆ రక్త చారికలు
మానవ మృగ అద్వైతానికి నిదర్శనాలు!

విద్యుత్తు విద్వత్తులా పాకి
చల్లదనం ఎరుగని నిప్పుపూలను కళ్ళలో వేసుకుని
పైకి నవ్వులు రువ్వే అకాల మృత్యు ముఖాలు
ఎందుకు నన్ను అలరిస్తున్నాయో ఇంకా అర్థం కావడంలేదు

ఏడవకుండానే ఎందుకు నన్ను ఓదార్చుతున్నాయో
ఇప్పటికీ తలకెక్కడంలేదు!
మధురమైన సంగీత వాహినిని వినిపించే మేఘ గర్జన
మృదువైన వాక్పటిమ ముందు ప్రాణాధారం అవడం

ఏపాటి నిజం?
అది నివాసమని, ఆదివాసమని నిర్ణయం జరగడం
ఏపాటి గాంభీర్యం?
అవును ఇది నా కవిత్వం!

నా అక్షరాల పరిమళ అరుణిమ రాగం!
స్వేచ్ఛ కోసం పరుగులు తీసే ఊహలన్నీ
ఒక వలకు కుట్టేసి అర్థరాత్రి అపరాత్రి తేడాలేకుండా
ప్రాణికోటి గుండెల్లో ఆవాసమయిన వికాసం!

హృదయం లోపల దాగున్నా
బయటి చిన్న అలికిడికే గతుక్కుమంటుంది
ఉదరంలో చేరి ఉదయాన్ని తోడు తెచ్చుకున్నా
ఒక్క చిన్న పరుషమైన మాటకే బీటలు వారుతుంది!

తెల్లారుతోంది!
తెల్లారుతోందంటే చాలు
నాకంటే ముందు లేచేవి నా ఆలోచనలు
ఈ రోజును గురించిన సందేహాలు

రేపటి గురించిన ఆందోళనలు
భవిష్యత్‌ను గురించిన పగటి కలలు
ఇవేవీ లేకుండా వెలుగులు గుడ్లప్పగించి నన్నే చూస్తున్నాయి
బద్ధలైన గతం తాలూకు తొడుగులు

అక్కడక్కడా ఇంకా కాళ్లకు అంటుకుంటూనే ఉంటాయి
అయినా సరే గతాన్ని నానపెట్టి
లేనివి అంటించి. మెరుపులు తాకించి
చిరునవ్వులు మొలిపించి.

లౌక్యాన్ని తగిలించి మాటకారితనాన్ని , మోసపూరిత తత్వాన్ని
ఒక్క తాటిపై కట్టినట్లున్న కవిత్వం
వీధిలో ఒక నృత్యం ఊరికే అందిస్తుంది లేదా
ఒక్కసారిగా నట్టెదుట నిలిచే దారులుగా మారుతుంది!

మళ్ళీ శబ్దం!
ఎవరు చేసారు? నీకు ఏదయినా అంచనా ఉందా?
నాకు లేదు. నీకు లేదని నాకు తెలియదు
స్వేచ్ఛ బద్ధలయినట్లుంది. కిటికీ ఊచ నిలదీస్తున్నట్లుంది.

గతి తప్పని రాత్రివలె ఒంటరిగా ఎదురుచూస్తోంది
దశదిశలా మోగించి ఎవరైనా వస్తారేమో అని చూస్తోంది
నీడలన్నీ చిరు గంటలు మోగించేలా
ఎడ్ల బండ్లన్నీ చుక్కల సముద్రంలా

ఎగసిన మంటల తాకిడికి కదిలే భావాలు
మనకు పదే పదే చెబుతున్నాయి
ఇది కవిత్వ ఉదార స్వభావం !
అది కాదంటే అభివ్యక్తీకరణ కాలప్రభావం!

మనిషి మనసు చీకటి వృక్షమయినపుడు
కనిపించే పచ్చదనం అంతా అజ్ఞానపు చిత్రాలే!
మానవత్వమే తిరిగిరాని వసంతమయినపుడు
నడయాడే ప్రజలంతా నిర్జీవ శరీరాలే!

బరువైన రెప్పలతో కళ్ళు తెరిచిన ప్రకృతి రూపం
చెట్టు కొమ్మలపై నిలిచిన ముఖాలతో
చివురు చివురుకు కనిపించే మెరుపు చూపులతో
ఎండ, చలి, వాన, గాలి నిశ్శబ్దంగా కదిలిపోయే

ఆత్మనేత్రం తెరచి ఉంచిన యోగినిలా ఉంది
వర్తమానం ఒక పీడకలగా ప్రశ్నిస్తోంది!
ఉండండి! ఉండండి!
మిమ్మల్నే! పిలుస్తుంటే వినబడదా ఏంటి?

నిత్యం నా కళ్ళముందు తారాడుతూ నీలినీడల్లా
పరిభ్రమిస్తుంటారు. ఎవరువీరు?
నిరాశా రూపాలా? ఆశావాదులా?
భయాన్ని కలుగజేసిన ఉభయ స్మృతులా?

నవ్వులన్నీ హృదయాకాశంలో తారలై వెల్లివిరుస్తుంటే
నా కాలాన్ని హరింపజేసే ఆకారాల్లా కనిపిస్తారు
గుండెలోని కోరికల ఆకులు విడిచే సమయంలో
విచార వదనాలను తోడు తెచ్చుకుని ఎదురవుతారు

హృదయంలో పూచే పూలన్నీ నేలరాలి
కంటినుండి జారిపోయేలా చేస్తారు
పాలవెల్లిలాంటి నా మనసు మానస సరోవరంలో
అగ్నిపూలన్నింటిని ఎరుకుని పోతారు

ఎమయినా అంటే అంటాను అంటారు కానీ
ఆశకు ఆశయం ఎంత దూరమో
ఆనందానికి ఆవిష్కరణ అంతే దూరం!
ఆత్మీయతకు మానవులు ఎంత దూరమో

అవసరాలకు అనుబంధం అంతే దూరం!
ఏదీ కనిపించరేం?
నా తెలియకుండా ఇలా తప్పించుకున్నారా?
చీకటి మనుషుల జాబితాలో నన్ను కూడా చేర్చారా?

భానుడు శరీరాన్ని వద్దన్నా కాంతితో నింపుతాడు
నడక ఎంత వద్దన్నా భుజస్కందాలను కదుపుతుంది
మనోరూపం ఎంతో శక్తివంతమయినది
రస తీర్థమయినది! జీవశక్తికి అంకితమయింది

ఇంకేం? నాకు ఎవరి సాయం అక్కరలేదు
నా గమనానికి ఎవరి వారే బాధ్యులు!
ఎవరి జీవితానికి వారే అనుచరులు!
అలాంటిది ఇదేం?

కత్తుల్లా ఐదువేళ్ళు ఉన్నా విడివిడిగానే ఉంటాయి
వత్తుల్లా రెండుకళ్ళు ఉన్నా వేర్వేరుగానే ఉంటాయి
కలిసికట్టుగా పూలమాల దేవుని మెడలో ఉన్నా

ఏ పువ్వు ప్రాణం దానికే ఉంటుంది

చెట్టు భాష మనకు తెలియదు కనుకనే
పిట్టలతో  మేల్కొలుపుతుంది
గాలి భావం మనకు తెలియదు కనుకనే
ఆకులలో కదలిక చూపుతుంది

కొమ్మ కొమ్మకు పూచే పువ్వులు, కాయలు
మనకు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది
శాంతి సహనం చెట్టు వ్యక్తిత్వం
ఆవేశం, అనాలోచితం మనిషి తత్వం!

రోజు రోజుకు ప్రకృతి చిత్రం మసకబారిపోతోంది
క్షణ క్షణానికి మనో ఆకృతి ఆనవాళ్ళు కోల్పోతోంది
ఆకాశం మనిషి తలగా,
సూర్యచంద్రులు రెండు కళ్ళగా

నక్షత్రాలు నఖక్షతాలుగా
గ్రహాలు శరీరంలోని చక్రాలుగా
ఉల్కలు ఆలోచనలుగా
తోకచుక్కలు మన అదృష్ట రేఖలుగా

అన్వయించుకున్న సృష్టి
రెండు భాగాలుగా విభజించబడిరది
ఒకటి డబ్బుగా మరొకటి జబ్బుగా
డబ్బును పోగొట్టుకున్నా సంపాదించుకోవచ్చు.

జబ్బును ఒక్కసారి సంపాదించుకుంటే పోగొట్టుకోలేము.
సృష్టిలో మమైకమైన మనం
సృష్టినే నాశనం చేస్తే ఇక మిగిలేదేముంది?
సమస్త జీవితాన్నే కాదనుకుంటే ఇక సాధించడానికి ఏముందని?

మృగమైనా మనిషైనా నవ్వితేనే మనకు సొంతం
మీద పడి చంపుతుంటే మిగిలేది శతృత్వం!
అలాగని నవ్వుతూ పిలిస్తే కలిగే నష్టం
సృష్టిలో వింతల జాబితాలోకి చేర్చితే

కలిగేది సంభ్రమాశ్చర్యం!
ఇపుడే నాపై జాలి కలిగిందేమో !
సింహం నన్ను చూసి నవ్వుతోంది!
నేను భయంతో కదలకపోవడంతో

ఒక్క అంగుళం కూడా కదలకుండా
మంచుతెర ఆకాశం నుండి తెగిపడినట్లు

గాలి కెరటం లేచి పడినట్లు
నా యెదలో సన్నని సవ్వడి !

కాలం చప్పుడు అయినట్లు!
తుమ్మెదలన్నీ కాలినడకన సముద్ర తీరం చేరినట్లు!
మాట! నిజమయినట్లు లేదు!
వాస్తవ సింహానికి భయపడి పరుగులుతీస్తూ

సృజనకారుల హృదయ ద్వార కవాటాలను ఆనుకుని
అనురాగామృత జిహ్వల తారాడే భుజంగాలను దాటుకుని
దిశ దశ దిక్కుల పలకరింపులతో సందేహాల్ని
ఒకదాని వెంట మరొకటి వదులుతున్నాయి

చుక్కలతో సముద్రం సహవాసం చేసినట్లు
ఎండలతో మంటలు సాన్నిహిత్యంగా ఉన్నట్లు
అయినా తీరికగా నిలిచి చూస్తే ఏముంది?
ప్రకృతి అంతా కవిత్వ ప్రవాహమే!

ఇందుకా అంత రాద్ధాంతం అనుకుంటే
అదే స్వేచ్ఛలోని మధుర రహస్యం !
ఒక్కోసారి అనిపిస్తుంది ఆకాశం నా ముందే వెళ్ళిందని..
నేల ఒక్కటే నేను పుట్టినప్పటినుండి

నాకు పరిచయం అయిన నేస్తంలా మిగిలిందని..
కారణం ఏదయినా ఒక్కటి మాత్రంనిజం
శతాబ్దాలనుండి వెంటాడుతున్న ఈ స్వరం
మొదటివాక్యమేదో చివరి వాక్యమేదో తెలియని ఆలయ సంగీతం

నన్ను అంటిపెట్టుకుని వినిపించే నా జన్మ సార్ధకం!
మట్టిని తింటే మంచిదే!
వచ్చిన చిక్కల్లా ఒక్కటే మానవత్వాన్ని తినడం!
మట్టిగానో, పిట్టగానో,

వేరుగానో, చిగురుగానో
నేలతల్లితో నాకు చాలా సహవాసం ఉంది
సుఖం, దుఃఖం, ఆనందం, విచారం,
ఆవేశం, అనాలోచితం వీటన్నిటితోనే కాదు

వీటి చుట్టాలతో కూడా పరిచయం ఉంది.
దేహం నన్నంటి పెట్టుకుందని
దాహం దేహానికి మాత్రమే వేస్తుందని
అనుకోవడంలోనే మన అలసత్వం దాగుంది

దేహం కోసం దుస్తులు మార్చుకోవచ్చు

ఆత్మకు ఏమని కొంటావు? ఎన్నని కొంటావు?
కానీ కొన్నాను గంపెడంత గాలిని
అనుభవించాను బానెడంత నీటిని

విద్యుత్తులా పాకే శరీరంలో శిలలా దిమ్మెక్కించే
దృశ్య కావ్యం నిప్పు పూలలా అలంకరించాయని!
మృదువైన నగిషీల వాస్తవ రంగ జలధిలో
అవన్నీ జల సమాధి అయ్యాయని!

నా ఆత్మ నాదే!
చనిపోతుందని వృక్షానికి ఇవ్వలేను
ఆగిపోతుందని గాలికి ఇవ్వలేను
మాట్లాడలేదని నీటికి అందివ్వలేను

అలాంటపుడు నేను, నువ్వు అందరికీ ఏమి ఇచ్చినట్లు?
చెంబులు, బక్కెట్లు డబ్బాలు ఎన్ని ఇస్తే ఋణం తీరినట్లు?
వలసలంటే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరడం కాదు
రాత్రి నుండి పగలుకు, పగలు నుండి రాత్రికి నడిచిపోవడం

అక్షరానికి కూడా ఆయువు ఉంది.
'అ' కారానికి అమ్మయినట్లు
క్షరానికి క్షీరాభిషేకం చేసినట్లు
పదానికి, వాక్యానికి కూడా మనకు కనిపించని దేహం ఉంది

ఆ దేహాన్ని మరింతగా తుత్తినియలు చేసే ధైర్యం ఎవరికుంది
వలస అక్షరం నుండి పదానికి, పదం నుండి వాక్యానికి
వాక్యం నుండి కావ్యానికి వలస పోతుంటే
కవి వర్తమాన జీవితం మధుర ఫలామృతమయితే

భవిష్యత్ మాత్రం దారి తెన్ను లేని ఒక శిలావిగ్రహం!
అనుకుంటాం కానీ... మనం ఎపుడూ ఆకాశ విహారం చేస్తూనే ఉంటాం!
నేలపై సాముగారడీలు ప్రదర్శిస్తూనే ఉంటాం
చెట్టుపైకెక్కి కొమ్మ కొమ్మను తాకుతూ ప్రేమను ప్రదర్శిస్తూనే ఉంటాం!

పుట్ట ఉంటే తేదీ వార నక్షత్రాలను చూసుకుని మరీ
పాలలో సగం నీరు పోసి పాలు పోసామనుకుని
తీర్చలేని కోరికలు కోరుతూనే ఉంటాం!
కోరికలు తీర్చలేదని తిట్టుకుంటాం!

వేరెవరికో న్యాయం చేసావు అని నిందిస్తుంటాం!
అంతా న్యాయం కావాలని చెబుతూనే
అన్యాయానికే తలవొంచుతాం!
ఏది? ఎంతవరకు నిజమని

చల్లగాలి నిలదీస్తే మౌనంగా ఉండిపోతాం!
ఇవి భ్రాంతి, విభ్రాంతుల మధ్య శకలాల సంవిధానం!
కొన్ని పూర్తి కాలేదు మరికొన్నింటికి అర్థం లేదు...
మనిషికి శాలువా కప్పినా , శవయాత్ర చేసినా

వాటిలోని అదితరార్థం గుర్తించే సమయం మనకు లేదు!
వెన్నెల!
ఏ ఒక్కరినీ వదిలేదయదు
అందరి యోగక్షేమాలు తెలుసుకుంటుంది

బాధయితే ఓదార్చుతుంది
దుఃఖమయితే వారిస్తుంది
సుఖం, సంతోషం ఏదయినా
తాను పంచుకుని మరింత అందాన్ని తనతోపాటుగా

మనకూ పంచుతుంది
అయినా వెన్నెల వన్నెలతో కలిసి
మబ్బులను ఆసరా తీసుకుని
నిరీక్షణా సంయమనాన్ని మరింతగా సమీకరిస్తుందని

బంధుమూర్తులై వానచినుకులు పడే వరకు
మనం తెలుసుకోలేము.
అపనింద రాత్రిపై తోసేసి
కాల వేదికనెక్కి రాత్రంతా మాట్లాడుతూనే ఉంటాం!

పైకి కనిపించే నవ్వుల మృత్యురేఖలు
దేవునిపై నెట్టేసి
మెరుపుల వేగాన్ని అంచనా వేస్తూ
పగలంతా పారిపోతూనే ఉంటాం!

పొగిలి పొగిలి ఏడ్చిన గుండెలన్నీ
వాకిలి దాటగానే
దీపంతో ఋణం తీర్చుకునే విషయాన్ని తెఒలుసుకోక
దీపం పురుగై అనుబంధం చుట్టూ పరిభ్రమిస్తుంటాం!

దీపావళి రాకుండానే పిస్టళ్ళు గుండెల్లోకి
పేల్చుతూనే ఉంటాం!
ఏ మారణాస్త్రాలకు లొంగని పూలు బిక్కముఖం వేసినా
నీ అవసరం మరణించాకనే అని ఖచ్చితంగా చెబుతాం!

ఒంటరితనంతో
కట్టుకున్న మట్టిగూళ్ళు
నాలోని నిస్సహాయతను సముదాయిస్తుంది
ఎవరికైనా చూపించి

మట్టి గూటి రహస్యాన్ని తెలుసుకుంటే
మానవ గుట్టుల్ని మరింత దాచిపెట్టే ద్వారంధాలు
కాస్తంత చూపి కవ్వించే చిలిపి కిటికీలు
అస్తిత్వం ప్రాతిపదికగా చేసి దగాపడిన వెంటిలేటర్లను

తిరిగి న్యాయస్థానం చుట్టూ తిరిగి ఒప్పించి,
చెట్టును సాక్ష్యంగా చూపించి
యధాస్థానం ప్రతిష్ఠయామి అనే భ్రమణ కాంక్షలు
కలిగిస్తే మిగిలేది ఒక్కటే అదే స్వైర్య విహారం!

గుండెలు సవరించుకునే దిశగా అభినవ సంరావం!
అనేకానేక ప్రార్థనల వెనుక వినిపించే వరాల ఆవాహనం!
పగలు పసిది కాదు
యుక్తవయసు వచ్చిన పెద్ధమనిషి కాదు

వయో వృద్ధురాలు కానే కాదు
వేలాది అనుభవాలు మోసి మోసి
నడుం వంగిపోయిన రాజనీతిజ్ఞురాలు!
మరణావస్థకు చేరుకున్న ఎవరికైనా పగలు రాత్రి ఒకటే!

గ్రీష్మం ఎంత పగలతో రగులుతున్నా సరే
'పగలు' కు పగుళ్ళు రావు
వర్షంతో  తడిచి ముద్ధవుతున్నా
తీక్షణతో నిండిన 'రాత్రి' కి రక్షణ అక్కరలేదు

ఏదైనా రాత్రికి తొందరపాటే!
ముంచినా, మండిరచినా
'పగలు' తల్లై ఓదార్చి సేదదీర్చే నదిలాంటిది
ఒడ్డుకు కొట్టుకొచ్చిన ప్రతిదానికి

సమాధానం ఇచ్చి గుర్తించే హృది లాంటిది.
అలల పసిపిల్లలతో ఆడుకునే
సముద్రం నీటిని శాసించే సుప్రభాతం!
తనపై ప్రయాణించే వారిని అలరిస్తూ

తనలోని జీవరాసుల్ని గుట్టలుగానో, ఒంటరిగానో
చూపుతూ ఆశ్చర్యపరుస్తుంది
తనను ఆక్రమించాలని చూసే సముద్రం పైన
ఎగిరే పక్షులని హెచ్చరిస్తూ

తనలోని ఆత్మవిశ్వాసాన్ని తరచి చూపుతుంది
నవ్వుతూ, తుళ్లుతూ, ఎగురుతూ

ఆడుతూ పాడుతున్న మానవాళికి
గంభీరత్వాన్ని నేర్పి ఆనందాన్ని, ఆవేదనను

సమపాళ్ళలో పంచే తీరును బోధిస్తుంది
వలలతో ప్రాణాలను పట్టి తీయడానికి అలలు అడ్డగిస్తాయి
కలలతో ప్రాణాలు నిలబెట్టడానికి అవసరాలు అడ్డమొస్తాయి
కాలం ఎవ్వరికీ అర్థం కాని పెంకి ఘటం

తెల్లారతే బతుకు తెల్లారిపోతుందంటే తెల్లారద్దంటే వినదు
తెల్లారి తీరుతుంది. రాత్రిగా అవతరించి తీరుతుంది
నీడలా చిరు మంటలతో మండుతూ నెత్తురు చిత్రాల కలలు కంటూనే
నాలుగు వైపులా తిరిగి ముఖమో, ముసుగో, తొడుగో తెలియని విధంగా

సందేహాల సమ్మోహనాన్ని విపులాస్త్రంలా వాడి
స్వచ్ఛతలోని ఉదార రహస్యాన్ని తేటతెల్లం చేస్తుంది.
గుర్తించనపుడు గుర్తించావా అని
గుర్తించనపుడు గుర్తించలేదు ఎందుకని అడిగే ప్రశ్నల తీరును

తొలిసంజెలో వాడిపోతూ కూడా సువాసనలు వెదజల్లే
సన్నజాజి పొదలపై నుండి తుమ్మెదలకే హక్కులను
ప్రాణ తర్పణంగా తీవ్రతీవ్రంగా ప్రాణ ఘాతుకంగా
నిండుగా కపాల రంధ్రాల్ని పూరిస్తున్న బరువైన నిట్టూర్పులను

నాగలి వలె కదిలే బతుకులను
జీవితం మోసుకొచ్చే అనుభవ శంఖారావాలను
సగం గాలి, సగం నీరు ఉండే గుండె గాలులు ఆపేస్తాయి!
జలదాగమన రహస్యాలను అనుసరించే దిశగా నీటిని నింపేస్తాయి!

అమ్మ కిటికీ వారగా ఉన్న మంచాన పడిరది!
కొన్నేళ్లు బతికింది. చెట్టును చూస్తూ
చెట్టుతో మాట్లాడుతూ.. చెట్టుపై వాలే పిట్టల్ని పిలుస్తూ
రాలిపోయే ఆకులను అందుకుంటూ

వాలిపోయే కొమ్మల్ని ఓదార్చుతూ
నేను చూడు ఎన్నో ఆటుపోట్లను, గొడ్డలి దెబ్బలను తట్టుకుని
ఎంత నిటారుగా నిలబడ్డానో?
నువ్వు ఏవీ అనుభవించకుండానే

నేలను విడిచి రాలిపోతాను అంటున్నావు.
అంటూ కొమ్మలను చేతుల్లా చేసి అందిస్తున్నాయి
ఆ విషయాన్ని తెలపాలని ఎందరినో రమ్మంది
చెట్టంత ఎదిగిన చెట్టును చూపాలని తనవారిని రమ్మంది

అక్క అంది, తోబుట్టువు అంది, చెల్లెలు రాలేదంది
అన్నయ్య పలకరించలేదు చూసావా అంది
తమ్ముడికి ప్రేమలేదు అని వాపోయింది
తీరా స్పృహ కోల్పోయాక

ద్వారం దగ్గరకొచ్చి ఎందరు పిలిస్తే ఏం లాభం?
దగ్గరకొచ్చి కన్నీరు పెట్టుకుంటే ఏం ప్రయోజనం?
ఎంత మంచిదో పాపం వినబడని ఆమెకు ఎం ఉపయోగం?
బతికితే మా ఇంట్లో ఉంచుకుంటానురా అంటే

బతుకేలేని ఆమెకు ఎక్కడిదీ సంతోషం?
చనిపోతే నేనెలా బతకనురా అంటే
ఆ మాట వింటే మురిసిపోయే ఆమెకు ఇపుడని
ఈ లోకంలోనే లేని ఆమెకు ఎక్కడిదీ జీవితం?

దీపావళి వచ్చింది
ప్రకృతి భయపడిరది
పండగ మీకు చప్పుళ్లు మాకా అంటూ అలిగింది
అలా కాదులే కాస్త భరించు అంటే

నాకేం అవసరం? నా బిడ్డలకు తాకనివ్వకండి
నా వాతావరణాన్ని కలుషితం చేయకండి
నేను పెంచుకున్న పక్షులు భయపడతాయి అని వేడుకుంది
అపుడు నేను అన్నాను

నీకు ఇవ్వాల్సిన బోలెడు బహుమతులున్నాయి
అవి తీసుకోవడం వాడుకోవడం ఇష్టంలేదా అన్నా!
అందుకే అనుకుంటాను
బహుదూర ప్రయాణాలన్నీ ప్రకృతిని చూసేందుకే!

ఇంటినుండి మరో ఇంటికి బయలుదేరుతున్నా
మరొకరిని చూడాలని వెళుతున్నా
ఎవరితో మాట్లాడాలని ఉన్నా సరే
ప్రకృతిని తాకి వెళ్లాల్సిందే!

దూరమయితే ప్రకృతితో సంభాషించాల్సిందే!
దగ్గరయితే ప్రకృతిని పలకరించాల్సిందే!
దారిలో కనిపించే రాతి శిలలు
సెలయేటి నవ్వులు అన్నీ కలిపి

ఆరని సెగలతో శత్రువులా కదిలిస్తూ కవ్విస్తూ
బ్రహ్మీముహూర్త మహిత వేళ సృష్టి రహస్యంతో
జగతినంతా మేల్కొలిపే ఉషఃకాల సంగీతంతో
పురాప్రకృతి బింబాల్ని స్మరింపజేసి ఓదార్చాల్సిందే

తప్పదు! నటిస్తూ వచ్చిన గాలి తరగలను చూపాల్సిందే!
సూర్యుడు లోకంపై శతాబ్దాల తరబడం
మమత చూపుతున్న ధీరుడు
ఒంటరి ప్రయాణం చేస్తున్న శౌర్యుడు

మంచుతెరలను చీల్చుకుంటూ
కీచురాళ్ళను నిశ్శబ్ద పరుస్తూ
దారిలో కనిపించే చందమామ
యోగక్షేమాలు తెలుసుకుంటూ

గస్తీ కాయకుండానే డబ్బులు కాజేసే
గూర్ఖాలకు వార్నింగులిస్తూ
ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు మనిషిని
మనిషి జీవితాన్ని కాచివడబోసి

నాకంటే నీకు కష్టాలా అని తెలియజేసి ఓదార్చుతుంది
దేహం ఎంతో పుణ్యమూర్తి!
వస్తుంది పోతుంది
కానీ నేను మండుతున్న నాదేహంపై నీరు జల్లేవారు లేరు

వాన వస్తుందికానీ నన్ను తప్ప అందరినీ తడుపుతుంది
నిజంగా నాదొక నిజమైన బాధ!
అందరూ చుట్టూ మూగినా తెలుపుకోలేని వ్యధ!
శాశ్వత నిద్ర మీకుంటుంది కానీ నాకుండదు

పగలయితే కనబడి రాత్రయితే మరో చోట కనబడాలే తప్ప
నాకయితే షిఫ్ట్ డ్యూటీలు లేవు.
వీక్లీ ఆఫ్లు లేవు అని తెలియజేస్తుంది
నా దేహం ఒక మండుతున్న మొక్క

దీనికి చావులేదు అలాగని పుట్టుకాలేదు
అంటూ చెప్పకుండానే తలుపు తీసుకుని వెళ్ళిపోతుంది!
అపుడే నా క్షణాలే నయమని నవ్వుకున్నాను!
ఆకాశానికి నన్ను చూసిన దగ్గరనుంచి తడపాలని

తనే తడవకుంటే ఆ ముచ్చట నాకెందుకు?
రైతన్న తలెత్తి పైకి చూస్తుంటే చిరాకు వస్తుందట
తనెంత సిగ్గుపడుతుందో ఆ బీడుభూమే సాక్షి!
ఇదొక నిలుచున్న వరికంకి వరదంకితాక్షి!

చీకటి !
నాకెంత అసహ్యమో మీకు తెలియదు
ఒకప్పుడు చీకటి కూడా కాస్తంత మూగగా కంటికి కనిపించేది

ఆ చీకటిలోనే ఎన్నో రహస్యాలు దాగున్నాయి.

కనిపించే చీకటిలో ఏమీ ఉండవు చెట్టు తలలూపడం తప్ప
కనిపించని చీకటిలో నువ్వు ఉండచ్చు
నేను, ఆఖరికి నవ్వుకూడా ఉండచ్చు
ప్రకృతికి పెద్దదిక్కయిన చీకటి బయటే ఉంది అనడానికి

దాఖలాలు లేవు.
మనిషిలో ఉండచ్చు! మనసులో ఉండచ్చు!
ఒంట్లో ఉండచ్చు వంటింట్లో కూడా ఉండచ్చు!
మహాత్ములందరూ హాయిగా సేవచేసి

భయాన్ని దూరంగా నెట్టేసి ఉండచ్చు.
ఇంతెందుకు?
నాకు నేనే నచ్చను
నాకు కవిత్వం రాని చీకటి నాకు నచ్చదు

నన్ను నన్నుగా ప్రేమించే చీకటి నాకు నచ్చుతుంది
అలసిపోయిన కళ్ళకు చీకటి నేస్తం!
ఆదమరచి నిద్రిస్తున్న జీవితానికి చీకటితోనే స్నేహం!
నాకు నేనే ఒక సమస్యగా మారినపుడు

చీకటి మరింతగా  పెంచితే నా ఊహలన్నీ ప్రకటనలయ్యాయి
చీకటి చిరుదివ్వెగా మారి పలకరిస్తే
నా వాస్తవాలన్నీ ప్రయోజనాల మేర మారే
మైనపు బొమ్మలుగా మారాయి

అవునవును!
మీకంతా నవ్వులాటే !
నా కర్థమవుతోంది
దిక్కుల గుండెల్లోకి వచ్చిన భూమి

మనిషి జన్మించడంతోటే స్థిరాస్థిగా మరింది!
జీవన గమనాన్ని పాలించే ఊహాశక్తి
యుక్తిగా మారి కుయుక్తికి దారితీసి
చరాస్తిగా రూపొందింది

ఒకరిమీద ఒకరికి అధికారం లేనపుడు
ఎవరి పని వారు చేసుకుపోవచ్చును
అందరికీ ఏదో సాధించాలనే ఉంటుంది
కానీ కాళ్లలో శక్తి గుండెల్లో ఆశయ శక్తి

తగినంత పట్టుదల మనుషులకు కొంతమేరకే!
ఉన్న కుటుంబీకులు వేళ్ళ లాంటివారు అంటారు

అవే వంకర టింకర అయితే మేమెంత అంటారు
సన్యసించి మిధ్యాభావనతో పరమార్థం శోధించే తత్త్వమతీ

ప్రాణాన్ని ఘనంగా తన నిల్వ ధనానికి లంకెచేసే నిత్య వ్యాపారి
హస్తముద్రలు గాలి పడగల్లా వుయ్యాలలూగుతుంటే
పెంకుటిల్లు సగర్వంగా తలెత్తి చూసాయి
మేడలన్నీ పేకల్లా నేల కూలాయి!

నేనిపుడు ప్రకృతిని ప్రేమిస్తున్నాను
నాతో ఇపుడే మాట్లాడిరది.
సంగీతమైనా, సాహిత్యమైనా
తననే అనుసరిస్తారు. అనుకరిస్తారు అని కూడా అంది!

అందుకే క్షమించేసా!
ప్రకృతి నాకు స్నేహితురాలైంది
మేఘదర్శనం ద్వారా ఆకాశంలోనే ఇల్లు నిర్మించి ఇస్తానంది
కానీ ఒకటే చిక్కు!

ఇది పతాక స్థాయి చర్చ!
శిల్పాలను ప్రేక్షకులుగా కూర్చోపెట్టి
గల్పికలను పహారాగా ఉంచి
అనేక రాళ్ళను కౌగలించుకున్న నా చేతులకు

అందరూ ప్రార్థించాల్సిందే
మరి ఎందరో అర్థించాల్సిందే!
నక్షత్రాలు ఆకాశంలో ప్రకటనల హుషారును మరింత
బలోపేతం చేస్తుంటాయి

నా పూర్వీకుల  పాదముద్రలకు
తరతరాల అడుగుల శబ్దాలు
ఉన్నట్లుండి చలిగాలికి ఆగిపోయాయి
హఠాత్తుగా చెల్లని కరెన్సీ నోట్ల కట్టలపై

విగత శరీరాలై తారాట్లాడుతుంటాయి
అయినా నేను మేల్కొనే ఉన్నాను
ఎప్పటికైనా బతుకులోని ఊర్పులకు మార్పులకు
ఏ క్షణంలోనైనా సాక్ష్యం ఇవ్వాల్సివస్తుందేమోనని

కళ్ళుమూసుకునే ఉన్నా మేల్కొనే ఉన్నాను
రెప్పల వెనుకనుండి గమనిస్తూనే ఉన్నాను
పగలు ను మరిచిన రాత్రితో సమ్మేళితం అయి
రాత్రిని మరిచిన సాయంత్రంతో పోరాడుతుంటాను

గొంగళీ పురుగు దశ అంటే రాత్రి అనుకునేరు

అస్సలు కానే కాదు!
రాత్రి అందమైన ఆకాశంలోనూ ఉంటుంది
ఖరీదయిన హొటళ్ళ వాకిళ్లలోనూ ఉంటుంది

రాత్రికి నక్షత్రాలు పగలు కనబడకుండా ఒక తెర!
కమ్మని కలల తెర తునాతునకలయినట్లు
ఒకానొక తీయని కన్నీటి వల !
చందమామ పగలంతా నిద్రపోతుందేమో

చినుకులతో ముఖం కడుక్కుని వచ్చేసరికి
అంతటి స్వచ్ఛత నెలకొంటుంది
పొద్దెక్కిన కొద్దీ చమటోడ్చుతూ వచ్చే
భానోదయం కదులుతున్న ముళ్ళతో

శరీరానికి ధైర్య కవచం తొడుగుతోంది.
శూన్యంలో దృక్కులు ప్రసరిస్తూ దూరం జరిగితే
లాంతరు ముఖాలన్నీ దగ్గ చిత్రాలుగా మారి
కళ్ళలో ఇసుకదిబ్బలు మరో చరిత్రను సృష్టిస్తాయి.

నిద్రంటే నాకు చిన్న చూపు
తపోనిష్ఠలో ఉన్నట్లుగా ఉంటుంది
గుండెకు బాధ్యతల చప్పుడు తోడయినపుడు
సాధువునై చిరునవ్వులు ఒలికించడం రాదు

తెలియని రోదన మనశ్శరీరాలను తాకి
చివరకు కనిపించిన పూలను ఒకచోటగా కట్టి
లేదా మెడలో ధరింపజేసి అలవోకగా కలిగిపోతాయి
ఇదొక అనిశ్చితమైన స్థాయిలో నిలబడనివ్వదు.

కూర్చోనివ్వదు.. అసలు కదలనివ్వదు
ఊర్లన్నీ ఊరవతల ఉన్నా సరే
జీవన పాదాల జాడలు నక్కి చూస్తుంటాయి
పక్షి చెట్టుపై తన పిల్లలతో సహా గూడు కట్టుకుందట

దాంతో అంత హడావిడి. అందర్నీ రమ్మని
చిన్న, పెద్ద , చిట్టి, రంగుల పక్షులన్నీ సరాసరి వచ్చేసాయి
వండేందుకు, తెచ్చిపెట్టేందుకు ఏవీలేవు అనుకుందట
కానీ అవన్నీ వచ్చింది తినడానికి కావట

ఏ మానవాధముని చేతిలో కొమ్మ విరగకూడదని
ఈ గూడు నాలుగు కాలాలయినా చల్లగా ఉండాలని పూజించాయట
పక్షి ప్రార్థన చేయడం నిజమే!
ఏ ప్రార్థనకూ పూజారి కాదనేది నిజమే!

అడుగడుగుకు అనుమానించే వేళ
వృధాగా జరిగే పూజలన్నీ పక్షి పూజలేనని అనుకుంటే
ఆత్మత్యాగాలకు సరికొత్త అర్థాలు వస్తాయినేది నిజమే!
పక్షి తీర్థమంటే ప్రదేశం కాదు

పక్షి ప్రార్థన. ఆ ప్రార్థనలోని ఆంతర్యం!
ఎన్ని జన్మలయినా కాస్తయినా అర్థం చేసుకోరు అనేది కూడా నిజమే!
పగటి వైశాల్యం ఎక్కువ
రాత్రి నీడలు ఎంత పొడవుగా ఉన్నా

మగతలో స్పష్టత ఉండదు.
ఒక్కచోట మాత్రమే గడిచిపోయే రాత్రి
పగటికి డాక్టరును అంటుంది
పగలంతా కనురెప్పలు మూతపడినా ఇవ్వలేని

శక్తిని తానే ఇస్తున్నానంటుంది
రాత్రి అంతా ప్రపంచం శాంతి ఆవరిస్తుంది
ఎద దేనిగురించో ఆన్వేషిస్తున్నట్లుంటుంది
స్థూలం నుండి సూక్ష్మానికి సాగే మనోగమనంలో

మనిషి మేల్కొంటాడు సరే
మనసు మాటేమిటి?
భూమి పూలను మోస్తున్న ఒక అందమైన వంతెన
ఎంతసేపూ నిండుగా ఉండాలని అందరినీ మోస్తుంది!

సజీవుడైనా నిర్జీవుడైనా సరే తనలోనే దాచుకుంటుంది
ఊహల్లో, వాంఛల్లో కనిపించే ఆశామనోజ్ఞరూపాలను కూడా
కని పెట్టి మరీ తనలోకి ఇముడ్చుకుంటుంది.
పగటి కలలకు, రాత్రి నిద్రకు పెద్దగా తేడాలేదు

రెంటికీ పెద్దగా ఖర్చూలేదు
నవ ఉదయ కాంతులకు, వాస్తవ హృదయ కాంక్షలకు
ఈ రెండూ సాక్షీ భూతాలే తప్ప మరొకటి కాదు
అలాకాదు అంతా నేనే

అంటూ మర మనిషి ఆకారం తిరుగుతున్నంతకాలం
అమృతం అనే మాట వట్టి ఊహే!
అమ్మతనంలో కనిపించే స్వచ్ఛత వట్టి కథే!
కంటి రెప్పలకు అద్దెలేదు.

ఇజిన్ను మూసినా, తెరిచినా నడుమ కనిపించే
రంగురంగుల దృశ్యాలన్నీ వారి వారి సొంతం!
కలలో కనిపించే దేవతలకు, కనిపించని దెయ్యాలకు
భాష్యం చెప్పడానికి మాత్రం నేలదే ఆసొంతం!

గీతం ప్రకృతిని అనుసరిస్తుంది
పిట్టల్ని ముద్దాడుతూ, గుడ్లను కాపాడుతూ
ప్రకృతి గీతం చెట్టు ప్రాతిపదికన మాట్లాడుతుంది
ఊళ్ళను, పట్టణాలను, పొలాలను, ఎడారులను దాటుకుంటూ

మన గమనం గగనం ద్వారా చంద్రుని పైకి వచ్చేదిశగా
పయనానికి హద్దులు లేవు. ఊహకు పరిధులు లేవు
పగటి బతుక్కి వేళ్ళు దన్నుకుని అలవాట్లను అనుసరిస్తూ
ఎంతో లోతుగా ప్రకృతి మాత పాతుకుపోయింది

పగలు నిశ్శబ్దం గుండెలోంచి వస్తుంది
రాత్రి నిశ్శబ్దం ప్రకృతి మాత ఒడిలోంచి వస్తుంది
ఒకదాని నుండి మరొకదానికి మారుతున్న మనో గమనంలో
నేను తప్పకుండా ఉలిక్కిపడతాను

ప్రకృతికి పల్లవిగా మారిపోతాను.
బతుకు బండికి ఒక చక్రంగా మారిన నా మనో వేగాన్ని
కాలదన్ని చెట్టుకు పక్షికి మధ్య వారధిjై◌◌ం నిలిచిపోతాను.
రా ! మౌనమా రా!

పగటి కలలకూ, పగటి మగతకూ తేడా తెలియని
నన్ను నీ రెక్కల్లో బందీగా చేసుకో!
అమృతం వర్షిస్తుందేమో అని ఆశించిన నన్ను
నీ జీవ కళగా మార్చి ప్రాణం పోసుకో!

ఇంతలా పిలుస్తుంటే
నా హృదయంలోకి రమ్మంటే ఎందుకు రావు?
సూరీడు లేడు. వెళ్లినా ఇపుడిపుడే రాడుకూడా
నవోదయ మనోరూపంలో దాక్కున్న నన్ను

ఓదార్చి నీతోనే ఉంచుకో!
ఇన్నాళ్ళుగా నీ రూపాన్ని ఏ చిత్రకారుడూ గియ్యలేదు
ఆధ్యాత్మిక సౌందర్యంలో తప్ప నీ ఆనవాలు ఎక్కడాలేదు
అంగడి బొమ్మల్లో దాచుకున్న ఒక రహస్య కాలం

ఇన్నాళ్ళూ ఒక పంజరంలో దాచిఉంచి
పొరపాటున నేలపైన రాలిన పక్షి
వృధాగా నీ సమయాన్ని తాకట్టుపెడుతోంది
కావాలంటే వచ్చి చూడు!

వీలయితే స్వప్నంలా రా!మురిసిపోతాను
వస్తువులా రా! దాచుకుంటాను
పాటలా రా! విని తరిస్తాను

మాటల మూటలా రా! అవలోకిస్తాను

విప్లవమైరా ! నీలో కలిసిపోతాను
ఉద్యమమై రా ! నీతోనే ఉండిపోతాను
చివరికి నాలా మారి రా! నీలో నేను నివసిస్తాను
లేదా నీలా నన్ను మార్చుకో నాలోనే నీకు గుడి కడతాను

వృక్షపు అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని
పిట్టలతో పాటు కోతులుకూడా చేరుతున్నాయి
బెదిరించి అదిలించి పిట్టలను తరిమేసి
కొమ్మను కొమ్మను విదిలించి పండున్నా, ఫలమున్నా

బలవంతంగా లాక్కుని సగం తిని కిందపడేసి
చిందరవందర చేస్తున్న తీరును గమనిస్తూ కూడా
కిక్కురు మనకుండా మౌనంగా ఉంటుంది.
తీరా వెళ్ళిపోయాక రాలిన పండ్లను, మృతులైన గుడ్లను

కసి మొగ్గలను చూసి విలవిల లాడిపోతూ
ఇకపై రానీయకుండా చేయాలని కొమ్మలకు, కాండానికి
తగిన వార్నింగ్ ఇస్తూ మిగిలిన పక్షలను గుండెకు అదుముకుని
నేలపై బడి పొగిలి పొగిలి ఏడుస్తుంది.

వాయువు కదలిక లేక మేఘాలు ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి
ఆయువు లేక మనిషి శరీరాలు ఉన్నట్లుండి ఎగిరిపోతున్నాయి
కొండలన్నీ తేలిక కావడానికి
కృత్రిమమైన రెక్కలు తెచ్చుకోవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నాయి

కారణం ఏమిటి అని ముఖం పెట్టకు
చెప్తాను కదా?
కొండ గట్టిదే అని ఉలిదెబ్బలు కొడుతుంటే
తట్టుకునే శక్తి ఉండదు

తునాతనకలు చేస్తూ అప్పటికేదో
మనుషులేదో శ్రమకు గురవుతున్నట్లు
ముఖం పెడుతుంటే
కోపంతో కొండలు మండిపోతున్నాయి

కొట్టేవాడి బుర్రమీద పడి కసి తీర్చుకుంటాయట
లేదా ఆకాశంలో ఎగిరి మరో ప్రాంతానికి చేరుకుంటాయట
అది విషయం !
అయినా ఉనికిని తెలియజేసి, గాలికి విహరిస్తున్న

పక్షులకు మాత్రం దిక్కేది?
పరుగులు పారిపోతున్న జంతువులకు రక్షణేది?

ఈ తుపాకీలు ఎవరు కనిపెట్టారో ఏమో కానీ
పరుగులు తీస్తున్న వారి గుండెల్లోకి గుచ్చేలా చేసారు

అవసరమా?
బుర్రను పగలకొట్టుకుని ఆలోచించి చించి
బుల్లెట్‌ను శరీరంలోకి ఎలా తయారుచేస్తే దిగబడుతుందో
అలా తయారు చేసి

గుండెల్ని, బుర్రల్ని, కాళ్ళను తూట్లుపడేలా చేసి
వీరు సాధించిందేమిటి?
సరిహద్దుల కాపలాకు పనికిరావాల్సిన తూటాలన్నీ
మనలో మనకే పిట్టకోసం, జంతువుకోసం

ఆస్తికోసం, కీర్తికోసం వృధా చెయ్యడం అంటే
ఎంత పొరపాటు? తయారుచేసిన వాడి గ్రహపాటు!
ఊహల్ని ఉపయోగించుకోవాలి కానీ
ఉనికికి నిప్పు పెట్టుకోకూడదు కదా?

ఆశల్ని అలల్లా సాగనివ్వాలి కానీ
కెరటాల్లా ఎగిరెగిరి ఉవ్వెత్తున ఎగసిపడనివ్వకూడదు
ఆ విషయం విషం కాకముందే
సాగిపోవాలి వృక్షాలకు తెలివిని నేర్పించాలి

వృక్షంపై వ్యాసాలు ,
వృక్షం అవసరాలకు తగిన విధానాలు
పర్యావరణంపై అవగాహనా సదస్సులు చాలానే జరుగుతున్నాయి
ఏం లాభం?

ఆ మూడుగంటలూ చెప్పడమయితే మరుసటిరోజు
పేపర్లు నిండుతున్నాయి
అయ్యోపాపం అంటున్నాయి.
ఒకరినొకరు ప్రశ్నించుకునే తీరులో పాఠాలు వినబడుతున్నాయి

బిడ్డనుండి బిడ్డను కన్న తల్లివరకు
నీతుల నిర్ణయాలే! బూతుల భూషణాలే!
కానీ..వర్షం అంటే కిందపడేదే అనుకుంటే పొరపాటే
కాదు.. కానే కాదు

వర్షం హర్షాతిరేకల సువర్ణావకాశం!
హర్షం వర్షపు చినుకుల మధ్య సయోధ్య నడిపే
ఆనందాతిరేకం!
చినుకు పంటను తడపాలి.

మండుతున్న నేలకు ఊపిరవ్వాలి

చెట్టుకు లాల పొయ్యాలి
బూజు పట్టిపోయిన శూన్యానికి శుభ్రం చేయాలి
తప్పు శరీరాల్ని ముద్దుచేస్తే ఏం లాభం?

నరనరాల్లో వేడిని పుట్టిస్తే ఏం ప్రయోజనం?
ఉద్దేశ్యం సరైనది అయితే ఊరు ఎక్కడుంటే ఏమిటి?
ఆలోచన అందుబాటులోనిదైతే
అనాలోచితం ఎందుకుంటుంది?

కన్నబిడ్డలెలాగూ స్వార్థంగానే ఉంటున్నారు
బతికుండగానే వారి కర్మలు వారే చేసుకుంటున్నారు
వర్షం కూడా తనకు ఎక్కడుంటే మర్యాద ఉంటుందో
అక్కడే కురిస్తే సరి!

ఇంత విన్యాసం ఎవరికి కావాలి?
జీవం లేని చెట్లకూ! కదలిక లేని గంభీర నదులకూ నా?
ఏమవసరది?
తనను తాను కాపాడుకోలేని చెట్టు

దారికడ్డంగా విరబోసుకుని నిలబడటం దేనికి?
పక్కగా నిలబడచ్చు కదా?
సామాజికత్వం ఎవరికి వినిపించాలి?
ఎవరికి వారు తమను సరిచేసుకోలేనివారు

దేశం కోసం పోరాడుతున్నట్లు పోజు లెందుకు?
ఉబుసుపోక కబుర్లు చెప్పుకుని బతకొచ్చు కదా?
వర్షమే పడినా, పిడుగే మీద పడినా
తమను తాము రక్షించుకోవడం అనేది కష్టమే కానీ

తప్పదు! జీవమున్న వారితో సమావేశం జరగాలి!
తప్పదు! ఆస్తికోసం గంగిరెద్దులా దత్తతకు తలవొగ్గుతున్న
జీవచ్ఛవాలతో చర్చలు జరగాలి!
ఎదురుగా ఉన్న చెట్టు ఇవన్నీ వింటోందేమో

కుంభవృష్టిగా కురుస్తున్న నీటితో తలారా స్నానం చేసి
పచ్చదనాన్ని మరింతగా సంతరించుకుంటోంది
ఉన్న ఆకుల్ని పదిలపరుచుకుంటోంది
మంచిరోజులొస్తున్నాయని చెప్పి సేదదీర్చుతోంది!

అయినా ప్రస్తుతం మేఘాలు దాక్కుంటున్నాయి
నిన్నటి దుఃఖాన్ని ఆరపెట్టుకుంటూ సూర్యుని చాటుగా నిలుచుని
సమయాన్ని సమయానుకూలంగా మార్చుకుంటూనే ఉన్నాయి
తలుపులు! చెక్కతోనో, ఇనుముతోనో సర్దుకుంటూ

జీవితం సాగిస్తున్నాయి
మెల్లగా వేసినా, దఢేల్ మని వేసినా సరే
మౌనంగా ఉంటాయి!
వాటిమూలంగా మన చేతులు కాళ్ళు ఏదయినా అయితే

లోలోపల మధన పడుతుంటాయి.
మేము వస్తువులం! జడపదార్థాలం!
చూసుకుని మమ్మ తృణీకరించవచ్చు కదా?
మీాకు మీారే కొట్టుకుంటారెందుకు?

కట్టుకట్టుకుని మమ్మల్ని నిందిస్తారెందుకు?
అంటూ వాపోతుంటాయి
మనుషుల్లో పెద్దవారు దొంగలు
కన్నాలువేసి లోనికేగి, తలుపు వెనకాల దాక్కుంటే
ఏం ప్రయోజనం?
ఏ ఇంటికి వెళ్ళినా అవే పాత్రలు

అవే పాత్రధారులు! అవే గదులు!
అవే నిద్రలు !
మనిషికి మనిషికి పెద్ద తేడాలేదు!
మనసుకు మనుసుకు మాత్రం అగాధమంత బేధం!

ఒళ్ళు మరిచి దారిలో అడుగులేసేటపుడైనా
ఆలోచించవచ్చు కదా?
వాస్తవ తలంపై పరిమళాలహరి పలకరిస్తుందో లేదో కానీ
అణగదొక్కబడిన ఆశలు మాత్రం బయటపడే అవకాశం కోసం

ద్వారంధమవుతుంది! లేదా
ద్వారపాలనగా మారుతుంది
కాలం నాకు మిగిలిన స్నేహం కాదు
ప్రకృతిమాతతో కలిసి మెలిసి పెరిగిన బంధం!

ఆకాశానికి, భూమికీ మధ్య నడిచే నిశ్శబ్దం!
కాలం పరుగులు తీసే ఒక యంత్రం!
మనసుంది కానీ మనిషిగా నిలవలేని ఒక ఛాయాచిత్రం!
పాపం! నవ్వదు! ఏడవదు!

ఒకరిని దూషించదు! ప్రేమించదు!
నిద్రలో నివసించదు!
మెలకువలో పవళించదు!
ఎపుడూ గిరగిరా తిరగటమే!

వారానికి కాదు, నెలకు, సంవత్సరానికి కూడా
ఒక్క సెలవు లేదు!

నిరంతరం అందరి జీవితాలకు కాపలా కాయాల్సిందే!
జీవితాలను అంచనా వేయాల్సిందే!

ఏ నిముషం ఏమవుతుందో చెప్పలేకపోయినా
నిముష నిముషానికి గమన రేఖలు గీయాల్సిందే!
నా సమయం ఆగిపోయిందని, బాగుచేయాలని
నా సమయం బాగోలేదని, సరిచేయాలని అంటుంటారు

సమయం ఎపుడూ పాడవ్వదు.
సమయం ఎపుడూ ఆగిపోదు!
మనిషి  చేతిలో పడితే సమయమేమిటి?
ఏదయినా బాగు చేయాల్సిందే! తప్పదు

మన కరముల స్పర్శ అలాంటిది .
ఆలోచనా పరంపర అలాంటిది
ఆశలకు మెరుగుపెడితే ఆశయం గా మారుతుంది
ఆలోచనలకు పదును పెడితే ఆనందమవుతుంది

భవిష్యత్ రేఖల్ని అంచనా వేసే కాలానికి
వెలుగు చీకట్లతో పనిలేదు.
తలుపు తట్టినా తట్టకపోయినా
ఆ ప్రయాణం సాగిపోతూనే ఉంటుంది

మూసిన కనురెప్పలమీద కూడా ప్రయాణిస్తూనే ఉంటుంది
ఎందుకంటే కాలానికి శరీరం లేదు
కాలం ఒట్టి ఆత్మ మాత్రమే!
శరీరం ఉంటేనే కదా? శరంలా దూసుకుపోయేది

ఆత్మ పవిత్రమైనదని కాలమే చెబుతుంది
ఆత్మకు ఏ వికారం అంటదని,
ఏలాంటి ఆకారం ఉండదని అర్థమయ్యేసరికి
నువ్వు నేను గడియారానికి ముళ్ళులా మారిపోతాము!

దేహ దుఃఖ స్పర్శ కీలల్లా రగిలి రగిలి
ఆనేకానేక తలపులు తలుపులు తెరవడం అంటే ఇదేనేమో!
బహుశా కన్నీటితడిని జల్లెడ పట్టడం అంటే ఇదేనేమో!
సముద్రం! విశాలంగా ప్రవహిస్తుందని అనుకుంటాం కానీ

దాని బాధలు దానివే!
తరచి అడిగాను కదా!
సముద్రంలో నీరు ఒక వంతే ఉన్నాయని వాపోతోంది
మిగిలిన మూడొంతులు ఎక్కడున్నాయని,

ఎవరెత్తుకెళ్ళారని నిలదీస్తే చెప్పలేక చెప్పింది

ఆ మూడొంతులు స్త్రీ కళ్ళల్లో దాగున్నాయని!
అబ్బ ! ఎంత మాట?
సముద్రం ఎంత చక్కని విషయం చెప్పింది

మాటలు రావని అనుకుంటాం కానీ
తనలో ఇంత విషయాన్ని దాచుకుని ఊరుకుందా?
స్త్రీ జీవితాన్ని గురించిన విషయం
ఒక్క మాటలో ఎంత చక్కగా వివరించింది అనుకుని

ఉన్న ఒక్క వంతును తనకోసం ఉంచుకోమని
హెచ్చరించా!
చెలియలికట్టపై నిలిచిన నౌకలు
ఒడ్డుకు కదిలి వచ్చి మెల్లగా విరిగిపోతున్న తరగలను ఆనుకుని

ఎన్ని జీవులకు నిలయమవుతోందో కదా? జీవనం అనుకుంది.
అనుకుంటాం కానీ
కోటగోడలతో నివాసం కట్టుకున్నంత మాత్రాన
జీవితం భద్రంగా ఉంటుందా?

పూరిపాక అయినంతమాత్రానా జీవనం విస్తరవుతుందా?
అనుకుంటాను కానీ నన్ను చదివిన ఒక సమాజం
ఇంద్రధనుసు లా విరియగాస్తున్నా
బుసలుకొట్టే నల్ల త్రాచులాంటి మబ్బులు మాత్రం

నరగ చిత్రాలను తలపిస్తూనే ఉన్నాయి
అయినా నా పిచ్చిగానీ
జవాబు లేని ప్రశ్నలకోసం తుణీరమవుతున్న సముద్రాన్ని
వదలలేక వదలలేక, మళ్లీ వస్తానని ఒట్టు వేసుకుని బయలుదేరా

నాకున్న ఆదర్శం ఒక్క ఆకాశమే!
నాకున్న అవకాశం ఒక్క ఆలోచనే!
గుండె తలపుకు తాళం అసంభవం!
ఇంటి తలుపుకు తాళం తాత్కాళికం!

గుండెకయినా, ఇంటికయినా
తలుపూ నేనే.. తాళమూ నేనే..
తలుపు తీయగలం కానీ
తాళం తీయడానికి చెవి కావాలి

ఆ చెవికి ఒక చోటంటూ ఉండాలి
గుండె తలుపుకు తాళం మెదడే!
ఆ తలుపు తెరచుకోవాలంటే మెదడులో కదలిక ఉండాలి
మెదడు స్తబ్ధతను ఆవరిస్తే

గుండె తలుపు మూతపడుతుంది
గుండె తలపుల తలుపు తెరచుకోవాలన్నా
ఇంటి వాకిలి తలుపు తెరవాలన్నా
ఇంట్లో ఉండాలనే తలపు

గుండెలో దాచిఉంచాలనే తలంపు ఉండి తీరాలి
కానీ ఏ తాళం ఇంటికి భరోసా ఇవ్వదు
ఏ తలపు జీవితానికి భద్రత ఇవ్వలేదు
వీటికన్నా తోటలో పూలే నయం

వాటికొచ్చిన భాషలో తలలూపుతూ సంభాషించుకుంటాయి
కంచెకు తాళం వేసినా అందరి కళ్లకు కనిపిస్తూనే ఉంటాయి
మనిషికి మించిన ఖైదీ లేడు
మనసుకు మించిన కంచె మరొకటి లేదు

కాలం మెదడుతో సమ్మిళితమై సంభాషించుకుంటాయంతే!
అందుకే మాటలతో మాలలు కట్టి ముచ్చటిస్తావా చెప్పు!
అలాగైతే చెప్పు! ముందుకు రా!
ఆలస్యం చేయకు! విషయాన్ని నాన్చకు!

దారిలో వాహనం వేగంగా పోతుందా తొలగిపో లేదా పారిపో!
ఉన్నట్లుండి మెలకువ వస్తుంది
ఆ మెలకువే నీకు ధ్వని సంగీతమై జీవితాన్ని నడుపుతుంది
మాటల పై రణగణ నిస్వానంగా జనంతో పాటుగా

గొంతు విప్పితే పలికేది పాటే కావాలి
మాటయితే పాట కాలేదు కదా?
అదే పాటయితే మాట అవుతుంది ముత్యం కూడా అవుతుంది
జీవన వాహనానికి స్టీరింగ్‌లుండవు

ఒకటే పరుగు..
అక్కడక్కడా బ్రేకులుంటాయి
అయితే అవి గుండెల్ని పిండిపిండి పిప్పిని చేస్తాయి
పో! త్వరగా పైకి !

వెలుగు చీకటి పంచుకున్న నిలవకు
సగానికి పైగా మనిషి జంతువైపోయాడు
ఇంకా నయం పక్షి కాలేదు సంతోషించాలి
మనిషిగా పరుగు.. పక్షిగా పరుగు అంటే ఎంత శ్రమ?

జడమైతే తప్పక తప్పించుకుంటాము
ఎందుకంటే ఎంత పెద్ద వాహనమైనా దిగులుపడి
తనంతట తానే పక్కనుండి వెళ్లిపోతుంది.
ఇక హారన్లుండవు. అడ్డంగా నిలబడ్డావు. బుద్ధిలేదా?

అనే దూషణ భూషణాలుండవు
నిత్యం క్షేమంగా యధేచ్ఛగా సాగిపోవచ్చు!
ఇష్టమైన చోటనే చిరకాలం నిలిచిపోవచ్చు!
ప్రియమైన నేస్తమా!

మట్టిని తాకని నీకు నా ప్రేమ ఎలా అర్థమవుతుంది?
చెట్టుని తరచి చూడని నీకు నా ఔన్నత్యం ఎలా తెలుస్తుంది?
బతుకు ప్రకృతితో కలిసి ఒక గుహలా మారింది!
గుహ గుహకు మధ్య మనిషి ఒక నిశాచరుడు

గుహ ఎంత లోతుగా ఉందో
అందులో ఉన్నవి రత్నాలో, వజ్రాలో
మట్టి పెళ్ళలో, ఇసక దిబ్బలో
గబ్బిలాలో, త్రాచుపాములో

తెలుసుకోవాలంటే మనం బాటసారులం అయివుండలి!
నిరంతరం సంచారంతో సహచర్యం చేసి ఉండాలి!
ఒక్కరోజునే అంతా వెదికేయడం,
అన్నీ తెలుసుకుని మసిలేయడం అంత సులభం కాదు!

ఒళ్ళు నిద్రపోతున్న వాడిని బలవంతంగా లేపి
విషయ సేకరణ చేయమని సమయం ఇస్తే
అణగదొక్కబడిన ఆశలు ఒక్కసారిగా మెరుగుపెట్టినట్లయి
ఉన్నది మరచిపోయి తాను ఎక్కడున్నదీ! ఎందుకున్నదీ!

అనే ఆరాలోనే సగం జీవితం గడచిపోతుంది.
బద్ధకస్తుడు  నడిచే దారంతా సమాధులే!
తవ్వినకొద్దీ అస్థిపంజరాలే!
ఆ  పాదాలు ఎగరలేవు! దిగులుగా నిలవలేవు

స్పందనలో శక్తి లేకుంటే సమయం సింహంలా ముందుకురికి
హిమశకలాన్ని కరిగిస్తూ
ప్రాణంలో ప్రాణమై ఉద్దీపన చైతన్యమై విశ్రాంతి తీసుకోలేవు
రాత్రయినా పగలైనా రేఖాగమనం మార్చే హస్తాలు

మూకలు మూకలై ప్రతి చోట సంచరించే ఘోషలో
నింగిని ఆవరించి ఉన్న నీడలన్నీ
రేపటికి వేసే బాటలన్నీ
మాపటిని అంటుకుని వీలయినంతగా

శక్తిని సమీకరిస్తూ శ్వేతేతర పక్షుల్లా కక్ష్యలను సాధిస్తాయి
ధాత్రిని ఆనుకుని ఉన్న ఉద్రేకమంతా విశ్రాంతి తీసుకుంటాయి!
మనిషి-ప్రకృతి-ఒక వాకిలి

ముప్పేటల గొలుసులా ఏర్పడి

విశ్వశాంతి సమర్చనంగా
మనో శిలాప్రతిమల నిలయంగా మారి
మనిషికి అవగతమయ్యే దారిలో
ఒక భావం పాడే పాట తత్వమేదో లోలకమై

సందేహమై మైమరచే వేళ
బయటపడుతున్న ఒక రహస్యం
నదీ  లహరుల్ని కిలకిల నవ్వులతో ఓలలాడిస్తూ
చెట్టును, పిట్టను, నేలను, ఆకాశాన్ని

కుశల ప్రశ్నల్ని వేసి సంభాషిస్తూ గల గౌ లాడిరచే
సమున్నత శైలిని శీతల హస్తాలతో స్పృశిస్తూ
మత సూత్రాలకు, కులగోత్రాలకు కట్టుపడని
ఆదర్శ స్నేహవీచికలను అందిస్తూ

తెలుపు నలుపులు వర్ణబేధాలకు స్వస్తి చెబుతూ
కాలం రాల్చుతున్న స్వేచ్ఛా వీచికల్ని ఆస్వాదిస్తూ
తాకట్టు పెట్టిన దేహాల్ని విడిపించుకుని
ప్రాచీనులు, ఆధునికులని తేడాలేకుండా

తిరుగాడే వేళ ఎంత దాచినా దాగని ఉదార వచనం
నిత్య జీవిత దృశ్యాల ఆగమనం!
వాకిలి ఎదుటే ఉన్నా వృక్షం
లోనికి రావడాన్ని గురించి సందేహిస్తుంది.

చెట్టు ఒక మనిషి అయితే సందేహంలేదు
అదే మనిషి ఒక చెట్టయితే మాత్రం సందేహమే!
ఈ సందేహ సందోహాల నడుమ
కలిగించే చిత్రమైన ఊహ!

ఒక్కో సమయంలో సహజం కూడా సందేహమే!
మనిషి మనిషి ఒక్కోసారి ఎదురుపడేవారం!
ఎన్నిసార్లు ఎదురుపడినా అవే చీకటి పొరలు కమ్మిన కళ్ళు!
ఎదురెదురుగా నిలబడి నిలబడి అలసిపోయిన క్షణాలముళ్ళు!

ఇన్నీ జల్లెడపడ్తున్నా సరే వాకిట ముందు నిలబడిన బిక్షగాళ్ళు
ఒక ద్వారం నుండి తరిమిగొట్టినా సరే మరెన్నో ద్వారాలు
పలకరించినా , తూ౦నాడి వెళ్లగొట్టినా ఆత్మలకు తాకకుండా
ఎవరికీ అందకుండానే అందినా చెందకుండానే పారిపోతున్న గూళ్ళు!

అయితే స్పష్టత ఎక్కడుంది?
ప్రయత్నం వెనుక నిలిచిన అస్పష్టత ఎందుకుంది? అనేది ప్రశ్న!

కాలం గాలానికి చిక్కిందని అనుకుని భ్రమలో
పైపైకి ఎదిగి దూరదూరాలు పాకి

మన మనుగడలకు గొడుగుల వలె కాపాడుతున్నవి
కేవలం మంత్రాలతో, కుతంత్రాలతో జరిగే
రూప విధ్వంస విహంగాల వ్యక్తీకరణ కానేకాదు!
మెలకువలో స్వప్నం ఎంత అసాధ్యమో

నిద్రలో కాళ్ళు నడిచి వెళ్ళడం అంత అసాధ్యం!
చెట్లు వేళ్ళతో మాట్లాడుతూనే ఉంటాయి
రోడ్డుపైని మానవుల దాతృత్వం గురించి
తననుండి పొందిన స్వలాభ లక్షణాలను గురించి

మాట్లాడినా, మౌన ముద్రలో ఉన్నా
మనకు మనమే నడిచి వెళ్ళిపోతాము.
తప్పదు నిదురించిన నేలపై
ముహుర్ముహు రాగత వాయు వీచికా సంచాలిత

పుష్పాందయ కాంతి చేలలో
దుఃఖ ప్రక్షాళనగావించి మెలకువ రహస్యం
తెలుసుకొనేందుకు గానూ విశాల హృదయంత
మాట్లాడే చెట్ల దగ్గరికైనా

పలకరించే పక్షుల దగ్గరికైనా ఎవరూ పిలవకుండానే
ఆప్యాయంగా కదిలిపోతుంటాము
ఎవరూ! ఎవరు పిలుస్తున్నారో నాకు తెలియటంలేదు
ఎందుకు రమ్మంటున్నారో అర్థం కావడంలేదు

పాత వస్తువులు విరక్తి భావాలా?
సరికొత్త స్నేహాల సయోక్తి బంధాలా?
జీవితపు పంక్తులలో పోరాటం ఆగదు
మనుషులు కుబేరులయినా కాకున్నా

కుచేలురు మాత్రం అవ్వక తప్పరు!
వేర్లు లేకుంటే చెట్లు పెరగటం ఎంత కష్టమో
స్నేహం లేకుంటే జీవించడం అంత కష్టం!
అయితే చెట్లు లేకుంటే వేర్లు ఎక్కడివి?

జీవితమే లేకుంటే స్నేహమనే మాటెక్కడిది?
ఒక్కక్షణం ఆగండి!
మంచుబిందువులు నన్ననుసరిస్తున్నాయి
మరొక్క నిముషం ఆగండి!

మానవత్వపు ఆనవాళ్ళు నన్ను పిలుస్తున్నాయి

జీవనయానంలో తోడూ నీడా లేకుండా ఉండటం అంటే
అదొక్క కవికే సాధ్యం!
కవికి శూన్యంలోనే కట్టడాలన్నీ!

ఒంటరితనంలోనే ఆత్మీయతలన్నీ!
అయితే వీటిని నమ్మినట్లా?లేక నమ్ముతున్నట్లా?
ఆ మాటకు ఆముఖం మొగ్గ తొడిగింది
ఆ మొగ్గలన్నీ పువ్వులై కాయలై నన్నునన్నుగా పిలిచి

నిన్నునిన్నుగా, నీలో నన్ను, నాలో నిన్ను కలిపిన తీరులో
ఆ ఊహలన్నీ ఆసాంతం రాసిస్తానంది
అబ్బ! ఎంత సేపటినుండి అక్షరాలతో మాట్లాడుతున్నానో
" కొన్ని గంటలు కాదు. కొన్ని రోజులనుండి"

అయితే ఉన్నది ఒకటే తృప్తి!
అక్షరాలు అబద్ధాలు చెప్పవు!
భావాలు మోసం చేయవు
అందుకే కవి నివాసం అక్కడే

వాస్తవాల ఆవాసం అక్కడే!
ఆటయినా పాటయినా
ప్రకృతికి ఆనవాలే!
రాతయినా, భాసయినా

హృదయానికి ఆనవాళ్ళే!
గతం కలలు కంటూ రోజూ ఒకే గదిలో
ప్రపంచాన్ని చూడాలంటే కష్టమే!
అలాగని నిత్యం ప్రపంచంలో ఉండిపోవాలన్నా కష్టమే!

ఇంతకీ ఆ ప్రపంచం ఎక్కడుంది?
నాలుగు గోడల మధ్యనా? లేక
సమాజపు అంచుల లోనా?
ఒకవేళ ప్రపంచంలో ఉండాల్సి వచ్చినా

గదిలో బంధీ అవ్వాలన్నీ ఒక్క మనిషి కోసమే
నిన్ను తప్ప అందరినీ వెదికినా
నువ్వు తప్ప నాకెవ్వరూ కనిపించలేదు
కనిపించినా కనిపించకున్నా వీలయితే

ఒక మనిషిని కనిపెడదామని బయలుదేరాను
వెదికాను వెదికాను ఏం ప్రయోజనం?
మనిషి కి బదులు 'మనీ'షి దొరికాడు
వాడికి మల్లే వీడికీ రెండుకాళ్ళు, రెండుచేతులు,

ఒక నోరు, రెండు కళ్ళు ఉన్నాయి కానీ
ఏవీ పనిచేయడంలేదు!
పనిచేసినా పలకరించడంలేదు
వీరిలో బయటకు కనిపించని వికృతాలు అనేకం

అనేక ఇతిహాసాలు! కనిపించే జీవితాలు!
అందరికీ కావాలి మనిషి తత్వం!
అయితే కనిపించేది మాత్రం రాక్షసత్వం!
ఎలా కుదురుతుంది? ఎంతలా కష్టపడితే మాత్రం!

చినుకు చినుకు మధ్య రాజీ కుదరనట్లే
మనో నిబ్బరం ముందు పచ్చగడ్డి కూడా మండుటెండే!
దారికి అడ్డంగా కనిపించేవన్నీ పచ్చని మొక్కలు కావు
పచ్చలంటే రెండు ఒకటి పసుపు, మరొకటి ఆకుపచ్చ

ఏదయినా వెళ్ళు! లోనికి ! మరింతగా లోపలికి!
ఈ స్వభావాన్ని ఎవరు కనుపెడతారు?
ఈ మనో వైకల్యాన్ని ఎవరు గుర్తుపడతారు?
పట్టణం అంటే బురదలో తేలినా తేలకున్నా

అది పట్టణం అంతే!
పన్నీరు జల్లుకున్నా , పన్నీటి స్నానమాచరించినా
అది పల్లెతల్లి అంతే!
అసత్యంలో సత్యం వలె

దుర్గంధంలో గంధం వలె
అంతరాత్మ ఎక్కడుంటే అక్కడి మాటే పలుకుతుంది
ఆత్మ దేనితో ఉంటే  ఆ దేహానికే కదలిక ఉంటుంది
అయినా కదిలిపోయే ముఖచిత్రాల్లో నీ పోలిక లేదు

కాలం కనుమరుగవుతుంది మైనపు వత్తిలో జాడల్లా
కమనీయమైన దీపం నీదే అవుతుంది ఙజిన్నుల క్రీనీడలా!
ఎక్కడికి పోతాం? పరుగులు తీస్తూ..!
చీకట్లోకి పోతే కనిపించమనుకోవడం మన భ్రమ!

వెన్నెల్లో విహరిస్తే వెన్నెల మనల్ని వరిస్తుందనుకోవడం భ్రమ!
వెలుగులోకి విసిరివేయబడితే ఆ ద్రోహం సూర్యుడిదే
అనుకోవడం వట్టి భ్రమ!
ఇన్ని భ్రమల మధ్య జీవితం ఒక వేదాంతం చొక్కా

తొడుక్కున్న దేహం సందర్భాలు అనేకం! అనిర్వచనీయం!
మనిషికి రెండు నాలుకలు ఉంటుంది
కానీ దేహం మాత్రం ఒకటే!

పలికినా, పిలిచినా, మాట్లాడినా,

కాదన్నా, ఔనన్నా, వద్దన్నా
వలదన్నా ఏదన్నా ఏమయినా ఉన్నది
ఒకటే దేహం హంతకుడిలా మనల్ని అంటిపెట్టుకుంటుంది
నేను అనే పదం అచ్చం నాలాగే ఉంటుందనుకోవడం

ఒక నిస్సహాయత, ఒక అసహాయత
ఒక నిర్లిప్తత, ఒక అపరిపక్వత అన్నీ కలిసి
నేను అనే పదం ఎవరితోనూ ఉండలేక
ఎవరికోసమూ ఎదురుచూడలేక పోవడం అనేదే

నాలోని నేను స్వరూప లక్షణం!
భృకిటి ముడిపడితే ఆలోచనే ఖచ్చితంగా
హృదయం ముడిపడితే ఆవేదనే నిరాటంకంగా
మనసు ముంగిలిలో కనిపించే దృశ్యాలన్నీ

ప్రకృతి ప్రసాదాలు అనుకుంటే పొరపాటు
కొన్ని మనం తయారు చేసుకున్నవాటిని ప్రకృతితో జతకలిపి
విజయమైతే మనదని, అపజయమైతే ప్రకృతిదేనని
ఘంటాపదంగా చెప్పడం అనేది నిన్ను పూర్తిగా

ఆవరించిన నిశ్శహాయత దోబూచులాట పరివర్తనం!
సమయాన్ని అనుసరించి నడిచే ప్రతి కదలిక
తనని తాను చంపుకున్నాకే లెక్కపెట్టడం మొదలుపెడుతుంది
ఏం ? ఆ మాటంటే బాధగా ఉందా?

చరిత్రను చంపినపుడు తెలియలేదా ఆ బాధ?
ప్రాచీన కథనాల్ని కూకటివేళ్లతో పెకిలించినపుడు లేదా ఆ ఆవేదన?
మెదడు ఒక పిచ్చిది!
భ్రాంతులమధ్య బతుకుతూ తానేదో

దేహానికి దేవాలయంలా చెప్పుకుంటుంది
ఆ దేవాలయానికి దేవుడే ఆలోచన అయితే
ఈ తకధిమి తకధిమి ఆటుపోట్లు ఎందుకు?
ఇప్పుడర్థమయ్యింది

ఒక్క చిత్రం తన మదిలో చేరగానే దాచుకుని
పదే పదే గుర్తుకు తెస్తున్నది చాలక
నిద్రను ఆవరించి కలల రూపంలో కదిలించి
మనసును వేరెక్కడికో పంపివేసి

పంచప్రాణాలలో ఒక ప్రాణాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని
తనేదో సాయం చేసినట్లుగా చెబుతుంటే..

ఎంతకాలమని ఈ అబద్ధపు పోరాటంలో మనం?
ఎంత దూరమని ఈ ఊహా చిత్రంలో మన పయనం?

మనిషిలోని ప్రేమ ప్రకోపించాక మిగిలేది
వట్టి దేహమే!
ఆ దేహాన్ని ఆనుకున్న బంధాలన్నీ
అనవసరంగా వెళ్లిపోయావా అని ఏడుస్తుంటే

అదంతా నిజమని మార్గమధ్యంలో ఉన్న ప్రాణం
ఉలిక్కిపడటం ఎంత నిజమో
చనిపోయిన పటానికి మాల వేసి అగరవత్తి వెలిగించడం కూడా
అంతే నిజం!

దీర్ఘ నిట్టూర్పులూ, వేడి వేడి వడగాడ్పులూ
దేహానికి సంబందించినవే కానీ మనసుకు కాదు
ఉన్మత్త వ్యాఖ్యానంలో జనించే ప్రతి పదం
శరీరానిది కాదు ఆత్మది!

మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి,
చివరికి మట్టిలోనే చేరిపోతామనేది ఎంత అసహజం?
దేహం ఎపుడు మట్టిని తాకదు
మట్టిలోనే దొర్లుతూ బతకదు

మట్టిలో చేరడం మాట అటుంచితే
మట్టి అంటే దుమ్ము కాదనే విషయాన్ని గ్రహించాలి
మట్టి అంటే ఇసుకరేణువులు కావనే నిజాన్ని తెలుసుకోవాలి.
కారణం ఏదయితేనేం? మట్టిలోనే పుట్టామనే అనుకుందాం!

అమ్మ భూదేవి అవుతుంది
జీవించడమనే మాట అంతా వృధాప్రయాస అవుతుంది!
మెదటిది సరే నేనొప్పుకుంటాను
మరి జీవితంలో జీవించే ప్రతి పేజీ చివర ఆయాసమంతా

వ్యర్థమేననే మాట ఎడారిలో మంచుగడ్డంత సాక్ష్యం!
రోజు రోజుకు ఎదురయిన నవ్వులూ! పూచిన పూలు!
అలంకరించుకునే చిత్రపటాలూ!
అన్నీ సమయానుకూల సమయపాలనకోసం చేసిన పనులేనా?

మనలోంచి పారిపోతున్న వైనాలు రాబట్టుకోవడానికి
చేస్తున్న ప్రయత్నాలేనా?
మనిషి మనిషిలోంచి పారిపోతున్నాడు
ప్రకృతి తనలోంచి తాను పారిపోవడానికి వీల్లేని స్థితిలో ఉంది

ఆకాశం తనను నమ్ముకున్న వారిని

ఏమాత్రం వమ్ముచేయకుడదనే విషయాన్ని
నిత్యం మననం చేసుకుంటుంది
భూమి తాను మోసినంతవరకు మోసి

చివరకు చేయి జార్చితే జరిగే భూకంప ప్రక్రియకు
తల్లడిల్లుతూ శక్తిలేక ఆలోచనలో పడిరది
మనిషి తనకు తానే రాజు
ఏడాది ఏడాదికి తానేదో పెరిగిపోతున్నట్లు

మెదలవ్వగానే కెవ్వుకేకలతో విసిగిస్తూ
మధ్యలోకి రాగానే నీరసంగా నినదిస్తూ
చివరికి మరొక మొదలుకోసం ఎదురుచూసే మోజు!
ఇది ఎంతవరకు అంటే చెట్టు ఉన్నంత వరకు..

పిట్టలు ఇంకా మనల్ని పలకరిస్తున్నంతవరకు!
జంతువులు తిన్న ఇంటికే కాపలా కాస్తున్నంతవరకు!
అలాగని దారికడ్డంగా నిలుచుండే చెట్లను
తట్టి పలకరించే సమయం  లేదు

జీవితంలోనే కనిపించని నీడ కోసం ఎదురుచూసే
అవసరం లేదా అంటే తెలియదు!
అనుకుంటాం అలవాటుగా
అందరికీ దూరంగా జరిగిపోవాలని

ప్రకృతి నుండి ఎలా పారిపోగలం?
ఆ గాలినుండి పారిపోగలమా?
నీటినుండి, ఆకాశం, భూమి వీటన్నింటినీ వదిలేయడం అంటే
వాటిలో కలిసిపోవడమే కదా?

సృష్టి వృక్షాల పక్షపాతి!
నిత్యం వృక్షం వెనుకే నిలబడి నవ్వుతుంటుంది
నా ముందుకు రావడానికి కూడా భయపడుతుంది
మనిషికి దొరికితే ఇంకేమయినా ఉందా?

ఒక్కో గంటా ఒక్కో సంవత్సరం అయిపోదూ అనుకుని
దొరకకుండా దూరంగా పారిపోతుంది.
వర్షం పడుతుంటే గ్రీష్మం తొంగిచూస్తుంటే చిరాకేస్తుంది
అరె! పడనీ వర్షాన్ని మధ్యలో నువ్వేంటి భయపెడతావు

అని కోప్పడతాను..కానీ వింటుందా?
వర్షం ఎక్కడ వంద మార్కులు కొట్టేస్తుందో అని
గ్రీష్మం గాలితో కలిసి కాపలా కాస్తుంది
ఒకవైపు తడిసి ముద్దయిన శరీరం

మరోవైపు చిరాకు పెట్టించే గ్రీష్మం
రెంటితోనూ సర్దుకుపోవాల్సిందే! తప్పదు!
చినుకులు పడుతుంటే దారిన పచ్చగడ్డి ఎంతలా మెరుస్తుంది?
వెళ్ళు వెళితే కనిపించే గుడిలోకి లేదా మీ ఇంటిలోకి ..

ఇష్టం లేకుంటే, నా ముందుకు రాకు! ఊపిరి ఆగిపోయేట్టుంది!
గ్రీష్మం అడ్డుతగులుతోందని నాతో మొరపెట్టుకోకు!
మనోకుహరంలో కనిపించే బొమ్మల్లో ప్రాణం ఉంటుంది
అవి కాలి బూడిదయినా ఊహల్లో బతికే ఉంటుంది

అలా ఏవో అన్నామని కనుమరుగైపోతే
హమ్మయ్య పారిపోయాయని భ్రమపడకు!
మన పాదాలను తాకిన ప్రతి అణువూ మనతో ఉన్నట్లే!
మన హృదయాన్ని అంటిపెట్టుకున్న

ప్రతి రేణువూ వేణువై మన దేహాన్ని అంటిపెట్టుకున్నట్లే!
గతకాలపు శైథిల్యంతో భవిష్యత్‌పై ఆశలు ఉన్నాయో లేవో కానీ
హృదయ ముఖచిత్రాలలో మాత్రం అత్యాశలు
కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

హృదయం సున్నితమైన నినాద శబ్దం చేస్తూ
మైనపు వత్తి మధ్యవర్తిత్వంతో ఎవరికి ఎవరు అనే నినాదాన్ని
మనసులో ఉంచలేక తీసెయ్యలేక వెలుగుల అంచుల్లో
వేల్లాడుతున్న బూడిద ఆసాంతం దహనమవుతోంది.

వాతావరణం ఒక విధంగా వెర్రిది
పోట్లాటలకూ వంతపాడుతుంది
ప్రేమకు పాట పాడుతుంది
ఇతిహాసాలకు, ఆధునిక రసహృదయ నినాదాలను జతకలిపి

పురాణాలకు పౌరహక్కుల గీతం గాత్రంలో నిలిపి
భారతానికి, రామాయణాలకు నీతులు నియమాలు జోడిరచి
చరిత్రను చంపకుండా
పేజీలలో కలిసిపోయి ఒకానొక పుటగానో,

కనీసం ఒక వాక్యంగానో మారిపోయి
పదంగా మారి పరవశిస్తూ చేసే నృత్యం
ఒకచోట నిద్రపోతోంది అసూయ దుప్పటి కప్పుకుని
స్వార్థపు నడకలను నేర్చుకుని

నిలవడానికి సమయం లేకుండా కవిత్వం మూటకట్టుకుంటుంది
నేనో ప్రయణికురాలిని. నువ్వో నావికుడివి
ఒకవైపు విహంగాల్లా చెట్లు!
మరోవైపు విమానాల్లా పక్షులు!

నెమ్మదిగా అలలు
ఎగసిపడే కెరటాలు!
పలకరిస్తున్న పావురాళ్ళు!
రొదచేస్తున్న కీచురాళ్ళు!

నవ్వుతున్న జాబిలి!
అల్లరి చేస్తున్న నక్షత్రాలు!
మండిపోతూ వెలుగునిస్తున్న సూర్యుడు
చేజారిపోతున్న తోకచుక్క!

చీకట్లో తమ సత్తా చూపుతున్న మిణుగురు పురుగులు!
నడిచే జంతువు. పాకే పాములు
అరిచే పిట్టలు! గాలి, నీరు
ఇవన్నీ ప్రకృతిమాత బిడ్డలు!

సృష్టి ఉన్నంతవరకు కాపాడుకోవాల్సిన
అంశలు! కదిలే చీమ, కలవరించే కాకి
అణువుల్ని ఏరుకుని
అల్లరి చేస్తున్న పెద్దమనిషి తరహా ఆంతర్యాలు!

వస్తూ పోతూ ఉండే జనరహిత రహదారులు!
ఒకానొకడు వెళుతున్న ఆసామిని పిలిచి అడిగాడు
సంగీతం ప్రకృతిలో ఉందా అరుపులో ఉందాని!
రెండిరటిని ఒప్పుకోకుండా

రెప్పలకింద దాగిన కన్నీటిలో అసలైన సంగీతం ఉందన్నాడు..
పసిపిల్లల నవ్వుకంటే ఏడుపే శోభనిస్తుందన్నాడు
దూరం పెరుగుతున్నకొద్దీ
విసిరేయబడుతున్న చూపుల్లో అందం దాగుందన్నాడు

తోచకుండా ఉన్నపుడు కలిగే ఆలోచనల్లో
నిగూఢత ఉంటుందన్నాడు
సంకుచితం రాత్రి అనుకుంటాం కానీ
ఆ చీకటిలోనే ఆనందం దాగుంటుందన్నాడు

విశాల హృదయం గల పగలు
వగలు పోతున్నపుడు సొగసు కనిపిస్తుందన్నాడు
గాలికి చెదరిన నిప్పురవ్వల్లా
ఏడ్చి ఏడ్చి మధ్యలో ఏదో సరదా మాట విని

వచ్చే నవ్వు మనోహరంగా ఉంటుందన్నాడు
మబ్బులు పట్టిన ఆకాశంలో
కనిపించీ కనిపించని నక్షత్రాల్లో

అమితమైన ఆహ్లాదం పలకరిస్తుందన్నాడు

కానీ అలల్లేని సముద్రం లేనట్లే
కదలిక లేని నది మన మధ్య ఉండదు
నది గంభీర ముద్ర దాల్చిన ఒక విన్యాసం
సముద్రం కెరటాలను అదుపుచేసే ప్రయత్నంలో

తన ముందు నిలబడే దెవ్వరైనా
నిర్భయంగా నిలదీసే గుప్పెట దీపం!
చిత్రం పేరు గుర్తుకు రావడంలేదు!
చూసి చాలా కాలమయ్యింది

ప్రకృతి ఆధునికావతారం ఎత్తి
మధ్య మధ్య మంటలతో పూలు జల్లి
కంటికి ఇంపుగానూ, గుండెకు నిండుగానూ
కనుమరుగైన సస్యశ్యామలమైన పంటల గురించి

అంగుళం అంగుళం గాలించి కాలికి ఏదయినా తగిలితే
అది పచ్చికేమో అని భ్రమించి
మేల్కొంటున్న వయసులో ఒకటిరెండు పురాస్మృతులతో
కాస్తంత భయాన్ని, మరి కాస్తంత నిర్భయాన్ని తోడు తెచ్చుకుని

ఉన్నదున్నట్లుగా ప్రతి ఉదయం జన్మిస్తూనే ఉంది
మరణం తెలియని జన్మలో కరువైన నవ్వుల తెరచాపలా ఉంది
జీవితపు తెరపై బొమ్మలు వస్తూ పోతున్నాయి
ప్రకృతి వెన్ను పై క్రీనీడలు కనిపించీ కనిపించకున్నాయి

గుడిలో చమురు దీపం కింద ముడుచుకున్న చీకటి
నిశ్శబ్దం ధ్వనిలో మురిసిపోతుంటుంది
మృదువైన వాతావరణానికి సున్నితమైన వెలుగును అందిస్తుంది
ఉదయ ముఖాన పతాక వార్త

చందమామ ఇకపై సూర్యుని వద్దనుండి వెలుగును వద్దన్నట్లు
సూర్యుడు అహంభావంతో తన వెలుగును తానే
ఫిక్స్డ్ డిపాజిట్ చేసుకుంటున్నట్లు
చుక్కలన్నీ సూర్యుని ఛాయకోసం వెదుకుతున్నట్లు

ఉన్నట్లుండి రివ్వున వీచే గాలి ఈల పాడుతూంటే
శభాష్ అంటూ చప్పట్లు కొడుతున్న చెట్లు!
జన్మ పునరాగమనం విషయాలెలా ఉన్నా
ప్రతి ఉదయం మాత్రం ఒక కొత్త జన్మే అనేది నిజం!

ప్రతి రాత్రి సరికొత్త భయమేననేది కూడా నిజం!
రాత్రి నల్లని చీరకు

జరీబోర్డరు వెన్నెలలో రజను దాగి ఉంది
మెరుపుల నక్షత్రాల నడుమ

ఏదో ఉత్సవం జరుగుతన్నట్లు
దేదీప్యంగా వెలుగుతూ
ఎవరూ మెచ్చుకోకుండానే
కళ్ళు మిరమిట్లు గొలుపుతాయి

కాళ్ళు జీవన పోరాటంలో నృత్యం చేసిచేసి
అలసిన మరీచికలా నేలపై పరుచుకుంది
ఉన్నట్లుండి గంటల శబ్దం!
సుస్వరాల మంజీర నాదం!

ఎక్కడికక్కడ సద్దుమణిగి ఏమీ తెలియనట్లున్న
సుప్రభాతం!
చాయ్! చాయ్! మంత్రంతో ఉలిక్కిపడిన
ప్రయాణపు జనానికి

కదలికలతో తప్ప ఉదయంతో పనిలేదు
ఉలిక్కిపడిరది ఉల్క!
ఇపుడు నేనెక్కడున్నాను ? అనుకుంటూ
తనంతట తానే తడిమి తడిమి చూసుకుంది

అర్ధమయ్యింది! ఆకాశ వేదికపై మెరిసి మెరిసి
నేలపై, పంటచేలపై అచేతనంగా పడి ఉందని
కాస్సేపటిలో తనో జన్మకు పరమార్ధంగా నిలిచి
శూన్యంలో ఒంటరిగా మిగిలిపోతోందని తెలుసుకుంది

తానెందుకు మళ్లీ ఈ పాపపు మానవజాతిలో
పుట్టాను రా స్వామీ అనుకుంటూ
పుట్టినపుడే తెలుసుకున్న బిడ్డ
క్యార్ క్యార్ మన్న ఏడుపుతో శృతికలుపుతుంది

మనకేం తెలుసు?
పుట్టగానే ఏడ్వాలి కదాని ఏడవకుంటే కొట్టి మరీ ఏడిపిస్తాము.
అయ్యో! ఇపుడు జన్మ మరీ నరకంగా తయారైంది
వ్యధలు నిండిన జీవితం కణకణలాడుతున్న నిప్పులాఉంది

ఉదయం గమనిస్తూనే ఉంది
రాత్రి తలగడ తడుస్తూనే ఉంది
ఈ మాత్రం దానికి జన్మ అవసరమా? అంటే
బతికున్నా మూతపడుతున్న కళ్ళు

అద్దంలో ఎంత చూసుకున్నా కనిపించదు

అయినా పడుతూ లేస్తూ  ఒకపనికి సరిపోయినా
సరిపోకున్నా , ఒక సందులో పట్టినా పట్టకున్నా
ఒంలరిగా అయినా , మూకలుగా అయినా

ఇరుక్కుని, సర్దుకుని, అడుక్కుని బతికేస్తూనే ఉన్నాం!
ఎలా బతికినా బతుకే అని సర్దుకుంటూనే ఉన్నాం!
పక్షి చూడు మాట్లాడలేదు.
జంతువు చూడు తన బాధ తాను చెప్పుకోలేదు

మనుషులకే ఇన్ని వరాలు అనుకుంటూ
అత్తెసరు జీవితాలను అరమరికలు లేకుండా                బతికేస్తూనే ఉన్నాం!
చూడండి!మీాకు కనబడుతున్నాయా?
గుండెమంటలకు పూచిన తీగెలు ఎలా వేల్లాడుతున్నాయో!

కడుపులో కాళ్ళను ఉంచుకుని దాహార్తిjై◌◌ం
తాగుదామని కార్చిన కన్నీటి చారికలు ఎలా కనిపిస్తున్నాయో!
నీడనిచ్చే చెట్టును నరికేస్తారు
స్వేచ్ఛగా బతికే జంతువుల్ని తినేస్తారు

బతికుండగానే ఆదిమానవుల సంతతిలా
మాంసఖండాలను తింటూ
మాటలన్నీ మలిన పడినట్లే మాట్లాడతారు
పక్షుల్ని వేటాడి జబ్బులు తగ్గిస్తాయని వండుకుంటారు

సంస్కృతి వెదికినా లేదు పోనీ!
సమానత్వం ఎలాగూ ఉండదు సరే!
సామరస్యం కూడా లేదంటే నీ జన్మ ఎంత వరకు?
నిద్ర సరే!

మెలకువలో కూడా నిద్రంటే జీవితం ఎక్కడివరకు?
వెలుగులో పరుగులు తీయాల్సిన పాదాలు
వెన్నెలలో తీస్తే దారి అనుసరిస్తుందా?
నిద్రావేశంలో నడిచే నడక శరీరాన్ని చైతన్యవంతం చేస్తుందా?

వైశాల్యం ఎరుగని భూమి
పొడవు వెడల్పులు తెలుసుకోలేని సముద్రపీఠభూమి
ఆకాశాన్ని ఏమీా చేయలేవు!
అవకాశాన్ని అసలే అందుకోలేవు!

ఎవరదీ నిద్రిస్తున్నది ఈ నేలపై?
పచ్చిక పారవశ్యంతో పలకరించే నీటి చెలమా?
గుచ్చి గుచ్చి నిలదీసే కంటక నేస్త రాజమా?
చమక్కులను చురుక్కుమనిపించే కిరణ కైవల్యమా?

హృదయాలను మలయమారుతం చేసే
దుఃఖ ప్రావరణావృత సంచాలితమా?
ఎవరదీ? లేవండి?
ఇక్కడ నిదురించాల్సిన వృక్షరాజమేది?

ఇక్కడే నిలుచుండాల్సిన పక్షి సంతతి ఏదీ?
తెలిస్తేనే కదా నేనీ కోనకు మహారాణిని
తెలియకుంటే మరోకోనకు నేనో ఉదారవచనాన్ని
నవ యవ్వన శీతల గంధ స్నేహవీచికా పరిమళాన్ని

ఆఘ్రాణించే నేనో మాలా స్నిగ్ధతను!
భూమిపై చెలమ, మనుషుల్లో వాక్పటిమ
మనసుల్లో ప్రేమ, కాస్తంత తపన ఉన్నందుకు
నా చుట్టూ అనుబంధాల దారాలను ఉండలు చేసుకుని

అందులో కృత్రిమ తీపిని జతచేస్తూ
బయటకు రాగానే ఊపే తలలన్నీ గాలి విజయపతకాలు
దేని బతుకు దానిదే అంటున్న సముద్రపు అలల సంకేతాలు
అయినా సరే!

నన్ను అనుసరించే ప్రతి అణువు ఆరిపోయే దీపం తాలూకు నీడలే!
నన్ను కాదన్న ప్రతి వస్తువు మసిగుడ్డ తాలూకు ధూళి తుంపరలే!
జుట్టువిరబోసుకున్న వృక్షం ముందునుంచి
ఎవరెవరో నడుస్తుంటారు

వయసు తేడా ఉండదు.
మనసు తారతమ్యం ఉండనే ఉండదు
నీడలో వృద్ధులు, పిల్లలు ఇద్దరూ కూర్చుంటారు
వీధిలో వస్తూ పోతున్న జనంలో

ఎవరు ఎవరి తాలూకా ఆరా ఉండదు
ఒక వైపు వీధికి, మరోచూపు ఇంటికి అంకితమైన కిటికీ మామ
పసివాడైపోయాడు చూపులన్నీ చువ్వల మధ్యలోనే ఉంచాడు
నడుస్తూ నడుస్తున్న వ్యక్తి పిలిచి

ఈ ఇల్లు మీదా? లేక ఈ వీధి మీదా? అనే ప్రశ్నకు
అమ్మేస్తే ఇల్లు, వీధి, చెట్టు గుట్ట అన్నీ మావే అంది సృష్టి
తలూపి ఊరుకుంటే గతానికి దగ్గర ంధువు
అడ్డంగా ఆనించి కాదంటే భవిష్యత్‌కు ఒకే ఒక శత్రువు.

వృక్షపు కళ్ళన్నీ ఆరిపోయే దీపాల తాలూకేనని స్ఫురిస్తోంది
కాసేపటికా వీక్షణాలన్నీ ఎర్రగా మారిన ఇనప బంతులై కనిపిస్తుంటే
చల్లారిన మంచుబిందువులన్నీ నాతో కలిసి నడిచే ముత్యాలయ్యాయి
లేదని పనిలో మునిగి ఉన్నా ఎక్కడికని అడగకున్నా

ఏం పనిలేదని అన్నారు పైగా అతి సామాన్యంగా జీవితం గుర్తుచేసుకుంటూ
ఉన్నట్లుండి నావైపుకు మనిషి గాలి వీస్తోంది
కోపం, భయం కలగలిసిన నా హృదయం చేతిలోకి వచ్చింది
శరీరంపై చేయివేస్తే కృంగిపోతానేమోనన్నంత బరువుగా ఉన్నపుడు

ఉలికిపడే పలికే పలుకులన్నీ విన్నాడో లేదో కానీ పిట్టమాత్రం
ఎగరడం మరచిపోయి నడుచుకుంటూ వెళ్ళిపోయిందనేది నిజం!
సరే! విషయం దాటింది
చినుకుపడి తడిసి ముద్దయిన గడ్డి ఆసాంతం

గుడిలో దాక్కున్నా వెలుగు తాకిడికి
ఆరుబయట ఎదురుచూస్తుంది
చెట్లన్నీ పసిపిల్లల్లాంటి పచ్చగడ్డిని ఏడిపించాలని
సూర్య తాకిడిని అడ్డగిస్తున్నాయి మనోహరంగా

నా ముందు కనిపించేవన్నీ ఇతిహాసపు చిత్రాలే!
చెట్లచాటునుండి నవ్వే సమయానుకూలాలన్నీ అనుభూతులే!
పో! మేఘమా! పో!
వస్తావుకానీ వర్షించవు!

వర్షిస్తానని ముంచేస్తావు!
నా ముందుకు రాకు! నన్ను అనుసరించకు!
నీ ఆలోచనల్ని ఎవరు మార్చుతారు?
నేను ఆకాశాన్ని  మార్చలేను

భూమిపై నిలుచుని సరిచేయలేను.
ఉండిపో! పోనీ !
మండుతూ పిడుగులా మారకు!
మేఘానివై బురదను తెస్తావు!

మెరుపులా వచ్చి ప్రాణాన్ని తీసుకుంటావు!
ఇంద్రధనుసులా వచ్చి వెంటనే మాయమౌవుతావు
నీవే గుణానికి చెందుతావు?
గత కాలపు శైథిల్యంతో భవిష్యత్‌ను భయంతో నింపుతావు!

కదిలిపోయే ముఖచిత్రాల్లో కాంతిగా మారి
శాంతిని పోగొడుతావు!
అసత్యాల మధ్య సత్యంగా మారి ఉనికినే కోల్పోతావు!
కాలం ఒక నిరంతర ప్రయాణీకుడు!

దారిలోని మంచిచెడ్డలను గమనించడమే కానీ
పరామర్శించకున్నా పరిష్కారం దిశగా నడుస్తాడు!
వస్తూపోయే జనం కాలిధూళి మధ్య అంతరాన్ని తుడిచేస్తున్న

కెరటాలు ఎంతగా వెనక్కు తిరిగినా ఒక్కోసారి

చెళ్ళున చెంపను సవరిస్తాయి
దెబ్బ తిన్న తీరం చెంపను నిమురుకుంటూ
మరోసారి నన్ను చేరు నా సంగతి చెబుతాను అంటుంది
అలాగని నిజమా అంటే ఏడిచే తీరంలో నవ్వు తొంగిచూస్తోంది

అయినా ఏదో పోగొట్టుకున్నట్లయింది.
మది ముంగిట నిలిచేది ఎపుడూ మరో మదే కదా అంది
వరుసగా రంగుల కలల వరుసలో
దూర దూరంగా జరిగితే ఆనందం కోల్పోతాము

వాస్తవ అవాస్తవాల సమ్మేళనంలో
స్వేచ్ఛాస్వరూపాల్ని  మరచిపోతాము!
పిచ్చి జీవితాలు!
ఉదయంనుండి రాత్రి వరకు మండుతున్న

అగ్ని తాలూకు నిజాలు మండి మండి
ఆరి బొగ్గులుగా మారి ఉపయోగపడేది
వంటింటి కుంపట్లకే కాదు
జీవనాధారపు నమ్మకాలకు కూడా!

సంకుచితమై చీకట్లు కమ్మిన నింగి నిశ్శబ్దంలో
గాలికి వదిలేసిన నిప్పురవ్వల వలె కనిపిస్తాయి చుక్కలు
గాలానికి చిక్కిన నిర్దయాలవుతాయి మాటలు
ఉరుము పెట్టే వెర్రికేకలకు ఈలలు వేసే గాలి పాటలకు

చెట్లు చప్పట్లు చరిస్తే , పక్షులన్నీ ప్రేక్షకులవుతాయి
అలలెరుగని నది నీటిలో బరువైన వస్తువులన్నీ వేడుకలవుతాయి!
మనిషి నిద్రిస్తున్నా మనసు మేల్కొనే ఉంటుంది
మనసు మేల్కొనే ఉన్నా వయసు కనిపిస్తూనే ఉంటుంది

కాకుంటే కదలికలను గమనించి తమ చేతిని
పట్టునుండి విడిపించుకుని అలజడుల మధ్య ముఖం జారుకుంటుంది
అంగుళం అంగుళం గాలించినా కనిపించనది నీకు నువ్వే!
విసిగి వేసారి వీస్తున్న ఈదురుగాలుల మధ్య వినిపించేది నేను!

ఈ నేను, ఆ నువ్వు కలిసి చెట్లతో చేసే గుసగుసల్ని
ఎపుడో ఎక్కడో భయంతో తలదాచుకున్న చంద్రబింబాలు మనం!
చమురు పోసి వత్తి పెట్టి పెట్టిన దీపం దహనం చేయదు
సృష్టి చిత్రానికి వెలుగు అవసరంలేదు

మండుతున్న అగ్నిగోళం ముందు మన జీవితాలు సమిధలు
ప్రతినిత్యం ఎదురుచూస్తున్న నిజ పతాకం చిత్రవధ క్రీనీడలు!

ఉదయ బింబం ముఖాన సూర్యబింబం తిలకమయితే
హృదయ బింబం అనుసరించేది కేవలం కాటుక చారికలు

పునర్జన్మ తెలుసుకోవాలనే ఆశ వృక్షాలకు లేవు
నాకున్న నిర్ధారణ స్థానానికి ఆనవాళ్ళు కనిపించవు!
ఉన్నట్లుండి నా హృదయానికి రంగులు పోయాయి
కంటికెదురుగా ఉన్న  రంగుల తాలూకు చిత్రాలన్నీ మసకబారిపోయాయి

జీవన రంగస్థలంపై నటులు నటిస్తున్నారు
సృష్టి కుటుంబం మాత్రం ఛిన్నాభిన్నం అయిపోతున్నట్లు కనిపిస్తున్నాయి
శబ్ద పర్యాయ పదంలో నిశ్శబ్దం దాక్కుంది
రెక్కలు ముడుచుకున్న దీపం కింద నీడలు కన్నీళ్ళు పెడుతున్నాయి

జీవన సౌందర్యమంటే వాతావరణంలో మెరుపులు కావు
జీవిత రహస్యమంటే ఆకాశంలో దాక్కున్న మబ్బులు కానేకావు
వృక్షాలను లుంగలు చుట్టుకున్న చీకటి అంచుల్లో
గాలి ఇమడలేక అంతా ఎవరో చెప్పినట్లే చెప్పి

కవిత్వంలో కలిసిపోయిన భావాల భామలా ఉంది రాత్రి
ఎవరేమి చెప్పకపోయినా అంతా అనుకున్నట్లే ఉంది!
ఇంతలో అలారం మోగింది!
వెలుగు రాలేదు కానీ చెట్లు లేచాయి

గాలి వీచికల మధ్య పిట్టలను అలరిస్తున్నాయి
ఎక్కడికక్కడ సద్దుమణిగిన మంచును సవరిస్తున్నాయి
చేతికి వేడి కాఫీ అందగానే కంటికి అంతా ఆనందమే!
గుండెకు కలవరింత రాగానే ఇంట్లో అంతా సందోహమే!

ఇంతకీ నేనెక్కడున్నాను. ఒక చెట్టునీడలో
ఎందుకున్నాను? గుండెమంటలపై చినుకుల పలకరింపుకోసం!
అవునవును!
నేనంటున్నపుడు ఎవరైనా వింటేనా?

నడిరోడ్డుపై కనిపించీ కనిపించని ఒక దృశ్యం!
బతుకు బండి సిద్ధంగా ఉంది కానీ బ్రేకులే లేవు మరి!
ఇపుడు కనిపించే ప్రదేశాలన్నీ చల్లారిపోతున్నట్లున్నాయి
పొగలు కమ్ముకుంటున్న రాజకీయాలు మాత్రం

వీధి వీధినీ వికృతంగా పలకరిస్తున్నాయి
నా సోదరులు! నేను పరవశిస్తున్న పచ్చిక మైదానాలు
దశాబ్దాలు గడిచినా,
అణుబాంబులు అందరినీ అడ్డగించలేవు

అనుకుంటాం కానీ వీధి విశాలం!

వింత పోకడలన్నీ అక్కడే సాధ్యం!
ప్రతిరోజూ సూర్యుడు ఉదయిస్తున్నా
ఎదురుచూపు, వెదుకులాట తప్పవు!

అలాగని చీకటి శాశ్వతంగా వదిలిపోతుందా
చిటపటలు, చిరాకులు విడిచిపోవు!
అదిగో కనిపిస్తున్నాయి చూడండి
అడవి జాతి మొక్కలు, విరబోసిన చేమంతులు

మురిసిపోతున్న మల్లెమొగ్గలు
అవన్నీ వలసపోతున్నాయట వీలయితే ఆపండి!
కాగడాలకు కోపం ఎక్కువ
అదే ఇంతటి వలసకి కారణం అయ్యాయట!

కనకాంబరాలతో కలిసి చర్చించి
తలలో లేని మనం ఇలలో ఎందుకని అనుకున్నాయట!
అరె! అనుకునే లోగానే
తట్ట బుట్ట సర్దుకుని బయలుదేరుతుంటే

దారిలో ఒక తల పూలతో మెరుస్తోందట
ఇంకేం? సిగ్గుల మొగ్గై విరజాజి వెనుదిరిగిందట!
ఛీఛీ! ఎంతటి అవమానం?
చెట్టు ఉండదు. ఒక పుట్ట ఉండదు

నీరుండదు. నీటి చెలమ ఉండదు
విలువలేని చోట మన వీలునామానా? అనుకున్నాయట
ఉన్నవి ఉన్నట్లుగా, లేనివి కూడా ఉన్నట్లుగా
కనిపించే మందారాలు మందులోనికట

కనిపించకుండానే సువాసనలు వెదజల్లే మల్లెలు
సెంటు సీసాలుగా ముస్తాబవుతున్నాయట!
అయినా పూలకు సందులేమిటి?
విరగకాచే కాయలకు కాపలా ఏమిటి?

సందులేమిటి? సమయానుకూల విందులేమిటి?
అన్నీ ఒక్కటే ఇష్టమొచ్చిన రీతిన తిరిగే ధ్వనులేమిటి?
ఇలా ఎలుగెత్తడానికి పర్యవసానం?
అడుగు అడుగుకు గమ్యం పర్యవసాన ప్రయోజనం

నైతిక వైకల్యంతో అనుచితోద్రేకంతో
యుగయుగాల సంస్కృతీ వైభవాల సమాధానం!
ఉషస్సుకు దారిచూపే శిఖరాగ్రాల మేధస్సులు
ఉడుత చేసిన సాయాన్ని సైతం

గుండెల్లో దాచుకుని కీర్తిస్తున్న రామనామాలు
ఉరుములు, మెరుపులు అలజడి చేసినా
మరచిపోలేని ఆరని తడి మంటలు కావా?
పుడమి తల్లి జీవించి ఉన్నంతవరకు

చెదురు మొదురు సంఘటలు తలరాతలు కాలేవా?
పౌరుషాల ఉగ్గుపాలలో మానవ ఆచ్ఛాదనలే లేవా?
పుట్టిన గడ్డపై తిరుగాడిన లేడిపిల్ల
పుట్టినింటి నుండి బయలుదేరిన ఆడపిల్ల

ఒకటి ప్రకృతిలోకి పయనిస్తే
మరొకరు ప్రకృతినుండి పయనించే అగ్గిపుల్ల
అరె! ఒక్కసారిగా అలా అనేసానేమిటి?
నిజమే! జాతి నుదుట గీసే రాతలన్నీ

నా ఎదుట నిలిచే విశ్వమానవ గీతాలుగా మారి
వన్నె తరగని కీర్తిని మూటలకెత్తుకున్న పక్షుల చిహ్నాలు!!
జీవులన్నీ మనకు ఇక అచ్చుల్లో కనిపించే బొమ్మలేనట
మానవ రూపాలన్నీ ఇకపై అనురాగానికి సాక్షులేనట

జ్ఞాపక చిహ్నాలన్నీ పక్షుల ఆసనాలేనట
శిలా విగ్రహాలన్నీ ఉద్యమాల మరకలేనట !
తనే అంది ఆ మాట!
అనాల్సింది అనేసి తలోమూలా కూర్చుంటే

నాకేంటి ఈ తంటా!
ప్రతిభలో ప్రభాతే గీతాలన్నీ అచ్చంగా నావేనట!
విహంగాలకు విశ్రాంతి లేదు
వివాహాలకు ప్రశాంతత లేదు

విరివిగా కనిపించే కనిపెంచే నిశ్శబ్దంలో
క్షణాలమధ్య వేగిపోయే చందమామ జాడలేదు
ఆకాశానికి కులం లేదని తెలుసు
అవని కులమతాల కమతాల మధ్య వేడిపోయే ఇనప గొలుసు

చెట్టుకు రంగులు తప్ప వర్ణబేధాలు లేవు
నీటికి, నేలకు, కన్నీటికి ఏమాత్రం సంబంధం లేదనేది నిజం!
ఒకసారి గాలి, మరోసారి నీరు
ఒకసారి విసురు, మరోమారు చమురు

స్వైర్యవిహారం చేస్తుంటే
ఆ సంబంధిత దారాలు వెంట నడవడమే ఇజం!
పట్టపగలు కళ్ళు ముకుళించినా కనిపించే సూర్యుని
తీక్షణ వర్ణచిత్రం రూపురేఖలు మారవు

నట్టనడిరేయి కళ్ళు తెరచి ఉంచినా నాలుగుగోడల
సామీప్యం తాకిడికి హృదయం చల్లారదు
అందుకే నేను ప్రయాణిస్తూనే ఉంటాను
నాలోకి నేనే.. నన్ను అనుసరిస్తూనే..

ఈ గుండె కదలిక పరంపరను తలచి తలచి
వాస్తవ దృశ్యరూపాన్ని వలచి వలచి..
కమ్మని కల!
నేను సృష్టిని అయినట్లు

చెట్టు నా గుండెగా ఉన్నట్లు
పక్షులన్నీ నా పంచప్రాణాలయినట్లు!
అయితేనే బావుండేది కనీసం
నాకో ఉనికి ఊహాచిత్రం ఉండేది

నా మనసుకు చైతన్యం ఉండేది
నా కళ్లలో అభినివేశం నాట్యమాడుతుండేది
రివ్వురివ్వున వచ్చే గాలి వింజామరలలో
నాకు నమ్మకం ఉంది నేనున్నానని

తలుపు చాటున దాక్కున వెన్నెల తుంపరలలో
నాకు గుర్తుంది నా కొంగు తగులుకుందని
విజ్ఞానం మనకే కాదు ప్రకృతికి కూడా ఉంటుంది
సంకేతాలు మనసుకే కాదు విశాల విశ్వానికి కూడా!

నా కదలికలు నాకోసమే వీక్షించే విజ్ఞాన కణికలు
నా భూమికలు నన్ను వదిలివెళ్లిన విజయ వీచికలు!
ఉండుండు! నేను వస్తున్నాను నీ వెంటే!
ఆకాశం శబ్ద సమూహమై కదలిపోతుంటే

నేనేమో వాటి అంతరంగాలను కనిపెట్టి
ఏడు రంగుల పంటను లెక్కలేస్తుంటాను!
ముఖంలో మౌనం అఖండ ధైర్యానికి చిరునామా!
హృదిలోని భాష ఎక్కడికక్కడ విడిపోయి ముక్కలయి

స్పందనలో చిగురులెత్తే కోరికల్లా విడిపోయి
అగ్నిలా జ్వలించే శక్తి నర్తిస్తుంది నా వీలునామా!
అవని పచ్చగానే ఉంటుందనేది మన అలవాటు
అహంకార భూమికల్లో వివిధ పాత్రల ప్రకాశనంపై

మెడకెత్తనున్న అదృష్టమైన విలీన జీవితపు ఛాయలు
కనిపించీ కనిపించనంత దూరంలో నిలిచే గ్రహపాటు!
విడదీయరాని అనుబంధంతో సమాజమింతవరకు

రూపమేదో పోల్చుకునే స్థితిలో లేదు

వివిధాకృతులతో రూపాలను మార్చే దిశగా
ప్రళయ పద్మాలు వికసించే సమయం రాదు
అంతులేని యాత్రకు శిల్పం ఏర్పడిరది
మేల్కొన్న మనసుకు పరిమళం అబ్బింది

ఎదురుగా నిలుచుని ప్రశ్నిస్తున్న నీ ముఖచిత్రం
విరబూసిన బంతిపువ్వైంది. నాకు నచ్చింది.
కొత్త చూపు వచ్చింది.
సరికొత్త ఊపుతో పదాల పొరలన్నీ వాలిపోయి

బతుకులో వలపుల చందంతో ప్రశ్నలన్నీ
జవాబుల దుస్తుల్ని తొడుగుకోవడం మరిచిపోయాయి
చీమ నడుస్తోంది
వెంట వెంట మరోచీమ మరో చీమ

నింగిన రివ్వున ఎగిరిపోయే పక్షుల గుంపును చూసి
యుగయుగాలుగా పొద్దుతిరుగుడు పువ్వైంది.
భవిష్యత్ కనిపిస్తే భయం వేస్తుంది
గండం గడిచే జీవితాలు మార్పును ఆశిస్తుందా? లేక

వరదల వలపుటందంతో దిశలను పరిపాలిస్తుందా?
వాలుతున్న తెరలన్నీ నా చీరల రంగులయ్యాయి.
నేలను తుడిచే దృశ్యమాలికలు
లయబద్ధమైన నీటి చలమలతో కలిసి

తడిరాగాల ఉద్వేగ సంచలిత విరచితమై
తరంగ నాదాల గోదావరిలో కలిసింది
నాది మౌనయానం!
నీది మాటల మౌనం!

నది సముద్రము కలగలిసిన చోట
కనిపించేది ఆటుపోట్ల వలయాలే!
పంటపొలాల సోయగాల నడుమ
మట్టిపొరల గుండా ప్రయాణించే

నేలతల్లి మెల్లగా ప్రవహిస్తూ, ప్రయాణిస్తూ
అడవి తల్లి ఒడిలో దోబూచులాడుతుంటుంది
నిశ్చలమైన నదీ వలయాలలో
విచలితమైన సూర్యకిరణాల్ని తాకడానికి

ప్రయత్నించే తూర్పుపడమరలు
నీటిలో కొట్టుకుపోకుండా తిలకం దిద్దుకుంటాయి

కాలం జాలరుల చేతిలో చేపపిల్లలు
కమనీయ దృశ్యాల తాలూకు కెరటాల వాకిళ్ళు!

దిశమొలలు ధరించిన గడ్డి పరకలు
ఆకాశం అద్దంలో ముఖం చూసుకుంటాయి!
అనుకుంటాం!
రాత్రుళ్లు మాత్రమే నక్షత్రాలు మెరుస్తుంటాయని!

పగలు హృదయాకాశంలో జ్ఞాపకాలు
ఉవ్వెత్తున ఎగసిపడే మధురానుభూతులవుతాయని!
కన్నీటి కెరటాలు ఆపుకోలేక హోరుమని ప్రవహిస్తున్నపుడు
ఆనకట్టలు తెగిన నదీమాతలా కనిపిస్తుంది

ఉత్తుత్తి కోపాలతో వృక్షాలు ఊగిపోతుంటాయి!
అలసిన కన్నులు అరమోడ్పులై
ఊసులతో కాలక్షేపం చేస్తూ ఊసులాడుతుంటాయి
నీరు ధారపాతంగా ప్రవహిస్తుంటే

పట్టి పెట్టుకోవడానికి ప్రేమ పదార్థం కావాలంటాయి!
నా ఇంటి గుమ్మంలో ఒక పసుపుకొమ్మ,
ఎదుట చెట్టుపై పచ్చటి చిలక ఉన్నాయి
గుండె గుమ్మంలో చకోరపక్షుల జాబితాలో చేరి

సుడులు అలజడులై తిరుగుతుంటాయి!
దేవాలయం వాకిట జేరాడుతున్న దేహాల నడుమ
కనిపించేవి నీటి వాకిళ్ళు కానేకావు
పలకరింపుల కరాచలనంతో కూడిన ప్రతి స్పర్శ తాలూకు

నిలవల నీటిగనుల బీళ్ళన్నీ సమరం చేస్తుంటాయి
ఆదిగదిగో నా ఆర్ద్ర చిత్రం నవ్వుతోంది
జలజలమని పారే సెలయేరు తరగల్లో దాక్కుని
కన్నీటి నదిలో సాగే పలకరింపుల నావను ఆనుకుని

జలతారు అలల వెచ్చని పావులుగా పొదుపుకుంటాయి
నేనిపుడు నవ్వులు నిండిన ముఖంతో
ఆకాశంకేసి చూస్తున్నాను
ఋతుపవన గమనాల్ని గమనించి

ఒకింత ఆశను తాయిలంలా చూపించి
వానతో మమైకమైన కాలాన్ని
పదేపదే తలచుకుంటూ స్నానమాడుతూ
నేలతల్లి ఊసుల్ని పుడమికి అందిస్తుంటాను

గ్రీష్మానికి ఎంత కోపమో కదా?

వర్ణధాతువుల మధ్య చేరి దేహాంతర్భాగాన్ని
మనో సంతకాల మధ్యకు చేర్చి
ప్రకృతి మాత చిరునవ్వుల్ని ఆరపోస్తూనే ఉంటుంది!

నా నేస్తమా నేస్తమా!
నేను నువ్వు ఇసక తిన్నెలపై కూర్చుని
లెక్కలేనన్ని కబుర్లు కలబోసుకుంటుంటే
సముద్రంలో పీతలు తొంగి తొంగి చూస్తుంటాయి

చేలన్నీ వరికంకులతో నిండిపోయి
ధరహాసాల్ని నక్షత్రాలుగా చేసి ఆకాశంలో నింపుతుంటే
చెరుకుగడల వంశవృక్షాన్ని ఆమూలాగ్రం గ్రహించి
గుండె ఒక్కటే అయినా రెండుబింబాలుగా మారాయి.

నిరాశ అనేది ప్రకృతికి కొత్తవస్తువు
మేఘాలు దిగులుగా ఉన్నా వర్షపు చుక్కలతో స్నానం చేయించి
ఎండుగడ్డితో చలిమంటను కాల్చి సేదదీర్చుతుంటే
శీతల పవనాలు నవ్వుతూ మనల్ని ఆకట్టుకుంటాయి

అనాదిగా అవని బీటలు వారిన రూపాన్ని సంతరించుకుంది
ఎక్కడ సంచలనం జరిగినా నేనే అంటూ జరుగుతుంటుంది.
భూకంపమని, నిర్మాణాలు కూలిపోయాయని అంటారు కానీ
భూమి వెన్ను పై బరువుల తాలూకేనని తెలుసుకునే దెప్పుడు?

ఇల్లు ఎపుడూ అమాయకంగా ఉంటుంది
ముందరున్న చెట్లనీ్న గాలికి ఊగిపోతూ
నీటికి తడిసిపోతూ ఇంటికి నిప్పంటిస్తాయి
ఫలితంగా గీటు దాటని సరిహద్దురేఖలుగా మారిపోతుంటాయి

నువ్వు తినే అన్నం మెతుకుల్ని చెట్టు మొదట్లో వేస్తే
అరాయించుకోలేక నీటినే మళ్లీ మళ్లీ కోరుతుంది
పల్లె పందిరిలో ఎగురుతున్న చిలుక లన్నీ
నా మనో మందిరంలో బంధీలై విహరిస్తుంటాయి.

మట్టి మట్టి అంటారే కానీ
మలినం లేనిది ఖచ్చితంగా మట్టికే!
అందుకే వరి పండుతుందే కానీ
అన్నంగా మారిన తర్వాతే మలినమయిపోతుంది

సముద్రం నాతో అంటోంది ఒకసారి
నాలో ఉప్పుందని అందరూ అంటారు కానీ
అంటున్న వారి నోటిలో ఉప్పుంటుందని గ్రహించరని
తమకో న్యాయాన్ని అందించాలని కోరుకోరనే..

వచనాలు ప్రవచనాలై
పలచని మాటల మాలగా మారిన వెంటనే
అవాస్తవాల సంఘటనల తాలూకు దారాలను
మెడలకు బిగించి ఒక్కసారిగా ఉచ్చు బిగిస్తుంటాయి

నాకు ఉదయం ఇష్టం
నీకు సాయంత్రం అత్యంత ప్రీతికరం!
ఉదయాస్తమయాలు ఎన్ని వైపరీత్యాలను తట్టుకుని
నిలబడతాయో అనేది సముద్రాలకే అర్థమయినా...

పయనాలన్నీ వట్టివే!
ప్రతి జననం భూమితల్లి కి వడ్డాణం అనుకుంటాం
వేసే అడుగులన్నీ తూచి తూచి వేస్తుంటే
కరువుతీరా ఏడవటం దార్లుగా ఏర్పడుతాయంతే!

గత స్మృతుల నీడలలో
కనిపించేవన్నీ ముళ్ళ సంపెగలే
మనసుతీరా పాడుకుంటే
వినిపించేవన్నీ విరహగీతాలవుతాయి!

ఎన్నాళ్ళు నీకోసం ఎదురుచూసాను?
అందట చెట్టు  నీటి చలమను చూసి
నీటి చెలమ అందికదా నీకేం? ఒకచోట నిలుచుంటావు
నేను ప్రవహించి ప్రవహించి అలసిపోతున్నాను అంటూ!

ఏ యుగం అయితేనేం?
సృష్టి అంతరంగం ఒక్కటే !
యుగానికైనా, సృష్టి ఆంతర్యానికైనా
గళంతో గళం కలిపి ఎగసి వచ్చే విశ్వహృదయం ఒక్కటే!

భయం నిండిన గుండెలోపల ఏవీ కాలవు
అభయం వెంట వుంటే మంచి చెడులు కనిపించవు
ఎవరికి వారే మంటల్లో కాల్చుకునే తీరంలో
శాంతి పరివర్తన సమూహాలై విసిగించవు!

చూపుల్లో సూదులున్నాయని గ్రహించలేని నీవు
పదే పదే చూస్తావు ఎందుకు?
మాటల్లో బాకులే ఉన్నాయని గ్రహించిన నీవు
కనిపించిన ప్రతిసారీ పలకరిస్తావెందుకు?

చినుకులు దారాలైతే మాత్రం
మాల కట్టుకోవాలంటే మాటలా?
కుంభవృష్టి పరుపు కావాలంటే మాత్రం
గాఢనిద్రతో సుదూర తీరాల్ని తాకుతావెందుకు?

అనుకుంటాం కానీ మేఘాలు కన్నీరు పెడతాయని
కానే కాదు మన కన్నీటిని తుడుస్తాయి
ఉరుములు మెరుపులు భయపెడతాయని
ఎప్పటికీ కాదు మనల్ని హెచ్చరిస్తుంటాయి

నేలకు జవసత్వాలు ఉడగవు.
జీవకోటి జీవం నిస్సారమైతే దాహార్తులైన నోళ్ళు
నింగి దిక్కుగా చూస్తుంటే
గుండె చేలలోని విషయాలన్నీ వెన్నంటి ఉంటాయి

సిరులు పండిరచే అవని ఒక్కోసారి
మూసలు ఎండి విస్తువిరిగిపోతుంది
కృత్రిమత్వాన్ని తన హృదయంలోకి పంపి
కలగలిపే దేహాల ఆనవాళ్ళను మోస్తూంది !

ఋతువులు మారినా
బతుకుల్లో మార్పురావడంలేదని చింతిస్తున్న రైతన్నను
ఓదార్చుతుంది నేల తల్లి తన వడిలోకి తీసుకుని
అవునా అంటూ కొట్టి పారేయకండి!

మట్టి ! ఎంత అందమైన పదం కదా?
ఏమీ చేతగాని వారి సణుగుడులా సాగి సాగి
నాకు ఎవరూ వద్దు పొండి అని విసుక్కుంటున్న
చెమట వాసన తాలుకు సొగసులు ఇంకా ఉన్నాయి!

ఆకుపచ్చని తివాచీలు బల్లపరుపుగా పరుస్తుంటే
ఎండకు వానకు తడిసి తడిసి ఎండి ఎండి
వాతావరణంలోనే చిట్టచివరిగా ఒడిపోతున్నపుడు
అల్లంత దూరంలో ఉన్న నిచ్చెనలు ఎదురుచూస్తున్నాయి!

చీకటిని ఆహ్లాద పరిచే చంద్రుని ఏటవాలు చూపులు
రాత్రిని కరిగించే సూర్యునికి కనబడవని
దోబూచులాడే నక్షత్రాలు గ్రహించి
భూమిని నీటిని కదుపుతూ తరగలపై నిద్రిస్తాయి

నేలతల్లి పాలభాగాన కనిపించే వన్నీ
అట్టడుగున కనిపించే అదృష్టసీమల తాలూకు సవ్వడులే!
కాకుంటే ఎవరికి వారే తేజస్సూత్రంతో ముడివేసినట్లు
మనసుకు మనసుకు ముడిపడుతున్నాయి.

ఉదయం మంచు చెట్లతో మాట్లాడుతుంది
వెలుగులన్నీ గాలితో మంతనాలు చేస్తుంది
కిరణాల ప్రతిఫలంపై భూమి పురివిప్పిన నెమలిలా ఉంది

అలల్లో కనిపించే బింబం అచ్చం నాలానే ఉంది

నీటిపాయలకై నిరీక్షించే వృక్షాలన్నీ
పొద్దెక్కినా మేల్కొనే ఉంటాయి
తమ తమ నిజరూపం కనిపించకుండానే
నీడలు సృష్టిని కాపలాకాస్తుంటాయి!

దాహమా ? ఎవరికి? సముద్రానికా?
ఉన్నా ఉంటుంది అందుకు ఆలోచనే సాధ్యమా?
గుండెల్లో నిద్రించే కిరణాలు ఉండటం నిజమా?
గుప్పెటలన్నీ మూసినా తెలుస్తున్నవన్నీ రహస్యమా?

వ్యక్తిలో భాగమైన ఆలోచన మనసులో
అరణ్యరూపం సంతరించుకుంటుంది
నీటిని వణికించే చలికి ఆవేశానికి భాష ఉండదు
జీవితంలో ఎదురయ్యే యుద్ధాలన్నింటికి లిపి ఉండదు

సంస్కృతి వికసించిన వదనంలా మారితే
వాటికి సంబంధించిన కల్పన కమలంలా మారుతుంది
మస్తిష్కం ముడుచుకుని ఉన్న మొగ్గైతే
దానిని అనుసరించిన వాస్తవం దృశ్యంలా కనిపిస్తుంది

స్పందన చంద్రకాంతి వదనమైతే
ఆశనిరాశల్లో ఎదురయ్యే అన్వేషణ
ప్రకృతి జీవన దృశ్యాల మధ్య దాక్కుంది
ఉదార హృదయంతో భూమి పరిమళాన్ని పరుచుకుంది!

మూర్తీభవించిన సూర్యకాంతిలో
స్త్రీ ఆర్ద్రమై. పార్శ్వమై పరిమళిస్తే
ఉదయాస్తమయాలకు ఏకంగా శక్తిగా మారుతోంది
ఆశ అభివ్యక్తమయింది. పరిమళం వికసించింది

రక్తచారికలను చెట్లు తాగవు.
రమ్మని పిలవడానికి ఒకరంటూ ఉండరు
చీకటి ఇక్కట్లయితే
చమ్మగిల్లిన కళ్ళకు వెన్నెల ప్రపంచం అందగించదు

కారణం ఏదయినా సరే
నేను ప్రకృతిలో ఉండాలి. వర్షంతో ఆడాలి
ప్రాణి వేరు, వ్యక్తి వేరనే భావనతో నిర్మితమవ్వాలి
ఒకే విశ్వ సంయోగంతో ప్రపంచం అవతరించాలి!

పూలు గుత్తులు గుత్తులుగా పూస్తుంటే
నాకు అనిపించేది అనుభవ బీజాలు మెలకెత్తాయని!

ఆకులన్నీ ఒకదానికి ఒకటి అనుసంధానమవుతుంటే
నాకు కనిపించేది ప్రకృతి మాత అలంకరించుకుందని!

ఇది వాస్తవంలో వాస్తవం!
విశ్వంలో మనం పరమాణువులం!
ఇది కాదంటే ఇక ఏమీ అనలేని మౌనముద్రలం!
వివేకమనే హంస రెక్కలలోని ఆంతర్యం!

సజీవ చేతనంలో కనిపించేవన్నీ అరుణకాంతులే
నిర్జీవ చరణాల పంక్తుల్లో జరిగేవన్నీ రమణీయాలే!
అజ్ఞాన పొరలు భూమిలో కూడా ఉంటాయనడం మూర్ఖత్వం!
ఎందుకంటే భూమిలో ఉండేవన్నీ దైవీక స్వరూపాలే!

ఒక విషయం నిజంగా చెప్పనా
నాకు చాలా కాలం వరకు నాకాళ్లు కనిపించలేదు!
నన్ను నేను చూసుకోవడం జరగలేదు
అదేం మాట? అని అనను కానీ ఇపుడు అద్దంలో ఉన్నాను.

ఇంట్లో ఉన్న చెట్లన్నీ తలలూపుతూంటాయి
స్పైక్ లుండవట! బందులసలే ఉండవు
పైరగాలిలో కనిపించవి తుమ్మెదలు కావు
అదిగదిగో !చిక్కని కవిత్వ కాంతులు కలవు!

నడిచే దారిలో  అంతా ముళ్ళే ఉంటాయా అనేదే ప్రశ్న!
పచ్చని చెట్లన్నీ నడిచే దారిలో కాపలా ఉంటాయా అనేది మరో ప్రశ్న!
అయినా నడవటమే మన విధి అన్నట్లు సాగితే మంచిది
నడిపించేది ఎవరో కాదు అడుగుల అనుభవం అంతే!

తప్పటడుగులను నిత్యం భరించేది పచ్చదనమే కదా?
ఊరుకోండి ఇదంతా కూడా సౌందర్యమే అంటారా అదీ సంతోషమే కాదా?
బొక్కబోర్లా పడినా గతచరిత్ర తాలూకు మసి అంటకుంటే చాలు కదా?
మాటల వర్షం లో తడిసిపోయిన తప్పుల తక్కెడ తాకదు కదా?

సంకల్పం అనేది సామధానంగా వినాల్సిన వస్తువు
ఈదురుగాలికి చేసే విన్యాసం అని నేను అనలేను కానీ
సమాజోద్ధరణపై గురిపెట్టిన ఆ చూపులు
అదుపు తప్పి మృత్యుశకటాలకు ఆహుతి కాకుంటే అదే పదివేలు!

అసలు నామాట ఒకటుంది
అది స్వప్నమా? దుస్వప్నమా తెలియదు కానీ
ప్రకృతి మనతో మమైకమవుతోందా?
పరవశించే ప్రజాలోకం వినయాన్ని చూపుతోంది!

సృష్టి చిత్రంలో అనేక కీటకాలు ఉన్నాయనేది నిజం!

నీలాకాశపు ముక్కలు అక్కడక్కడా పడి ఉంటాయనేది కూడా నిజం!
అనుభవం తాలూకు జ్ఞాపకాల నక్షత్రాలు
ఆవేశపు తాలూకు రంగు రంగుల అబద్ధాలు కూడా చేరిపోతాయనేది నిజం!

నేనంటున్నది ఏంటి అనేది ప్రశ్న రావచ్చు
భృకుటి ముడివేసి ఆలోచనలో పడిపోవచ్చు
రెండు ముఖాలున్న మనసుల్లో మొలుస్తున్న కత్తులు
నేలను తాకగానే చిరునవ్వులుగా మారచ్చు!

వెళదాం! మనకి ఎక్కడ ఇష్టమయితే అక్కడికి..
వెళదాం మనకు ఎక్కడకు లాభమయితే అక్కడికి
వెళ్లిపోదాం ఆత్మీయమైన చేతులనుంచి చేతల్లోకి
వెళుతూనే ఉందాం ఇద్దరి మధ్య వీచే స్వచ్ఛమైన స్వర్గంలోకి..

అవమానం! అసహనం!
హింస! ఘాతుకం! హత్య! ఆత్మహత్య!
లాంటివన్నీ నీటికి కాదు నేటికి ఉండకూడదు
ఉన్నట్లుండి వీచే పల్లవుల రాగాల మధ్య ఆలపించడానికి తప్ప!

ఆకాశాన్ని పిడికిట బంధించడం సాధ్యం కాదని తెలుసు
అవనిని కాళ్లకింద నొక్కి పెట్టడం సాధ్యం కాదని తెలుసును
కేవలం మనల్ని మనమే సానపెట్టుకోవడం తప్ప ఏముందని?
నన్ను నన్నుగా రమ్మని పిలిచే ఆత్మీయుల పిలుపులో సుగంధాలు తెలుసును

ఆగండి! మరింత దూరం కాకండి!
ఎవరికోసం వెదుకుతూ పోతారు మీరు?
ఎవరున్నారని మాట్లాడుతూ ఉంటారు మీరు
ఆగండి! మీకోసం మాత్రమే! వీలయితే మనకోసం మాత్రమే!

చెట్టుకు పర్యాయపదం వృక్షం అంటారు కానీ
మనసులోని ప్రశాంతతకూడా అని ఎందరికి తెలుసు?
పుట్టకు పాలుపోయడం వరకు పుట్టగానే కనిపిస్తుంది కానీ
ఏమీ లేకుంటే మాత్రం మట్టిగానే ఆవిర్భవిస్తుంది నిజంగా

కవిత కేదీ అనర్హం కాదంటారు మహాకవి శ్రీశ్రీ
కానీ కవిత్వమంటే విద్యున్నవ భావాల సంపుటి
అసలే నీళ్లమజ్జిగగా మారిన కవిత్వం
కన్నీరయినా పర్వాలేదు నీరుగా మారితే మాత్రం తట్టుకోలేని స్థితి!

చెట్టు పాడుతుందని, పిట్ట పాకుతుందని
రాయి పిలుస్తుందని, కొండ కదులుతుందని
వానపాములు సైతం ముక్కలయి ఒక్కొక్కటి ఒక్కోపామై కరుస్తుందని
ఆత్మను పరిశీలించుకుని, పరిశోధించుకుని ప్రదర్శన పెడతారు

ముఖాలపై నవ్వుల్ని తొడగలేము.
ఆలోచనలపై హృదయావిష్కరణ చేయలేము
అనాగరికం అంటే మాటరాని తనం కానే కాదు
పగిలిన కూజా లోని నీరు ప్రభాతం వినిపిస్తుందంటే నిజం కాదు!

ఎందుకా కన్నీరు చెట్టుకు ? అర్థం కావడంలేదు
నీరు కావాలా? వేర్లు పడే ఆవేదనకు తోడుకావాలా?
వాతావరణాన్ని అనుసరించే మల్లెలు జాజులు కలిసి
సర్వం రమణీయమైన విహంగాలకు ఆసరా కావాలా?

ఏది ఎలా ఉన్నా ఆత్మ వెనక్కు తప్ప ముందుకు కదలడంలేదు
శక్తిని పొంది, రక్తిని త్యజించి వివేకాన్ని వికాతన్ని పొంది
కాలానికి స్వేచ్ఛలేదని, ఉండితీరాలని మొక్కలకు నీరు పోస్తుంటే
ఆయువు మొదలైనప్పటినుండి చివరి దాకా అనుభూతి కలగడంలేదు

ప్రకృతి పలకరించిందని నాదంటే ఎంత మాట?
వినిమయ శక్తులు వరించాయని నీవంటే అంతే మాట
మంచును ఎంత తోడినా చేతికి నీరే వస్తుంది
ఉష్ణాన్ని ఎంత ఆర్పినా మచ్చలే మిగులుతుంది

పర్వతాల పగుళ్లలో నెగళ్ళు కనిపించాయి
అలల నిత్యం గాయాలు చేస్తుంటే తప్పదని కొన్ని
చెట్టుకి వేళ్లాడగట్టి బలవంతంగా లాగినా సరే
మట్టి తల్లి నీరసించిపోకుండా సంక్షుభిత జీవాన్ని పొందుతాయి

పర్వతమైనంత మాత్రానా అంత భయపడాలా?
గులకరాళ్ళు కుప్ప పోసినంతమాత్రాన తప్పుకోవాలా?
సమయం అనిర్వచనీయమని సంచీలో దాచుకోలేము
స్వచ్ఛమైన నీటినంతా గుప్పెట్లో ఉంచలేమని..

దారి వెదుక్కుంటున్న ఛాయలు మనవే కావు.
దారులన్నీ మూసేసే బండలపై మన పేర్లు ఉండవు
సజీవ శిల్పాల్లా మనం ఉన్నా  సరే
మంచు శిలలు పరుచుకున్న స్థితిగతులు మనకు చెందవు

ప్రకృతికి మనకే తెలియని భాష ఒకటుంటుందట
మిగతా ప్రపంచానికి తప్ప ఎవరికీ చెప్పనంటుంది
అత్యాధునిక యుగంలో ప్రతి భాష అందరికీ మేనత్త రూపమే
ప్రాచీనం ముద్దయినా సరే పెనుగులాటలకు సిద్ధమే!

కంప్యూటర్ లోకి తొంగి చూస్తే
మనకు ప్రపంచమే కనిపిస్తుంది
కానీ ప్రపంచం మాత్రం కంప్యూటర్‌ను చూపించలేదు
కమాండ్స్‌ను అనుసరించి సూర్యచంద్రులు నడవలేరు

అనుకుంటాం కానీ ప్రపంచానికి కూడా పెదవులుంటాయి
లేదనుకుంటాం ఆనీ వృక్షాలకు సైతం చెవులుంటాయి
పక్షులకు నిత్యం విహరిస్తూ ఉండాలనే ఆశ ఉంటుంది
ఇంద్రియాలన్నీ ఉన్నా మనిషికి బతకాలనే ఆశే లేకపోవడం ఆశ్చర్యం!

రాత్రి తలుపు మూసినపుడు
ఉదయం తలుపులు తెరచినపుడు
నన్ను చూసి పచ్చని వృక్షం నవ్వుతుంది
నేను బయట నువ్వు లోపల అంతే తేడా అంటుంది!

మనసు స్వేచ్ఛాప్రతిమ అయితే
గాజు అల్మారాకే అంకితం అవుతుంది
అణువణువు క్షిపణి వీధిలో
ముమ్మాటికీ సామాజిక న్యాయమవుతుంది

మనిషి ఎన్నో కండరాల సమూహం
మనసు ఎన్నెన్నో విస్ఫోటనాల విధ్వంసం
కండరాలు ఖాళీ అయితే మనిషి ఖాళీ
మనసు శూన్యం అయితే మనిషి కత్తిరించబడతాడు

ఉలిక్కిపడ్డాను ఎందుకు? బాంబు శబ్దం!
కొత్తేముంది? మనలోనే ఉంది కాలుతున్న మానవ హోరాలు!
ఆకాశం వద్దు!  నక్షత్రాలు వద్దు! సూర్యచంద్రులు వద్దు
కానీ నువ్వు జీవించాలి ఎడారి రహదారుల్లో నిత్యం తలలూపే పసిది కావాలి!

మానవ మాయలు లెన్ని ఎదురైనా
మనిషిలో శక్తియుక్తులుంటాయి
మనిషి నాతో పీకలదాకా ఉంటున్నాడు
అయితే కనికట్టు చేస్తూనే పాఠాలు చెప్పనారంభిస్తాడు

కావలి కావాలా? ఎవరికి?
ఎందుకు? ఎపుడు అనే విషయాలన్నీ ఒక పార్శ్వాలయితే
స్పందనతో సత్య సౌందర్యం వరిస్తుంది
మంచుతో చీకటి కలగలిపినట్లు..!!

జనం ప్రభంజనమై విరుచుకుపడినా సరే!
పోయేకాలం దాపురిస్తే చెప్పకుండా పారిపోతారు
ఒకానొక కాలంలో నన్ను అనుసరించే పాఠాలన్నీ
ఊళ్లోకే కాదు గుడిలోకి కూడా చొరబడతాయి!

మెదడులో ప్రపంచం గూడు కట్టుకుంది
శతాబ్దాల శబ్దాలలో కలిసిపోయింది
పైన రవి చంద్రులతో ఆకాశం ఎలాగూ ఉంటుంది

కాకుంగే నేలపై మాత్రం సాహస గమనం కరవైయ్యింది

నిర్జీవమైన ప్రాంతంలో పచ్చదనానికో ఆలోచన వచ్చింది
కల్పనతో ప్రారంభమై కలయిక గా మారి ఆవేదనయ్యింది
నిరాశ, అత్యాశ ల మధ్య అందని వాటన్నిటి దారి కనిపించింది
అభిలాష అవ్యక్తమయింది. చీకటి కనుమరుగైంది

ప్రాణమయ శక్తితో నూనత ప్రాపంచిక వ్యవస్థ గురించి
వినియమ విభూతితో సనాతన ప్రకృతి అవస్థ గురించి
చర్చించుకుందామంటే కనిపించేది కేవలం ఉదార గుణాలు
పదగమనం, గుండెలయల్లో ఆయువు గురించిన రమణీయాలు

గాయపడిన వృక్షజాతి కలలోనయినా నవ్వాలంటే
కోటాను కోట్ల విత్తనాలు సజీవమై ఉండాలి
నాలుగు దశాబ్దాల నగరం కత్తి మొనలా దాపురించి
నోరు విప్పి చెప్పుకోలేక వేలెత్తి చూపలేక

చచ్చినవాడినే మళ్ళీ మళ్ళీ మహారాజుగా చూపుతుండాలి
ఓడినవాడినే తుదిదాకా దుర్మరణం పాలుజెయ్యాలి
జాతి ఆరోగ్యాన్ని విజాతి వితర్కాలకు ఉపయోగించిన వానిని
కలలు కనే అంతఃకలహాలలో స్మారక చిహ్నాలుగా నిలవాలి.

ఏదీ నీలో నిజం? నిజ ప్రతిబింబం
పసిపాపనుండి ప్రాంతపు పసిదనం వరకు వందనం
సహచరుల కోసం నిశాచరుల్లా దిక్కులన్నీ కలియదిరిగితే
ఆకాశాన్ని తాకే నా హస్తం నీకు కలను దానం చేస్తుంది.

చెట్టుకు ఆకులున్నాయి. కొమ్మలుంటాయి అని తెలుసు
మూగదని వాటిని నేను తీసుకుంటానంటే రెండు కళ్ళు
వెనువెంటనే మనల్ని ఖండిస్తూ ప్రశ్నిస్తాయని తెలియదు
ఆగవయ్యా! అవి పుష్పించేంతవరకు. ఫలమై చేతికి అందేవరకు అంటూ!

తీరా పుష్పించాక పక్షుల ఆనందం ముందు ప్రకృతి ఏపాటిది?
గాలిని , నీటిని తోబుట్టువులుగా ఆదరిస్తూ, ఆసాంతం ఆశీర్వదిస్తూ
పూచే ప్రతి మొక్కకు ప్రాణం ఉంటుందని తెలియజేసే
సంవేదన వృక్షజాతి ఏపాటి సాయం చేస్తుంది అభాగ్యులకు

పండ్లుంటాయి. ఆ పక్కనే పురుగులుంటాయి
పూలుంటాయి ఆపక్కనే ముళ్లుంటాయి
కొమ్మలుంటాయి వాటిననుసరిస్తూ వేర్లుంటాయి
ఉనికి ఉంటుంది దానిపై ఖచ్చితంగా నేల ఉంటుంది

ఉదయం సూర్యకాంతి వచ్చేటపుడు ఎవరినీ అడగదు
వెళ్ళేటపుడు ఎవరికీ చెప్పదు.

వచ్చేటపుడు ఎవరు ఎదురొచ్చారో చూడదు
వెనుకగా తనను ఎవరు అనుసరిస్తున్నారో గమనించదు

కాలాన్ని, రెండు కొండబండల్ని,
నాలుగు పండిన ఆకుల్ని, తీగెల్ని కలగలిపి
పూర్తిగా కడుపు నింపుకుంటున్న ప్రకృతి మాత
కంటినిండా నిద్రపోతుందనుకుంటే పెద్ద పొరపాటు!

నవ్వితే నవ్వుతుంది. ఏడిస్తే కాస్తా ఎక్కువే ఏడుస్తుంది
ఇవన్నీ పక్కకు పెట్టి ఇంతవరకు తాను పడ్డ ఆవేదనలన్నింటిని
ఒకచోటగా కట్టకట్టి పెడితే గాలి పసిగట్టి చేస్తే
చివరకు ఏవీ తెలియనట్లు కన్నీరు పెడుతోంది

తలారా స్నానం చేసిన అడవి తనలో తాను మాట్లాడుకుంటోంది
తన ఏకాంత వాసంలో వున్న చెట్లన్నింటిని సమావేశపరిచి
తర్వాతి కాలంలో తనను చంపేందుకు ఏర్పాటు చేయబడ్డ
మానవాధములకు ప్రవేశంలేకుండగా చేయాలనుకుంది

గాలి నవ్వుతోంది. నీరు ఏడుస్తూ తలబాదుకుంటోంది
చెట్టుపై పిట్టలు, కొమ్మలు, చిగురాకులు అన్నీ
అమ్మకు ఎంత చెప్పినా అర్థం కాదు కదా? అనుకుంటున్నాయి
తన ఉనికి అవసరం అంటూనే కూల్చేస్తున్న తీరుకు చింతిస్తున్నాయి

సరే! మనిషి మారడు!
ఆయువులో వందకూడా జీవించని మానవుడు
అడవిపై అసూయ కాక ఏమి పెంచుకుంటాడు? అనుకుంటున్నాయి
అయినా వాటి ఆయుధాలైన వేర్లను పదునుపెట్టుకుంటున్నాయి

విచ్చుకుంటున్న పూలు వెనుదిరిగి చూస్తూ మురిసిపోతున్నాయి
మంచు బిందువుల్ని మోస్తున్న ఆకులు సోయగం
తడి అంచుల్ని అవలోకిస్తున్న కొమ్మల వయ్యారం
చూస్తున్న పునాది వేర్లు ముసిముసిగా నవ్వుకుంటున్నాయి

తుంటరి గాలి అన్నింటిని కౌగలించుకుంటుంది
చిలిపి ఆకాశం పిల్లల అల్లరిని చూస్తూ సంతోషంతో
వీటికి ఆధారమైన వృక్షాల్ని చూస్తూ సంతోషిస్తోంది
వణుకుతున్న పిల్లరెమ్మలకు నేనున్నా అంటూ చేయి అందిస్తుంది

పువ్వులు, కాయలు, పండ్లు లాంటివన్నింటిని
చురుక్కుమనిపించే సూర్యకాంతి రంగులో అమ్మాయి
అమ్మగా మారేందుకు అన్నికాంతుల్ని నింపుకుంటోంది
అయితే ఏముంది ద్వార పాలకుల్లా నక్షత్రాలు అక్కున చేర్చుకుంటున్నాయి

ఉదయానికి ఖచ్చితంగా అలారం మోగాలి

అది ఇంకా ఇంకా ఖచ్చితంగా కోడి కూతై ఉండాలి
కానీ ఏది? పిచ్చిపట్టిన ప్రేమతో కొండ మొండిగా మారి
ఇంత జరిగినా కూడా సూర్యున్ని లేవనీయకుండా గారం చేస్తున్నాయి

ఎంత చేసినా మనకు మిగిలేది ఒకటే మబ్బుల మోమాటం
కువకువలాడే చిరుపక్షులు, కీచుమనే కీచురాళ్ళు
నిశ్శబ్దం మరింత శబ్దమై వినిపించే నేలవారీ చప్పుళ్ళు
మేఘాలతో జతకూడి ముందుకు నడిపించే నెమ్మదైన ఆరాటం

అనుకుంటాం కానీ మబ్బులు పట్టిన ఆకాశంలో
సూర్యచంద్రులుండరని.. కానీ అబద్ధం
మబ్బుల తెరచాటున దాక్కుని అజమాయిషీ చేస్తూనే ఉంటాయి
ఆ దిక్కారమే మనకు కాంతులై కనిపించేది అర్ధం

ఒకానొక సమావేశంలో మబ్బులు మెరుపులు నేనంటే నేనని
నేను గొప్ప కాదు నేనే గొప్ప అని అనుకుంటుంటే
ఆకాశం కోప్పడిరదట. మీ అల్లరి రానురాను ఎక్కువైపోతోందని
మధ్యలో వచ్చిన ఇంద్రధనుసు నా రంగుల ముందు మీరెంత అందట

నీడల్ని ప్రశ్నించే ధైర్యం  ఎవరికి ఉంది?
కిరణాల్ని ఆలస్యంగా వచ్చారేమిటండి నిలదీసే ప్రశ్నేలేదు
చల్లగాలుల్ని చాలు పొమ్మనే ధైర్యమే ఉండదు
వెచ్చని సంగీతాన్ని మించిన ప్రపంచమే లేదు

మల్లెపూల పొదల్లో ఒక పక్షి దాగుంది
తన బిడ్డలకు బుద్ధి చెబుతూ
పిల్లలందరూ తల్లిని ఒకసారి చూడాలని తలెత్తాయి
ఇంకంతే ఇక మీకు జీవితం అర్థమయ్యిందంటూ వదిలి తుర్రుమంది

రాత్రయింది
మిణుగురు పురుగుల సమావేశం తమకేం తక్కువని?
పక్షులన్నీ నిద్రావస్థలో ఉన్నా గూబ  ఉందిగా వింటూనే అంటోది
ప్రేమికులకు దారి చూపే గుణం మీది మీకేం తక్కువని?

సవాలు విసిరేందుకు సవారీ అవసరంలేదు
నిలదీసి ప్రశ్నించేందుకు దక్షతతో పనిలేదు
ఓదార్చేందుకు ఒడ్డు ఉండాలని ఆదేశం లేదు
కాదు కాదు పొమ్మనేందుకు ఎవరికీ హక్కేలేదు

అలా అనుకుంటున్నానా?
నాకే తెలియకుండా గడ్డివాము దగ్గర అలికిడి అవుతోంది
అలికిడి అంటే ప్రియుని ఆరాటమే అవ్వక్కర్లేదు
ఆకలిగొన్న జంతువు తినడానికి ఏదయినా దొరుకుందనే వెదుకులాట కావచ్చు

అన్నీ అనుమానాలే! ఏం చేద్దాం?
సూర్యోదయం నుండి సూర్యాస్తమయందాకా
అంతా అలజడులే! విమాంశలే! సంశయాలే!
ఎంత ప్రేమ లేకుంటే ప్రకృతిని కాజేయాలనే ప్రయత్నంలో మనిషి ఉంటాడు?

కళ్లల్లో కన్నీరు రావడం సహజం
గుండెలో కన్నీరు వస్తే అసహనంతోనే ఖచ్చితంగా
ఆ మాట ముందే తెలిసి ఉంటే
ఆ విషయమే నా జీవితాంశ అయి ఉండేది కదాని!

నివ్వెరపోయాను నిజంగా
చంద్రుడు నన్నే రోజూ చూస్తున్నాడంటే
ఎంతటి దయ? నాకెంతటి ఆనందం?
ఎన్ని శక్తులు నాగురించి మంచి చెప్పకపోతే అలా జరుగుతుంది?

సృష్టికి ప్రతి ప్రాణి అందమే
జింకనుండి జోరీగ వరకు దేని ప్రత్యేకత దానిదే!
నేను నడుస్తున్న దారిలో కదిలే ప్రతీదీ అందమే
కాకుంటే చూపుల్లో జాలి ఉండాలి. కరుణాత్మకం అవ్వాలి!

వీటన్నింటిని చూస్తూ నేను పాడుతుంటే
తూనీగ వెక్కి వెక్కి ఏడ్చింది. ఎందుకంటే
తన గీతం రోద గా మిగిలిపోతోందట
మానవ రోద గీతంలా మురిసిపోతున్నారట!

ఔరా! ఎంత తెలివి మీరిపోయాయి ఈ ప్రాణులు?
తమకు భాష రాదన్న ఒక్క బాధ తప్ప మరేమీలేదు
తీరా తరచి భాషను చూస్తే తెలిసింది
ఆ ప్రాణాల ముందు మానవజాతి చాలా చిన్నదని..

చేతలు వణుకుతే తగ్గుతాయి. కానీ చేతల్లో వణుకు తగ్గుతుందా?
గొంతు వణుకుతోంది. మాటలు తడబడుతున్నాయి
అయినా మనసు అరుణ రశ్మితో చేరి  సుధాకాంతుల్ని జతచేసుకుని
ఎంతటి భౌతికమయినా శ్వాస ముందు చిన్నవే కదా అనిపించింది

కారణం తెలియడంలేదు కానీ మస్తిష్కంలో ఏదో తెలియని వస్తువు ఉంది
దాని జాడలను కనుక్కోవడమే అమూర్తమైన మనసు తాలూకుగా మిగిలింది
అలjైం, అలజడిjైం, ఆవేశమై అహ్లాదమై విభవై విప్లవమై
కనిపించే మూర్తికి ప్రేమ తోడైతే చంద్ర కాంతుల ప్రభవం ఉద్భవిస్తుంది

కల వాస్తవానికి మూలమా? ఎలా?
కాదే! కల అంటేనే నియమం లేని విషయలాలసకు ప్రతిరూపం
కథ అన్నా అంతే కదా?
విషమ పరీక్షకు తోడైన జీవితాలను తప్పించుకునే మార్గం.

కాదు కానేకాదు. ఇదంతా వట్టి భ్రమ తాలూకు ప్రతిమలు
వృత్తుల్లో వృద్ధులదే పైచేయి
ఆవులను మేపుకునేవాడికి దొరికిన ప్రకృతి సౌందర్యం
ఏటి గట్టుపై నిలుచున్న సుమనోహర దృశ్యం ఎవరికి దొరుకుతుంది?

ముట్టుకుంటే జల్లుమనే చల్లదనంతో కాస్సేపు ఆడుకుని
వాటి మధ్యనే పీఠం వేసుకున్న కమలాన్ని అందుకునే ప్రయత్నంలో
బుడుంగుమని మునిగే బండరాళ్ళు
గడ్డిపరకలమీద కనిపించే తూనీగల పాటతో మైమరచిపోతాయి

ఎవరైనా తమవంతు రానంతవరకు ఏమీలేదనే అనుకుంటారు
రాగానే తమకు లోకంలో ఇంత తంతు ఉందాని ఆశ్చర్యపోతుంటారు
రాళ్ళయినా రప్పలయినా పరుగులు తీస్తున్న గుర్రానికే తెలుస్తుంది అలుపు?
అందుకే నేనెప్పుడూ లేడిపిల్లలా భయపడుతూనే ఉంటాను

పుట్టినపుడే నన్ను ప్రకృతి ఎత్తుకుపోయింది
లాలించింది. లాలిపాట పాడిరది. లాలిత్యం చూపింది
నేను చేతపట్టుకున్న ప్రతి గ్రంథం లో చివరిపేజీ వరకు నాతోనే ఉంటుంది
రాత్రి ఎవరినీ నమ్మదు. నమ్మినా నిద్రపోదు తప్పదు!

నా ఆనందమా!
నన్ను కాదన్న మాత్రాన నువ్వు నా ఆనందానివి కాకపోతావా?
నాలోని ఆర్ద్రమా?
అమృతపథం దిక్కుగా నడుస్తుంటే అగ్నిలా ఎదురు కానుందా?

ఉద్రేకం నుండి రాలేవి కన్నీరు కావు అంతర్‌శక్తి కవచాలు
ఉదయం నుండి పలకరించేది ఆనందాశృవులు కావు
నేల పగుళ్ళకు కారణం భూకంపమే కాదు
వాళ్లనుకుంటారు నన్ను నన్నుగా శిల్పంలా పరిగణిస్తారు

ఎన్నో ఏళ్ళనుండి సాగుతున్న ఈ ప్రయాణం
ఒక్కసారిగా వెనుదిరిగి ప్రశ్నిస్తుంటే చిటారు కొమ్మపై కూర్చున్న ఉష్ట్రపక్షి
చటుక్కున ఎగిరిపోయింది ఇక వినలేకుండా
విందుభోజనానికి రాకపోతుందా అని చెట్టు తల్లి విలాపం

పక్షుల్లో పెళ్ళేంటి అనుకోవడమే తప్పు!
మనుషులకంటే నిష్ఠగా ఉంటాయనేదే ఒప్పు !
నేలతల్లి కాపలా తో ఆకాశం హంగామాతో జరిగే ఈ తీర్పు
మంటల్లో చీలికల్లా కలిసే మండుతాయి. ప్రయాణం చేస్తాయి

గుక్క పెట్టే పాపాయికి కనిపించే మొదటి బొమ్మ అమ్మ
కువ కువలాడే పిల్ల పక్షులను పలకరించే చెట్టు కొమ్మ
సూర్యకాంతికి మెరుస్తున్న వెండికొండలన్నీ నింగికి ముక్కు పుడకలైతే

జీవనాన్ని బీభత్స వేదిక చేసి సోదాచేస్తే మిగిలేది వట్టి చమ్కు!

గోధూళి వేళలో అగుపించే దృశ్యాలన్నీ ఒక్కొక్క కలగా
ఆవిష్కృతమవుతుంటే నిష్ప్రకణంగా పరిగణించే ప్రతి స్థానం
గోమాతల దీవెనలతో స్వప్న శకలాలుగా కాకుండా
వాస్తవ బింబాలయినపుడు కనిపించేవన్నీ వెదుర బద్ధల సోపానం!

ఉన్నట్లుండి చంద్రబింబానికి అహం వచ్చిందట
ఎందుకని ఆరాతీస్తే తానకు అర్ధం సముద్రమట
మాకూ సముద్రం చుట్టమే అని మునకవేసామా
మనకు అర్థం ఉండదు కనీసం నీడలా కనిపించే ముఖబింబం ఉండదు

గాలిలో ఎన్నో పిలుపులుంటాయి
అరుపులుంటాయి, విసుర్లు , వింత పోకడలు ఎన్నో ఉంటాయి
మనోధర్మానికి తగినట్లు ఊహిస్తే కనిపిస్తాయి
కావలసినంత ఆవిరులు, ఆశలు వాటితో పాటు కన్నీళ్ళు!

ఆత్మలు నక్షత్రాలతో కలిసి మెలసి ఉంటాయయట
అదిగో మీ తాత! అదిగో మీ అమ్మమ్మ అని చూపుతూంటే
నక్షత్రాలన్నీ చిన్నబుచ్చుకుని ఇక్కడకూడా వారుంటే ఎలా?
మా తళుకులన్నీ చంద్రుని హృదయగీతాలుగా వినిపించడం ఎలా?

నేలపై మధ్యగా కూర్చుని
అలసటను భరిస్తూ ముక్కాలిపీటపై పద్మాసనం వేసుకుంటే
మెచ్చని మాటల మధ్య కనిపించేది భూమి కాదు
అబద్ధాల అందాలపై నివసిస్తున్న మనుషుల మధ్య వినిపించేది ఏమీ ఉండదు

నేను ఒక్కోసారి అనుకుంటాను వ్యాపారం చేద్దామని
దేనితో అంటే సూర్యచంద్రులతో అంటాను.
ఆశ్చర్యంగా ఉంది కదూ! అక్కడే నీ పొరపాటు దాగుంది
నేనంటున్నది వాటితో కాదు అవి ఉన్నపుడు అని అర్థం !

బేదాభిప్రాయాల మధ్య కలిసి ఉండేవి తలవంపులే!
ఉన్న ప్రకాశవంతమైన హృదయానికి కావాల్సింది అనువైన మార్గాలే!
ఒక చల్లని సాయంకాలం నాటి స్నేహం మనిషిలో మార్పు తెస్తుంది
ఒకానొక చల్లని నీడలో జీవితం ఎప్పటికీ ఓదార్పునిస్తుంది

అదృష్టం అంటే అందలాలు ఎక్కడం కాదని నిరూపించే
వినమ్రవీధులు ఒకప్పుడు బలహీనతను కొని తెచ్చుకుంటున్నాయి
దారి పొడవునా కనిపించే పచ్చిక బయళ్ళపై నిలచునే
తూనీగలు ఎప్పటికీ బలాన్నే ఆయుధంగా వాడుతున్నాయి.

ఎన్నో ఏళ్ళగా మనిషి పరాక్రమాన్ని పదునుగా వాడుతున్నాడు
ప్రపంచం నుండి ప్రపంచానికి ప్రయాణం చేస్తున్నాడు

అలసటను ఎంతైనా భరించే వృక్షరాజంతో జతకలిపితే
జీవన యాత్రలన్నీ స్వచ్ఛంధ పురాణాలైనట్లు వినిపిస్తున్నాడు

అదే అదే నా పేరులోని మాధుర్యపు విశ్వాకారం
భయంతో అయినా, బేల అయినా నన్ను విడిచి వెళ్ళిన స్వైర్యవిహారం
సూర్యున్ని వెనక్కు నెట్టడం అంటే కళ్ళు మూసుకోవడమే
వేరే కాంతితో ఆడుకోవడం అంటే చీకటిని నమ్ముకోవడమే!

కాలం ఎంత మంచిదంటే
గాయాల్ని మాన్పుతుంది. గానాల్ని నేర్పుతుంది
మనుషుల్ని, వారిలోని మలినాల్ని, హృదయాల్ని తట్టిలేపుతుంది
అవునంటే అవునంటుంది. కాదన్నా అవునంటుంది!

ఎన్నేళ్ళ ప్రయాణమో కదా ఈ జీవన యానం
ఉదయం లేవగానే ఎదురుగా కనిపించే వృక్షం
రాత్రి తలుపు వేస్తుంటే కనిపించే చెట్టు రెండూ ఒకటే
కాకుంటే అది వీధిలో నేను ఇంటి బయట అంతే అంటుంది!

అనుకుంటాం కానీ
శిలల రూపాల్ని ఎవరు ఊహించగలరు?
సూర్యకిరణాలు అనేక కోణాల్లో శిలల్ని చూపించగలవు
ప్రతీదీ తన చేతిలోని రహస్యాలే అని ఎంత గర్వంగా ఉంటుందో చూసారా?

ఏదయినా చూడాలనే కోరిక మనోశంఖాన్ని పూరిస్తుంది
ఎవరినైనా పలకరించాలనే కోరిక మెదడుకు సంకేతపరుస్తుంది
ఒక్క శిఖరాన్ని ఎక్కండి ఇక కోరికలు ఉండవు
ఒక్కసారి దేవాలయాన్ని పలకరించండి ఏ సంకేతాలుండవు

ఉన్నట్లుండి మెరుపు మెరిసి, ఉరుము ఉరిమి
ప్రకృతిని నిలదీస్తుంటే గొల్లుమని ఏడవడం తప్ప మరేమీ లేదంటుంది
గ్రీష్మతాపంతో భగభగ మండిస్తుంటే
ఒక్కసారిగా కన్నీటితో సమాధానం తప్ప మరేదీ వద్దంటుంది

ఉదయమంతా నాదైతే మరి నీకు ?
మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అన్నీ నావే అయితే
అలజడులు, ఆవేదనలు, ఆవేశాలు అన్నీ నావే అయితే
మంచిదే కదా మీకు  హిమఘనమైన సమయం తోడుంటుంది

చీకటికి రూపం ఉండదా ? ఎవరన్నారు?
వెలుతురు గొప్ప సౌందర్యరాశి అని ఎవరన్నారు?
అన్ని ఋతువులు కలగలిపిన దృశ్యమానం నా ఆకృతి అయితే
ఎన్నో వ్యధలు నిండిన వాస్తవం ప్రకృతి చిత్రం!

నన్నడిగితే ప్రకృతి అంత చక్కనిరూపం ఎవరికుంటుంది?

అమ్మాయి తానే! అమ్మ తానే అయి దిక్కుల్ని ఇంద్రజాలం చేస్తుంది
ఒప్పుకుంటేనా? గాయం ఎక్కడ తగినా ముఖాన్నే చూపుతుంది
బలహీన క్షణాలైనా, నిముషాలైనా మనల్నే చూపుతుంది!

అసలు నీకు నీమీద నమ్మకం అనేది ఉంటే
నిన్ను నీవు కాపాడుకుంటాను అనుకోగలిగితే
ఆరోజే, ఆ నిముషమే, ఆ క్షణమే ప్రకృతి నీ సొంతం!
అలా కాదంటే మాత్రం నీవు ప్రాణం ఉన్న బొమ్మ రూపం!

కలలో ఒకసారి కనిపించే దృశ్యమానాలన్నీ
ఒక్కచోట చేర్చి అలసిపోకుండా ఉండగలిగితే
నీ గమ్యం ఖచ్చితంగా ఇక సాయంకాలమే!
నీ గెలుపు ఓటములు తప్పనిసరిగా ఒక మధ్యాహ్న సమయమే!

సత్యం అంటే రెండు కొండలు నడుమ పారే సెలయేరు అంతే
అసత్యం అంటే రెండు నాలుకలు మధ్య సాగే ఉప్పులేరు అంతే
కాకుంటే సత్యాన్ని చేజిక్కించుకోవాలంటే కావాల్సింది సమయం
అసత్యం సత్యమవ్వావలంటే మాత్రం కావాల్సింది అంతులేని పయనం!

తీరం కనబడని సముద్రానికి ఎంతో ధైర్యం తనకో తీరం ఉందని
సుదూర తీరంలో  ఉన్న మనిషికి అనిపిస్తుంది కేవలం అదో అవస్థని!
బొమ్మ బొరుసు ఆటలో బొమ్మయితే చిత్రం కాదు నీ గమ్యం
బొరుసయితే జీవితంలో ఒకటి కాదు వందల సమూహం!

మనదయితే మనదే మంచిదే
కాకున్నా మనదే మంచిదే కాకుంటేనే సమస్య
ఓడిపోతూ కూడా మళ్లీ మళ్ళీ అగుపించే శ్వాస నిశ్వాస
వెళిపోతూ కూడా నీ వంతు నీకివ్వాలనుంటే అది నిజమైన సమీకరణం!

కళ్ళు చూసి చూసి అలసిపోయాయి
కొండలకూ కళ్ళుంటాయి కదాని విసిగిపోతాయి
ఓటమి అంటూ గెలుపు చివరలో ఉందంటూ మాట్లాడుతుంటే
గుండె గుండెకు బలాన్ని చేకూర్చగలది కేవలం ఒక్క మాటే!

ఉదయం చల్లని గాలి , ఎదురుగా సెలయేరు
చెట్టుపై పక్షిపాట, నేలపై పచ్చని పచ్చిక
ఎదురుగా ఈలపాట, పక్కనే ప్రేమజంట
ఇవన్నీ చూస్తుంటే ప్రకృతిలో నీవో కన్నుల పంట కాదా?

నవ్వులు, చిలిపిపనులు, షేకండ్లు, కౌగలింతలు లాంటివన్నీ
కాలాతీతమైన చర్యలే అనేందుకు సాక్ష్యం క్షణాలు
ఒక్క సెకనైనా ప్రకృతిని పలకరించగలిగితే
నిలబడ్డ భూమి నిన్ను కాపాడే ఆకాశం అన్నీ నీవే కావా?

అంటాను ఎన్నో.. ఒక్కోసారి ఏవీ అనలేను
సంతోషం ఉంటే అన్నవన్నీ ఆణిముత్యాలే
దుఃఖంతో నిండిన కళ్ళన్నీ మంచు ముత్యాలే
ఈ ముత్యాలన్నింటిని చేంతాడులా పేని మెడలో వేసుకుంటే నేనే కదా?

కొద్దిసేపు నిలబడగలం. మరికాస్సేపు నడవగలం!
ఇంకాస్సేపు చూడగలం! మరికొంత సేపు వినగలం !
అంటే వందేళ్ళ జీవితానికి ఎంతని ఎన్ని విషయాలని చేయగలం?
చేయగలమా? అయితే ఇంకేం ? ఏ ప్రశ్నలూ అడగద్దు !!

కీకారణ్యానికి జీవితాంతం నమస్కరిస్తాను
అందులో అమాయకత్వం మాత్రమే సంచరిస్తుంది
ఒకచోటు నుండి ఒకచోటుకు ప్రయాణించే ప్రాణులకు
నన్ను గూర్చి  ఎన్ని గుసగుసలు పోయినా వేలసార్లు తలుచుకుంటాను

మునివేళ్లపై చేసే ప్రయాణం మునీశ్వరుని తలపిస్తుంది
అందుకే ముని అడవుల్లోనే నివాసం ఆవాసం చేసుకుంటాడు
చంద్ర నిప్పులు చెరిగే భానుడు ప్రళయగర్జన చేస్తే మాత్రం
మన చూరుకిందే నిలుచుని తీయగా తలుచుకుంటాడు

లాలి పాట రోకలి పోటుతోనే మొదలయ్యిందట
జోలపాట జోరీగ నేర్పితే నేర్చుకున్నారట
వెన్నెల పండుగ మన పలువరుస నుండే వచ్చిందట
చిరుజల్లుల మురిపెం అవని అలకే నేర్పిందట!

ఇన్ని తెలిసీ, బాధలకోర్చి,
పరిమళభరితమైన ఉపశమనపు శాంతిలో ఔలాడి
ఆహ్లాదకరమైన రహస్య స్థావరాన్ని అంటిపెట్టుకుని
వనదేవత కరుణించింది అంటుంటే నాకు విసుగు రాదా?

కళ్ళు స్త్రీని అంటిపెట్టుకున్న రెండు కలిశాలు
ఒలికిపోతే దేవి ఆగ్రహించి వికలమవుతుంది
గంభీరమైన నిశ్శబ్దం ఆవరించినపుడు కలతనిద్ర తప్పదు
పక్షుల కిలకిలా రావాలు వరించినపుడు ఆనంద తీరం తప్పదు

నిద్రలేచింది లోకం ఉన్నట్లుండి అయినా ఎవరులేపారు?
వసంత గీతం పాడుతున్న ప్రియురాళ్ళా?
కిటికీని సుతారంగా తడుతున్న చినుకుల చిలిపి మరదళ్ళా?
కాస్తంత సందు చూసుకుని దూసుకొచ్చే తుంటరి గాలి తమ్ముళ్ళా?

ఎవరైతేనేం? తలుపైతే తెరుచుకుంది.
అక్కడెక్కడో ఉన్న ఆవుమెడలో గంటలు మోగుతున్నాయి
కొక్కొరొక్కో అనేది కోడి కాదు. సెల్‌ఫోనులో అలారం వినిపిస్తోంది
అయినా నిద్రపోవయ్యా! నీకెవరు చెప్పేరు లేవమని?

లేచి చేసేదేముందని! ఆలోచించడం తప్పు !
ఎంత సత్యం? ఎంతటి వాస్తవం?
దేనికి నీ బాధ అని ప్రశ్నించుకుంటే
క్షితిజాన్ని జ్ఞప్తికి తెచ్చుకోక తప్పదు

నిజం కదా? మన మెదడులో వెలుగు వచ్చిందికదూ!
ఆవేశానికి ఆలోచనలకు మధ్య ఆంతర్యం అర్థమవుతోంది కదూ!
చకోరానికి , తీతువుకు మధ్య తేడా తేటతెల్లం అవుతోంది కదూ
మంచి గంధానికి, మురుగు కాలువకు వ్యత్యాసం విపులీకృతం అవుతోంది కదూ!

రవి కాంచని చోట కవి గాంచుతాడు అనే మాట తెలియనిదెవరికి?
ప్రకృతితో పోల్చితే కవి సూర్యునిలాంటివాడయితే
చదివే పాఠకుడు త్రికరణశుద్ధిగా చంద్రుని లాంటివాడు
విమర్శలు నక్షత్రాలయితే అంగీకారం మెరుపుల్లాంటివి. తప్పదు!

రాత్రి అంటే ఒక్క చీకటే కాదు
రాత్రి చీకటిలో మమైకమైనా సరే వ్యక్తిత్వంలో ఏ అణువూ కోల్పోదు
సహిస్తూ పోరాడుతూ చేసే యుద్ధంలో అస్థిత్వం అమృతం అవుతుంది
ప్రవహించే అంతరంగం ఒకనాటికి విశ్వాంతరంగా రూపొందుతుంది

రాత్రికి ఒక్క రాత్రే సమాధానం
సున్నితమయినా, సునిశితమైనా,
దైన్యమయినా, ధైర్యమయినా రాత్రే ప్రశ్న !
మంచును తన గుండెల్లో దాచుకుని చల్లదనాన్ని అందిస్తుంది!

ఎన్నో మొగ్గల ఆంతర్యం రాత్రికి తెలుసును
మరెన్నో పువ్వుల జీవితం రాత్రికి మాత్రమే తెలుసును
ఉదయానికి విచ్చే మొగ్గలు నవ్వుతున్నా సరే
ఒక్కనాటి జీవితాన్ని జీవించే పువ్వులు చిరునవ్వులు చిందిస్తూనే ఉంటాయి!

ఒంటిరెక్క జీవితానికి రాత్రి పగలు తేడా ఉండదు
అంతా ఒక్కటే యాత్రలో ప్రయాణమే తప్ప దిగడం అనేది ఉండదు
వసంతమయినా, శిశిరమైనా, గ్రీష్మమయినా ఏదయినా ఏమయినా
ఒంటరి అడవిలోకి ప్రవేశించిన ఏ ప్రాణికి జీవన సౌందర్యం ఉండదు.

వారంలో ఏడురోజుల సమాహారం
ఒక్కోరోజు వారానికి అలంకారం ఒకరకంగా అహంకారం
ఏ రోజుకారోజు మనల్ని పలకరించే నిముషాలన్నీ ఒకచోట చేర్చి
కలగలిపితే వచ్చే మనోహర దృశ్యరూపం నెలకు ఒక మెట్టు ఎక్కిస్తుంది

వ్యతిరేక దృశ్యాలపై పడిన ప్రభావం మనసులోనే ఉంటుంది
స్వభావాలన్నీ సంకీర్ణాలై బందించినపుడు అనేక చోట్ల పలకరిస్తుంది
వ్యక్తుల మధ్య, వర్ణాల మధ్య దాక్కున్న కాంత తిరిగివెళ్లటం మరచిపోయింది

ఆతృత , ఆత్మీయతలు స్వజాతి ధర్మాలై వెదకటమే శాశ్వతమనుకుంది

భావాల కెరటాల మధ్య నేను నిలుచుంటే సముద్రం ఎదురీది ప్రశ్నిస్తోంది
పెదవుల తీరాలను దాటి పలికే స్వదృశ్యబింబాలన్నీ
నాలోని భాషను తీసుకెళుతూ వెనుదిరిగి చూసేలోగా పక్కనే నిద్రిస్తోంది
కాలం చేతుల్లోకి తీసుకుందామంటే మణికట్టుపై వాలింది

దుఃఖం ఎడతెరపిలేకుండా పలకరిస్తుంటే
ఆకాశాన్ని సైతం ఓదార్చేటంతటి నవ్వు శాశ్వతమైన వారధి కట్టింది
తనను తాను కోల్పోయి తిరిగి మళ్ళడం మరచిపోతుంటే
సమస్త దిక్కులూ నాతో ప్రయాణిస్తూనే ఆగిపోయింది.

అవును.. నేను ప్రేమలో పడ్డాను
అక్షరాలను ఆలకించి, ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి
భావాలతో సాన్నిహిత్యం చేసి పదాల్ని పల్లవులుగా స్వీకరించి
కమనీయమైన కవిత్వంతో ప్రేమలోపడ్డాను

ఈ ప్రేమ ఈ నాటిది కాదు. ప్రాచీనానిది
బతుకంతా వెదుకులాటే ఎందుకోసమో అంచనావేయలేనంత
నా పాదాల అడుగులు ఆగిపోయాయి కవితా స్వరూపం దగ్గరే
నా జీవితం అంతమయింది ఈ కవిత్వ ఔన్నత్యం దాటలేనంత!

సముద్రం విశాలమే అది ప్రత్యేకంగా చెప్పేదంటూ ఏమీలేదు
తనను తాను కోల్పోయే ప్రయణించే ప్రతి చోట నన్ను నేను
ఆవిష్కరించుకునేది, అలవాటుగా నవ్వుకునేది ఏమీ ఉండదనుకుంటుంటే
"ప్రేమించేయకూడదూ" అనే మాటతోటే కవితాత్మలో ఏకంగా కలిసిపోయాను

ఇదేం ప్రేమ అంటారేమో ఇది ఖచ్చితంగా ప్రేమే!
ఇప్పుడు కొత్తగా పుట్టిందా అంటారా? ముమ్మాటికీ కాదు
నా ప్రేమ పాతదేనని మరీ మరీ పదాల హారంపై
కళ్ళనీళ్ళతో గుండెను కడిగి సరికొత్త ప్రమాణంతో చెబుతున్నాను.

వందేళ్ళ జీవితమని మనం అనుకుంటే సరిపోతుందా
వందేళ్ళు ఏవీ? ఎక్కడున్నాయి వెదుక్కోవాలి కదా?
ప్రతి ఏడాది నన్ను వదిలిపోతున్న పునాది
ఎంతాశ్చర్యం?దానికి పుట్టినరోజంటూ నామధేయం!

అందరినీ సమానంగా ప్రేమించే ఆకాశాన్ని ప్రేమిద్దామనుకున్నాను
అందరినీ సమానంగా మోసే అవని కోసమే బతుకుదామనుకున్నాను
ఇవన్నీ ఆకర్షణ యుగాల్లో కనిపించే కాల ప్రవాహాలు
అక్షరం ప్రేమ మాత్రం నా అణువణువు ఆలపించే ప్రహారీ గోడలు

సూర్యుని ఎదుట ప్రమాణం చేసి
ప్రభూ! ఈ అక్షరాలన్నీ నీకు నైవేద్యాలు

కాకుంటే ఇవన్నీ నక్షత్రాలుగా తీర్చిదిద్దే బాధ్యత మాత్రం నీదే
అనగానే ముఖం చాటేసి మరి నా నక్షత్రాల మాటేంటి ?

ఊహల ఊయల అనేది పాతదే అయినా నేను కొత్తగా ఊగుతున్నాను
ఊటబావులన్నీ ఎండిపోయినా సరే నేను మొక్కలు వేస్తున్నాను
నా ఆలోచనలన్నీ నీ పాదాల చెంత అణువులే ప్రభూ
లక్షల సాక్షిగా నా దుఃఖపూరిత సందోహాన్ని నీతోనే ఉంచుకో!

మనుషులందరి ప్రేమలు రెండు రకాలు
ప్రాచీనం ఆధునికం దృశ్య చిత్రాల్లా పొందుపరచి ఉంటాయి
గతంలో ఒకటి ప్రస్తుతంలో ఒకటి కాపలాదారులై ఉన్నా సరే
కుప్పలు పోసిన జ్ఞాపకాల వెల్లువలో గమ్యంలేని గమనాలున్నాయి

నింగి ఈ నాటి వరకు తన నిజవర్ణం తానే ఎరుగదు
నేడు ఎవేవో రంగులు ఆ పాదాల చెంత చేరుతుంటే గమనించదు
మనుషుల మధ్య లేని ప్రేమ, మనసులేకుండా మనుషులు
ఎంతోకాలంగా కలిసి ఉండటం అనేది కొత్త సిద్ధాంతాలు!

విశ్వజనీనమయితే ఏ అక్షరమైనా నా ఇంటివాకిట నిలుచోదు
అవిభాజనమైన దుఃఖమైతే ఏ పదమైనా నా గది వాకిట కావలి ఉండదు
గతంలో ప్రేమ శూన్యంలోనే ఉంటుందనుకునే నేను ఏకంగా
సమయం అలల మీద వేల్లాడే పచ్చని ఆకులా కదులుతూనే ఉన్నాను

ప్రకృతి పాపం ఎపుడూ పక్కన నవ్విన పాపానపోలేదు
ఆకాశం ఏడుస్తోందనో, మండిపోతోందనో,
గాలిరాజు విపరీతపు చేష్టలు చేస్తున్నాడనో
మానవ విపరీతాలు ఏమూల నుండి తనపై దాడి చేస్తాయనో

నిత్యం ఆవేదనే! నా గుండె ఇక నన్ను వదిలి వెళ్ళిపోతాననంటోంది
నేనే ఇదో ప్రయాణంమని, ఇందులో నినాదాలు, నిస్పృహ పతాకాలు
ఎన్నో ఎన్నో ఉంటాయని ఓదార్చి ఆపుతున్నాను
ఇక ఓర్పులేదు. నిజమే విశ్రాంతి తీసుకుందామనే నాకూ ఉంది!

ఏది మన చేతిలో ఉంది?
నిన్నటి వరకు నాకు నేనే ఎవరూ లేరని అనుకున్నాను
ఇపుడు తోడుగా కవిత్వం ఉంటుందా అనే ఆశతో ఉన్నాను
అయినా నా సేవలో ఎన్ని పదాలకు చోటుందో కదాని ఊరుకున్నాను.

నేనెపుడూ ప్రకృతితో మాట్లాడతాను
నన్ను ఓదార్చే చెట్లు, పక్షులతోటే నా అనుబంధాలు
పార్కులో నాది ఒంటరి బల్ల అయినా
గాలి నాతో ఎన్నో మాటలు చెబుతుంది. ఒక్కోసారి నవ్విస్తుంది కూడా!

మేఘాలకు చీకటి తోడైతే నాకు చాలా భయం

ఉరుములు అడ్డుకుంటే మరీ భయం
నా అడుగులు లెక్కలేని జనన మరణాల్ని తరచి చూసిన వైనం
గుర్తు తెచ్చుకుంటూ గుండె వేగాన్ని తగ్గించి మరీ నడుస్తుంటాను

ఎపుడో ఒకసారి సముద్ర తీరంలో ఒంటరిగా కూర్చున్న జ్ఞాపకం
కెరటాలకు నన్ను తాకాలంటే సంశయంగా ఉండేంతగా దూరంలో నేను
గతం వర్తమానాన్ని లెక్కచేయకుండా చేస్తున్న వ్యాపారంలో
నేనో అశాంతిని వెలిగించే భావాల్ని ప్రజ్వలింపజేస్తున్న కాగడాని!

అతనెవరో నన్నే చూస్తున్నట్లుంది
నన్నేనా? నా వెనుకజి ఉన్న శూన్యాన్నా? అని ప్రశ్నించుకున్నాను
కాదు నన్నే! అని నిశ్చయించుకున్నాను
దగ్గరకు వెళితే తాను ఎవరిని చూస్తున్నాడో తనకే తెలియని స్థితిలో అతను!

భ్రమ అనేది మెదడుకు సంభంధించినది కాదు
పురివిప్పిన ఆలోచనల మధ్య మజిలీ మజిలీకి ఒక భాష ఉంది
మనవి కావనుకున్న శబ్దాలన్నీ గుండెకు చేరువ అవుతాయి
మనవే అయితే గుండె విశ్రాంతిలో ఉండి తర్వాత అంటుంది

కళ్ళు తెరిచి చూసినప్పటినుండి నా డైరీ నిండిపోతూనే ఉంది
జీవన ఆటుపోట్లుతో పేజీలన్నీ కన్నీటితో తడిసిపోతూనే ఉన్నాయి
నేను నిజంగా స్వేచ్ఛకు అర్థం తెలిసినదాన్ని
అందుకే లెక్కకూ, అవసరాలకు సరిపడేటంత జీవితాన్ని అందుకున్నాను

వెదుకుతాను వెదుకుతాను ఓపిక ఉన్నంతవరకు
మరలిపోతాను నాలో అక్షరాలు తోడున్నంతవరకు
ఏదో తెలియని అశాంతి ఆవరించిన వెంటనే
నేను కూడా అంటున్నాను.రోజు రోజుకు చెప్పుకోదగిన కొత్తేముందని?

నాకు పరిచయం ఉంది అలలతో
కానీ పలకరించకుండా మెల్లగా సాగిపోతాయి కదానేది నా బాధ
అరె! ఒకింత నవ్వయినా నవ్వదు కదా చూడనైనా చూడకుండా
నువ్వు నాలా నెమ్మదిగా ఉండచ్చు కదా అని జారుకుంటుంది

అయితే ఏముంది ఎవరికి వారే వారిలో నిమగ్నమవుతారు
నిమగ్నమనేది జరిగితే కమ్మని కలల స్వరూపం నా సొంతమవుతుంది
మనం వెళ్ళేదారి ఎడారి అయితే అన్నింటా నేనే ఉంటాను
ఎవరికి ఎవరు ఏమివ్వగలరు? అంతా అనుకోవడం తప్ప!

నా ఉనికిపై ఊహలు ప్రత్యక్షమయితే
మొదటిరోజు కించిత్ బాధాతప్త హృదయంతో నిండి
ప్రాణమే లేని గోడయినా సమాధానం ఇస్తుంది
ఎందుకంత ఆరాటం? నన్ను చూడు నా మౌనంతోనే ఎంతకాపాడతానో అని

ఉండుండి ఏదో వెలితి తెగతోడుతుంది
నిజమే అది నాదే కాదు నాలాంటివారందరిదీ అంటుంది
జరిగే సమస్యలన్నీ సామరస్యంగా పరిష్కారం అవ్వొచ్చు
కానీ అమానుషాలకు ఎవరు జవాబుదారీ కావచ్చు అనేదే నా ఆవేదన

ఇష్టం కూడా నన్ను దాటితే నాకు నచ్చని పోరాలమే
కష్టంవస్తే కాపాడలేని ప్రకృతి మాత అమ్మయితేనేం? అక్కయితేనేం?అనిపిస్తుంది
అబల కన్నీళ్లతో శుభ్రం చేస్తున్న ఈ చైతన్య స్వరూపానికి పేరు ఏమిటి?
నన్ను నన్నుగా పరిశీలించే సమాధానమా? లేక మౌనమా?

రోజులనుండి వత్సరాలు దొర్లిపోతూ నవ్వుకుంటున్నాయి
క్యాలెండర్‌లో ఉదయం లేచి ఒక్కో పేజీ చింపుతుంటే నవ్వుతుంది
ఒరేయ్ నీ జీవితంలో ఒక రోజు మైనస్ అంటూ ఎగతాళి చేస్తుంది
అయితేనేం మళ్ళీ మళ్ళీ చింపుతా ఆ వ్యంగాన్ని వస్త్రంగా మార్చుకుంటా

ఇల్లు మార్చేను. కిటికీలకు రంగులేసేను
గోడలకు ఫొటోలు పెట్టి అలంకరించేను
కుర్చీలన్నీ ఒక వారగా సర్ది దారులు ఏర్పరిచేను
ఏం లాభం నా మనసును తీసి కడిగి మార్చలేకపోయాను!

ఎందుకు? అర్ధమవుతోందా?
అవుతుంది లేదని మాత్రం ఎవరూ అనకూడదు మరి
నిత్యం పాతది పాతది అంటూ ఏడిపించాను కదా
ఈ రోజు సరికొత్త దుస్తులతో తన అందాన్ని చూపుతోంది మరి

సూర్యకాంతి కనిపించే ఇల్లు ఇల్లవుతుంది కానీ
మెరిసే నగలు, కదిలే గడియారాలు
చేతిలో టార్చ్‌లు, సెర్చ్ లైట్లు ఉంటే ఇల్లవుతుందా? నా పిచ్చిగానీ
అందుకే ఉదయం సూర్యుని కోసమే నా ఎదురుచూపు!

వారగా ఉండే గదిలో కాంతిలేదు
దూళి మూగిన అమ్మ ఫొటోలో చిరునవ్వులేదు
గాలికి ఊగింది. అమ్మ పిలిచిందనుకున్నాను
కాదు కాదు నీ జీవితం ఇలా కాకూడదనే హెచ్చరిస్తోందని తెలుసుకున్నాను

నేనయినా నువ్వయినా చనిపోతే గోడమీద బొమ్మలమే
ఒకప్పుడు గోడలు వాటికి అనుమతి ఇచ్చేవి
ఇపుడు గర్వపడ్డ గోడలు తమను తాము శుభ్రపరుచుకుంటున్నాయి
పని లేకున్నా సరే ఒక్క సారిగా సాష్టాంగ ప్రమాణం చేస్తున్నాయి

ప్రపంచంలో నేనో పరమాణువుని
విశ్వంలో ధూళిని
ప్రతికారంలో పెద్దపులిని
కానీ నీ ప్రేమలో మాత్రం నేనే విశ్వాన్ని అనుకుంటూంటాను

ఇవన్నీ ఉబుసుపోక కబుర్లే అనుకోకండి
నా గుండెను రెండు ముక్కలు చేసి లాగి చూస్తే వచ్చిన భావాలు
నిరాశ నుండి నిరీక్షణకు చేరితే ఎదురైన చక్రాలు
ప్రతి నిత్యం ఒక సంరంభం! అంతా ఇంతేనా అనిపించే నాదాలు

ఎండ రావడంతోనే తీక్షణంగా ప్రారంభిస్తుంది
ఎదురయి వస్తున్న జీవన దృశ్యాలను ప్రస్ఫుటంగా చూపుతుంది
పొద్దు గురించి వారందరినీ గుర్తుంచుకుంటుంది
అన్నింటిని పుక్కిట పట్టి పేరు పేరునా విశ్రాంత సముద్రాలను చూపుతుంది!

బతుకు బండిని కళ్ళముందే కట్టేసిన వైనం నాకు తెలుసు
యథేచ్ఛగా సాగుతున్న కళేబరాల శాంతి వచనాలు తెలుసు
నిర్లజ్జగా నడిచే నీరవ నిశ్చయాలు తెలుసు
పిలిచే శబ్దాలు, వలచే ఆమోదాలు కూడా తెలుసు!

పుట్టుకను ప్రలోభపరిచే ప్రతి ఒక్కరూ ఒక్క
అందమైన అద్భుతమైన శిల్పాలు కారు
రండి చేత బూనండి !
కాదంటే ఏకంగా వదిలి దూరంగా వెళ్ళిపొండి!

దిశలు, దిక్కులు అన్నింటికి అర్థం ఒక్కటే!
దిశ నన్ను నన్ను గా చూస్తే
దిక్కులు నన్ను మరొక వస్తువుగా నిరూపిస్తున్నాయి
ఇద్దరం కలిసాం. కలిసే బాధపడతాం! రా రమ్మనే నేనంటున్నాను

ఈ వివిధ రకాల రంగుల విశ్వంలో
నేను ఒక పరమాణువని నువ్వనుకుంటే
నేనంటాను ఒక బ్రహ్మాండాన్ని భరించలేక అందరూ రోదిస్తుంటారని
నేనున్నది సమాధిలోనే కదాని సర్దిచెప్పుకుంటాను కూడా!

పగలంతా పనుల వత్తిడిలో నేను నాముందున్న నిన్ను గమనించలేను
కానీ గుండెలో మేలుకోవడం అనేది జరిగాక
కలత నిద్రయినా, కటిక నేలపై గాఢ నిద్రయినా ఏదయినా నిద్రే
ఒక్క ఆలోచనతో మొదలై వంద ఆరోపణలతో రోజు మొదలు పెట్టలేను

మారుతున్న కాలంలో అనేక చిత్రాలు నన్ను ఇబ్బంది పెడుతున్నాయి
చిత్రమేదైనా సరే చిత్తరువై ఆహ్వానించే స్థాయికి తీసుకెళుతున్నాయి
దారులన్నీ మూసుకుపోతున్నపుడు కనిపించేవన్నీ శూన్యాలే
ప్రతీ దారి నాదే అయినపుడు వినిపించేవన్నీ శుభాభివందనాలే!

బతికుంటే పది అడుగులు చనిపోతే ఆరు అడుగులు ఇంతే జీవితం
పది అడుగుల్లో పది మాణుగుల ఆనందంకోసం పరుగులు తీస్తుంటే
ఆరు అడుగుల్లో జీవితాన్ని జీవింపజేసేటందుకు వెనక్కు పోరాటం

పెరుగుతున్న అరణ్యపు పొరల్లో వేల్లాడే బ్యాగ్‌ల సంచార యుగం!

పయనం ప్రారంభం అవ్వడంలేదు.
గమ్యం సరిగ్గా ఉండటంలేదు
శుక్లపక్షం నీదయితే, కృష్ణపక్షం నాది
ఎంతటి ప్రవాహంలో అయినా మునిగిపోతుందంటే చలిస్తుందంతే!

అవనికి జాతకం చూపాలంటే నమ్మడంలేదు
అల్లంత దూరాన ఉన్న ఆమనిని పిలవాలంటే రమ్మనలేదు
అలాకాదని ఇలా కాదని అన్నీ నాదే కదా అనుకోవాలంటే రుజువులేదు
స్వేచ్ఛ స్వతంత్ర్యం అనేది మాడిపోదు అలసిపోదు అంతే!

ఆకాశానికి తలుపులు లేవు తాళం వేద్దామంటే
అమాయకత్వానికి అటంకాలుండవు ఆపుదామంటే
అయోమయానికి అంతేఉండదు అర్థం చేసుకుందామంటే
స్వేచ్ఛకు ఎత్తుగా ఉండటమే ఇష్టం! ఎగిరిపోవడమే ఇష్టం!

అవని పాలతలంపై వీచే ప్రతి రేఖా అదృశ్య రూపమే
పరిణామ దశల్లో వినిపించే ప్రతి దృశ్యం విగత జీవమే!
పుట పుటకు మట్టి భాష తెలుసు!
సమస్యలావర్తనకు ప్రియ సంభాషణా చాతుర్యమే తెలుసు!

దప్పిక వేస్తే తాగడానికి నది అంత నీరు అవసరంలేదు
ఆకలేస్తే తినడానికి వందకేజీల అన్నం అక్కరలేదు
బతకడానికి మాత్రం లోకమంతా కావాలి
బతికించడానికి బతుకునే పణంగా పెట్టాలి!

చేతిలో నాణేల వంక చూస్తుంటే
రేఖలు తలవంచుకోవు!
విశ్వమాత తలవిరబోసుకుని సమాంతరం చేస్తూ
తడి పొడి మాటల మధ్య వెల్లివిరిసే వదనాలు కనిపించవు

ప్రపంచం అంటే పంచశీల దృక్పథాల సమ్మేళనం కాదు
నా ప్రపంచం అంటే ఒక్క మానవ స్వరూప సమ్మిళతమే
నేనొక ప్రళయకాల స్వరూప రహిత శిలను కాను
ప్రణయాన్ని హృదయాన్ని సరిచేయగల ధైర్యమున్న ఉదయాన్ని!

ఒక్కసారి భరోసా ఇచ్చి వదిలిపెట్టు!
నా పొడవాటి జీవితాన్ని నీకు తాకట్టుపెట్టి మరీ మాట్లాడతాను
కోపంతో నన్ను చూడకుండా బతకనివ్వు
ఆలస్యమయినా నీకోసమే మరోసారి జన్మిస్తాను!

నేను నిలుచున్న ఈ వర్షపు రాత్రి వెన్నెల్లో ఉంది
నే తడుస్తున్న ఈ రోజులన్నీ తడికి దూరంగానే ఉన్నాయి

నేను ఎదురుచూసే క్షణాలన్నీ నీ పాదల ముంగిటనే నిలుచున్నాయి
ఒక్కసారి మేఘాలను పలకరించి దగ్గరకు తీసుకున్నాను నమ్మకం ఇచ్చాయి

మారని మేఘాలు వర్షించలేని ఆకాశాలు
నా ముందు పనికి వచ్చే కాంతులున్న సుదీర్ఘ నిర్ణయాలు
రావిచెట్టు దగ్గరకు నడిచి ప్రదిక్షిణాలు చేసే అడుగులు
కాంతిలేని చిన్న వాకిట్లో నిలిచిన దీపాల సరాలు!

ఉన్నాయి చూడగానే కాదనుకునే ముఖాలు
ఉంటాయి ఆలోచించగానే వద్దనుకునే పరిచయాలు
ఇకపై రమ్మని పిలుస్తాయి ముఖస్తుతి ప్రవచనాలు
వచ్చినా ఏమాత్రం పట్టించుకోకుండా ఉంటాయి భేషజాల అంతర్యానాలు

అయితే ఒకటి ఆ ఆనందాలన్నీ అలానే ఉండాలనే అనుకుందాము
జ్ఞాపకాల అలలపై కొలిచే అందాల్ని సౌందర్యజగతిలో
ముత్యాల సొగసునై పరవశించాలనే కలగందాము
శాంతమై, గంభీరమై సమ్మోహనాల సమ్మేళనమై కనిపిస్తాము

మల్లెల స్వచ్ఛదనాన్ని చూసిన చందమామ ఊరుకోదు
మెల్లగా సువాసనను లాగేసి ఒక్కరాత్రే కదా నీ సోయగం అని కవ్విస్తుంది
గాలి దేవుని సహాయంతో కిందికి తోసేసి నవ్వుతుంటుంది
వీలయితే వరుణిడిని ప్రాథేయపడి రా రమ్మంటుంది

అయినా ఒక్కటి మౌనంలోని అంతరార్థాన్ని రాద్ధామనుకుంటున్నావా ?
శీతాకాల సాయంత్రాలన్నీ తూర్పార పెట్టాలని అనుకుంటున్నావా?
ప్రేమ సందేశాలన్నీ చీరకొంగులో దాచి పంపాలనుకుంటున్నావా?
నీకేం అర్థమయిందని తెగ నవ్వుతున్నావు చెప్పు వీలయితే!

అంతరార్థాలకు రూపాలుండవు
వట్టి మనసు చిత్రాలే!
తరతరాల ఆరావళి పర్వతాల కింద నీ చూపులు దాక్కుంటే
మనసులో కలిగే అలజడి ఆలోచనలన్నీ నీ రూపాలే!

అయినా ఎవరికి తెలియదు ఇపుడు ఇళ్ళన్నీ
పుట్టుకతోనే వయోవృద్ధులై కూలిపోతున్నాయని!
అడవులన్నీ ఆమడ దూరానికి పారిపోతున్నాయని
అందని అందాలన్నీ కంటిముందు సాక్షాత్కరిస్తున్నాయని!

నేస్తం ఆగు ఒక్కసారి ఒక్కమాట!
నీకోసం నివసించే ప్రాణులుంటే పరిచయం చేయి
నిన్ను చూస్తూనే బతికేవారి చిరునామాలివ్వు
మారిన వైనం తెలిపే చకోర పక్షుల ఆనవాళ్ళివ్వు!

నేల పుట్టుక , నది పుట్టుక

భౌగోళిక చరిత్ర, నేల మాణిగలపై చర్చ
అవసరమా అనుకుంటే చుట్టూ పుట్టలు కట్టిన తపస్విని ఎలా అవుతాను?
ఎగుడుదిగుళ్ళనూ, బీటలు వారిన జీవితాలకు కారణంగా నేనే ఎలా కనిపిస్తాను

సాయంత్రం అయ్యేసరికి నా యెదుట పక్షుల గుంపు
చిలకలు కావచ్చు, రాబందులు కావచ్చు ఏవైనా పక్షులే కదా?
అరణ్యాలు పెరగచ్చు! ఆవేశాలు తరగచ్చు ఏదయినా మనుషులమే కదా?
అలాంటపుడే అనిపిస్తుంది కళ్ళు ఎపుడూ మహనీయునివే అయి ఉండాలని!

వెయ్యేళ్ళ చరిత్ర చెట్టుకు మాత్రమే ఉన్నట్లుగా చూపుతుంది
శిధిలాలైనా అన్నేళ్ళు ఉండవేమో కానీ
శకలాలకు అసలే ఉండదు కానీ
ప్రాణాలిచ్చే తల్లిని సైతం తృణప్రాయంగా మార్చేటట్లుగా కనిపిస్తుంది

చరిత్ర చాలా విచిత్రమైంది
మహనీయులతోపాటు మలినాన్ని కూడా మోసుకొస్తుంది
నిర్భయత్వంతో పాటు నిర్భాగ్యపు తనాన్ని కూడా తీసుకొస్తుంది
జ్ఞానేంద్రియాలు శిధిలాలవుతాయేకానీ జ్ఞాపకాలు మాత్రం కావు

నేను ఎపుడూ కొత్తగా నిద్రలేస్తాను
చల్లగా గాలివీచే రాత్రిని నన్ను ఆవరించినట్లు చేస్తాను
కలలో ఎపుడూ అస్పష్టమైన చిత్రాలు తప్ప మరేవీ మాట్లాడనివ్వకుండా చేస్తాను
దేవుడా? ఎక్కడున్నావయ్యా? నేను నిజంగానే నిలుచున్నాను

విస్తరిస్తున్న విహారాల ముందు నేను ఒక దివ్వెను మాత్రమే
గుడిలోనూ వెలుగుతాను. గుండెలోనూ వెలుగుతాను
నన్ను తాకే ప్రతి వస్తువులోనూ వేడుకలు విచ్చుకుంటాయి
జాబిలి పక్కనే భానుడిలా నిర్మలంగా శూన్యపు దృక్కుల్ని పలకరిస్తాను

ఎవరూ లేని అరణ్యాలలో నేనొక మొగ్గనైతే
అందరూ ఉన్న అనాథలలో నేనొక వికసించలేని విహంగాన్ని!
తలపులు వేయడం తీయడం అనేది దశాబ్దాల కాలపు అలవాట్లయితే
గుండె తలపులలో నిండి తలుపులు తెరిచి ఉంచేది వట్టి ఒదార్పు!

యుద్ధాలు రాజుల కాలంలో పరిపాటి కావచ్చు!
పోరాటాలనుండి పోరుబాట వరకు అన్నీ సూర్యునికి సుపరిచితమే!
గెలుపు ఓటముల మధ్య న్యాయాన్యాయాలకు న్యాయాధిపతిrైాం
ఇప్పటికీ ఏది నిజం తెలుపలేని తనం కేవలం చేతకానితనమే!

దిగంతాల నడుమ కనిపించే కని పెంచే వారు సైనికులు
ఏదైనా జరగనీ మనం ఉంటే చాలు అనుకునే వారు సామాన్యులు
ఏదో ఒకటి సాధించాలి అనుకునే వారు ఘటికులు
ఏమి జరిగినా అర్థం ఉండాలి కదా అనుకునేవారు ఆధ్యాత్మికవేత్తలు

ఒక ప్రేరణకు కారణం ఉండితీరాలి
ఒక కారణానికి తప్పనిసరిగా జీవన్మరణాలు ఉండితీరాలి
అన్నీ జత చేసాను కానీ ఏం లాభం?
నాకు నేనే ఏమీ కాలేని వృధా శ్వాసనయ్యాను

సంగీతం ఎక్కడినుండి వచ్చిందంటే
పక్షుల గొంతునుండే అనేది తెలిసిన సత్యమే!
సంగీతమై పోవాలంటే మాత్రం
పక్షులతో మాట్లాడాలని అనుకోవడమే!

రాబోయే నిముషాలన్నీ నాకు జోలపాడే ఉత్సాహాలే!
ఎవరికి చెప్పను? నాకు నేనే ఒక ద్వేషమయిపోయానంతే!
అందుకే నా పాటను జీవితానికి మరచిపోయిన ఓటుగా చూపాను
నా గొంతును నీ పిలుపుకోసం మిగిల్చిన వీణగా మార్చుకుంటాను

ఓ నేస్తం! నన్ను నేనే మరల్చుకునే క్షణాలకు వారసురాలిగా
నాకు నేనే నీకోసం వేచివుండే చకోరిలాగా
జీవన్మరణాల చక్రంలో కనిపించే వాస్తవాల రూపంలాగా
వ్యవస్థకాదు వ్యర్థం కాదు ఏకంగా నేను నీ రూపానికి ప్రత్యక్ష సాక్షిని

అని చెప్పే ఈ ప్రకృతి ఒక భాండాగారం!
ఒకానొక భయానక స్వప్నానికి కారణం నీ వైపరీత్యమే
ప్రాకృతిక సౌందర్యాల మధ్య వినిపించే నీ గానం
తలలు వంచుకుని నీకోసం ఎదురుచూసే సుందర వనం!

దశ ఏదయితేనేం? మస్తిష్కంపై కదిలే రూపాలన్నీ నీ అనుచరులే
మరచిపోకు నేల కంటకుండా వచ్చే నీలిమబ్బులు వట్టి ఆకారాలే!
ప్రదర్శనశాల ఏదయినా సరే నిన్ను నిన్నుగా కొలిచే సాధనాలే
ఎండిన గుండెకు తడిని చేర్చి పలకరించే తీరు తప్పని కంటకాలే!

నిజమే! కోటాను కోట్ల జనాభాకు ఆహారాన్ని అందించేది భూమి!
నీటిని అందించేది కూడా భూమి!
అలాగని గాలి లేదని, నిప్పు లేదని అనుకుని వదిలేస్తామా?
కోపంతో చిందులేస్తే సూర్యబింబం తాలూకు పాఠాలను మరచిపోగలమా?

దారిలో కనిపించే శిల మైలురాయి కావచ్చు ఆయుధం కావచ్చు
వెనుక అనుసరించే నీడ నీదే కావచ్చు లేక నాదయినా కావచ్చు!
అంతెందుకు? మనిషన్నాక గానం మానలేము
పూలగానం కావచ్చు లేక అగ్నిగానం కావచ్చు

మానవతాగంధంతో గానాలను అనుసరించే పోవచ్చు!
ప్రస్తుతానికి సెలవు అంటున్న వన్నింటినీ వెళ్లనిద్దాం! లక్ష్యానికే వదిలేద్దాం!
అసహనంగా ఉంటే తలలను దాటి చరిత్రలో ఎన్నో పుటలు
ఎత్తిన ముఖాల్ని దించేటంత వెలుగు వాటిలో లేవు!

ఎక్కడికని పరుగులు తీస్తారు? ఎంతకాలమని ఉరుకులు పెడతారు?
మనిషికి మనిషి కనబడటం లేదట! ప్రకృతికి విన్నవిద్దాం!
సరే! ఆ సంగతులన్నీ అలా పక్కకు పెడదాం!
ఇంతకీ నువ్వు నిద్రలేచేది రాత్రా పగలా? అలోచించు

మనం ఏమి మాట్లాడుకున్నా ఆకాశం వింటూనే ఉంటుంది
నువ్వేమాత్రం దుఃఖించినా నేలతల్లి తడుస్తూనే ఉంటుంది!
కాదనడానికి, లేదనడానికి పక్కన ఎవరైనా ఉంటేగా
ముఖాన్ని కాల్చడానికి , చుబుకాన్ని ఎత్తి పలకరించడానికి?

కళల మార్పుతో అలలా ఉన్నాను ఇపుడు పెరుగుతున్న కొద్దీ. మరీనూ!
అసలీ జీవితం అనేదే స్వప్నం నుండి మొదలైంది
భయానక దృశ్యాలు, ఉలిక్కిపడే సంఘటనలు రెండూ
నా పుట్టినింటి ఖజానాలో దాచుకున్న నగలు

ఇక అవమానాలు, అనుమానాలు మాత్రం ఖచ్చితంగా అత్తోరివే!
చిక్కల్లా ఇక్కడే నేను ఆ స్థానమాక్రమించి నీ గురించి తలిచి
వాస్తవమైన అభూత కల్పనలకు స్వస్తి పలికేసి
కొండలని, గుండెలని కొత్త కొత్త పదాలు పలికించి

నా మెదడు మొత్తం కంప్యూటర్ యంత్ర భాగాలు అయ్యింది
ఇప్పుడు ఒక్కొక్కటిగా విరిచేసి, విడదీసి
కంటికి కనిపించే రమణీయ సంస్కార రూపాలకు హారతి ఇచ్చి
భౌతిక శక్తి అని, అభౌతికమని చెప్పి చెప్పి

పరిశోధకులందరూ నన్నే చెట్టు వేర్లను గమనించమన్నారు మరి!
ఏంటో ఇప్పటికిప్పుడే అన్నీ అర్థమయిపోతున్నాయిలా ఉంది
చలికి బిగుసుకు పోయిన మంచులా హృదయం ఊగిసలాట
గగనం గంగవెర్రులెత్తి పాలిపోయినట్లుగా ఉన్న దోబూచులాట

ఇదంతా కాలం సృష్టించుకున్న ఊహాచిత్రపు శకలాలు మాత్రమే!
ప్రకృతికి వ్యాపారం తెలియదు
లేకుంటే వాన రాగానే నీరు, ఎండరాగానే ఎండ
చలి రాగానే చలిని దాచుకుని కిలోలెక్కన అమ్మేది.

వసంతాన్ని, శిశిరాన్ని తనలో దాచేసుకుని బ్లాకులో అమ్మకాలు పెంచేది
సూర్యుని స్థానానికి పోటీ చేయడానికి ఎలక్షన్లు లేవు
చంద్రుని స్థానం ఏకంగా మనిషి హృదయంలోనే గెలిచుకుంది
ఒక తారలా? తళతళలాడే కన్యల్లా తమలో తాము ఊసులాడుకుంటున్నాయి

గాలికందుకే రుసరుసలు! నీటికందుకే చిరుబురులు!
మట్టి అనేది భూమికే సంబంధించింది అనుకోవద్దు
మట్టి జీవన కేతనం. మానవారంభ తుది పరిమళం!

ఎడారి ప్రపంచంలో ఉండే ఇసుక మది గదుల నిండా నింపితే

ఒకానొక శీతల ఓదార్పు పల్లవిస్తూనే ఉంటుంది
అనుకుంటాం కానీ అనేకానేక ముసుగుల దోపిడీ బతుకు
అవన్నింటిని తప్పించుకుని ప్రాకృతిక సౌందర్యంలా
వేల వేల టన్నుల మట్టిని మోసుకుంటూ దింపుకుంటూ

ఏ తరానికి గాలం వేయాలో ఏ తరానికి పిలుపునందివ్వాలో కదా?
బాల్యంలో మట్టిపై మమకారం మకారమే!
గుడులు కట్టి, కూచుకు చుకు పుల్లలో పుల్లలను దాచిపెట్టి
కొత్తవైనా పాతవైనా మట్టిని అంటించి

పదే పదే పాఠాలను వల్లెవేసే ఒక లయాత్మక స్వరంలో ఉన్నాను
కొమ్మలమీదికి ఎక్కినపుడు హిమాలయం ఎక్కినంత ఆనందం
గోడలమీది కెక్కినపుడు చరిత్ర కెక్కినంత
గుండెలెక్కినపుడు విశ్వాన్ని అధిరోహించినంత

మేడలెక్కినపుడు ప్రయోజకత్వ సాధించినంత!
ప్రేమ ఒక అపురూపం అంటే నిజమే నేనొప్పుకుంటాను
అయితే అవి ముక్కలు ఎందుకవుతున్నాయి?
ఒక గుండెను ఎన్ని తునకలు చేస్తాము?

అందుకే ఒకేసారి అందించాలని ఒకరికే అందించాలని..!
బడి ఉన్నట్లుండి మన ఒడిలోకి చేరితే
లెక్కకు మించిన చిరునగవులన్నీ గుండెలోనుంచి చిప్పిల్లితే
మరికొన్ని చిరు మొలఃజిలు మందిరాలై ఆక్రమిస్తాయి

పాఠాలు చెప్పే వాచకాలు లయాత్మకంగా చిందులేస్తాయి
జ్ఞాపకాలన్నీ చిన్నతనమైతే గుంజిళ్లు తీస్తాయి
యౌవనమైతే రమణీయమైన సొగసులను
ఒలకపోస్తూ ప్రాణం పోసుకుంటాయి

ఆ దశల్ని పాలించేవయితే దోసిలిపట్టి ప్రాణం పోసుకుంటాయి
నాకు తెలిసి ప్రకృతికి మించిన పాఠంలేదు
నాకు తెలియకుండా ప్రేమను మించిన అనుభవంలేదు
తెలిసీ తెలియకుండా ఎదురొచ్చే అనురాగం ఉండదు

యుగయుగాల సంస్కృతిని అనుసరించి మానవీయం ఇగిరిపోతుంది
కన్నీరు వస్తోంది బిందెలతో పట్టుకోండి!
కొన్ని భూమి పొదుపు చేసుకున్నవట! మరికొన్ని ఎక్కడో దాచుకున్నవట
ఎండిన కొమ్మలూ, బిరుసుబారిన కేసాలక్లేశాలు

మొద్దుబారిన చెట్లు మరో జన్మకోసం ఎదురుచూస్తున్నాయట
వర్షం ఆలస్యంగా వచ్చినా ఇంట్లోని గంగ నీరు అయిపోతోంది అనడానికి దారిలేదు

గంగ కేరింతల ఉద్విగ్నభరిత వాతావరణానికి మించిన ఆనందంలేదు
ఉత్తేజాన్ని అంత్యాక్షరిగా ఆడుకుందామనే ఆశలేదు

నాదీ చరిత్రే! కాదన్నదెవ్వరు?
కష్టపడుతున్నవారిని ఎవరు మెచ్చుకోవాలి?
ఎంతమందినని భుజస్కందాలపై నిత్యం భరించాలి?
అడవి జీవితం అగాధం లాంటిది

కేరింతలతో ప్రారంభమైన పాట వదిలిపెట్టి వదిలి వెళ్ళేంతదాకా
సప్త స్వరాల శీర్షం దాకా ప్రయాణం చేస్తూనే ఉంటుంది
ఆడపిల్ల జీవితానికి స్మృతిపథాల దిక్కుగా ప్రయాణిస్తుంది
వీధి గుమ్మంలో కనిపించే ఒక్కో వృక్షరాజం

నాయనమ్మ చేతికర్ర ముందు దిగదుడుపే సందేహంలేదు
గతం వర్తమాలు చిందులేలిన పిచ్చివాని ధోరణులు మారలేదు
ఎడారి ప్రపంచంలో బతుకుతున్న ఆడవి జీవితాలలో మార్పులేదు
వర్షం ఎప్పుడొచ్చినా పర్వాలేదు మార్పులేదు

అవని గుండెపై గంగ దుమికినా భయంలేదు
పారే నీరు, కదిలించే గాలి అన్నింటికి సమయవ్యూహం ఉండాలి
పసివాడు వేసిన వర్ణచిత్రమే అయినా వివేకం ఉండితీరాలి
ఎంతగా ఎన్నివిధాలుగా నీరు అల్లరి, కోపం ప్రదర్శించినా

దాహంతీరే మర్గం, తీర్చుకునే మార్గంలో ముందే ఉండాలి
యుద్ధాలన్నీ నీటికోసమే అంటుంటే ఏకంగా యుద్ధమే రావాలి
అవని దాహంతో తిరగడానికి ముందు ఆకాశం ఉండాలి
ఒక్కటా రెండా? అనేకానేక శబ్దించే శరీర యంత్రాల నడుమ

ముగ్ధ మనోహరంగా సాగిపోతున్న కాలానికి కత్తెర్లు వేస్తూ
సౌందర్య పరిమళాలు వీచే గాలుల మధ్య జరిగేది సంరంభమే కాదు
ఆరంభం కూడా! గాలిలో సాగిపోయే ఊహలు, ఊసులు కూడా!
మనసున ఉన్న అంతరా◌ౌ పొరల్లో అర్ధవంతమైన జీవన వ్యూహం

నవనవోన్మేష జీవనాకృతి పాదుకలన్నీ ఒకచోట చేర్చిన వైనం
గంపగుత్తకు మాట్లాడుకున్న వెలుగు కత్తులు గుండెపై తళతళలాడుతూ
కలలు కన్న ఎన్నోరాత్రులు పాడిన గీతాలలో అర్ధాలు కనుగొన్న తీరం
ఉండు ఉండు నేను ఇంకా చెప్పాలి!

నా మౌన యానంలో నదీ సముద్రము రెండూ విలీనమయ్యాయి.
నా సునిశిత వాక్యా◌ౌలో గుండె మెదడు రెండూ సంలీనమయ్యాయి
ఆకుపచ్చని సుందర స్వప్నాల కేరింతల నడుమ ఉప్పునీటి గాలి!
ఆకాశం గుండా చూస్తే కనిపించే మొలకనవ్వుల వెలుగు

పంటపొలాలపై పడి మట్టి పొరలను ఆనుకుని

లోలోతులను గమనిస్తూ ప్రవహిస్తూ తడిగా వడిగా విడిగా
చెమ్మగిల్లే సూర్యకిరణాల్ని సవరించుకుంటున్నది ఉభయసంధ్య!
నదీనదాల మెరుపుల అద్దంలోసూర్యకిరణాలు చిప్పిల్లినా లేకున్నా

జీవితాన్ని కాపలా కాస్తున్నట్లుగా అభినయించిన
ప్రతిబింబం నీటిలో లేదు నీలో లేదు రెండూ నిశ్చలంగా ఉన్నాయి!
ఆ రెండు లేతకళ్ళ పాదాల ముంగిట
అలలు ఎగసిపడే దృశ్యాలు ఎన్నని ఒకటా రెండా ఏకంగా వేలకువేలు!

లయబద్ధమైన నీటి ఘోషల ఉద్వేగమండలం నా గుండెలామారి
పగటి నక్షత్రాలు దాక్కుని మరీ సంభాషించుకుంటాయి!
అంతకోపమేమిటి  ఆ కెరటాలకు
హోరుహోరుమని శబ్ధాన్ని వినిపిస్తూ కూడా

అలసిన పడవల్ని దాహాల గొంతుల్ని ఒకచోట చేర్చి
కరచాలనం చేస్తూ దోసిలి పట్టి మరీ ముచ్చటలు చెప్పుకుంటాయి
దిక్కులన్నీ నృత్యభంగిమల్లో నిలబడి తమ ప్రతిబింబాలు
నీటిలో కొట్టుకుపోకుండా విజయ తిలకం దిద్దుకుంటాయి

ఎసరంటే ఉడికిన అన్నం మీదే కాదు
ప్రకృతిలో కూడా పండువెన్నెల ఎసరు పెడుతుంది
తాకిడి దేహాలకు తప్ప దేశాలకు అర్థం కాదు
అప్పుడప్పుడు గోదావరి నీటిని ముంచే రాగాల వసంతం అవుతుంది

వర్షపు చినుకులు ఒక్కోసారి కాదు అనేకసార్లు మాయచేస్తాయి
తాను అలుముకుని మరొకరికి కనిపించకుండా కన్నామూచీ ఆడతాయి
శ్వాస దిగ్బంధన అయినపుడు జలసంబరాల నడుమ దేహం గని అవుతుంది
రక్తంలో కలిసిన దేహాంతర్భాగపు చలనాతిచలనం పులకితమవుతుంది

శిశిరమా! శిశిరమా!
నీ సౌందర్యాన్ని ప్రకృతికి కనిపించకుండా
నిత్యవసంతాల పచ్చతోరణంలా
జలతారు పాయల్లా నా ఇంటిముందు కనిపించవా? అన్నాను

కాదంది! మరోసారి ఔనంది!
గుండెల్ని మండిరచే నీటితోరణాల పచ్చని వసంతం
జలతారు ఞజినురెప్పల్లో స్ఫటిక మానవ బింబంతో
తరలిపోయే కవితా ప్రపంచానికి తిరిగివచ్చేదంటూ లేదు

నాకు ఆరోజు ఇంకా జ్ఞాపకం ఉంది
ఇంటిముందు మేకల్ని తోలేవాళ్లూ!
బాతుల్ని తోలేవాళ్ళు అందరూ కలగలిపి ఆకాశంలో వికాశాలయిన వైనం
కానీ నాకు అవేవీ చేతికి చిక్కలేదనేదే నేను మరవలేని బాల్యం!

నేనెవరో తెలియని క్షణం నుండి నాకు పక్షులు తెలుసు
నేనెందుకు పుట్టానో తెలియనప్పటి నుండి ఆకాశం భూమి తేడా తెలుసు
''నాతి చరామి' కి అర్థం తెలియకుండానే తల్లినయ్యాను
అర్థాంగి అంటే అర్థం తెలిసిన క్షణం నుండి ఒంటరినయ్యాను

అప్పట్లోనే ఇంటిముందు వీధిదీపాలు వెలుగుతూ ఉండేవి
ఆ వెలుగులో  ఇసుక తిన్నెలూ ఉండేవి
నేను ఇసకకేసి నడిచానో లేదో బలంగా రెండు చేతులు లోనికి లాక్కెళ్ళి
చెంప ఎర్రబార్చేది. అయినా ఇసక వారినేం చేసిందో కదా ?

'' ఒక భావుకుడైన మనస్విని
నిత్యాంతర్ముఖుడైన మనిషిని
అనంత ఊహావైశాల్యం గల కవిని
అనవసరమైన ఊహల్ని అక్షరాలుగా మార్చని సోమరిని

అంటూనే ఇదే కవి '' కవిని
విరుల తోటలో మనస్సు మండిన ఆవిరిని! '' అంటారు
అలాంటివి చదివినపుడే అనిపిస్తుంది
చిద్రమైన మనసు ముక్కల మీద అక్షరపు మంచు కురుస్తున్నట్లు

గడ్డివాము పగుళ్ల నుండి కనక వర్షంలా కవిత్వం కనబడుతున్నట్లు
నేను నడుస్తుంటే నా వెంట పదాల పారదర్శకత తరుముతున్నటు
కవిత్వమంటే కొన్ని అక్షరాల సముదాయం కాదు
భగభగ మండే భావాల అంతర్లీన ఘోష!

ఇక మారదనుకున్న సమాజంపై పద పదం ఒక బుస!
మసకనీడల్లో దాగున్న మానవ చరిత్రను ఎత్తిచూపే అంతర్లీనమైన శ్వాస!
ప్రకృతిలో ఎంత అందమైన సెలయేళ్ళు పారుతుంటాయో
పక్కనే నక్కలూ, తోడేళ్ళూ నడుస్తుంటాయి

ఆ పక్కనే కొత్త కొత్త కోరలతో కత్తులు పొంచిఉంటాయి
వేరుకుంపట్ల సెగ తాలూకు నేతిగిన్నెలూ కాపలా ఉంటాయి
ఎవరన్నారండీ? ఆకాశంలో సగం భూమిలో సగమని?
ఆకాశమే సగమైనపుడు అందులో సగం ఇంకెక్కడుందని?

అంతా నేల , మట్టి శాశ్వతమయినపుడు ఇక్కడ ఆకాశం గోలయేమిటి?
అంతా దొరకని దొంగల వేలిముద్రల భాషని ప్రకృతికి తెలుసు!
అపుడే పుట్టిన లేగదూడ కాస్సేపు తానెక్కడున్నానో తెలియక
తికమక పడి కిందపడుతుంది కానీ మళ్ళీకాస్సేపట్లో లేవదూ!

యేనుగు అనుకుంటామే కానీ అదీ అంతే
అంతా ఆరాటమే! అన్నింటా ఏదో కావాలని పోరాటమే!
ప్రకృతికి మరణం లేదు
విలయతాండవం చేసినా మేఘమే ఘర్జించినా

అనుకున్న నగిషీలు నేలకొరుగుతాయే తప్ప ప్రకృతి చెక్కుచెదరదు.
రాత్రి ఘోరం జరిగినా సూర్యుడు సెలవు పెట్టడు!
అందుకే ప్రకృతిలో ఏది నాశనం చేసినా మళ్ళీ మళ్ళీ పుడుతుంది
మానవ జీవితంలో ఏది స్పృశించినా ఇక పుట్టడానికంటూ ఏమీ ఉండదు

నిజం ఖడ్గం లాంటిది. దాని నైజం నరుక్కుంటూ పోవడమే!
భేషజం కరచాలనం లాంటిది. ఆ పట్టులోనే నీ నైజం చెప్పేయడమే!
అమ్మ! నాన్న! అక్క! చెల్లి! అన్న! తమ్ముడు ! ఒక పర్వంలో పావులు
అత్త! మామ! భార్య! భర్త !పిల్లలు! రెండో పర్వపు పల్లవులు

స్నేహం! ప్రేమ! గురుత్వం! బంధుత్వం! వాడుకరిలో చర్చలు
ఎవరైనా ఏదయినా నడిపించేది రెండుకాళ్ళే! తినిపించేది ఒక్క చెయ్యే! మరవకు!
చిక్కని వెన్నెలలో ఒక పలచటి దుప్పటి పరుచుకుని
చేతిలో కాగితం మరో చేతిలో కలం ఉంచుకుంటే తోడెవరు కావాలి?

భావాలు చాలవూ? అనుభవాలు చాలవూ?
ఇంకా ఒంటరినని అనుకుంటున్న కవి కవి ఎలా అవుతాడు?
పట్టుచీర, తలలో పూలు, చేతినిండా గాజులు
నునుపైన చెక్కిళ్ళు లతో సుతిమెత్తగా నడుస్తుంటే

చూపుల్ని కాజేసే కలం మెల్లగా తన భావాల్ని తలగడ కిందకు చేర్చితే
ఖచ్చితంగా నిద్రను తాకట్టు పెట్టి కలల్ని బేరం పెట్టాల్సిందే!
రాలిపోతున్న జుత్తును మరింత కత్తిరించి
నిలబడి ఉంటే దాన్ని లుంగలు చుట్టించి

ముఖంపై పడేలా చేసిన కనుగుడ్లకు ఒక వారధి కట్టి
మూగ పాటలు పాడుకుంటుంటే ముంగిళ్లు బింబాలై ప్రశ్నిస్తాయి
ఇపుడు నిజంగా నేను నాలోకాన్ని ప్రశ్నించుకుంటున్నాను
కోట్లాది చూపుల మధ్య శైలీ పునాదుల్ని వెదుక్కుంటున్నాను
సముత్తుంగ శిఖరాలమధ్య నిలుచున్న మొక్కలకు వేరై ప్రశ్నించుకుంటున్నాను
యుద్ధమైనా, నిర్యుద్ధమైనా ఏదయినా నియంత్రించడానికే అని
తెలుసుకుంటున్నాను
రెపరెపలాడే కాగితానికి ఎగిరిపోకుండా పెట్టే బరువు అక్షరం.
భావాలన్నీ ఏ గాలికీ కొట్టుకుపోకుండా పెట్టే బరువు వస్తుసముదాయం

పదశైలి తలవంచుకుని మనతో ఉండాలంటే కాపాడేది అభివ్యక్తీకరణ
అన్నీ కలగలిపిన వచన కవిత నిలువెత్తై నిలిపేది వాస్తవ చిత్రీకరణం!
ఋతువులు మారుతుంటాయి
వరుసగా ఒడిపోతున్నట్లున్న ఆకుపచ్చని తివాచీలు

అసహనపు నమ్మకాలతో జతకూడినపుడు కలిగే భావాల్ని
ఆశల నిచ్చెనలెక్కి ఒక్కమారుగా కిందకు దూకుతుంటాయి
మట్టి నన్ను అంటుకున్న నేస్తం!

నాకొద్దు అనుకుంటే వేషభాషలు లేవు నీకు ఫో! అన్నపుడు

నా తడికళ్ళను ఆకాశానికి పంపిస్తాను
నాకే పసిడి ముద్దలు అక్కర్లేదు నీ పాదధూళి చాలు అంటాను
కాకుంటే ఏమిటి?
నేనేమో తుఫాను కొట్టుకుపోతున్న చెత్త సంచీని.

వరద తాకిడికి బురదలో చిక్కుకుపోయాను
విధ్వంసానంతర పునర్నిర్మాణం తలకు వేసుకుంటాను!
అక్షరాన్ని నిజంగా నమ్ముకుంటే చెడిపోయినవారు లేరు!
ఆకర్షణలు వికర్షణలను దాటి జీవితానికి అడ్డుపడినపుడే

అంతులేని భావోద్వేగం వృధాఅయిపోతుంది కానీ
అక్షరాలకు అందదు. కనిపించే కారుణ్యం కూడా ఉండదు
ఇపుడొక ఓదార్పు పదం నాకు వినిపిస్తోంది
పలకరిస్తున్నా పలకని హృదయం కనిపిస్తోంది
ఏది నిజం? పదవా? దానిని ఆనుకున్న మనిషా?
తలుపులు ప్రత్యేకంగా ఉంటే మనిషి ఉండడనుకుంటాను!
మొక్క నవ్వుతూ నెత్తి బాదుకుంటోంది!
పిచ్చిదానా? సృష్టి వట్టి పేరు మేరకే !

ఎవరికి కావాలి నీ సృష్టి, పరివృష్టి మాటలు?
నాతో మాట్లాడుతూ ఉన్నట్లుండి మానవాధములను తలుస్తావెందుకు అని!
అహంకారం ఎత్తునుండి కిందికి పారే ఒక పసరు సొగసు
దిగువ నుండి పైపైకి ఎగబాకే నీరు ఒక అనవసర దినుసు

కరువుకు కడుపుకు చాలా దగ్గర అనుబంధం ఉంది
జీవనదీ మంత్రజలాల్ని వాటాలుచేసి పంచుకునే ఆనందం ఉంది!
నిర్గమ దారుల్లో కనిపించే సొగసులన్నీ నావీ కావు నీవీ కావు!
ఎండిపోయిన డొక్కల్లో కనిపించే శిలాఖండాలన్నీ సిగ్గుమాలిన చరిత్రలు!

ఎంత బతిమలాడినా మేఘాలు వరాలివ్వవు
ఎంతగా పాదాక్రాంతమయినా నేల పగుళ్ళు శాశ్వతం కాదు!
సాయంత్రం! చల్లని గాలి! ఒకచెట్టుతో మరో చెట్టు మాట్లాడుతోంది
మనకింద కూర్చున్న ప్రేమికులు ప్రేమికులేనా? అని!

తేరిపారి చూసిన రావి చెట్టు ఏమో వీరయితే నన్ను చుట్టలేదు
అందుకని వీరు ఎప్పటికీ ప్రేమికులు కాలేరు అంది!
అయితే స్వార్థం? కదా? చుడితేనే ప్రేమంట! అని!
ఇక్కడ మరో అర్థం ఉంది సమయాన్ని సృజించాలని!

కాలాన్ని కాదని ఏ ప్రేమ గెలిచి తీరలేదని
లాభనష్టాల బేరీజుల మధ్య మొదటి కవి సంతకం చూసి తీరాలని!
పచ్చని నేల ముత్తయిదువలా తయారైంది

ఇక విత్తనాల్ని చల్లడమే తరువాయి. బిడ్డలు కలగడానికి
గద్దలు తన్నుకుపోతున్నట్లు వర్షం, గ్రీష్మమో ఎత్తుకుంటుంటే
తండ్రిగా నీ మాట ఆత్మశాసనమా? మరణవాగ్మూలమా? తెలియకుంది!
ఒక ప్రకటన! ఒకరి ఆక్రందన! ఒకరి ఆవేదన!
మరొకరికి జీవనాధారమయిదే ఇక చేయగలిగినదేముంది?

పాప పరిహార పత్రాలపై ఎవరు చేవ్రాలు చేసినా ఫలితం ఏముంది?
నిర్దయ, నిర్లజ్జ దారుల మధ్య పూచే పూలు పూలు కాపపోతాయా చెప్పండి?
గాలి మనిషికే గానీ మట్టికి కాదు
మనుషులు ఊరేగింపులకు పనికొస్తారు

గాలి మాత్రం వాటిని దాటుకుని అనంతవాహినిలోకి ప్రయాణిస్తుంది
దేనికైనా ఎపుడైనా ఎక్కడైనా తలవంచాల్సింది ఒక్క నేలలోనే!
చీలికలు వాతావరణంలోనే కాదు
మనుషుల మధ్య మరీ ఎక్కువ

మబ్బుల పరదాల్లో సూర్యుడిని దాచడానికి ఎక్కడని పెట్టాలి?
ఆటల్లా సాగిపోయే పయనానికి అక్షరాలు అద్దాలంటే  నిశ్శబ్దం అవసరం!
ఇపుడు చెప్పండి! సమస్త భూవలయంలో మనుషుల శాతమెంత?
లోలోతుల్లోని గాయాల్ని తడుముకొని తడుముకొని

నేల వొడిలో మనసును భద్రపరిచేవారు నిత్యం మట్టి ప్రమిదల్లో
వెలుగుతాడు. మట్టిలో మాణిక్యంలా మిగిలిపోతాడు.
కూర్చున్న కుర్చీలో ఒక బంగారు నాణెం ఉంచండి
పక్కగా మీరు సాధారణంగా నిలబడండి

అపుడు తెలుస్తుంది మీరిస్తున్న గౌరవం ఖచ్చితంగా బంగారానికి అని
కుర్చీలో ఏమీ లేకుంటే లాగి కూర్చునేవారు కదా?
అందుకే సొరుగుల్లో ఉన్న మానవత్వాన్ని బయటకు తీయండి
ఒకానొక సామూహిక వ్యధకో ఆనందానికో వాడేయకండి
పసిడి అంటే అలంకరణ అనుకుంటారు చాలామంది
కాదు కానే కాదు పసిడి అంటే స్వచ్ఛమైన చిరునవ్వు!
తొలకరి చినుకుకు నేల తల్లి కిలకిలా నవ్వుతుంది కానీ
కుంభవృష్టికి భయపడి ముడుచుకుపోతుంది

లయను అనుభవిస్తూ చెట్టు చీరకొంగై కాపలా కాసినా
శ్రమ గంధాన్ని పూసుకుని విశ్రాంతి కోరుకుంటుంది
కొన్ని చెమట చుక్కలు
మరికొన్ని మాట ముత్యాలు

ఎపుడైతే నేల రాలుతాయో
అపుడే నదీ మాత ఆశీస్సులు అందుకుంటుంది
ఇపుడిపుడే తూర్పుగడియలు తెరుచుకుంటున్నాయి
సూర్యుడు కొండవెనుక దాగి దోబూచులాడుతున్నాడు

పెగిలిన కలల వాకిళ్ళ ముందు ముగ్గుల్లా
మరో జీవితానికి జీవం పోసుకుంది!
అపరిచితమైన గుమ్మాలన్నీ ఏటవాలుగా నిలుచున్నపుడు
అవసరపు మెడ ముందుకు సాగి గులాబీ రేకు పెదాల్ని

ఇంద్రచాప వర్ణాలతో పోల్చి శూన్యాన్ని సమీకరిస్తుంది
నాదలహరి వలె ముసి ముసి నవ్వుల్ని అరువు తెచ్చుకుంటుంది!
దోసెడు మట్టి చౌదా తంతు పూర్తి చేయడానికి!
రెండు పిడికిళ్ల మట్టి చాలు మొక్కను బతికించడానికి

ఇద్దరికీ నేల ఒక్కటే ఒకటి బతికిస్తే
మరొకరు వీడ్కోలు చెబుతారంతే!
దివినుండి భువికి దూకుతున్న కాంతి తెగ అల్లరి చేస్తుంది
నవ్వుతుంది! పరుగులు తీస్తుంది చివరకు
ఊయలూగి ఊగి ఉసూరుమంటూ చతికిలపడుతుంది
ఇక నిద్రతో సాయంత్రం కోసం వీక్షించి శైల శిఖరం వెనుకగా దాక్కుంటుంది
మామూలుగా జీవించే నేను ఒక శిలను చూసి నిలుచున్నాను
నా మనసుకు చాలా దగ్గరగా కనిపిస్తోంది.

కిటికీ సాయపడుతోంది కానీ తలుపు వద్దంటోంది
నిజమే! శిలలు కదలవు. ఇంట్లో ఇమడవు అర్థమయ్యింది!
సృజనాత్మకంగా సాగుతున్న పిల్లగాలికి ఒక చిలిపి ఆలోచన
రాగద్వేషాలెరుగని నేను నా ఆకృతి గురించి ఎందుకు ఆలోచించలేదని?

ఇక ప్రార్థన మొదలైంది! చెట్టును మొక్కింది! పుట్టకు సేవలు చేసింది
మెరుపు గమనించి ఆకృతి ఎందుకు? శూన్యంలోనే ఆనందాకృతి ఉందిగా అంది!
కరువు తీరా పరికించే దిశగా గాలి ఆలోచించింది
ఆనందం అంతా నాకేనా అని మురిసి మురిసి పరుగులు దీసింది

శూన్యం స్పర్శతో తయారైన నాకెందుకీ ఆకృతి
అనుకుంటూ కాలరథాన్ని ఎక్కింది ప్రేమగా మారింది!
ముఖమంటే నిత్యం అలంకరించుకోవాలి!
నిశీధిలో ఆప్తుల్లా తిరుగాడుతున్న తనకు చెట్టు సాక్ష్యం!

రెండు చేతులు చాచి తన గుండెలకు హత్తుకుంటున్న మనోముద్రల ముందు
నీవెంత?్వ నీ ఉనికెంత? నీ ఆచూకి ఎంత ? నీ ఆలోచనెంత? చెప్పు!
ప్రపంచంలో ఒక దేశం, ఒక దేశంలో ఒక ప్రాంతం
ఒక ప్రాంతంలో ఒక ఊరు, ఆ ఊరులో ఒక చౌరస్తా

ఆ చౌరస్తాలో ఒక సందు. సందులో ఇల్లు
ఇంటిలో నేను ఉంటున్నపుడు నేనెప్పుడు ప్రపంచాన్ని చేరుకోవాలి?
అందుకే నాకు ప్రపంచమయిన కవిత్వాన్ని చేరుకున్నాను
బాహ్యాంతరాల అజాగ్రత్తల ముందు కడు హీనంగా

దాచుకోలేని అశక్తత ఆధీనంలోకి తెచ్చుకుంటుంది
విత్తనం ఎరగా వేసినట్లే నా హృదయానికి అక్షరం ఎర వేస్తే ఇంకేం కావాలి?
అణువులన్నీ ఒకచోట చేరి అక్షరాలుగా మారితే
అంతకు మించిన సమకాలీన ఒత్తిడులు

ముక్తసరి యాంత్రిక వేగం సామజిక పరిస్థితులతో జతపడి
అంతకు మించిన సప్తవర్ణాలను ఉంగరాలుగా ధరించింది!
కాలం నడుస్తోంది ఎవరినీ ఏమీ ఆశించకుండా!
కాలం నిష్క్రమిస్తుంది ఎవరికోసం ఎదురుచూడకుండా!

మనిషి భౌతికమైన పొరలను కరగదీసే మనోవేదన
నింగిని తలపిస్తే అర్ధంకాని మనస్సు సరస్సులోకి దూకుతుంది.
పుష్పాలు వికసించడం, కొత్తమొలకలు మొలకెత్తడం
పరిమళాలను పలకరించడం ప్రకృతి పవరశించడం లాంటివి

జీవన యానంలో గతి తప్పకుండా ఉండేందుకు వారధులు కడతాయి
ఒక్కసారి తెగితే అయ్యో అన్న పలుకుల ఆర్తనాదాలు వినిపిస్తాయి
ఒక్కసారి అనిపిస్తుంది
ఈ పచ్చని నేలంతా పట్టు తివాచీలా ఉందని!

రాలిన మంచు తాలూకు ముత్యాలు కనబడనీయకుండా దాచేసి
గతాన్ని ఆయుధంలా ఉపయోగించే క్రియాపదాల్ని వినిపిస్తుంది
గుడిసెలకు కూడా శిశిర దృశ్యాలు కనిపిస్తాయి
వసంతం శిశిరం లేని చోటు ఏమీ ఉండదని నిరూపిస్తాయి

వాయుశక్తి లేనిదే కదలని పిల్లనగ్రోవిలా కాంతి శిఖరాలను తాకుతాయి
గుప్తంగా కొందరు వీధిలో విస్ఫోటనా యంత్రాలుగా మిగిలిపోతారు
ఎంత పరిచయం ఉన్నా వీధులు మన సొంతం కాలేవు
పగలు చూసినా రాత్రి చూసినా వెలుగుకి సమాప్తి కాదు

కిర్మీరంలో ప్రతి వర్ణం ఎరుపుగానే కనిపిస్తుంది
సమాజంలో వర్ణప్రమేయంలేని జీవితానికి ఒక రూపమిస్తుంది.
పట్టుబడటం అనేది వ్యక్తి భాషే కాదు కాలానిది కూడా!
సాక్ష్యం చెప్పాలని ఒక్క మనిషే కాదు కాలం కూడా !

ఒక్కోరోజు ఒక్కో పేజీతో తొలగిపోతుందా అనేది లేదు
ఈ రోజుటి చరిత్ర ఎప్పటికో ముద్రించబడుతుందనే విషయంలో వాస్తవంలేదు!
ఎవరిని చూసినా రాలే ఆకులాంటి వణుకు ఎదురవుతుంది
జీవితంలో ఏది పోగొట్టుకున్నా చెట్టు సాంత్వన చేకూర్చుతుంది

విస్మరించడం అనేది శిలలకూ వర్తిస్తుంది
నిప్పుకణాలు నిద్రపోతున్నాయి అనడంలో నిజం తనను తాను కోల్పోతుంది
ఉదయం వాకిలి తెరవగానే మొదట వీధే పలకరిస్తుంది
యోగక్షేమాలకు బదులు తనని పలకరించమని చీపురు చూపుతుంది

ఎన్ని ఆజ్ఞలు జారీ చేసినా సరే రెండు ముఖాలకు మధ్య ఆకాశం ఎదురౌతుంది
వీధిలో ఒక పక్క వూదే నాదస్వరగీతంతో లేవలేని స్థితితో పాము పడిఉంటుంది.
ఆకులు రాలుతుంటే కొత్త చివుళ్ళకు ఆనందం!
ముఖంలో ఆకుపచ్చగా కళకళలాడుతూ

పయోదj్రైంం ప్రవాహానికి ఉత్సాహమైన శక్తిని అందిస్తూ
కధలు కథలుగా మనిషి గురించి గుసగుస లాడుకున్న నీడలు బొమ్మలయ్యాయి!
అద్భుతమైన చిత్రణలో జీవితం ఒకటి!
నవ్వుతుండాలి! కష్టాలను సుఖాలుగా మార్చుకోవాలి!

తప్పు ఎవరిదైనా మన తప్పు ఎంతుందో తరచి చూసుకోవాలి!
నీతివాక్యాల చిట్టాల సమాహారంలో అనుసరణ ఎంత? అనుకూలత ఎంత?
అనుకోకుండా మాటలమీద మాటలు కొడుతూ
అంటున్న ప్రతి మాట ప్రచ్ఛన్నంగానో పరోక్షంగానో

అనుభూతుల వలయంలోకి చేరి తేలి తేలి
అవేదనల జట్టులోకి చేరితే హద్దులు దాటుతాయి
చివరకు నీచూపు
నీ రూపు, గురి, వరి పండిరచినట్లుగా మారి

ప్రకరణ నినాద వాదాలుగా ఏమారి
అన్యాయమో లేక సమన్యాయమో ఏదో ఒకటిగా రూపు!
కళ్ళు తెరిచి చూస్తేనే కదా ప్రకృతి అందం కనిపించేది
ఉపన్యాసం లో ఉపవాసం ఉన్నవారిలా ఉంది నేటి స్థితి

అంతసంఘర్షణల నడుమ భావపరిణామ పోరాటాల గతి
శ్రేయోగతికి లక్ష్యమయ్యేనా విలయ తాండవ నీతి!
గతం ఒక విధంగా అద్భుతమైన అనుభవసారం!
భవిష్యత్తు వేల్లాడే నీడల్ని మోసుకుంటున్న సమయం!

వర్తమానం ప్రవాహానికి ఎదురీదే నీడబొమ్మల స్వైర్యవిహారం!
ఆలోచనా సంస్కారానికి పరివర్తన చెందే విలయశబ్దం!
రోజురోజుకు పెరుగుతున్న మనిషి జీవితం తరిగిపోవడానికే
జగతికోసం పరుగులు తీసే క్షణాలు చాలా కొన్ని ఊపిరిలో, ఆయువులో

అహంకార విస్ఫోటనంతో గడుసు దెయ్యాలు చోటుచేసుకుంటున్నా
అదే నీడలో మరో వృక్షానికి గానీ జీవానికి గానీ చోటివ్వని సాక్ష్యాలయ్యాయి.
నిజమే! ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే మిగిలిందేముంది?
ఒక్కసారి తరచి స్నేహితుల చిట్టా విప్పితే మిగిలినవారెందరు?

బతుకు బరువు! ఏ మనిషినీ మట్టికి చేర్చనిది. కానిదేముందని?
భగ్నం! ఉద్విగ్నం! శాంతి పథం నుండి ప్రగతి పథానికి కదలనిదేముంది?
మేఘానికి ఆకాశం చెబుతోంది కదా ప్రపంచం మాట వినొద్దని!

పైపైన చూసి లేనిపోని విషయాలను ప్రచారంచేసే ప్రపంచంవైపు చూడొద్దని!

నదీతీరాలు, రైలుపట్టాలు రెండూ ఒకటే అంటే ఎలా కుదురుతుంది
అవాంతరాలెన్ని ఎదురైనా అంతరాలు మారవనే విషయం ఎలా తెలుస్తుంది?
ఏకాలు కా కాలు, ఏ కీలుకాకీలు విడివడిపోతున్నా సరే
కాలం చప్పుడు రెండు ముళ్ళ సాక్షిగా వినిపించుకోవడంలేదు

విడివడేది వస్తువులే కాదు మనుషులయ్యేసరికి పట్టువదలలేదు
ప్రపంచ పటం నీటిమీద నల్లటి మేఘం లాంటిది వర్ణించక మానదు!
శూన్యంలో ఎక్కడో ఏ మూలో
ఏదయినా గెలిచి సాధించాలనుకుంటే సరిపోతుందా?

మానవ శరీరానికి జంతువుల మనసుంటే ఏమి మిగులుతుంది?
శతాబ్దాలు గడిచిన ఆధునికత ముసుగులో దాగున్నా మార్పు ఏముంది?
మిగిలింది ఒక్కటే నాకు నేనే.
ఊహలకు తావులేదు. భ్రమలకు భయంలేదు

చిలిపి గాలుల అల్లరికి వెసులుబాటు లేదు ఉండదు
అంతా తెలుసుకున్నాను. మనసులోనుంచి ఆలోచించడం మొదలుపెట్టాను
నా మాటను మాలగా వేసాను
నా ఆవేదనను దాటుకుని ఆవేశాన్ని గొంతువరకు నింపాను

కానీ ఏం చేయను? నేను వారి తయారీనని తలచుకుని
కొత్త పాత జీవితాల నడుమ బంధీగా చేసి బతుకుతున్నాను
సంవత్సరాలు ఎన్ని మారినా అందరికీ సమానమే!
పాత కొత్త లు మనుషులకే కానీ శ్వాసలకు కాదు

పగలులో కొన్ని దశాబ్దాలు, రాత్రిలో కొన్ని దశాబ్దాలు రెండూ కలగలిపి
సంపూర్ణమైనా సమభాగాలేవయినా సరే మరో జన్మకు కావు!
ఉదయపు చల్లగాలులు సాంత్వననిస్తాయి
అలాగని ఆరోజు పవిత్రమైన రోజుగా చెప్పలేము
గుడి ముంగిట నిలుచుని ప్రశ్నిస్తున్నామని
ఆ ప్రాంగణం అంతా ప్రాణీత రూపమై నిలుస్తుందని మాటివ్వలేము
అయినా ఊపిరి ఆడని చోటలో మనకేం పని?
వెలుగు ప్రసరించని చోటలో ఉండటం ఎందుకని?

గదికి నాలుగు గోడలున్నట్లే మనసుకు కూడా అనేక దిశలుంటాయి
దారి పక్కన కనిపించే సమాధిలో మాత్రం మనిషే ఉంటాడు
అల్లంత దూరం నుండి నడిచి వస్తున్నావు
ఒక్కదానివే వచ్చావు. ఒక సారే వచ్చావు.

అయితే వృద్ధాప్యంలో ఉన్న చెట్టులా నువ్వు నాకోసమే ఉన్నావు
అలాగని ఎవరూలేరని నువ్వు ఇపుడు ఈ సమయంలో అడవికి వెళ్లద్దు
వెన్నెలకు దారి అనంతం

అయినా ఒకవైపు  చీకటి పరుచుకుంటోంది

మనసు మౌన సముద్రంలో ఈదుతున్న వంతెన లాంటిది
వంతెనలో కూర్చుని ఈదడం కష్టం కానీ నావ ఏదీ?
నావికుడంటే సముద్రవాసి కాడు
బతుకు కొడిగడుతుంటే కనిపించే వెలుగుగని రూపం

దారులన్నీ ఒకటే చీలికలు ఒకటే మనసు మరుభూమి ఒకటే
అన్నీ ఒకే చోట కలగలిపే రూప గమనంలో మనసూ ఒకటే!
నిద్ర లేచీ లేవగానే పిలుపొచ్చింది
పక్షులన్నీ నేనంటే నేనని నేను మాత్రమే లేచానని గోలచేస్తున్నాయి

బిడ్డల్ని చెంత చేర్చుకుని జాగ్రత్తల వరుసను ఏకరువు పెడుతున్నా
అల్లరికి జారిపడిన పుల్లల ఏరికలో సాయంలో పిల్లలు కూడా!
కుర్చీ లాక్కుని కాస్తంత అలికిడి కాగానే పనులు మానేసి
కింద రాక్షసులు ఉన్నారు జాగ్రత్త అని చెప్పి మరీ తుర్రుమంటాయి
అణువంత అనుమానం కలిగినా సరే పర్వతమంత భయాన్ని నేర్పుతాయి
ఇల్లు పూచిక పుల్లలదే అయినా ఆలోచన ప్రపంచమంతా!
ఆటంకాలు కలిగే సమయంలో అవరోధాలు మింగేలా ప్రాణిజీవితం
ఆలోచనలు ఆచరణం కావచ్చు! లేక స్వప్నమై మిగలచ్చు!

ఎలా బతికినా సరిపోతుందిలే అనుకుంటే ఒరిగేది ఒక్కటే జీవితం
ఎలాగైనా బతకాలి అనుకుంటే మాత్రం మనకు దొరికేది జీవించడం!
గండ్రగొడ్డలికి పనిచెప్పిన మానవాధముడు
చేతులొకచోట, కాళ్లొకచోట నరికి నరికి వెళ్లిన తర్వాత

వృక్షం మరో వృక్షాన్ని అడిగింది బావున్నావా ? ప్రాణాపాయంలేదు కదాని!
ఏం చెప్పేది ? నా అంతట నేనే వచ్చానని చెప్పినా వినలేదు. బతికే ఉన్నాను అని!
నేనొక ప్రశ్నను! మనిషికి నిరంతరం !
నేనొక సమాధానం మనసుకు ఒక్కోతరం!

నొప్పితో రాత్రంతా గాలి అన్న సాయం చేసినా నిద్రలేదు
సహనం ఎంతని చూపను ఒళ్లంతా గాయాలు చేస్తుంటే అంది!
నాలోని నిరాశను నీలోని ఆశను కలగలిపి ఎడారికి ప్రయాణమయ్యాను
అక్కడ నీరొక్కటే ఉండదు తెచ్చుకుంటే సరిపోతుంది కదాని!

చూస్తుంటే ఉంది అక్కడడక్కడా నీరు
తరచి చూస్తే తెలిసింది కదా అది ఒంటెల కన్నీరని!
బరువనే పదం ప్రకృతి నుండే వచ్చింది
బరువు మనసుకు సంబంధించిందే కానీ శరీరానిది కాదు

తప్పని సరిగా మోయాల్సివస్తే పిట్టకూడా బరువే!
ఆత్మీయతను ఆలంబనగా చేస్తే కొండకూడా గడ్డిపరకే!
మనిషికి ప్రకృతికి వీడని బంధం ఉంది

ఇంటినుండి మరో ఇంటికి మారుతుంటే ఎదురుగా ఉన్న
వృక్షాలు మౌనంగా ఉన్నా హిమవంతమవుతాయి
గోడలు వాడలు, సమాజం కలగలిపితే విషాద వీచికలవుతాయి
నీ చేతిలో పుష్పం ఉంటే నీ మనసు వెన్నెల దారి చూపుతున్నట్లే
ఖడ్గం ఉంటే నీ హృదయం వంతెన వీధికి వెళుతున్నట్లే

కలం ఉంటే నవపారిజాతాల ననుసరించి అనురాగాన్ని స్పృశించినట్లే
కాలం ఉంటే ఇరుకైన భూలోకం మరింత విశాలమయినట్లే!
సమాజంలోని శిలలన్నీ మానవ మేధలే!
వర్తమాన తలంపై విరియగాచే పరివర్తన ప్రతిబింబాలే!

మనిషి మనిషికీ కనిపించే దిశలన్నీ పురాతన స్వరూపాలే!
నిద్రించిన శిలలన్నీ సంగీతపు ఆవిష్కృతాలే!
భయంకరం! భయానకం ! రెండూ వ్యతిరేక పదాలు!
నిద్ర సగంలో లేచి చూడగానే కనిపించే దృశ్యమేదయినా భయానకం!

సగం మెలకువను తోడు తెచ్చుకుని వేసే అడుగులన్నీ భయంకరం!
కళ్లకు గంతలు కట్టుకుని నడుస్తుంటే వినిపించే శబ్ద తరంగం చైతన్యం!
ఆగండి ! ఆగండి ! ఆలోచనల్ని సిద్ధంచేసి మీ ముందు తివాచీలా పరుస్తా
మనిషికి భయపడి రాత్రి కొండమూలలో దాక్కుందట!

అర్థంలేని చీకటి శక్తి అంతా అమాయకంగా ఆవిరి అవుతోందట!
నడవండి! నేలను తవ్వండి! అభేద్యమైన చీకటి వ్యత్యాసాలను వెలికి తీద్దాం!
నేను ఎప్పటినుండో చూస్తున్నాను వెలుతురు ఇంత విస్తరించి ఉందేమిటి?
దాని నైజం అంటున్నా స్తంభించిన వాతావరణం ముందు నువ్వు నేను ఎంత?

చేతిలోని మొక్కలన్నీ మరొక చోటు లేదని గ్రహించి తలలు వాల్చేయి
మానవ ముఖాల్లో కనిపించని చిరునవ్వు కోసం వెదుకుతూ దారితప్పేయి!
మనిషికి కుటుంబం నాలుగు గోడలమధ్యనే దాక్కుని ఉంటుంది
నాలుగు దిక్కుల్లో ప్రపంచ కుటుంబం విస్తరించి ఉంటుంది
నాలుగు గోడలు నాలుగు దిక్కులైతే రాలే కన్నీటి బిందువులు ఎక్కువౌతాయి
నాలుగు దిక్కులు నాలుగు గోడలైతే మాత్రం జీవితం అగ్ని చిత్రంగా మారుతుంది
తోబుట్టువులు నాలుగు గోడల మధ్య విహరించే జైలు కమ్మీలు
పలకరిస్తే పలువరుసకు బదులు పళ్ళు కనిపిస్తాయి

మౌనమయితే దేహాలకు వరసలు మారుతాయి
మండే గాయానివైతే కల్లోల సముద్రపు కెరటాలై శమింపజేస్తాయి
అమ్మయనా, నాన్నయినా వసూళ్ల విషయంలో మనుషులే
అన్నయినా తమ్ముడైనా పంపకాల విషయంలో మనుషులే

అక్కయినా చెల్లయినా పిల్లల గొప్పదనాల ముందు మనుషులే!
భార్యాభర్తలయినా, పిల్లలయినా అవసరాల ముందు మనుషులే!
ఇందరి మనుషుల మధ్య ఏ బంధంలో విశ్రాంతి ఉంటుంది?
ఖాళీ అగ్గిపెట్టెను తీసుకుని అందులో చీర దాచుకుంటానంటే ఎలా?

మురుగుకాలువను అనుసరించే వాన తుంపరలు
మనిషి జీవితానికి శాశ్వతమైన కటకటాల చినుకులు!
తప్పదు! బతకాలి! బతికించాలి!
వండాలి! తినాలి! తినిపించాలి!

బతకాలి! బతికించాలి!
ఓడాలి!  ఓటమిని అంగీకరించాలి!
జీవితమెంత భారమైనా కనిపించే దృశ్యాలు రెండే ఎండ వాన
ఎండ తండ్రై శాసిస్తుంటే వాన తల్లై కన్నీరు కార్చుతుంది

బిడ్డలు వసంతం కొడుకై, శిశిరం కూతురై పలకరిస్తుంటే
పసిడి నారింజ పళ్ళు ఇంటిని నింపినట్లు కాదూ?
యంత్రాల మధ్య జీవితం ఎంత హృదయ విదారకమయినా విధాయకం!
గుండె యంత్రమైనపుడు కదిలే జీవితం టిక్ టక్ ల మధ్య డోలాయనం!
నాకైతే ఉన్మత్త సముద్రంలో ఒక వినూత్న ప్రయోగం జీవితం!
ఆర్తి నుంచి అగ్నిదాకా సాగే ప్రయాణంలో కిలకీ గా మారిన బింబం!
ఏదైనా శాశ్వతత్వం కలిగి ఉండాలని ఉంది!
బడిగంట, ఇంటిలో వంట, గుండెలో ప్రియ అప్రియాలు!

తప్పదు! వర్చస్సుతో తప్ప వాస్తవంతో పనిలేని అపరిబింబాలు!
అసత్యం అహింసతో కలిసినపుడు సమాధులన్నీ కన్నీటి బిందువులు!
ఒక్కసారి చూడాలి ఈ ప్రపంచాన్ని!
చూస్తే ఏముంటుంది? తరచి చూసి పరిశీలించాలి!

సమాజపు సరస్సు ప్రపంచ నదిలో ఎలా ఇమిడిపోతుందో చూడాలి!
ఎగసిపడే కెరటాలలో ఎంత అంతర్యుద్ధం ఉందో గమనించాలి!
ఆనందం! మనిషి ఏదనుకుంటే అదే!
వేరేగా విపరీర్థాలు లేవు! నువ్వు బాగా కనుగొన్నట్లయితే మాత్రం

ఏదో ఒకరోజు పరిమళాల ధ్వని నిన్ను తాకక మానదు
ఇంతా చేస్తే జీవితానికేం మిగిలింది? ఖాళీ కుండ తప్ప!
నిజంగా ఇది వసంతమే అయితే ఆనందభాష్పాలను నింపుతుంది
నువ్వు గ్రీష్మంలో ఉండిపోయి భూమిలోనికి కృంగిపోతే ఆర్తి ఉంటుంది

ఆకాశాన్ని అద్దెకు తీసుకుని వర్షాన్ని దాచుకుంటే కలహతీరం తాకుతుంది
భూమి ఎలాగూ మనల్ని భరిస్తూనే ఉంది కనుక నడకే మిగులుతుంది.!
ఎడారి గుండె గుండెకు మధ్య కూడా కనిపిస్తుంది
ఇనప కవచాలు తొడుక్కున్న హృదయాలకు వర్తిస్తుంది

ఆకాశం ఎడారిలోనూ అడవిలోనూ ఒకటే ఉంటుంది
సుడిగుండాల్లో కొట్టుకుపోతున్న ప్రజావళికి కనిపించే తీరం ఒక్కటే ఆలంబన!
ఒక్కసారి వరద వస్తే ఆపే తరంలేని వారికిది ఆనందం!
సునామీకి వొంపులుండవు. ఒకటే ఆక్రమణ! మానవాతిక్రమణ!

ప్రవహించే నీరు ఎంతగా  పొంగిపొర్లుతున్నా సరే అలంకరణతో ఉంటుంది
ఒక్కసారి మనిషిని మింగడం ఆరంభించిదా ఏకంగా భీకరంగా మారుతుంది
ఒక్కసారి తీరికగా ఆలోచించలేని నువ్వు ఏమి కోరుకుంటున్నావు?
ఎవరినీ ప్రేమించలేని నువ్వు చివరికి ఏమి మిగుల్చుకుంటున్నావు?

కృతజ్ఞత , జాలిని వేరెవరిమీదా చూపలేని నువ్వు ఎలా ఉండగలవు?
ప్రేయసిని ప్రేమగా కూడా చూడలేని నువ్వు ఏమి సాధించగలవు?
శూన్యం మరో శూన్యంతో మాట్లాడుతోందట
మన మధ్య శూన్యం ఉండకూడదని

గాలి కూడా జొరబడని శూన్యానికి మిగిలేది దైవత్వం!
నీరు ఏమాత్రం దొరకని ప్రపంచానికి మిగిలేది కఠినత్వం!
ఆకలి వేస్తే మాటలాడే మనిషి ఏదయినా తినగలడు
పలకరింపు ఎరుగని వాకిలికి ఎందరు మనుష్యులున్నా వృధా!

ఆనందంతో ఆకలి కాస్త తీరుతుంది కానీ అర్థాకలే!
ఆవేదనతో ఆకలి ఉండదు కడుపు ముడుచుకున్న పుష్పాలే!
తరచి చూస్తే హృదయంలో కనిపిస్తుంది
దగ్గరలో ఉన్న మనిషి చూపే స్పందన కంటే

అత్యంత దూరంలో వినిపించిన మాటలు
బతుకుకు మరో మార్గం చూపుతుంది. ఆప్యాయంగా పలకరిస్తుంది
ఏ చెట్టు చిగుర్చుతుంది వేరు లేకుండా?
ఏ పిట్ట ఎగరగలుగుతుంది తల్లి ఆహారం అందించకుండా

ఏ గాలి వీస్తుంది ఆకాశంలో విహారం చేయకుండా
ఏ మనిషి జీవించగలడు భూమిపై ప్రేమను అందుకోకుండా!
ఉన్న చోటునుండి వీధిలోకి అడుగులు కదిలితే చాలు
ఏ వైపునుండి మనల్ని గాలి దుమారం పలకరిస్తుందో తెలియదు
అమానుష విషమ చక్రాల మధ్య మనం నిలబడి వింత చూస్తున్నాం
అమానవీయ చరిత్రలలో చేరిపోవడానికి సిద్ధపడే జీవిస్తున్నాం!
నాకు కావాలి! ఏమి కావాలి? ఎందుకు కావాలి?
ఆ ప్రశ్నలో వచ్చే సమాధానం ఏమీ ఉండదు నాకు కావాలి అంతే!

ఏమి కావాలో సగజీవితం గడిచాక తెలుస్తుంది
ఎందుకు కావాలో అనేది జీవితం పూర్తయ్యేనాటికి అర్థమవుతుంది!
నిప్పురవ్వ విసిరితే ఎక్కడో ఒకచోట అంటుకోక మానదు
మాట ముత్యం విసిరితే ఏదో ఒక గుండెకు చేరక మానదు

ఏదో ఒకటి విసిరేయడానికి మనమేమీ సముద్రంలో లేము
ఏదయినా అనుభవించి తరించడానికి మనం అందుబాటులో లేము
కాళ్ళు సాచి జీవించే జీవితాలకు జీవితం తక్కువే!
ఒక్కసారైనా నవ్వుతూ నవ్విస్తూ కణకణలాగే మేధతో

మతాలను ముసుగు వేసుకోకుండా, కలాన్ని కులంలోకి మార్చి
కదిలే ఈ సమాజానికి ఎపుడూ ఆయుధాలు ఉంటాయి
వేట కళ్ళకు పరిమితమయితే మంచిదే
చేతులకు పనిపెడితే మాత్రం మానవునిలో దానవుడు చేరినట్లే!

ఇపుడు మనిషి వేట మొదలెడితే నరకడం ఆపకూడదు
ఆగిందా ఇక గుండె ఆగిపోయేంతవరకు తరిమి తరిమి కొడుతుంది!
మనో భూమికకు ముందుగానే కృతజ్ఞతలు చెప్పుకోవాలి!
ఒక పక్క ఆకలికీ, మరోపక్క అలజడికీ ఆగమని సర్ది చెప్పుకోవాలి!

నోరు తెరిస్తే ఆకలికోసమే కాదు ఆరాటం కై పోరాటం కూడా!
నియమం తలదించుకుని వస్తే ఆనందమే నిప్పురవ్వలు పడితే మాత్రం బొగ్గుకణమే!
మనిషి స్వేచ్ఛావస్త్రం తొడుక్కోవాలని తెగ ఆరాటపడతాడు
ఒక్కసారి వేసుకున్నాక తీయడానికి వెంటపడతాడు
అమృతం రుచి ఎరగనంతవరకే ఆరాటం!
రుచి మరిగాక ఏముంది అందునుంచి తప్పించుకునేందుకు పోరాటం!
మనసు మెదడుతో కలిసి ప్రయాణం చేసినపుడు
కనిపించే ప్రతిబింబాలన్నీ చీకట్లలో చిక్కుకుని లేదా నీటిలో నిలుస్తాయి

ఇసుకలో కనిపించే నీటి చలమ అనుసరించి రాతిబండలు
కళ్ళకొనలు మిగిలిన ప్రవాహ అంచుల్లో తొంగిచూస్తుంటాయి
రాళ్ళల్లో నీరు కొండల మధ్య సెలయేరు రెంటికీ చాలా వ్యత్యాసం ఉంది
చెమట పట్టిన శరీరానికి ఊహకు వాస్తవానికి మధ్య ఏకాంతము ఉంది

ఎక్కడా ఎవరూ ప్రశాంతంగా ఆలోచించలేరు. ఆశించలేరు చూడలేరు
కీచురాళ్ళ రొద, కప్పల బెకబెకలు వినిపిస్తుంటే ఉన్న నీరే చిరాకు పుట్టిస్తుంది
కమ్మని పాటల నడుమ సాగే సెలయేరు నడుమ పచ్చని పాచి పలకరింపు
కావ్యం నుండి కదలివచ్చే భాషతో హృదయ పతాకం ఎగరవేస్తే

ఎగసి వచ్చే మంటల కోరల్లో చిక్కుకున్న మనసు యుద్ధానికి సిద్ధమవుతోంది
నింగిని ఆనుకున్న ఛిద్రమైన క్షణాలను ఒక్కచోట చేర్చి రాయబారం నడుపుతుంది.
చిట్లిన మట్టి కణాలనుండి విసుగును ధ్వనింపజేస్తూ
నీరుండిపోయిన సరస్సులన్నీ సుగమమయినపుడు కనిపించే

చినుకులు రాల్చుతున్న రజను ముఖంపై తళుకులీనుతుంది
తలుపుల్లేని గుడిసెల తాటాకులు నక్షత్రాలను ఇంటిలోనికి రప్పిస్తుంది
కావ్యానికి పదాలు శ్రమించినట్లే
కలానికి మెదడు సహకరిస్తుంది

అక్షరాలకు ఆలోచనా విధానం వెంటపడినట్లే
రూపం చిందించేందుకు చేతులు సాయపడతాయి
ఒక్కోసారి మనఃస్థితిని అనుసరించి
పదాలు పరుగులు తీస్తాయి. పగులుతాయి. పారిపోతాయికూడా
ఒక్కోసారి ఏడుస్తాయి, ఏడిపిస్తాయి

కోపగించుకుంటాయి. లాలిపాడుతుంటాయి
కవిత్వానికి నిద్రరాదు. అల్లిక అనేది సాగిపోతూనే ఉంటుంది
భావపరిణామం నుండి సాగిన ప్రతి అక్షరం విశ్రాంతి ఎరుగదు

కారణాలు ఎన్నయినా ఉండనీ..కవిత కమనీయ దృశ్యాలను వదిలి వెళ్లదు
రానీ రాకపోనీ, కుదరనీ కుదరకపోనీ ఏదయినా స్థిరత్వం వదలదు
బాల్యమయినా, యౌవనమైనా, ప్రౌఢత్వమయినా వృద్ధాప్యమైనా
ఏ దశయినా ఏ దిశ అయినా నిశ్శబ్దంతో అంతరించవు

బతికుండగా ఆత్మ ఒక శరీరాన్ని వదిలి మరో శరీరానికి బదలీ అవ్వదు
కవిత్వం రాయాలంటే మాత్రం నన్ను తప్పకుండా కవితాత్మ ఆవహించాల్సిందే!
కలిసి ఉంటున్న ఖాళీ సంచుల్లో కనిపించేవన్నీ నటనలే
శరీరం ఉందన్న మాటే గానీ అణువణువూ అక్షర సందర్శనాలే!

నమ్మకం, ప్రేమ, దిగులు, ఆశ, లాంటివన్నీ మనసును అనుసరించేవే
ఒక్కసారి ప్రేమ సందర్శిస్తే చాలును జీవితం పదును దేరుతుంది
జీవం ప్రకృతిలో కలిసిపోయినపడు
మనుషులకంటే పంచభూతాలే చింతిస్తాయనేది వాస్తవం

మనుష్యులేంటి మనీపర్సుల అవతారాలేంటి?
చీకటి వెలుగవ్వడం ఏమిటి? వెలుగు చీకటికోసం ఎదురుచూడటం ఏమిటి?
గుప్పెడంత గుండె స్థితిని అనుసరించి కళ్ళు ఎదపై నాట్యమాడుతాయి
నక్షత్రాల తళుకుబెళుకులను అనుసరించి చందమామ ఆకాశాన్ని తడుముతుంది

రెంటికీ నడుమగల ఖాళీ ప్రాంతం జీవన సంస్కృతికి సంకేత పదం
పల్లెల్లో పట్టణాలలో కనిపించే మనిషి చెట్టునూ ఒకేలా స్పందిస్తుంది
ఎంత పని చేసావు ? హృదయంలో ప్రేమ పతాకం దించేసి
నీ యంతట నీవు ఇష్టమొచ్చిన రీతిలో పోతుంటే
నా జీవితానికి కనిపించని వాస్తవాలు నీడల్లా పొంచి ఉన్నాయి
ఎవరికి వారే వారి వేదానికి బాధ్యులు మరొకరికి దిక్కేది అంటే నీ ఇష్టం!
ఎత్తిన చేయి ఆకాశం దిక్కుగా చూపితే
ఆకాశమేదో కాని పని చేసినట్లు అనుకోవడానికి అర్థం లేదు

పూలు పండ్ల వలె కనిపించే కళ్ళన్నీ నన్ను తడిమి చూస్తుంటే దానికో ముగింపులేదు
కాదనకు! నీకు తెలిసినా దూరం ఉంచావని తెలిసినా ఏమనకు!
కంఠం వణికిపోతోంది! నిజాన్ని భరించలేక!
మనుషుల ఆకారాలను ధరించినవారం మనం

మనుషులమవడానికి కొంతకాలం పడతుంది నిజం!
రాక్షసుల నడుమ బంధాలకు అర్థం వెదకడం అమానుషం!
నీ సంచిలో నిండిన హారాలన్నీ నీవికావు
నా సంచీలో ఏవీ లేవు.

కానీ నా సంచీలోవి కూడా నీవు కలుపుకున్నావని చెబుతుంటే

ఇక నన్ను దూరంగా ఉంచుతానని ప్రమాణం చేయడం అవసరమా?
ఒకసారి అర్ధరాత్రి మేడపైకి చందమామను చూద్దామని వెళితే
గాలి, చినుకు  రెండు వైపులా చేరి గుస గుసలాడుకుంటున్నారు.

నిలదీసి అగగానే ఆకృతి లేని రూపం మాది మేమేం చెప్పగలం అన్నాయి
ఆకృతికి మిగిలిందేముంది? నీలోనే సమభావ రాగం వినిపిస్తోంది!
చెదలు పట్టినంతమాత్రం చేత చరిత్ర అంత తెలివి లేనిది కాదు
ఎన్నో కన్నీళ్ళను,. ఎన్నెన్నో మాటల ముత్యాలను దాచుకున్న చరిత్ర

ఒక్కనాటికి ఎవరినీ అనుకరించదు, పలకరించదు
వారికి వారే పరిచయం పొందాల్సిందే! జాతి వర్ణబేధంలేని మతి గతి!
ఒక్కోసారి కాదు అనేక సార్లు కంఠం కవిత్వం ముందు చిన్నబోతుంది
కవిత్వం ఎంత  తీరాలు దాటినా సరే కనువిందు చేస్తుంది
దేశాల్ని, ప్రాంతాల్ని సరిచేసుకునే కవిత ఆణిమత్యమై నిలుస్తుంది
బతుకు ఆపదల ముళ్ళనుండి తప్పించుకుంటే సూర్యుని ప్రత్యక్షం!
అడవులు కాదు ఏకంగా కీకారణ్యమే ఎంతో ఆనందమైనది అనుకుని
నిశ్శబ్ధం నుండి కొన్ని శబ్దాలు ప్రేలిపోతే కొన్ని శిలాశాసనాలు మనపరమవుతాయి

కాలం శ్రమను ప్రేమిస్తూ జీవన యాత్రలో నిరంతరం కీర్తి సాధనమవుతుంది
స్పందించినా, ద్వేషించినా చలనానికి ఏ గుణమూ అబ్బని స్వేచ్ఛ ఉంది.
కాలాన్ని నిద్రపోనివ్వకుండా చేసేవాడే నిజమైన కవి
కాలానికి రంగులేదు. జాతి లేదు. కులం లేదు

ఉన్నదంతా మానవతారాగం! ఏదయినా జాతికొక అగ్నిపరీక్షనే చెప్పాలి
అవన్నీ కాదని వెళ్లిన ప్రతి రాగం ఒక విషాద కావ్యం!
ఉదయం నుండి చీకటి పడేదాకా కనిపించే సంరంభాలు
ఈనాటివి కావు శూన్య మనఃక్షితిజంలో మరో అందమైన లేఖాస్త్రం

అద్దం ముందు నిలుచుంటే నాకయితే మనసు కనిపిస్తుంది
నీ గురించిన ఆలోచన, మనోరూపాల ప్రస్తావన వస్తుంది!
శిరస్సు వంచితే నీకు సలాము కొట్టేది ఆకాశం కాదు
పాదాలపైన ఉంచితే వాస్తవాల పొరల్లో నీ రూపే కనిపిస్తుంది

నాలుకపై నీటి చుక్కలకు బదులు కన్నీటి చుక్కలు కనిపిస్తాయి
సర్కస్‌లో తీగపై నడిచే మనిషికి తెలిసినంత జీవితం ఎవరికి తెలియదు!
అసలు నాకో సందేహం!
వెళ్ళిపోయిన దారినుండి మళ్ళీ మళ్ళీ దేహాలే వస్తున్నాయేంటి?

వృత్తులు పోయాయి, ప్రవృత్తులు స్టేజీడ్రామాలను రక్తికట్టిస్తున్నాయి
బతుకు పుట్టను కదిలిస్తే విషాదబింబాలయినా పలికించే రాగాలవుతున్నాయి
ఎన్ని రోజులు ఎదురైనా ఇంకా ఒక రోజు నాకోసం చూస్తున్నట్లే ఉంటుంది
ఎంతమంది ప్రశ్నలను సంధిస్తున్నా సమాధానమే ఒక ప్రశ్నలా కనిపిస్తుంది
ఏనాటి కాలమిది? అనుభవాల శిఖలు హిమాలయాలను తలపిస్తే
అనుభూతి పొరల మధ్య నాకు నేను విధించుకునే వలయం నాదే అవుతుంది

కావాలంటే దొరికేది ప్రకృతిలో ఉండదు
వెదుకుతుంటే కూడా దొరకనిది మనిషిలో ఉండదు

ఏమి వైపరీత్యమో కదా ఇది? అయినా ఇక్కడే ఉంది సవివరం
దొరికీ దొరకనంతవరకే మిగులుంటుంది జీవితం
అనుకోని అతిథి రావడంవలనో లేక అనుకున్నా రాకపోవడమో కాదు
ఏదయినా ఎదురు చూడటమే అయినపుడు చెట్టు ఎంత విచారించాలి?

ఎదురు చూపుల కంచెలో చిక్కుకున్న వృక్షరాజాలకు తగిన భాష ఏది?
గాలి తెమ్మెరలతో పలకరించే ముఖ బింబాలకు అంతమేది?
ప్రపంచం నుండి ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానం ఉన్నా దొరకదు
మనసులోనుండి వచ్చే ఏ సమాధానమైనా నన్ను అనుసరించదు

కాలం మహా మేధావి ఒకవైపు ప్రకృతిని, మరోవైపు మానసిక వికృతిని
చేతబూని నవ్వుతూనే తిరుగుతుంటే విలయవీచికలు కాపలా అంటే ఎలా?
రోజులు, గంటలు, నిముషాలు, క్షణాలు ఇలా ఒకటా రెండా?
ఎన్ని గడిస్తే జీవితం పుటలు పుస్తకమవుతాయి?

ఎంతమందిని ఎదుర్కుంటే బతుకు బండికి రిపేర్లు కాకుండా ఉంటాయి?
ప్రపంచమంతా కన్నీటి మయమయితే పాత్రల వేషాలు మారుతయంతే!
ఇంటిముందున్న వృక్షం నాతో అంటుంది
సూరీడు రాకుండా నాతో మాట్లాడు. వస్తే మా పనులు మాకుంటాయని

తప్పదు నాకు చెట్టుతో మాట్లాడటం ఇష్టం నిద్రలేవాలి మరి!
వస్తు ప్రపంచ ధ్వనిలో కలిసిపోయి నాకెందుకు అనుకుంటే నాకోసం ఎవరుంటారు?
నేను కదిలిపోవాలనుకుంటున్నాను
పాడుకుంటూ, ఆడుకుంటూ, మాట్లాడుకుంటూ, వినుకుంటూ
నా వెనుక నా నీడను కూడా రావద్దని చెబుతున్నాను
నువ్వు తప్పదులే! ఎక్కడయినా నీ వృక్షసంతతి నాకు తోడేగా!
గులాబీలా, మల్లెలా పుట్టాలని ఉంటుంది
కానీ ఒక్కరోజే తల్లి దగ్గరుండాలి కదా?

పువ్వుల్లా పుట్టిన జీవితం ఒక్క రాత్రైనా జీవిస్తే చాలనుకుంటాము
కానీ ఆ పువ్వుల్ని పూయించే చెట్టులా ఉంటే అంతకంటే ఏమి కావాలి?
నేను మరణించాననే అనుకుంటుందట ప్రపంచం!
నిజమే! నేను అనే పదం మరణించాల్సిందే ఒక్క మాటకు ముందు

పెనుభూతంలా మారిన నాది నేను పదాలు మరణిస్తేనే కానీ
ఎవరో ఒకరు మనలా మనకోసమే జన్మించరు. మనం అనే పదం ఉండదు
ఆలోచించేకొద్దీ ఒకటే అనిపిస్తుంది నేను ఎవరిని? అని
ప్రకృతిని ఆస్వాదించడమే తప్పయితే నేనెవరిని?

కనీసం గరికకున్నంత విలువకూడా నన్ను చూసి ప్రపంచం ఈర్ష్య పడుతోంది
ఆకాశానికి బారెడు దూరముంటే భయపడి గర్వపడుతోంది

చెట్టు ముస్తాబైంది. మంచుతుంపరలతో స్నానం చేసి
తన వంశంపై ఆధారపడివున్న పక్షుల్ని తయారు చేసి వారి వారి పనులకు పంపేసి

కొమ్మలు సవరించుకుని నుదుట సూర్యున్ని తిలకంగా దిద్దుకుంది
అంతే వేటగాళ్ళు విజృంభిస్తున్నారన్న మాట వినగానే కంపిస్తోంది.
అయిన వాడెవడు నన్ను నరకడానికి?
నేను మనిషిని కానే పారిపోవడానికి?

అయినా నా నీడకావాలి. నానుంచి వచ్చే గాలి కావాలి
నా కొడకల్లారా! నన్నే నరుకుతా్రా?
మీ దేహ సౌందర్యాన్ని ముక్కలు చేయకపోతే నన్నడగండి అంటూ విలపిస్తోంది
నా సమాధి ఇదే నా పుట్టుక ఇదే. నన్ను తుత్తునియలు చేసినా సరే
మళ్లీ ఇక్కడే మొలకెత్తుతాను. మళ్ళీమళ్లీ ఎన్నిసార్లు నరుకుతారు?
మీరు నరుకుతుంటే నా తల లేస్తూనే ఉంటుంది కానీ మీరు?

వెళ్లండి ఆ పరిస్థితి రానివ్వకండి!
నా ప్రియమైన వీక్షకుల్లారా మీరైనా ఈ ఘాతుకాలను ఆపండి
సృష్టి అంటే మీరే కాదు. మేము కూడా మరిచిపోకండి
మీ తలుపులమై మీ తలపుల్లో నిత్యం ఉండేది మేమే కదా?

నేను మీ ఇంటికి కాపలాకాస్తున్నాను
మీ రహస్యాలను మరింత రహస్యంగా దాస్తున్నాను.
మీ అంతర్గత మాటల్ని నా కిందకూర్చుని మాట్లాడుతుంటే వింటూనే ఉన్నాను
ఒక్క రోజయినా ఒక్క గుక్కెడు నీరు పోసారా? మరెందుకు నరుకుతారు?

విలపించి విలపించి చెబుతుంది కదా
ఆ పక్కవీధిలో మరో వృక్షం ఉంది అది చాలా మంచిది
నేనంటే కరెంటు వైర్లకు అడ్డం వచ్చానేమో కానీ ఆ వృక్షం దేనికీ అడ్డం కాదు
అందానికి అందం పర్యావరణం అంతా ఆ వృక్షం ఆమె నా భార్య అని వేడుకుంది

ఉన్నట్లుండి మీ కత్తి నా కొడుకులపై పడిరదా?
వారేం చేసా్రా ? మందుకు పనికి వస్తారా?
నా కొమ్మలు ఏమి చేసాయిరా? ఓహో! మీ ఇంటిలో కాంతిని కాజేసాయా?
అయినా ఒరేయ్! ఇది మంచి లక్షణం కాదురా గుర్తుంచకో!

ఈరోజు మా గొంతు చుట్టూ ఉరితాళ్లు వేస్తారు
ఎవరో స్నానంచేసి వారంరోజులయిన వారంతా మీద కూర్చుంటారు!
ఛీఛీ! పాడు బతుకు ఉండండి ఉండండి గ్రీష్మం రానీయండి
అపుడు మలమల మాడ్చేయనూ ? మీరు చేసిన ఏ ఘాతుకం మర్చిపోను.

నాకూ ఆశలున్నాయి. ఆశయాలున్నాయి
అసలు మాకు కూడా కదిలే గుణముంటే అడవిలోకి పారిపోయేవారం
మా అడవి మాకుంటే మేమే ఒక రాజ్యాన్ని ఏర్పరుచుకునేవారం!

అన్యాయంగా మీ చేతుల్లో ఉండిపోయాము అర్ధాంతరంగా బతుకుతున్నాము

తన కన్నీళ్ళన్నీ రాలి రాలి కింద పడితే నేలంతా తడిచిపోతుంద
నేల తల్లి అంటుంది నేనెంత వీక్షించకపోతే మీరంతా నిలిచేవారే అని
నిరీక్షించడం భరించడం నేను చూసినంత మీరెక్కడ చూసారే అంటుంది
నేలను నమ్ముకున్నా తప్పదు ఖర్మఫలం చెట్టయినా మనిషయినా!

చెట్టుపక్కనే నేను కూర్చుంటాను. గుడిలో ఉంటుందేమో
పెద్దగా బాధలు పడుతుంటుంది అనుకోలేను. నీరు పోస్తాను
కాస్సేపంటే కాస్సేపే  నా వేదనంతా ఎవరికి చెప్పుకోవాలో తెలియక
దాని బెరడును గిచ్చి గిచ్చి పెడుతంటాను. ఏమీ అనదు మరి!

ఒక్క సెకనంటే ఒక్క సెకను నా సంతోషం కోసమే నా యాతన
ఓ భగవంతుడా నా మొర వింటున్నావా? నాకు యాతనను తీసేయి
నేను బతికున్నంతవరకు నేనుగా నన్నుంచు ఆవేదనను తొలగించు
వాతావరణం బాగోలేదు నిజంగా ధ్వని తరంగాలను దాటుకుని చూపించు

ఎంత సేపూ తూర్పును గురించి వర్ణిస్తారే పడమర గురించి మాటేంటి?
అని పడమర ఉత్తరం దక్షిణం ఒకే వేదన చూపుతున్నారు
అరె! సాయం సంధ్యను పోషించే నీకు కొత్తగా పొగిడేదేముంది?
సాక్షాత్తూ సూర్యభగ వానుడే నీకు పొగడపూల దండ వేస్తుంటే అన్నాను

నేను చెప్పాను ఇక వెళుతున్నానని
కనీసం నా చేయి అయినా వదలరేం? మాట వినండి
నన్ను వెళ్లనివ్వండి అవతల ఉత్తరం, దక్షిణ దిక్కులు పోరాడుకుంటున్నాయి
హమ్మయ్య వదిలేసారా? నాకేం భయంలేదు ఇదొక తమాషా ఆట అనుకుంటా!

ప్రకృతికంటే అందమైనది ఏదయినా ఉందా?
అనేది ప్రశ్న కాదు ప్రళయరుద్ర ఆకర్షణలో కనిపించిన హేతువు
అందానికి నిర్వచనమే సృష్టి అయినపుడు
క్షణాలు దోసిళ్ళలో పోసుకుని జారే పూల గుత్తుల వంక చూపెందుకు?

ఆలోచనా పథంపై కరాళనృత్యం చేసే సమాజం ఎక్కడుంది?
అనుభవ శిల్పాన్ని పోలివున్న చైత్యన్యం ఇపుడేమి చేస్తోంది?
కిటికీలు తెరవండి! కర్టెన్ల వెనుక దాగుంటే మీకేం తెలుస్తుంది
మంచు తొలగిన సూర్యకిరణాల్లో మానవత్వం, మందారం అన్నీ తెలుస్తుంది!

అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్నారో లేదో అనడానికి వీధిదీపాలే సాక్ష్యం!
ఉదయమే నిద్రించినవారు లేచారా? లేదా నిద్రపోతున్నారా అనేందుకు
నిద్రించినవారందరిలోనూ నిరాశ ఉందా అని తెలుసుకోవడానికి
ఉదయాన్ని చీకటితోనే చూసినవారికి ఆశ ఉందా అని కనుక్కోవడానికి సాక్ష్యాలులేరు!

వేదనతో నిండిన గుండె ఏకాంతాన్ని గ్రహించలేదు

అసలు గుండెకు వేదన ఏంటి ఏదయినా గ్రహించలేని తనం ఎక్కువ
ప్రకృతితో మమైకమైన జీవం జీవితాన్ని భరించడం ఎంతో తేలిక
మనుగడలేని మనుషులకు విషాదం మోగించే ఆలాపనం ఒక తూలిక

ఎక్కడెక్కడ ఉంది ఈ ఆర్తనాదాల వెనుక పరుగులుదీసే దృశ్యాల మాలిక
నన్నడిగితే శిల్పాలన్నీ ఒకచోట చేర్చితే కలిగే భావప్రకంపనే దీనికి దీపిక
ఏమయిందనే ఆలోచన నీకు నాకు మధ్య కలిగే అనుభవ గీతిక
నా దగ్గర దారిలో కనిపించే గాలులన్నీ ఒక్క చోటగా చేర్చిన ఆనందడోలిక!

ఎవరన్నారు ఆకాశం అట్టహాసం చేస్తోందని..
సూర్యచంద్రులు మాటిమాటికీ సెలవు తీసుకుంటున్నారని
నక్షత్రాలు నగిషీల మోజులో కాలం గడిపేస్తున్నాయని
నింగి నేల స్వైర్యవిహారం చేసే మోజులో వరుణుడి ఆగమనాన్ని గమనించడంలేదని

తెలియదు తెలియదు అంటే తెలుసుకుంటే మంచిది కదా?
నాకు తెలియదని నీకు తెలుసును కదా ? నీవేం చేస్తున్నావని
ప్రకృతిలో ఈ ఆవేదనలు ఉండవు గాక ఉండవు!
నిరంతరం సాగే ప్రవాహంలో నీ ఉనికే కాదు ఎవరూ నిలవరు!

అర్ధరాత్రివేళ తోకచుక్కలు నేలరాలితే ఎవరు చూసారు?
తోకచుక్క అందమైన అక్షర కన్య నగిషీల చీరను ధరించి
భూలోక విహారం చేయాలని రాత్రి మాత్రమే వస్తుంటే
పైగా ఎవరో గొప్పవారు పుడతారని చాటింపు వేస్తారు. గుసగుసలు పోతారు

తోకచుక్క రాలినా, ఇంద్రధనువు ఆకాశాన్ని అలుముకున్నా
ఓ మనిషీ నీలో మాత్రం ఇసుమంతైనా ఎదుగుదల ఉండదు
మరణం, మధ్యాహ్నాలతో కలిసి ఆనందడోలికల్లో తులతూగే
నీకెందుకు ఈ తారాతోరణాల హరివిల్లు! విరిజల్లుల తాపం!

ఈ ఆలోచనలకు పూర్ణ చుక్కను ఎవరు పెడతారు?
నఖశిఖ పర్యంతం చేసే ఆలోచనా విధానాలలో
ఎవరికి తరంగ ధ్వని వినిపిస్తుంది?
నన్నడిగితే తెరచి ఉంచిన కిటికీ నుండి వచ్చే వాస్తవ శక్తులతో కదలడం కష్టం!

అవును ఒక్క చెట్టుకు మరో చెట్టుకు వాదన!
అలాగని ఒకదానికొకటి పడదని కాదు!
అదే మనిషికి మనిషి మధ్య అనురాగపు వేదన
అంటే ఇద్దరూ జీవితాంతం కలిసి ఉంటారని కానే కాదు

ఎవరు ముందు? ఎవరు వెనుక? అంతా రహస్యమే!
అయినా ఏదో నేనే ముందు అనుకునే వాదనలోనే కాకూడదనే సంవేదన
తల్లి చెల్లి, తండ్రి కొడుకు వీరిలో వెళ్లిపోవడానికి వరుసంటే ఎలా?
పీల్చేగాలిలో శ్వాసల లెక్కలననుసరించే కదా ప్రయాణం కాదా?

నేను నిజమనుకునే నువ్వు నీకెంత దూరంలో ఉన్నావో నీకు తెలియదు
నేను నిలిమా అనుకుంటే చాలదా నువ్వేదో నీకే తెలుస్తుంది
నీకు నచ్చితేనే మాటయినా అక్షరమైనా నిజమనేది ఎంతవరకు నిజం?
కాకుంటే దానికి సవాలక్ష చేతులతో త్రోసిపుచ్చడం ఎంతవరకు సమంజసం?

బిందువూ బిందువూ కలిస్తేనే కదా ప్రశాంతంగా వర్షమవుతుంది.
గిరి శిఖరమై ప్రవాహమై సమాజమై ప్రపంచమై కదిలితే మాత్రం
ఖచ్చితంగా రౌద్రదర్పణమే అవుతుంది. కొరగాని ఒంటరితనం అవుతుంది
అపుడేం మిగులుతుంది మన పిచ్చిగానీ నీకంటే నేనే నయమనిపిస్తుంది

కిరణాల తాకిడికి శరీరాలపై పచ్చల పొడులు ఏర్పడితే
నిలదీయడానికి , నిలబెట్టి కడిగేయడానికి సూర్యుడు ఎదురుగా రాడు
కానీ నేలతో స్పృశించిన పలకరింపుల్లో శరీరగాయాలయితే
నిందాస్మృతుల మాలలు ఒకదాని తర్వాత మరొకటి మెడలో పడుతూనే ఉంటాయి

మరణం శరీరానికి అనివార్యం!
ప్రకృతిలో పరమాణువులైన మనకు శిరోధార్యం!
నేనేమిటో నీకు తెలియదు నావద్దకు మరణఛాయలు ఉండవని నీవంటే
వచ్చే జవాబు సమాజం నుండి కాదు. ప్రపంచం నుండీ కాదు ఏకంగా నీనుండే!

నమ్మితేనే కదా జీవితం రక్తి కడుతుంది
సూర్యుని నమ్మితేనే మానవాళి జీవిస్తుంది
ఆకుపచ్చని నీడపడితే నీరు కూడా ఆకుపచ్చగానే ఉంటుంది
నమ్మకంమనే పచ్చబొట్టు ఉంటేనే జీవితం రక్తికడుతుంది

సంవేదన సంఘర్షణ రెండూ సమన్వయం అయితే
ఎప్పటికపుడు మానవ గణంగా మారి దీపస్తంభాలై నిలుస్తుంది
గిరి శిఖరమైన చోట ప్రవాహాలన్నీ కొండలుగా మారవా?
హృదయంలో కలిగిన శాంతి క్షణాలన్నీ కలిసి నిశ్శబ్దమైపోవా?

రోడ్లన్నీ ఒంపుల వయ్యారలతో నృత్యం చేస్తున్నాయి
వాటిపై నడిచే వాహనాలన్నీ ఉత్సవానికి బదులు ఊరేగింపు చేసుకుంటున్నాయి
ఆవిష్కరింపబడిన ప్రతి బిందువు నీడలేని శరీరాన్ని అనుసరిస్తూ
ఏకాంతవాసంలో నిలుచున్న మనిషి ఆనవాళ్ళను చెరిపేస్తున్నాయి

ఈ అలజడి ఎపుడూ ఉండేదే! ఈ ఆనందం ఎప్పటికో గానీ రాదు
ప్రపంచం అన్ని తీరాల్లో విస్తరిస్తూ అదే శ్వాసలో కలగలిపిన స్వప్నాలను
విరామంలేని అతిపెద్ద వాక్యాలకు అర్థం ఆర్తి లేని గ్రంథాలననుసరిస్తూ
ఒక పెద్ద ముసుగులా కనిపించే విరామం నా ముందే నిష్క్రమిస్తుంది

సృష్టికి ఎంత ప్రేమ ? మనిషిని కాపాడటంలో?
భౌగోళికంగా సరిచేసుకుంటూ మానసికంగా సరిపోల్చుకుంటూ
నాకు నేనే అన్న చందాన్ని అద్దంలో చూసుకుంటూ

సముద్రాన్ని అద్దంలా వాడుతూ కదులుతుంది నాలోనే ఉంటూ!

ఎప్పటికప్పుడు కలిస్తూ విడిపోయే ఈ పరిచయ రూపాలతో
ఎంతకాలమని పోరాడాలి?
పిడికిట్లో భద్రంగా దాచుకున్న రేఖాగణితాలలో
ఎన్ని ఆదర్శాలని నిలపాలి?

ఆకారాలను అనుసరించి పలికే ప్రతి పలుకు పలకలోనే
అస్తవ్యస్తమైన దూమయితాలపై నిలిపే అక్షరాలన్నీ నల్లని బోర్డులోనే
ద్వేషానల పవనాలు వీచే ప్రతి ఋతువు సంధ్యాచరణాలపైనే
శతృత్వమెరుగని చెట్లు, ఆకులు కొమ్మలు నిత్యం సూర్యోదయంపైనే

కన్నీరు కార్చుకుంటే జీవితశిఖల్లో మణులెందుకు దాక్కోవాలి?
హింసతో ఎరుపెక్కిన చెక్కిళ్ళను నిమురుతూన్న పావురాళ్ళతో పోల్చాలి
నిశ్శబ్ద గవాక్షాలంటారు కానీ కోమలి కన్నులకు మించిన తలుపులేవి?
నీలి గద్దలుగా సాగిపోయే ఈ జీవన ప్రయాణంలో నేనుతప్ప మరెవరు?

చెట్లను చూస్తే చాలు ఎన్నో జ్ఞాపకాలు
మా అమ్మను చూసింది. నేడు అమ్మమ్మగా నన్ను చూస్తోంది
పల్లవించే మొదలు నిత్యం నన్ను చూసి నవ్వుతూనే ఉంటుంది
నేను కన్నీరయితే మాత్రం తట్టుకోలేక మౌనం వహిస్తుంది!

జలం ధునిగా మారితే కనిపించే ధైర్యం ముందు దూకుతున్న ఉత్సాహం
మేఘాన్ని చూసినపుడు అందని లోతైన గతమంత సాగుతుంది
అరణి వంటి బతుకులో వర్తనతో సంకల్పం ఆగ్నిjైం సమాధానపరుస్తుంది
శక్తిగా సమాజానికి నవ్యమైన ప్రగతిని తెలుపుతుంది!

ఈ క్షణాలొకటి నన్ను నన్నుగా నిలబడనీయకుండా వేధిస్తున్నాయి
ఈ నిముషాలయితే నన్ను ఏకంగా నిలదీస్తున్నాయి
ఈ గంటలు, రోజులు అయితే పలకరింపుల మధ్య ఆశారూపాలు అందిస్తున్నాయి
ఈ ఘర్షణలో కిరణాలన్నీ మౌనంగా గోడవెనుక దాక్కుని చూస్తున్నాయి

చిన్న చిన్న గిరులు తమపై నేలపై రాలిన ఆకులను వేసుకుంటూ
ఆడుకుంటున్నాయి వెలుగు రెక్కలను అరువు తెచ్చుకుని దొర్లుతున్నాయి
భుజాలపై చెట్లు నిలబడిరదని గిరిశిఖరం నన్నడుగుతుంది నీకంత బలమా అని
అనంతమైన వ్యత్యాసంతో బలం కాదు నాకు మిగిలిన ఆశారూపం అని!!

నౌకలు నావలు ఇవన్నీ ఏవయినా అవతలి ఒడ్డుకు చేర్చడానికే!
నావికులు, సైనికులు ఇద్దరూ మానవులకు కాపలా ఉండటానికే!
ప్రేమికులు ప్రేమించుకుంటే మాత్రం వారిలో ప్రపంచం ఉంటుంది
లేకుంటే మాత్రం ఘర్షణలో కనిపించకుండా శూన్యం దాగుంటుంది

రవి ఉదయించడం, అస్తమించడం రెండూ ఎప్పటికపుడు కొత్తే
ఉదయించినా కొండంత అందాన్ని అస్తమించినా గోరంత ఆనందాన్ని ఇస్తుంది

స్వేచ్ఛదొరకని సంకెళ్ళు లేని బతుకులో వేలాడే నీడలు ఎన్ని ఉన్నా
పయనాన్ని అనుసరించి పొలిమేరలు దాటే జీవితాలు ఎన్నో ఎన్నెన్నో!

సముద్రం పొడవును కొలిచి వాన కురవదు
వెడల్పును అనుసరించి ఎండ కాయదు
తీవ్రమైన సూర్యునికైనా, తడిపి ముద్దచేస్తున్న వరుణుడికైనా ఒక్క గొడుగు చాలు
సముద్రాన్ని ఒక్కసారి అల్లకల్లోలం చేయడానికి ఒక్క వాన చాలు!

కూర్చుని నిలుచునే సరికి రోజు  సగానికి పైగా నడిచిపోతుంది
పదాలను ఏర్చి కూర్చేసరికి ఏకంగా ఆలోచనలోకి తీసుకెళుతుంది
ప్రయాణం నావరకు వస్తేనే ప్రయాణం లేకుంటే నిత్య సంచలనమే!
సంధ్యారుణ భానుని ముందు ఏమి ఉన్నా లేకున్నా ప్రకాశమే!

పొలాలు, గనులు రెండిరటికీ హస్తిమసకాంతరం
అయినా నర్తనా తీరుల్లో మాత్రం నరనరాల్లో అంతస్తుల ఆకర్షణలు
కళ్ళు పైకెత్తి చూస్తే కనిపించేవన్నీ మెరుపులు ఉరుములు కావు
ఆర్ద్రతతో చూస్తే ఏది కనిపించినా శిఖల్లోని అంతర్గత కాంతులవుతాయి!

కవిత్వం ఒక్క అణువుకు సంబంధించినదే కాదు
కవిత్వం ఒక్క వస్తువుకే వేల్లాడే మనో యంత్రం కాదు
సూర్యుడు ఎక్కువ కాడు చంద్రుడు తక్కువ ఎంతమాత్రం కాడు
చరిత్ర గుణపాఠాల్ని తెలిపే జ్ఞానిముందు అడవి రూపంలో ఉంటుంది

ఇటీవలే నాతో సముద్రం సునామీ రూపంలో మాట్లాడిన గుర్తు
అపుడే కవిత్వం కూడా ఉవ్వెత్తున ఎగసి పడి నిలదీసింది
నాకు నేనే ఒక గూడును నిర్మించుకున్నాను.
ఋతువులైనా, న్యాయాన్ని నెలకొల్పే వ్యవస్థలయినా నాకు ఒకటే!

రవికిరణాలు నిరీక్షించే దశలో నాలో ఎన్నో కలలు ఆవిర్భవించాయి
మంచుకొండలు నన్ను నిశితంగా పరీక్షించాయి
రాత్రివేళ చంద్రరేఖల్ని చూస్తూ నక్షత్రాల నఖక్షతాలను విశదీకరించాయి
నిశ అంతర్దశలల్లో కనిపించే వెలుగు ముద్రలు నన్ను పూర్తిగా ఆవరించాయి

భూభాగం కొంత వరకే ఉన్నా కనిపించే దృశ్యాలు ఎన్నో
నిన్న రేగిన జడభారం వదిలి మనిషి జీవితం శక్తిమయం అవుతుంది కానీ
ప్రకృతి ఆకృతులన్నీ ఒక్కొక్కటీ విడదీసే సమయంలో సమాజం
నవ మానవ సంస్కృతీ సౌరంభాల మధ్య మనోజ్ఞమై పూస్తుంది

కలువ వికసించిందో లేదో కానీ వృక్షాలన్నీ తల నిమురుతూనే ఉంటాయి
ఆరోజు నాకింకా గుర్తుంది దట్టమైన అడవుల్లో నదిలో
నా శరీరమే కాదు నా మనసు కూడా ఎంతలా కొట్టుకుపోయిందో
ఊగుతున్న ప్రతి వృక్షం సంస్కృతి ప్రాకారాలమీద ఎంతగా ఆధారపడిరదో

ఒకటే ఇక్కడ మనం చర్చించవలసినది

విఘాతం ఏదయినా ఉంటే చెట్టుకు ఉంటుంది కానీ
కింద చల్లాచెదురైన గులకరాళ్లకు ఉండదు
సముద్ర ఆంతర్యం ఎరిగిన రాళ్ళు నిత్యం మనకు ఆటవస్తువులానే కనిపిస్తుంది.

ప్రవాహ వ్యధృతి పెరుగుతున్న కొద్దీ
భయానికి దులు బాధ్యత పెరగాలి!
నన్ను నా శరీరాన్ని తప్పించడం పెద్ద కష్టంకాదు
మరో శరీరాన్ని నడిచినంతమేర నడిపించి జీవితానివ్వడం ఎంతో అవసరం!

చరణాలు ఎన్ని ఉన్నా
ముఖంలో కనిపించే శరణాగతి లేకుంటే ఎలా?
ఎవరు? మీరెవరు? ఆశామతి దృక్కుల నడుమ ప్రసరించే
చేయిచాస్తూ నిలుస్తే అడుగులు పడతాయా?

పేదలకు తెలుసు ఆకాశం నుండి నేలగణం వరకు
జీర్ణవర్ణ కిరణాలకు మూలం వారేనని
ఎక్కడికో వెళ్ళి సూర్యకిరణాలను ఏరుకునే బదులు
ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న వీరికి ఎంతానందమో?
ఒక పక్షికి తెలిసినంత విశ్వం నిజంగా ఎవరికీ తెలియదు
ప్రవహించే నదులతో నడిచే గడ్డిపోచకున్నంత వేగం ఎవరికీ ఉండదు.
గాలి ఒంటరిది కాదు
ఎంతోమంది మృతజీవుల జీవాత్మలను మోస్తోంది

అందుకే ఒక్కోసారి భారంగా , ఒక్కోసారి మౌనంగా
దేని సమస్య దానిదే కానీ గాలి మాత్రం అందుకే భారం!
నీటితో కలిసిన విన్యాసం ఒకసారి ఒదిగి ఉంటుంది
ఇంటినుండి బయటకు పడగానే కనిపించకుండా దాక్కుంటుంది

జీవితంలో నిరీక్షణకు ఒక అర్థం ఉంటుంది
పలరించిన ప్రతిక్షణానికి ఏదో ఒక మిష ఉండితీరుతుంది
నేను నిద్రలేచేసరికి నాలో ఏదో భారం దాగిఉంటుంది
అవి అక్షరాలుగా మారి నిరీక్షణను తొలగించుకుంటుంది

ఎక్కడికి ప్రయాణించాలన్నా నా ముందు పక్షిలా వాలుతుంది
నువ్వుంటే నేను ఎక్కడికీ వెళ్ళలేనంటూనే నదిలా నడుస్తుంటాను
ఎన్నాళ్ళనుండి ఎదురుచూసానో నిన్ను నిన్నుగా చూడాలని
ఒక్క పాటతో నా గుండె అరలను తాకి ఏకంగా శిలగా మారిపోయావు

ఇన్ని రంగులా నీ శరీరానికి ఎవరు దిద్దారు తెలియలేదు
విఘాతం ఎరుగని అందమైన సమాధానానికి ప్రశ్న వేసుకోవాలి తప్పదు!
ఎవరు కనిపెట్టారోకానీ అద్దం మనిషిని మాయే చేస్తోంది
ఆవరణను ఒకేలా చూపుతుంది ఆనందాన్ని ఒకేలా చూపుతుంది

నడిచే మార్గాలన్నీ కనిపించాలంటే ఏమాత్రం వినిపించుకోదు

నిశ్శబ్దంగా తిరుగుతూ వీచే గాలిలా నాలో ఆవేదనే కనిపిస్తుంది
ఎక్కడుందీ ఏమరుపాటు? ఎందుకొస్తోంది ? ఎవరిని కాపలాకాస్తోంది?
రమ్మన్నా లేకున్నా నాలో అంతఃర్లీనంగా చేరిపోతోంది
మనసును మానవ సంస్కృతీ లోకాలను దాటించి తీసుకుని పోతోంది
నేనూరుకుంటానా? ఒక్కొక్క మిషకు ఒక్కో విషయాన్ని తెలిపీ మరీ చెబుతాను

నేను నడుస్తూనే ఉన్నాను
ఎదురుగా ఒక ఆడమనిషి పాపం !అడుక్కుంటూ
ఏం చేయను రూపాయి బిళ్లవేసాను.
దిగ్గున చూసి కళ్లతో చెప్పింది ఇందుకా ఇంత అందమైన మేకప్పు అని!

ఏం చేయను? విధి ఎంతలా ఉంటుందంటే ఒక్కోసారి
గుప్తదానాలు బయటకు బిలబిలా వచ్చేస్తాయి
గొప్పదానాలు గుండెల్లో నిలిచిపోతాయి
హృదయం లో షహనాయి వినిపించినట్లయింది మృదంగంతో తాళం వేస్తూ

దారికంటా కంఠం బాగోలేకపోయినా రాగం సాగుతోంది
నిలుచున్నచోటే మళ్ళీమళ్లీ ఊపందుకుంటోంది
ఒకరు పాట మరొకరు సాయం రెండూ వినడానికి భయంగా ఉంది
కానీ వారికి సాయం చేసేందుకు  దేహాన్ని దేవతలకు ఇచ్చేయాల్సిందే!

ప్రయాణం అంటే ఒక్కరికే సంబంధించినది కాలేదు
ఏ ప్రయాణం ఎవరితో చేయాలో నీకు తెలియజేయాలని తపించినా
జీవితంలో శతృవుతో చేయని ప్రయాణం ఎలా సాగుతుంది?
శతృవంటేనే మొలవని మొక్కలు కావచ్చు లేదా తలవలేని రెండు క్షణాలు కావచ్చు!

ఊరి పొలిమేర కనిపించే వృక్షాలన్నింటికి మాటలు రావు
కానీ సరదాగా ఉంటాను అంటే కాస్సేపు గాలికి కదులుతాయంతే!

అడగాలి నీ పేరేమిటి? నువ్వేం పండ్లు కాయిస్తావు?
నీ వేర్లలో బలమెంత? నీవున్న చోటుకు విలువెంతని?

కానీ అన్నింటికీ ఒకటే సమాధానం నాకు మాటలు రావని అంతే !
ముఖంపై కనిపించే చిరునవ్వుల కిరీటచ్ఛాయలు తోడుగా ఉండవనంతే!
మేం పోతేం ఎక్కడికయినాపోతాం! కొండలు, కోనలు, అడవులూ అన్నీ ఒకటే!
మరో పరివర్తనం ఆవిష్కృతం అయ్యేదాకా వ్యవస్థలన్నీ సమస్యలతో ఉంటాయంతే!

చెట్లతో మాట్లాడండి! బిందెడు నీళ్ళు అక్కర్లేదు చెంబుతో చాలు!
రాళ్ళతో పలకరించద్దు! కత్తితో కోసి బొమ్మలు వేయద్దు పాపం కదా?
కొండగుర్తులకు ఉపయోగించుకుంటూ కొమ్మల్ని నరికేయకండి
విషమ స్థానంలో విషయ పరిజ్ఞానం దిక్కుగా అడుగులు వేయనీయండి!

ఏ కాలమైనా మనిషికి మంచి చేయాలనే ఉండి మట్టితో కలిసిపోతుంది
ఏ ఈదురు గాలయినా నీనుంచి చెత్తను వేరుచేయాలనే సంకల్పంతోనే ఉంటుంది

ఏ వాన చినుకైనా ఎక్కడికక్కడ ఎండిన నేలను తడిపివేస్తుంది
ఏ వసంతం ఆనందాన్ని , శిశిరం ఆశీర్వచనాల్ని ఇస్తుంది!

ఆకు రాలింది అంటే మీ భాషలో మృత్యువు ఆవరించిదనే కదా?
కానీ ఆకురాలడం అంటే మరోచోట తన జీవితం ఎరువుగా మారడానికే
వాసనరాని శరీరం ఆకులది. నీకు తెలుసు ఎండిపోతుంది తప్ప మరేమీచేయదు
వెలుగు రెక్కలతో స్వేచ్ఛగా ఎగిరే హంసలన్నీ ఏకంగా కవిత్వాన్నే చుట్టుకుంటాయి

ఇంత జరుగుతుంటే మనిషెందుకు ప్రకృతిపై కోపం చూపుతాడు?
వానలంటే వానలని, ఎండలంటే ఎండలని, ఏ కాలానికి ఆకాలాన్ని
దూషించుకుంటూ చూపుతున్న ఆర్ద్ర వాతావరణంలో సంకేతం లేదు
మెరుపుల వానలో మాదారిలో మీరు రాకండి! మీలోనే మీరుండండి !
మేఘం ఒక తెల్లని పావురంలా వచ్చి రహస్యంగా నా చెంత చేరింది
బంగారు ఇసుకమీద మోపిన పాదానికి చిహ్నమై నిత్యం సృజనమైంది
విషాదం నుండి వివేకం వివేకం నుండి విషాదం మారుతుంటే
సూర్యుడికి ఎదురీదడం అంటే మనిషి బలాన్ని సంకోచించడమే!

హృదయం ఒక సింహాసనం
ప్రపంచం ఒక ఊయల
ప్రకృతి ఒక అమ్మ
సకల జీవరాసులు అన్నీ బిడ్డల స్వరూప స్వగతాలు!

ఈ హృదయంపై కూర్చుని పెట్టని కోటగోడలున్నా ఎక్కగల సామర్థ్యం ఉంటుంది
ఆ ఊయలపై కూర్చుంటే సమస్త ప్రపంచాన్ని ఏలగలిగేటంతటి ధైర్యం ఉంటుంది
అమ్మంటే కిరాతక చర్యలకు సైతం వంతపాడుతూ వడిలో జో కొడుతుంది
సకల జీవరాసులు జలచరాలు, పక్షులు అన్నీ అల్లరిచేస్తూ కాంతిలీనుతాయి

మట్టి అంటే మొక్కకే కాదు మనిషికి కూడా అనుబంధం ఉంది
నేలనుండి వచ్చిన మొక్క మట్టిని తాకకుండా రాదు
మట్టిలోనికి వెళ్ళే శరీరాణువులన్నీ వీణాతంత్రులై మనసును ఆహ్లాదపరుస్తుంది
ఏదయినా ఏమయినా జగతిలో నిర్మాణ రూపానికి సాక్ష్యమై నిలుస్తుంది

ఎగసిపడే కెరటాలలో తెలిసీ ఒక ఘోష
తెలియని ఒక ఘోష ఉండి తీరుతుంది
తెలిసీ తెలియని ఆవేదన ఉంటుంది
రాక్షసత్వంతో వెనుదిరగని కలలను అంతం చేస్తుంది

ఏమరుపాటు నీటికి ఉందని ఎందుఃజినుకుంటున్నావు?
గాలివాటుతనంలోనే ఏమరుపాటు ఉండదని తెలిసిన నీవు
ఆటవికం నుండి నాగరికం వరకు మనిషిలో సంస్కార తేజాలు పలకరిస్తాయి
రాత్రి అంటే వినువీథుల్లో తిరిగే ఆకారం లేని రూపమై సాక్షాత్కరిస్తుంది.

ప్రకృతి మనదేనని ఏనాడైనా అనుకున్నావా?
మరి కాలుష్యాల కటకటాల వెనుక ఎందుకు నెడుతున్నావు?

అందుకే గాలి దేవుడు నీ పాలిట మృత్యువై తరుముతున్నాడు
కాంతులకోసం వర్షం నీళ్లను మరచిన నీవైపే నడుస్తున్నాడు

నాకు సమయంలేదు ఆకాశంలో చుక్కలు లెక్క పెట్టడానికి
నాకు తరుణంలేదు నేలపై నిప్పురవ్వలు కనిపెట్టడానికి
నాకు ఆలోచనే లేదు నీకున్న రంగులన్నీ నావిగా మార్చుకోవడానికి
నాకు ఆవేదన అసలే లేదు నువ్వే ఎంచుకున్నావని తెలపడానికి

వందల రాత్రులు, వేల వేల క్షణాలు, వెరసి మనిషిని మార్చాయా?
లేదే? పుట్టుకలో ఉండే గుణాలు మారవని చెప్పే దశకు చేర్చాయి
బంగారుజింకల వేటలో పరుగులు తీసే నీకోసం కుక్క తేవడం వృధా!
అవును నిజంగా సమయంలేదు నాకు శూన్యం చెప్పిన మాట నిజమే!

ఎంత చేసినా ఒక విధంగా మనం బయటపడ్డవారం!
ఎవరు తీక్షణతకు ఈ ధనుస్సు ఎక్కు పెట్టబడిరదో
ఎవరి ఛిద్రమైన సంగీతం వింటూ ఈ కాలం వృధాచేయబడిరదో కానీ
ఈ నక్షత్ర శాలకు మట్టిలో పూడ్చడానికి సిద్ధమయ్యాము

సూర్యుడు ఒకడే! నేల ఒకటే! జీవితం ఒకటే
ప్రేమ ఒకటే !ఆత్మీయత అనురాగం అన్నీ అన్నీ ఒకటే ఒక్కటే
అలాగని సూర్యుడిని ఇంటికి తెచ్చుకోగలమా?
కాదని నక్షత్రాలను ఒక్కగూటికి చేర్చగలమా?
కాదు కానే కాదు ! భయం ఒక జబ్బులా వెంటాడుతున్నంతకాలం
ఆశ ఒక జాడ్యమై ప్రవహిస్తున్నంతకాలం మనం మనమే! అంతే!
ఆటవికం నుండి నాగరికం వరకు మనం సాధించింది ఏమీలేదు
సంస్కార బీజాలు వేసి మొలకలొస్తుంటే చూద్దామనే ఆశలేదు!

ఘనమైన సృష్టి ఇది ఖచ్చితంగా గగనాన్ని మేల్కొలుపుతుంది
నిజమైన దృష్టి ఇది వాస్తవమైన మనసుల్ని తట్టి పలకరిస్తుంది
జనంలో మతం లేదు మతాధికారులు మాత్రం హాజరుపట్టీలో
మొదటివరుసలో ఉంటారు సమజాన్ని నడుపుతూ నడుతానని మాటిస్తూ!

ఆలయంలో దీపం చీకటిలో మరింతగా కాంతిలీనుతుంది
సవరిస్తూ, స్మరిస్తూ, నిర్మిస్తూ , నిర్మితమవుతూ మనిషి బలం అక్కడే ఉంటుంది
మట్టి కుండలో మొక్క వేస్తే మొక్క ఎంతగా ఆనందిస్తుందో
మనిషిలో నవ జీవన పునాదులు తవ్వుతుంటే ఎంత ఆదరణ వస్తుందో

రాత్రి డాబాపై నడుస్తుంటే నక్షత్రం నన్ను చూసి నవ్వుతోంది
నువ్వు నాకు నక్షత్రంలా కనిపిస్తున్నావని
స్థానాల్లో మార్పులేదు. ప్రతిష్ఠాపనకు హక్కులేదు
మన చేతుల్ని తనకు తన చేతుల్ని మనకు అందించడంలో జాప్యం అంతే!

స్వాగతించబడిన నల్లటి ఆకాశం
అన్నింటిని తుడిచిపెట్టుకున్నట్లే ఉంటుంది కానీ

కనబడని కళ్ళుంటాయి కనిపిస్తూ రెండు చూపులుంటాయి
ఇంత చేసి మనకు కనిపించే వాటికి రెండు ముక్కులుంటాయి జాగ్రత్త!

ఓ అతిధీ!
ప్రపంచానికి నీతో పాటు అందరూ అతిధులే !
మనిషి మాత్రం ప్రత్యేకమైన ఆత్మీయం! అలా ఉండిపోనివ్వండి!
ఓ మానవాకారాల్లారా! ఇంకా గాలిలోనే మనం ఉన్నామని మరచిపోకండి

సూర్యుడు చంద్రుడు, ఇంట్లో పొయ్యి, దేవుడి దీపం
అన్నీ ఒకటే అని ఎలా అనుకుంటాము చెప్పండి!
ఒక్కో కాంతికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది
దేవునికి దీపం స్థానం అటుంచితే ఇంట్లో పొయ్యి స్థానమెంత?

సూర్యచంద్రులు సృష్టికి వారసులు
దేవునికి దీపం సృష్టిని మేల్కొలిపేందుకు వెలిగించే కాంతి
మరి బతకడానికి పట్టెడన్నం అనే తీరులో
ఇంట్లో పొయ్యి ఉండాలే తప్ప ఆకలికి ఉండితీరాలనే సమస్యలేదు!

మట్టిని మట్టితో పలకరింపుకు సిద్ధం చేస్తే ఏముంటుంది
పిచ్చి నిశ్శబ్దం తప్ప!  నిన్ను నిలదీస్తున్నాను నా జీవితం ఏది?
చనిపోయే ప్రాణాలన్నీ ఎక్కడికి నిన్నడకుండా వెళ్లవు కదా?
నువ్వయినా చెప్పు ఎందుకు వెళుతున్నాయి? ఎక్కడుంటున్నాయి?

నేలను నాకు ఇచ్చేటంతగా మాట్లాడిరది మట్టి కొంత సేపు
నాకు ఏవీ వద్దులేమ్మా ఆరుడుగులు కూడా అక్కర్లేని పోరాటం నాది
నన్ను నమ్ముకున్న బిడ్డలకు మాత్రం నిలవడానికి స్థానమివ్వు!
ఆశలను అడియాసలు చేస్తూ విషయలాలనను సేకరించే నిందితుడవు నువ్వు

నాకోసమే పుట్టిన ఒక పూలతీగె
తుమ్మజిగురులా నా మనసుకు హత్తుకుపోతుంది
నా మాటల్ని మూటలు చుట్టి నన్ను నడినెత్తివీాదికి తీసుకుపొమ్మని
మారాం చేస్తూ చేస్తూ నన్ను నాతోనే ఉండనిస్తుంది! బావుంది!

ప్రతి స్థానానికి రెండు గుండెలుంటాయి!
నిజమైన స్థానానికి నాలుగు కళ్లుంటాయి !
ఆత్మీయతను చూపడానికి రెండు ముఖాలుంటాయి
అదేం పాపమో! నిజం చెప్పడానికి ముందు రెండు నాలుకలుంటాయి!

ఇక్కడకొచ్చి నన్న ప్రశ్నించండి !
ద్వేషం కోపం, కలగలిపిన ఒక వింత పదార్థంతో మాట్లాడకండి!
అడ్డంలేకుండా, ఆవేశంలేకుండా ఆనందానికి మరోపేరును తోడ్కొనిరండి
ఉన్న మాటను, అన్నమాటను జతచేసి నాకు కానుకగా ఇవ్వండి!

ఓ వృక్షరాజుల్లారా!

నా ఒక్క మాట వినితీరాలి!
నీడను ఇస్తున్నంతవరకు మీ పని బావుంది
కానీ మీ ఉనికిని ఖననం చేస్తుంటే మాత్రం కొమ్మలను కొమ్ముల్లా వాడండి!

సమావేశం ముగిసింది!
ఇక మీ నిర్ణయం మీది! ఆచరణ మీది!
క్షణక్షణం సేదదీరే విషయాంచలంలో కనిపించే పేరు మీది
భూసముద్రాల మధ్య చీలికలు పడ్డప్పుడు తలెత్తాల్సిన స్థానం మీది!

నా మనసుని మెలిపెట్టి మరీ మీతో మాట్లాడుతున్నాను
సంవత్సరాల తరబడి మీకు ఎదురయ్యే దుస్థితిని గూర్చి చర్చిస్తున్నాను
ఏదయితేనేం మనం మనం ఒకటే కదా?
మీకు నష్టం కలిగితే మొదటగా నష్టపోయేది మేమే కదా?

నీ పరిధిలో ఒక ఉనికి కావాలి మరి!
నోరు విప్పనపుడు నీకేం దొరుకుతుంది  నామది ?
నీలాగే నాకూ నిద్రపోవాలనే ఉంది కానీ
తప్పదు నా ఊజినురెప్పలకు పని ఎక్కువ !

అంతర్గతంగా అక్షరాన్ని నాలోనే చూసుకుంటున్నాను
నా ఉత్సాహమంతా ఊపిరిగా మార్చి నీకిద్దామనుకుంటున్నాను
తీసుకుంటావా? లేక తీసుకోవడానికి కూడా ఆలోచిస్తూ ఉండిపోతావా?
నేను అనే పదాన్ని ఇంటివెనుక కాలువలో తొక్కి నీలోనే కలిసిపోతాను

ఇవన్నీ ఒక విచిత్రమైన క్షణాలు
వీటిని వేడిచేస్తే వచ్చేవి మానవ కణాల సంబంధిత ఆలోచనలు
లేపనంలా పూయాల్సిన ఆ క్షణాలను వేడిచేసి
గాయపడిన గుండెకు పూస్తే త్వరగా కోలుకుంటారేమో పాపం!

మనల్ని మనం ఎపుడూ అర్థం చేసుకోలేము
ఎవరు ఏమన్నా సరే మనల్ని మనమే తిట్టుకుంటాం!
ఇక మనం వేరొక మనిషిని, చెట్టును, కొమ్మను ఎలా అర్థం చేసుకుంటాం?
పరిశుద్ధ వస్త్రాలను ధరించిన మనం శుభ్రంగా ఉన్నామనుకుంటే ఎలా?

నేను, నేను కోరుకున్నది మారణాయుధాలు కావు
పూర్తి సోమరితనమా అంటే అదీ కాదు
బతుకంటే బతకడమే లేదా బతికించడమే కదా?
కనిపించని పచ్చిక మైదానాల్లో విహరించడమే కదా?

ఇపుడు ఆకాశం చూస్తున్నాను.
చిక్కని చీకటి తప్పమరేమీ కనిపించడంలేదు
ఏమయింది ఏమయింది అని విసిగించకండి!
అందులోని ఆంతర్యంతో ఆత్మతో ఎంతగా ముడిపడిఉందో తెలుసుకుంటాను

ఎవరన్నారు వారు పోయారని?
మనసులో లేకుంటే వారు పోయినట్లేనా? కాదే
శరీరం ఉంటే ఉన్న ట్లే శరీరం శాశ్వతంగా ఉన్నా పోయినట్లే అంటే ఎలా?
కాలుతున్న కాగడాల్లా వెలుగుతుంటే జీవంతోనే ఉన్నానంటే ఎలా?

యుద్ధాలు మనోకోటకు కాపలా కాస్తున్నాయి
నీదని నాదని మాటల మధ్య మనదనే మాట పహారా కాస్తోంది
ఏది ఎవరిది? ఎక్కడ్నించి తెచ్చుకున్నారని ప్రశ్నిస్తే నీడలు ముందుకొస్తున్నాయి
రాగి రంగు జీవితాలకు రంగుల కుంపట్లు వేడిచేస్తున్నాయి

నేనెప్పుడూ ఒకటి రెండ్లకు దూరమే!
ఏ ఒక్క లెక్కను చూపినా నాలుగంకెల దూరంలోనే ఉంటాను
ఇసుక రేణువుల్ని లెక్కించడంలో అక్కడే ఓడిపోయాను
గాలి ఎన్నిసార్లు నన్ను పలకరించిందో అనే విషయం మరిచిపోయాను

రెండు వత్సరాల యాత్రలో నేను నేనుగానే ఉన్నానుసరే
ఒక్కసారి కూడా కడుపు నిండా తినడానికి
నీ విలువైన జీవితం వెచ్చించకుంటే నువ్వు కొన్న మానవీయత
నిన్ను నిన్నుగా నిలబెడతాయనడంలో ఎంత నిజం?

కొండలనుండి దిగుతున్నపుడు రవి పక్కనే ఉన్నట్లు అనిపించింది
అదే ఎక్కుతున్నపుడు అంతే నిగ్రహం కోల్పోలేదు
నేను నిశ్శబ్దంగానే ప్రయాణించేను కానీ నన్ను అనుసరించే కలలు
నా దారంతా పరుచుకోవడమే కాకుండా భయపెట్టేయి కూడా !

కాలం నాదికాదని నీదికాదని అనుకుంటాం కానీ
కాలమేంటి ఏదయినా అనుకుంటే నాదే! నీదే!
వేలమంది ఉదయకిరణాలను తాకుతూ నడుస్తూ అదృష్టాన్ని పరీక్షించుకుంటే
నిర్మానుష్యమైన నిర్జనమైన ప్రాంతాలమీద ఖచ్చితంగా కనిపిస్తుంది!

కలత పరిచే కలలన్నీ నా జీవితమంతా పరుచుకున్నాయి
మృదువైన మానవతీత కూనిరాగం శరీరాన్ని ఆవరించుకుంది
పచ్చని బొట్టు పెట్టిన ప్రతి సూర్యాస్తమయం మనకు వర్తించదు
ఉప్పొంగే ఉత్తర దక్షిణ ధృవాల ఆనందాలు మనదాకా రానంది

నేను నిలుచున్న చోటునుంచే ఒక స్వప్నాన్ని పంపుదామనుకున్నాను
నేను నడిచే దారి నుండే ఒక వాస్తవాన్ని చూపుదామనుకున్నాను
ఏ పలకరింపయినా మృదువుగా ఉంటేనే మిగులుతుంది
గులకరాళ్ళ చందం అయితే మాత్రం నన్నునాతో మిగుల్చుతుంది

ఎగసి పడుతున్న ఇసుక తుఫాను నాకోసం ఏమీ చేయలేదు
కంటిలో పడిన నలుసులా కనిపిస్తే మాత్రం వినిపించుకోనీయలేదు
లోలోపలి అధికారం అనధికారాల స్వభావాల స్వరూపాల
ఇంకా ఇంకా ఎగిరిపడుతూ పడుతూ లేస్తూ చేస్తున్న లీల!

ఈ రోజు ఎందుకో సూర్యచంద్రుల సమ్మెట
ఎందుకూ అంటే ఎలా అవి అలిసిపోవా ఏంటి అనుకుంటూ
ఒక చిలిపి వృక్షమొకటి పలకరించి ఉత్పత్తి వేగం పెంచింది
కిరణ ప్రాసారాలన్నింటిని ముందుగా ఆపేయాలని ఆశించింది

ఒక బల్ల, ఒక కాఫీ కప్పు!
ఒక పెన్ను! ఒక ఇంకుసీసా!
ఇవేవీ లేకుంటే కాగితం పెన్సిలు చాలేమో
సృష్టి చిత్రం గీయడానికి!

కానీ అది తప్పు! సృష్టి చిత్రం గీయడానికి
ఒక పెన్సిలు లేదా పెన్ను లేదా పేపర్ ఉంటే చాలదు
మనసుండాలి. మనుషులపై ఇంగితం ఉండాలి
మనదై ఉండాలి ! అన్నీ మనకోసమే అన్నట్లుండాలి

అదే మరి! ఉప్పేకదా అని ఊరుకుంటే
మన నాలుకపైనే నర్తించి మాటిమాటికీ నీరు తాగే అవసరాన్ని కలిపిస్తుంది
అసలు నిజం ఏమిటంటే
కనిపించని గాయాల గుర్తులు వృద్ధాప్యంలో బయటపడతాయి

భృకుటి ముడిపడిన ముఖాలన్నీ
ప్రకృతి నాకేమిచ్చిందనే! ధిక్కరించి కళ్ళుమూసుకుని నడవటమా
లేక కళ్ళుతెరుచుకుని మరీ నన్ను నన్నుగా సాక్షాత్కరించడమా అనేది
సిసలైన స్వేచ్ఛగా పలికే పదాలకు పెదాలు మూలపడతాయి

నేను ఆకు పచ్చని చెట్టుకోసం తపించే పసుపు పచ్చని వృక్షాన్ని
గాజుముక్కలాంటి గగనానికి అంతస్స్వహారాన్ని
చీకటి వెలుగుల అంతఃసౌందర్యంలో కనిపించే స్పష్టతను
కవిత్వంలో కనిపించే దేహాలను సరిచూసుకుంటూ నడిచే మిశ్రమదృశ్యాన్ని !

ఆగు అక్కడ! నేను నీ వెంటనే ఉన్నానుగా!
అంటున్న నిముషాలన్నీ విరామచిహ్నాల్లో అనుసరిస్తాయి
ఆకులా ఉన్నావంటే చులకనవుతావా?
అసలు ఆకుకు మించిన అంతస్తు ఏముందని?

నాకోసం నేనే జీవించే క్షణాల్లో నేనుండేది చాలా తక్కువ!
జీవితమంతా నువ్వే నిండిపోయినపుడు నా పనికిరాని అంతర్గతాన్ని
బహిర్గితం చేసి చూసేవాడు ఎప్పటికీ పిచ్చివాడు కాడు కేవలం మనిషి
నీ ముందు నేనొక అనాలోచిత శకలాన్ని , ఆగ్రహం వలదు
పెదవులపై కనిపించని విరుపును చూస్తే పక్షులు కూడా వాలవు.

అసలు ఏ వృక్షమూ తన నీడను దాచుకోదు
ఏ సముద్రమూ తన నీటిని పారపోసుకోదు

ఏ నదీ, ఏ సరస్సు తనలోని అమృతాన్ని తానే అనుభవించదు
తప్పదు! వీటన్నిటినీ శరీరంతో పాటే వదిలేయాలి అంతే!

సాధారణం అంటే అసాధారణమైన స్మృతిపథమని ఇపుడే తెలిసింది
నిద్రపోతుంటే కూడా పులికళ్ళు మిల మిలా మెరిసే నక్షత్రాల్లానే ఉంటాయి
అస్త్రాలు ఎన్నయినా సరే ! దూసుకుపోతుంటే ఆపే ప్రయత్నం ఎక్కడిది?
కెరటాలన్నీ తనకు లోబడే ఉన్నాయనుకుంటే తీరం తీరు ఏపాటిది?

జాంపండులా కనిపించే భానుడు రాను రాను ఆపిల్‌లా తయారవుతాడు
మైదానానికి నాలుగువైపులా పదునే అని పరుగులు తీద్దామనుకుంటాడు
దిశదిశకు జారిన ఉదయం పాతదే కానీ చరిత్ర మాత్రం ఎప్పటికీ నలగదు
ముఖానికి కనిపించే దిశ ఒకటే ఉంటుంది కానీ వెనకుండే బింబం నిలవదు

తూర్పు దిక్కున చూపిన పగటి మంటలన్నీ
శాంతిగా ఉండాలంటే మనిషికి తప్పని సరిగా దిశానిర్దేశాలు అవసరం!
భరించలేని కిరణం ఏ పచ్చని చెట్టుకిందో కూర్చుంటే చెట్టేంకావాలి?
ఉపయోగం ఉండేంతవరకు అద్దం దాచి పెట్టే ఉంచాలి!

నాలుగు కూడళ్ళ మధ్యలో ఒక సందేహం కలుగుతోంది
అనుభూతి ఆవిష్కరణలకు , అనుగ్రహ గోపురాలకు తేడా వేదాంతమా? అని!
ఈ లోపల జరిగే హింసా అహింసల ఘాతుకాలకు అర్థం నిశ్శబ్దమేనని!
అపాయ ముద్రలో ఎదురీదే జీవితాలకు రెక్కలు అవసరమా అని!

నీకేమి తెలుసునని నా గురించి మాట్లాడుతున్నావు?
కేవలం రంగుపొరలను అనుసరించి లోలోన మండితే సరిపోతుందా?
విచిత్రంగా తొలి సంధ్యలో పూర్వరంగంలా వికసించే ఉషస్సు ఉంటుందా?
మనిషి తనకున్న స్థితిని అనుసరించి పునరావృతం చేయడం బావుంటుందా?

తెరలంటే ఇనప తెరలు కావు!
మాటలంటే పెదవులతో పలికేవి కావు
హృదయాంతరాలలో కాస్త వెలుగుంటే సరిపోతుందా?
నీడ మీదున్న అనుమానంతో వద్దంటే పారిపోతుందా?

నీవు చూస్తున్న మార్పులన్నీ ఒక గడియకు కట్టేయడం కుదరదు
నిజమైన సారాన్ని గ్రహించి కనిపెట్టగలిగేదే బహిరంగం అవుతుంది
మూడో ప్రపంచమయినా , సంసార సాగరమైనా ఏదయినా
ఏమయినా సరే వాటి ఆనవాళ్ళు శిథిలాలు తప్ప వేరెవరూ చెప్పలేరు.

నేను నిలుచుండే చోటలో రెక్కలు చాలా అవసరం!
ఎగిరిపోయేందుకు నాకు తోడు పక్షులు కావాలి!
ఈ లోగా ఏదైనా హింస ముక్కలైతే గుండె పగిలిపోవచ్చు!
అపాయ ముద్రలో దాగున్న జీవితాలకు అద్యంతమూ ఒక శిక్ష!

వేచి వేచి చూసే ఈ కళ్ళకు ఏమీ తెలియదు

చిరునవ్వుతో పగిలిన ఆయుధాలకు స్పర్శ ఉండదు
జీవితాలకు తీరని భూములు రెండే ఒకటి భయం! ఒకటి అబద్ధం!
తీరానికి బాటలు వేసే ముందు ఎదురయ్యే శిల్పాలు ప్రస్థానంలో శిఖరం!

చెట్టుకింద పిల్లలు ఆడుకునే గోళీల ఆటలో జీవితం ఉంది
అనుభవంతో గమన మారే ఆటలన్నీ జీవితానికి అనుసంధానాలే!
హృదయలోయపై కనిపించే మానవతా సుందరి ఈ యుగమే!
ఎడారిని అరచేతిలో దాచుకుంటే కనిపించేది లేడిపిల్ల పరుగే!

గట్టుపై పిట్ట, గుండెపై పిల్ల! రెండూ ఉండవు
పిట్ట ఎగిరిపోతుంది! పిల్ల కదిలిపోతుంది!
ఎవరొస్తేనేం కాళ్లకింద మంటలు రగిలినట్లే!
ఎగిరే పిట్ట కదిలే పిల్ల నీవారే అనుకోవడం అప్రస్తుతం కాదు!

పొద్దుపొడిచే ముఖంలో కనిపించేవన్నీ ఆవలింపు దృశ్యాలే!
దొంగల భయముతోనో, పాముల భయంతోనో
చుట్టూ ఏ నీడా నీ వెలుగుకు చేరువ అవ్వదు
ముళ్ళుండచ్చు! దారిలో శిలలుండచ్చు! మొత్తంమీద అందరూ అపరిచితులే!

చంద్రుడు మెల్లగా వచ్చి ఎక్కడ అందరూ
ఆక్రమించుకుంటారో అని చెట్టు వెనుక దాక్కుంటాడు
ఆకుల అల్లరి చేయడం మానుతాయా? మాటవింటాయా
ఒకదానినొకటి తోసుకుంటాయి! చందమామను చూపేస్తాయి!

చెట్టు ఎన్నిసార్లు భయం పెడుతుందో కానీ
వినవు కదా పైగా మాటలను ఒక చేతలో పెట్టి ఊరుకుంటుంది!
నిద్రపొమ్మని నిత్యం పోరుతూనే ఉంటుంది
వింటాయా? పక్షులు పడుకున్నాయంటే వింటాయా?
పూలు ఎవరికీ కనిపించకుండా తనలో తాను మురిసిపోతుంటాయి
అవన్నీ కోసి పుష్పవిలాపంలో అన్నట్లు ఉరివేసి మరీ ద్వారానికో
దేవుని పాదాలకో, పడతి సిగలోకో రాతను బట్టి చేరిపోతుంది
అందినంతవరకు ఆనందంగానే లేకుంటేనే ఈ ఆవేదనంతా!

ఉన్నవాడు తన భవనంలో వెచ్చని ఊలు మధ్య నిదురిస్తాడు
లేనివాడు ఏకంగా ఆకాశాన్నే కప్పుకుంటాడు
ఉండీ లేనివాడు అటు దుప్పటికీ కాక, ఆకాశానికి కాక
శూన్యంలోకి చేరి సమాజ చలనానికి పాత్రుడవుతాడు!

ఇంద్రధనుసు వానరాకడను సూచించి
ఆకాశపు కొయ్యకు వేల్లాడుతుంది
ప్రశ్నలోనే సమాధానాలున్నాయని గ్రహించి
హృదయాకాశంలోనే ఉషస్సును సూచిస్తుంది!

అనుకుంటాం కానీ మనిషే కాదు మనసుకూడా ఒకప్రశ్నే!

ఒక్క ఆలోచనే కాదు ఏకంగా ఆనాలోచన కూడా ప్రశ్నే!
చరిత్రకు మరుపున్నంతవరకు భూమి తిరుగుతూనే ఉంటుంది
మరుపులేక తెలివివిమారిందా అంతే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది!

సంకల్పం పరిణామదశను దాటి
అనేకానేక శక్తుల్ని సంపాదించుకుంటుంది
వయోక్తిక అజ్ఞానం అనంతంగా మిగిలే ఉంటుంది
మధుధార సాగినంతకాలం శుభ ప్రదంగానే సాగిపోతుంది

వీడలేని భూమికి దగ్గరగా చేరి నింగిని హేళన చేస్తుంది
ఎంత విశాలమైన ప్రపంచమయినా పెన్సిల్‌తో వేస్తే చిన్నదవుతుంది
మంచు అద్దిన శిల్పాలన్నీ అలానే ఉండిపోవు
మెరుపులు కనబడని ఘర్జనలన్నీ మరీ మరీ పునరావృతం కాలేవు!

గగనానికి నేలపై ప్రేమ
నేలకు ప్రకృతిపై, నింగిపై ప్రేమ
ప్రకృతికి ప్రాణులపై ప్రేమ
ప్రాణులకు మళ్ళీ మనుషులంటేనే ప్రేమ

ఈ ప్రేమామృతం ఒక్కనాటిది కాదు
కాదనుకుంటే వదిలిపోయేది కాదు
కావాలనుకుంటే పరుగులు తీస్తూ వచ్చేది కాదు
బింబ ప్రతిబింబాల నడుమ సాగిపోయే తత్వంతో పోల్చుకునేది కాదు

పసితనం నుండి పనితనం వరకు జారిపోయే
జ్ఞాపకాల బుట్ట నగిషీలతో ద్విగుణీకృతం అయిఉంటుంది
తనకే తెలియకుండా శరీరాలన్నీ అర్థంలేని నౌకనే ఆనుకుంటుంది
ఎక్కడికక్కడ నౌకాపరివారమంతా జగత్తుకు కానుకగా ఇస్తుంది

రంగు తెలియని రీతిలో శక్తులన్నీ ఒక పేక మేడల తీరు
ఆకలి, దారిద్ర్యం ఆశ, నిరాశలన్నింటినీ పయనింపజేసే తీరు
మనిషికి నగరాల మధ్య నయగారాలు ఆశా విహంగం కాకుంటే
తప్పక రూపాదితరం చెందుతుంది. ఎన్నో విధాలుగా జీవితం నడుచుకుంటుంది

నదుల పరంపర ఏనాటిదైనా ప్రకృతి ప్రసాదమే!
సముద్రాల పుట్టుక శతాబ్దాలనాటిదయినా చలన సంగీతమే!
సృష్టికర్త చెమట బిందువు మానవ సమూహం!
గణాలతో సమూహాలతో సమాజం పరిధి తరగని ఆయుధం!

రైతు పిడికిట్లో ప్రపంచ జీవనం దాగుంది
పంటలేసే విత్తనాలలో జీవిత సత్యం వెల్లివిరిసింది
వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలన్నీ కడుపు సంపదలు
నేలమాత్రం మానవ శరీర సంపదే!
ఒక్కొక్కరిలో ఏకాంతం ఎందుకుంటుంది అనుకుంటే

ఎందుకుంటుందో అది వారికే తెలుస్తుంది!
ఒక దిశను ఎంచుకునే దారి ఉంది. దారి తప్పితే ప్రమాదముంది
గణాంకాలతో తేల్చుకుందామంటే కాస్త తాత్సారం ఉంది

ఈ రోజులన్నీ నా పుట్టుకకు తొడిగిన నగలు!
ఒకరోజు కాదు రెండు కాదు ఏకంగా ఇన్ని వేల రోజులు
నా జీవితానికి ఆ భగవంతుడు ప్రసాదించిన ప్రాకరాలు!
యాత్రలో క్షణాలు మనసులో గంటలు రోజులు ఇపుడు అక్షరాలు!

కొండలన్నీ నాతో నిత్యం పలకరింతల వెల్లువలో ముంచేస్తాయి
ఒక్కోసారి గంభీరంగా తన పని తాను చేసుకుంటున్నట్లుంటాయి
ఏమయిందని ఆరాతీస్తే ఇల్లు కట్టుకోవాలంటే నన్ను ముక్కలు చేయాలా?
మీరు జీవించడానికి మా జీవితానికి పునాదులు తవ్వాలా ? ఏకరువు పెట్టింది!

తలమీద నుండి బరువంతా తీరినట్లయింది!
మరో తలపై కిరీలం పెట్టినట్లయి తేలికగా ఉంది
దేశం తలపై కిరీటం మన జెండా అయితే
దేహానికి తలకు మెప్పుకోలు వందనం నింగికెగసింది!

ఒక చోట నీటితో నిండిపోయి ప్రాణాలే పోయాయి
మరోచోట ఎండకు ఎండిపోయాయి
మరోచోట తిండికిలేక ఆకలితో ఉండిపోయాయి
చేతులుంటే ఏదయినా తినొచ్చు చేతలుంటే ఎక్కడున్నా బతకచ్చు!

కృషిని సుభిక్షం చేసే మొదటి ప్రయాణ దశలోనే
నిరసన బిందువులై వాలచ్చు! వెల్లువై కానరావచ్చు!
ఆహారం విషయంలో నేను మొదటి ముద్దనయితే
ఆహార్యం విషయంలో ఆనందంతో శక్తి యుక్తులు కలవచ్చు!

కష్టమొస్తే మనిషి దేవుని పాదాలపై మోకరిల్లుతాడు
ఎన్ని ఆపదలు వస్తే ఒక మనిషిని తప్పనిసరిగా నమ్ముతాడు
పలకరిస్తే కలిగే ఆనందం  ఊరికే పోతే ఉంటుందా
కాదని దూరం జరిగినంతమాత్రాన వికార ముఖాల్ని చూపుతాడు!

ఆశ్రమం అంటే నిదానంగా కూర్చుని ఉండే స్థలం కాదు
ఆయువు ఉంటే ఎవరూ ఎవరేమి చెప్పినా నిలిచే ప్రయాణం కాదు!
వ్యూహరచనలో జీవితను వర్తనలో రెండిరటి ప్రాణం అర్థం కాదు
శిలల వలె ఘనిభవిస్తే నిజాన్ని కాపుకాసే సమయంలో కనబడదు.

శైల శిఖరాల మీద ముఖాల్ని గుర్తించే యత్నంలో గెలవలేము
హిమగిరిని దాశే బావి గిలకలాంటి బాధల్లో తరతరాలను అనుసరించలేము
వ్యూహరచనల్లో తలపైని కిరీటం నేలజారితే
ఒక్క,రోజు పత్రిక మనదౌతుంది. మాట మనగురించే అవుతుంది

దిక్కులేని పక్షులు పదచిహ్నాలై నిలవాలనుకుంటే ఎంత కష్టం
మస్తిష్క యుగంలో కనిపించీ కనిపించని సంపద అంత ఇష్టం
ఉదయం కాంతి పుంజాలు విహరించడం ప్రారంభమైనప్పటినుండి
గతంలోని భౌతిక శక్తులు అంతరించడం ప్రారంభమవుతాయి!
అనుకోకుండా ఎవరో నాపై రాయి విసిరారు
కాలితో తన్నినా లేకున్నా ఆరాయి మాత్రం నాకు నచ్చింది
నిజం! ప్రపంచంలో విలువైనది రాయి! అది భద్రంగా నాతోనే ఉంది
అది ఏకంగా నా చేతిలో కలమైంది . నా కల నెరవేరింది!

చిల్లిపడుతుందని ముందుగానే కుండలో
నీరు పోయను అంటే ఎంతటి హాస్యాస్పదం?
పడినా సరే పడనీయకుండా చేయాలనే సంకల్పం
మనల్ని విడిచి దూరంగా నెట్టివేయబడటం సేచనం!

భిన్న స్వరాలు, విభిన్న ఆలోచనలు అన్నీ కలగలిపిన
ఈ ప్రపంచం సహస్ర కర పంక్తులకు అంకితమవుతుంది
శూన్యానికి భావం జతచేసినట్లు శ్రమను స్వప్నానికి అంకితం చేస్తుంది
మనిషి జీవితానికి తప్ప దేనికీ పనికిరాడు కాకుంటే తల పండుతుంది

ప్రపంచానికి స్వాతంత్ర్యం లేదు రాలేదు
సృష్టికి స్వాతంత్ర్యం ఏనాడో ఉన్నా సరే నిలవలేదు
వ్యక్తిగత స్వాతంత్ర్యం హరితమై, సదృశ్యమై కనిపించడంలేదు
ఒకప్పుడు బంధువైన నేను నేడు రహస్యాలకు ప్రతినిధినయ్యాను అంటే ఆశ్చర్యమే!

గరికను చేతిలోకి తీసుకుని వినాయకుని పూజ అయిందంటే
ఎలా తెలుస్తుంది నిన్న కనుమరుగైన శాంతి సుమింపజేస్తుంది
ఎక్కడో సుదూర తీరాలలో హిమం ప్రవహిస్తూంటే
ఏకంగా నీడను తోసే రోజుల్లోనే అడవి సాక్షాత్కరిస్తుంది!

వెలుగు ఎవరినుండి ఏమీ ఆశించదు!
వెన్నెల ఎవరికీ కాకుండా పోదు
మంచు వర్షం అందరికీ సమానమే!
కాకుంటే రాత్రి పగలు మాత్రం రెండు భాగాలు

దేహంపై గాయాలు చల్లని గాలికి రెండిరతలయ్యాయి
మనిషి శరీరానికి విశ్రాంతి అనేది ఒక్క వంతు మాత్రమే
పుట్టినప్పటినుండి ఎదురయ్యే ఒక్కో తలుపూ తలంపుగా
తలవంపుగా మారుతుంటే బతికే దారిలో ప్రతీదీ భ్రమరనాదమే!

వుంటాము . బతికే ఉంటాము ఎంతకాలం?
రక్తంలో ఆటంకం కలిగించనంతవరకు
సమస్యలు హృదయానికి అంకితం కానంతవరకు
క్షితిజం ఒకచేతిలో సూర్యోదయమైతే మరో చేయి ఎపుడూ ఖాళీసంచే!

బతుకంతా పూల బంతుల మధ్య గడుస్తోందని అనుకుంటే పొరపాటే!
పూబంతుల నడుమ కూడా పురుగు నడుస్తుంటుంది.
చెట్ల అంచుల నడుమ నడుస్తుంటే పాములు అనుసరిస్తాయి
మనుషుల వెంట కాలాన్ని నడిపిస్తుంటే భ్రాంతుల మధ్య అనేది గ్రహపాటే!

ఆలయానికి ఇరువైపులా శక్తివంచనలేకుండా చెల్లే!
పలకరించి నీళ్ళు చిలకరిస్తే వృక్షాలవుతాయి
అవ్వగానే పెద్దమనిషి అయినట్లు దాని చుట్టూ తాయత్తులు
గమ్మత్తులు చేస్తుంటే ఇక గ్రహాల మాటేమిటి?

కొత్త దారులను అనుసరించి మీరు సంతోషించండి
లేకుంటే పాతదారులను సరిచేయండి!
అయినంతవరకు భవిష్యత్తును కంచెలు తీసేయండి
కాకుంటే దారిలో మోత రాకుండా అపాయాన్ని తెలియజేయండి!

ఉన్నట్లుండి బాల్యం మీదికి కలం వెళుతోంది
నాకింకా జ్ఞాపకం ఉంది ఒక్క తూటా శబ్దంతో
అడవి నుండి జనారణ్యాలపై వాలే పక్షుల గుంపును
అనుసరించి తరలిపోయే కవితా ప్రపంచం ఉంది

జననం మరణం రెండూ పక్కపక్క దేశాలు
వీటికి వీసాలు పాస్‌పోర్టులు అవసరంలేదు
ఎవరైనా ఎప్పుడైనా పుట్టొచ్చు ఎప్పుడైనా పోవచ్చు
ఉన్నా లేకున్నా స్వర్గం నరకం ద్వారాలు తెరిచే ఉంటాయి

మోసం చేయడమనేది జ్వాలా ముఖంమీదికి చీకట్లను అమర్చడమే!
ధీరత్వంతో త్రికరణశుద్ధిగావించబడిన ప్రతి సత్యం నానుండి అనుశ్చితమే!
వీధిలోకి అడుగులు వేస్తే తిరిగి వచ్చే నమ్మకమే లేని మనకు
దేనికి ఏ సమాధానం? దేనికి ఏ ఫలితమో చెప్పండం కష్టతరమే!

మహిలో మహితాత్మునిలా కనిపించే సహజీవిని తెలుసుకుంటే
ఏమాత్రం పరిచయంలేని ముఖాలు సైతం చిరునవ్వుల చిచ్చుబుడ్లు అవుతాయి
చెట్టుకొమ్మలకు కావలి కాస్తున్న మంటలు సైతం
నీటిపై పొగలతో నేలపై నీడలతో కదిలిపోతాయి..

నీకు మాత్రమే తెలుసు కోలాహల లహరుల్లో మనుషులు తక్కువని!
ఒక స్వప్నాంతర మండలంలో విరిసే సత్యం క్షణాల్లో మాయమౌవుతుంది
వివిధ వర్ణాల జీవిత చిత్రాలకు రంగులేసుకుంటూ
కదిలిపోతున్నాయి వాస్తవాల అనుగుణాల మేరకు కిరణ ఛాయలని!

రోడ్డు నాదని నేనే నడిస్తే నడిచిపోదు
అనుకున్న పనులన్నీ ఒకే రోడ్డుపై జరగలేవు
ప్రకృతి పరమాణువులన్నీ నిట్టూర్చుతుంటే అంతరంగం ఒక కపోతం అయ్యింది
బయటయినా లోపలయినా ఏదయినా విడవలేని పొగమంచుగా మిగిలింది

ఉన్నట్లుండి ఇంటి నుండి వీధికి
సాయంత్రం నుండి ఉదయానికి గల వ్యత్యాసం నీకు తెలపాలనుకున్నాను
భయాన్ని అనురించి సందేహం వచ్చిందా?
సందేహం నుండి భయం వచ్చిందా అనేది ప్రయాసే అనుకున్నాను

మనసనే బలహీనత కలవాళ్ళు మాత్రం
ప్రపంచాన్ని చూడలేరు ఒట్టి ఆచూకీని ప్రశ్నించినపుడు మాత్రం
తెలుసా లేదా అనే స్థితులకు మధ్య
విజ్ఞానాన్ని ద్వారానికి తగిలించి, పక్కనే అమర్చుకున్నాను

పొగమంచు అనేది ఏ సమయమయినా పట్టచ్చు
పోల్చుకోలేని ఆకృతుల నడుమ వ్యాపించు వేళలను
కలగలిపి అపరిచితమైన ఈ వూరినంతా హృదయానికి హత్తుకుని
నడిచినదోవనే మళ్ళీ మళ్లీ నడిచేందుకు సిద్ధం చేసుకుంటాము

ప్రయత్నం నీరుగారాక మెల్లగా చల్లని చూపులను అనుసరించి
చివరికి ఇంటికి చేరుకుని అస్తిత్వాన్ని తవ్వుకుంటుంటే
మెల్లగా చిరు గంటలను మీటినట్లు కింకిణుల అనుకరణాన్ని
వేయి జన్మలుగా మనకు ఆవిష్కరిస్తుంటుంది

నాకు తెలుసు నువ్వు మాట నిలబెట్టుకుంటావని
ఏదో ఒక్కోసారంటే తప్పదు కానీ శబ్దవైభవం అనేది శిలలే ఆవిష్కరించాలి
నాలో అణువణువు  ఉషస్సులా మార్చి పలుకరిస్తుంది
నేనే శిలగా మారే తరుణంలో ఉన్నచోటనే నిలుచుండిపోతాను

ప్రతిస్పందన అనేది కేవలం గుండె గోడలనుండి వచ్చే శబ్దం!
జీరవోయిన ద్వారఘంటికను అనుసరించిన ప్రపంచం
దూదిపింజలా ఊస్సూరుమంటూ గాలిలో తేలిపోతుంది
ప్రాంగణంలో నాటిని తులసి లేదా పారిజాతం నలువైపుల చూస్తాయి

ధనదీ ప్రాంగణంలో చెట్టు నిలబడితే కడుపునిండా నీరే
పసివాడయినా లేక పెరిగి పెద్దవాడయినా సరే దూరంగా
ఊహించినదేదీ నిజం కాని కారణంగా జీవితాన్ని తలపోస్తుంది
భూభాగాల మధ్య అహర్నిశం నిలుచునే వినోదానికి దిక్కుల్ని కాపలా కాస్తుంది

ఒకసారి జడంగా మరోసారి చేతనంగా
కనిపించే విచిత్రరూపాలన్నీ ప్రపంచ పరిస్థితుల ప్రభావాలే
ఒకవైపు విధాతకు మరోవైపు సామాన్య మానవునికి
కనిపించే ప్రశ్నలన్నింటిని ఏ ఇద్దరైనా కలిసి విభజిస్తారు

అంతలోనే సమస్తాన్ని వదిలి ఎక్కడికెళ్లిపోయావు?
పోతూ పోతూ నాగురించి కాకున్నా సమాజపు మనసిక
స్థితిని అంచనా వేయగల సమభావ జీవనాన్ని

నిందించలేక, దూరం చేసుకోలేక సుమధుర సంగీతనయ్యాను

కావాలంటే చూడండి
ఇప్పటికీ మీకోసం దాచి ఉంచాను
మృత్తికలపై నిలుచున్న రాజహంస పదచిహ్నాల్ని
శతప్రయత్నాలు చేసినా సరే నిజమని నిరూపించలేకపోయాము కదాని!

సంధ్య వేళ దీపాన్ని పరిశీలించి చూస్తే
అనాకలనీయ విషాదం ఆవిహించిన కారణంగా
లీలగా, అంతర్లీనంగా లయబద్ధ సంచారం చేసిన ప్రకృతి
పక్షులను  అనుసరించి వేయి స్మృతులను వెలిగించదూ!

అవును! మనం మానవులం!
వేటిగురించి ఆలోచిస్తాం?
ఉభయసంధ్యలు ఉపేక్షించినా లేకున్నా
అలరిస్తూ నర్తించు దౌత్యము నిన్నుకూడా అనుసరిస్తుంది నిజం!

జన్మజన్మకు మనకు ఒకే ఆకాశం ఉంటుందట
ఒక్కో జన్మకు ఒక్కో ఆకాశం అంటే కష్టమే మరి!
అక్షరనీరాజనాలు సర్వం నాలుగు కాలాలను అనుసరించి
స్థల కాలాతీతమైన వృక్షసంతతి అనుమతి తీసుకోకుండా వస్తుంది

ఓ మానవ పరివృతవా?
నా మాట విను! క్షణాలు మరీ మేలు చేయాలని నీవు
ఒక్కసారైనా మనం ఏమి చేసామని నేను తన్నుకులాడుకుంటే
భాష ఏదీ? కన్నులలో ఆర్ద్రత ఏదీ?

ఒకసారి తలుచుకుంటేనే
చచ్చేటంత ఆవేదన ఉన్న ఈ పక్షి మురిపాలకు
మన దరి చేరాలంటే మరో అవకాశంలేదుకాక లేదు
మనతో నడిచే ఏడడుగుల బంధం ఉండిపోవాలని లేదు

ఏమిటో ఒక్కోసారి వెనక్కు వెళ్లిపోవాలనే ఆలోచన
వెనక్కు ఎందుకు? వెళ్ళేదేదో ముందుకే వెళితే
ఇరువురిలో ఏలాంటి వాస్తవం ఉండదు కానీ
తిరోగమనమే ఎరుగని కాలాన్ని ఉదాహరణగా తీసుకుంటే తప్పులేదు

ఏ ఇద్దరిలోనూ ఒకే ఆలోచన ఉండదు
ఆచరణ అంతకంటే ఉండదు
కాలానికి ఎపుడూ మనం ఖైదీలమే!
అంతరిక్షానికి అంతరంగం ఎపుడూ వేళాకోళమే!

కడలి నెమ్మదిగా ఉన్నంత సేపూ నువ్వు దాని చెవులు ఎంతైనా పిండుకో
ఒక్కసారి ఉవ్వెత్తున ఎగసి తొలిరూపాన్ని రూపుదిద్దుకుందా అంతే

తిరిగి తన బలిమిని కాదని వాడిపడి ఉన్న పూలకు వసంతం చేరుకుంటుంది
తప్పదు గాలయినా, నీరయినా ఏదయినా శాపాలను సిద్ధంచేస్తూనే ఉంటాయి

ఒకానొక సమయంలో చల్లని గాలిలో
హాయిగా మైమరచి నిద్రించేవేళను అప్పుతెచ్చుకుని వాడుకుంటుంటే
ఆకలేసి ప్రపంచం అల్లాడిన నిజం ఇంకా నా కళ్లకు కట్టినట్లుంది
పాడు మనుషులు నేను కాదన్నానా నాపై కోపం చూపుతోంది!

ఇంతకాలం సమాజంలో పాటలే కాదు ఆటలు కూడా ఉన్నాయి
పాడమని పాడమని మరీ మరీ అడిగి నన్ను కబుర్లకే అంకితం చేసిన
స్పందనలన్నీ నాకోసం మరింత ఆలస్యంగా నవ్వుకుంటున్నాయి
మాటి మాటికీ ఈసడిరచుకనే నేను ఏదోనెపంతో పలకరిస్తూనే ఉంటాయి

ఎండవానకు ఓర్చుకుని ఆకలికి ఆయాసానికి ఒప్పుకుని
రెండుచేతులను ఆర్జనకే అంకితం చేసిన నీవు
ఇరుగుపొరుగువారికీ అందరికీ
మేటిలేని సాహిత్యమనే ప్రచారానికి నడిచాను వారాంతపు సాయంత్రమైంది

అవునని కాదని ఏదోఒక నెపంతో తెలియక
ఎన్నాళ్లో తెలియని జీవన ప్రస్థానాన్ని ఎరవేసాను
ఇరుగుపొరుగువారికీ, నింగీనేలకు రెంటికీ మహాప్రసాదమయిన
సందర్భంలో కనికరమైన చూపలేదు కదా?

నువ్వు పిలిచావా గుర్తుకు తెచ్చుకో
అనుకోలేని భయాలను ఆవహింపజేసే తరుణంలో
నా నవోఢరూప లావణ్యాదులన్నింటినీ ప్రకృతికి అప్పగించి
అనుక్షణం మౌనంగా అనుకరిస్తుంది కదా?

నిత్యం నీసేవలో తరిస్తోందని నీ మంచితనపు ఆలోచనలు
ఒక జీవిత భాగస్వామిగా అంగీకరించగలము కానీ
నిత్యం నీకోసం మిగలాలని అనుకున్నంతకాలం
కనికరమైనా చూపి నా విధేయతను పాటించావా చెప్పు?

మొదట తీయగా పాడి రాను రాను గడసరిగా మారి
భేషజాలను నమ్మకంగా నమ్మించ వద్దని నిత్యం చెబుతుంటే
చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్న ఈ విషయం
ఎవరినో నమ్మించాలని చేస్తున్న పరిచయం విషమేమీ కాదు

అయినా నాకెందుకీ శ్రమ?
అక్షరాల మాలను నారుపోసిన ఆకులను బిడియానికి వేల్లాడదీసిన
మొదట మనుషులుగా గెలపించడం ఉత్తుత్తి మాటలే!
చదువుకున్నా, నడవటం, ఏదైనా మంచి మాటలే!

ఎన్ని వసంతాలైనా ఒక ప్రేమను బంధిడానికి సరిపోదు.

నిరంతరం నాడుల్లో ప్రవచించే నులివెచ్చని రుధిరమే తప్పుకాదు
కవితలనేవి ప్రపంచసారధులే కానీ ప్రపంచాలు కావు
నేల నుంచి క్షితిజానికి ఒక్కొక్క మెట్టులా సాగి పాపిటను నిలిచింది

రాత్రినుండి ఉదయానికి వెదికాను. అందుకు ఏడుపు రాలేదు
దోసిలినిండా నక్షత్రాలను తీసుకు వచ్చిన తపన
ఇష్ట పూర్వకమే అయింది కదా నా నీ పాలిట!
ప్రవేశార్హతను దాటిన నీ ప్రవర్తన గగన విపినాల బాసట!

అరణ్యానికి దేవతలు ఉండేవారని అంటుంటారు
కానీ కాదు కానే కాదు అరణ్యాన్ని ఆదిగా ఎంచుకోగల అధిపత్యం కోసం
ఎవ్వరినీ మెప్పించలేక దూరంగా జీవించడానికి ఉన్న జీవన వ్యాప్తి కోసం
నా యోజనా శక్తి కల వ్యక్తిత్వాన్ని కొట్టేస్తేంది కదూ?

ఒక్క చిరుజల్లు చాలు! నిన్ను నేను నిత్యం సాక్షాత్కరింపజేస్తాను
అంటుంది గాలి తెమ్మెర! కాదు కాదే నిన్ను ఏకంగా నిర్మించేస్తాను
అంటుంది ఇంద్ర ధనుస్సు! అయినా నిన్ను అనాలి ఏకంగా
జీవింపజేస్తాను అనడంలో నీకంటే ఎక్కువా నేను అంటుంది ఆకాశం!

నిన్ను అల్లుకోవాలని ఉన్నా నేను నీ మేనికో రంగునై నిలుస్తాను
నన్ను నిర్వచించుకోవాలని ఉన్నా నేను ప్రపంచచిత్రపటాన్నై నిలుస్తాను
నన్నునన్నుగా నిలబెట్టుకోవలని ఉన్నా నా కవితలతో నిన్ను
ఏకంగా అభిషేకిస్తాను అంటున్న సృష్టి ముందు నేనెంత నా కౌమెంత?

ఎర్రని మందారాలు విరిసీ విరియగానే కోసే వరకు ఊరుకోవు
కోసిన వెంటనే దేవుని పాదాలచెంత చేరేదాకా ఊరుకోవు
శ్రామికజన ప్రాంగణాలలో బాహ్యాస్మృతుల కాహ్వానం పలికే
ప్రతి యవ్వనం  విశ్వానికి కావలిదారై ఉండాలి తప్ప మరేవిూలేదు!

సకల చరాచరజగత్తుకు స్రష్ట అయిన వానికి అర్పించుకున్న గీతికలన్నీ
ప్రాధమికమైనా ప్రౌఢకవులైనా ఎవరైనా ఆహ్వానం పలుకుతాయి
తనకు తాను అర్పించుకున్న ప్రహేళికలన్నీ ఒక్కసారైనా తలుచుకోలేవు
శతవసంతాల కాలాన్ని తరిచిచూస్తే సృష్టి నిర్వేదంలో గడిపిన క్షణాలే లేవు!

తలపులు ఎవరివైతేనేం? తలుపులు తెరుచుకుంటే చాలదా?
పొద్దుతోపాటుగా ప్రాయం కూడా గడచిపోతూనే ఉంటుంది
లెక్కకు మించిన మిక్కిలి కిరణాలు ఒక్కొక్కటిగా విడిచి వెళ్లిపోతుంటే
మిగిలినవన్నింటినీ బతికించాలని ఓ మారు దృష్టి సారిస్తుంది సమాజం!

ఉప్పెనలు వస్తాయి. తుఫానులు వస్తాయి! సునావిూలు వస్తాయి
రాక ఏమిచేస్తాయి? కంటిరెప్పలు పడినపుడు,తెరిచినపుడు
ఎదలో వీచే రaాంరaాం మారుతాలు దిగంతాలను ఏకంచేసేటంతటి
గొప్పగా గానం చేసి జలదిగ్బంధం చేసే తరుణంలో ఒకేసారి ఉపశమింపజేస్తాయి.

అహర్నిశం మనిషిని వివశుణ్ణి గావించే
అంతరంగాన్ని మరీ అంత తక్కువగా చేస్తే అట్టడుగున సాక్షాత్కరించే
అందాల పరిమితులు చంద్ర సూర్య శిల్పాలుగా మరి
ఉన్నట్లుండి అవుతాయి అంతర్హితాలు! అత్యధిక నేపథ్యాలు!

ఒక మహా స్వప్నంలో నేను చూసాను కదా?
తిరోగమన మనోగమనాలు ఎంత ప్రయత్నించినా మారవు
రేయి అయినా పగలయినా ముంచుకొచ్చే పుష్పాల అలంకృతాలే!
ఉపశమింపజేసే ప్రతి విషయం విశ్వాన్ని మనిషిలో చేర్చుతాయి!

ఇందుకోసం ఇంతకాలం ఎదురుచూడటం అంటే వృథా అనిపిస్తుంది
ఒక అపూర్వ ముహూర్తాన పుడమి గర్భాన చీల్చుకుని వచ్చిన మొక్క
రేపో మాపో ఏదో ఒక సమయంలో ప్రాణం పోసుకున్న మరుక్షణం
నా అస్తిత్వాన్ని దినచర్యలో ఒక భాగంగా చేసుకుంటుంది వృక్ష రాజం!

శ్రమించదలిచితే నాకోసం లేకుంటే ప్రపంచం కోసం!
విశ్రమించదలుచుకుంటే నీకోసం లేదా సమాజం కోసం!
వినదలుచుకుంటే దరిదాపులకు ఏదీ వినబడనంత దూరంగా ఉన్న గోళం!
వింటే ఏముంది ఏకంగా దట్టమైన కంచె, పక్కనే ఒక నులకమంచం!

కారుణ్యమైన మనసుతో ఒక్కసారి అవలోచించి చూస్తే
కనిపిస్తుంది ఆరాధనకు వరంగా సాధనకు ఫలంగా కనిపించే ఫలాలు!
నేనే ఎదగాలంటే నేనే ఎదుగుతాను.
నేను ఎదగాలంటే నువ్వుకూడా తప్పక ఎదుగుతావు

సహజం భ్రమించేటంత పిచ్చిది కాదు ప్రపంచం!
అయినా ప్రేమించేటంత వెర్రిదీ కాదు
అటూ కాకుండా ఇటూకాకుండా నాతోపాటు ఉండే ఒక భావం
కేవలం ఏళ్లలో ఎదగడం మాట ఇటుంచి విలువల్లో ఎదుగుతాను!

కొమ్మకాదు రెమ్మ కాదు ఏకంగా శాఖోపశాఖలు
వ్యాపించిన మహామేధావి ఈ మనోశిఖరం
నీవంటే సరే! ఏకంగా నీ తరం వారే కాదంటుంటే
ఇకపై ముందు తరాలన్నీ ఏమవ్వాలి ? ఎవరికి చెందాలి?

నాతో పాటు నిలబడ్డ నాలుగు స్థంభాలు నన్ను అనుసరిస్తున్నాయి
ముచ్చటగా నడుపుతాయి జీవితకాలపు సర్వ భూయిష్ఠాలు!
ఏకాంత వాసాన నన్ను నేను ఆవిష్కరించుకునే సమయంలో
ముచ్చటగా మూడు ముళ్ళు మార్గశ్రాంతులుగా మారిన వాదోపవాదాలు!

యువతకెంత శక్తి ఉంటుందో ప్రకృతి భవితకు అంతే!
సంస్కృతి సాంప్రదాయాల జట్టులో కొనసాగించబడే ధ్యేయాలు
బలిపెట్టే ప్రకృతి శోయగాలను స్పృశించి, కొనసాగించబడి
నేలతల్లికి, ఆకాశ గంగకు సంగ్రామాన్ని నడుపుతుంటాయి!

మానవాతీతమైన ఇతిహాసంలో
మానవేతి హాసంలో అనూహ్యమైన అంతస్సూత్రమైన
వైషమ్యాలకు వర్గవిభేదాలకు అవిశ్రాంతంగా శ్రమించి
ప్రపంచాభ్యుదయం గావిస్తారు గంగ యమున నదులు!

విశ్రాంతి అనేది మనని విడిచిపెట్టేసిన ఒక దిగ్భ్రాంతి!
వివిధ రకాల కంఠశోషలకు గాను విధించబడిన ఒక ఆవిష్కృతి!
ఒకానొక నిముషంలో పరాజితుడువై అనిష్టుడవై
ఒంటరివై సార్థక నామధేయుడనే మాటను మరచిన సంస్కృతి!

ఓ మానవుడా? ఎంతటి చమత్కారం దాగుంది నీలో!
వర్షవర్షానికి ముందు ప్రసరించిన హర్షం నాలోనూ ఉంది
నిశీధిలో ఒక ఆశీర్వచనమై కనిపించే అవిశ్రాంతం నాలోనూ ఉంది.
ఒక్కసారిగా నిలుచుని ప్రేరణను సాగిస్తున్న వేళలో నా వంతు వుంది

ఇంతకీ నేనెవరని నీవనుకున్నావు?
నీ గృహారంభంలో కావలిదారిగా ఉంటూనే
ఆప్యాయంగా ఉభయసంధ్యలూ నిన్ను పలకరించే తత్వంలో
ఈ మహావృక్షం మిగిల్చిన శ్రీనికేతనం!

ఇహపరాల యాత్రను చాలించేలా చేయాలనేదే
నా స్వప్నం నా ఆశయం!
అలాంటిది ఏమాత్రం ఎడతెరపిలేకుండా అలరించే ఆ పిలుపు
నాకు తెలిసీ నేననుకున్నంత సులభమైతే కాదనేది నా తలపు!

ఇది అప్రస్తుతం! నాకు తెలిసీ!
నేల లోతుల్లోంచి తేమను తీస్తూ కన్నీళ్ళు పెట్టేటంతటి
ఆకాశగంగ కాయాన్ని ఒక్కసారిగా పెంచుకుంది
కానీ ఏండ్లు గడిచిన కొద్దీ గుండెల్లో గంపెడంత ఆశను పెంచుకుంది

ఏనాడయినా నువ్వు చూసుకున్నావో లేదో కానీ
ఆకుల మాటున తప్పని సరిగా సరిగమలు కాపురం ఉంటున్నాయి
నేను గమనించాను వసంతం వచ్చిందా?
కొమ్మకొమ్మకు తేనె ఏదయినా దొరుకుతోందా అని తెలుసుకోవాలి!

ఎవరు వస్తున్నారో కాస్తంత చూసుకో కాస్త!
వచ్చేవాళ్ళంతా వేలిముద్రలతో అలంకరిస్తారు మరి!
ఎంతో వైభవాన్ని తలపై కిరీటంలా చేసి మరీ
తలపైని భారాన్ని మోసిన పరిసరాలు నీకోసమే అంటారు!

నన్ను నిలిపిన క్షణాలన్నీ పచ్చదనం కోసం పరితపించినవి
ఎదురుచూసినవి ఏదైనా గులాబీలు పూస్తూనే ఉన్నాయి.
విడివడపడ్డ శరీరానికి ఏ పూలయినా ఒక్కటే!

స్పర్శలేని ప్రాణాలకు మిగిలేది వాస్తవం ఒక్కటే !

అలాగంటే వృక్షాన్ని సమూలంగా తెంచాలనే కదూ
ఎన్నో ఏళ్ళుగా పడుతున్న ఆరాటం కన్నుమూసుకుంటుంది
తొలకరి రాగానే, చిటపట చినుకులు రాలగానే
వేటు పడిన చోటునే ఏకంగా మరిన్ని కొట్లు పడుతూనే ఉంటుంది!
వృక్షం కన్ను మూయదు
ప్రపంచం నిద్రపోదు అనేది మనకు తెలుసును
అయినా నిత్యం చేస్తున్న అల్ప ప్రయత్నాలన్నీ
మళ్ళీ మళ్ళీ పునరావృతం అవుతాయి నిజం!

ఒరేయ్ వెర్రివాడా వృక్షాన్ని నరికి సృష్టిని శాసించి,
నాశనం చేసే ప్రక్రియలో వెర్రివాడివి అవుతున్నావు గ్రహించుకో!
నీవు సంకల్పించుకున్న ఈ మేధంలో
నీకునీవే దగ్ధం చేసుకున్నావనేందుకు సాక్ష్యమని తెలుసుకో!

ఒక్క సారిగా దూరం చేసుకుంటున్న ఈ ప్రకృతి
ఎంతో సాన్నిహిత్యంగా మనకు సన్నిహితమవుతుంది
అప్పుడు నీవనుకున్న హేయమైన పని పూర్తవుతుంది
అమరలోకానికి కాదు ఏకంగా మరోలోకానికి మూట చుట్టబడుతుంది!

విఘ్నాధిపతి వినాయకుడు ఒకసారి
తన తండ్రి శివుని వద్దకు చేరి అంటాడు కదా
"గరిజకు గడ్డురోజులొచ్చాయి నాన్నా! మరి!"
గరికకా గిరికకా మరొక్కమారు చెప్పు అన్నాడట

నీలగిరుల దొంతరలలో దొరతనంలో
చాలావరకు విశ్వచిత్రం కనుమరుగు అవుతోంది
విశ్వం లేకుంటే మనుగడ కడగండ్లవుతుందని! ఆహోరాత్రాలు నిజమని
పరిసరాలు పతనానికి చేరువైన తరుణంలో నేను నువ్వని!

ఆకాశ మార్గాన ఎన్నో పక్షుల బారులు తీరితే
మనసుకాసారమైనట్లనే మాట నిజమేమో కదా?
నేలను ఎంత తీసుకుంటే మాత్రం నీదవుతుందా?
నీవున్నంతకాలం ఉంచి, ఆరడుగులు ఇచ్చి మొత్తం లాక్కుంటుంది

నదులు సముద్రాలు సమావేశమై
తమలో నిద్రాణమైన కోరికలన్నీ ఒక్కసారిగా ఎలుగెత్తి చాటాయట!
పైకి నీటి నురగలు, అలలు, కెరటాలుగా ఉన్న తాము
తమ లోపలి రాగాలను కనిపెట్టగలిగేటంతగా మానవుడు నిలిచాడట!

మత్తులో జోగుతున్న సూరీడు
ఒక్కసారిగా ఎగసిన మంటలకు ఉలిక్కిపడి లేచాడు
రానున్న జలప్రళయం తాలూకు సెగలు హెచ్చరించాయేమో కానీ

చుట్టుపక్కలా కలియజూసి తన ఉనికిని మరింతగా భద్రపరుచుకుంది!

విశ్వం ఆద్యంత నిర్ణేతగా నిలుచున్న ఆనతికాలంలో
కనిపించేవన్నీ నీలాల కన్నీళ్ళే!
వంగి వంగి దణ్ణాలు పెడుతున్న శబ్దాలన్నీ
విరామచిహ్నాలైన సమయంలో అవతారాలన్నీ ఆవిష్కృతమయ్యాయి!

ఊపిరి ఆడటంలేదు. ఉన్నట్లుండి మనోవిహంగాలనడుమ
ఎత్తుకున్న భిన్న ధృవాలన్నీ మైదానాల అంచులపై చేరుకున్నాయి!
ఎన్నెన్నో వ్యాపకాలలో తలమునకలవుతున్నా మసక కాంతులన్నీ
కంటికి మింటికి కనిపించని ధారగా శైలీ దిక్కుగా ప్రయాణం చేస్తున్నాయి!

నీలిగిరులను, సముద్రపు గోడలను చూడగమే పనిగా పెట్టుకున్న
దిశలన్నీ మన గుండెకు తట్టిన కళ్లలోతులను శోధిస్తుంది.
వలదన్నా లేదన్నా సరే ఏకంగా శూన్యపు అంచుల్ని దాటుతుంది
వెదురు బద్దలను అనుసరించి ఆ జన్మాంతం పిల్లనగ్రోవిగా మారుతుంది!

దొరల తనం అనేది ఈనాటిది కాదు ఎప్పటిదో
మృగాలన్నీ మానవాకారాలై శాపాల దృష్టిలో కనిపించే
జనవాసాలలో గాలిఊసులు తగిలిన మరుక్షణం
ఊహకందని తీరాలకు పరుగులు తీస్తుంది
ఇవి తూలికల తూణీరాల ముంగింపు
మహారాజుల్లా మైమరచిపోయిన జీవితాలకిది గ్రహింపు
ఋతువులన్నింటిలో జలకాలాడిన పన్నీటి జలకాల ఆగ్రహం అయితే
ఆనోట ఈ నోట వినిపించే ఉభయసంధ్యలు కనుమరుగయ్యాయి

ప్రకృతికి అందం అనేది సహజమైతే ఆరగించాయి
జీవితంలో పున్నమి పరిచయాలు నోచుకోకున్నా మిగిలి శమించాయి
స్వచ్ఛమైన గాలిని పీల్చుతూ సాధుజలాల్ని సేవించిన
పచ్చిగరికను గని పరుగులు తీసిన బృందగానమయింది!

నిరుడు తరతరాలకు ఎక్కడో ఏమూలో
ఆయువు మేరకు జీవించిన వైనం ఆలపించింది
నక్షత్రాలన్నీ తన ఉనికి కోసం ఆవిష్కృతమై ఆవిర్భవించింది
దేవుడు జీవించి ఉన్నాడు నాకోసమై నవ్వుతూనే ఉన్నాడు సృష్టికి వారసుడై!

ఎవరికీ అతీతం కాని పూర్వుల వైభవోపేత జీవితాన్ని
పూర్తిగా విడిచి పెట్టిన మానవజీవితాలు
క్షితిజ రేఖల్ని వెంట పెట్టుకుని జీవన సముదాయ స్థితికి చేరి
అవిరామంగా అధికార తత్వాన్ని ఎరగా వేస్తున్నాయి!

ఆనాటినుండి నేటివరకు లోతుల్లోకి వెళ్ళిన జీవాలన్నీ
ఇసుక రేణువులను వారధులుగా చేసి స్పందిస్తున్నాయి!
లోలోపల బయటపడిన పంచప్రాణాలు

నిరంతరం మహా విశ్వంలో రాళ్ళను మోస్తున్నాయి!

బతుకు బండిని లాగలేని బడుగుజీవులు
పరమశివుని వాహనాన్ని అద్దెకు తీసుకున్నాయి
పసిడి ఊహల్లో విహరింపజేసినవన్నీ సీతాకోక చిలుకలే!
విచారమవుతున్న ప్రయోగశాలల్లో వినిపించేవి మాత్రం తపాౌబిళ్ళలే!

క్షమించగలరు! నేను శ్రామికురాలని అని ఇపుడే తెలిసింది
లేకుంటే చాలాకాలం నుండే మీకు తెలియజేసేదాన్ని !
చిరునవ్వుల్ని కొన్ని వెలిగించేసి గిటారుపై ప్రపంచగీతం పాడితే
ఈల గోల చేసే స్నేహితులందరూ ఇసుమంతయినా చెదరరు!

ఓ స్నేహితుడా! ఒక్కసారి ప్రకృతిలోకి తొంగిచూడు!
దారులోనే ఎదురయ్యే దైవాల బలాన్ని గుండెతో చూడు!
ఈ విశ్వదిలో కొన్నింటిని ఇతిహాసపు బావుటాల్లో ఎగరవేయాలి!
మరికొన్ని సనాతనం నుండి రాజరికపు గుండెలతో సమతూకం వేయాలి

రవి అస్తమించాడని రాత్రి తెలియలేదు
నేను రాత్రిని చూడలేదు. మేము అలరించిన బావుటాలు
నేడు తెల్లబోయినా ధైర్యంగా నిలుచున్నాయి
నిన్నటి కరతాళధ్వనుల మధ్య నిలుచున్న తోరణాలు

ఏమీ పాలుపోవడంలేదు నిజంగా
రవి ఉదయించినా, అస్తమించినా
నిరాశక్తతకు తోడుగా నిలిచిన  కావ్యఘోష ఒకటి
నేడు రంగుల కలయే కాదు సుమా? వాస్తవ ప్రపంచం కూడా !

కరతాళధ్వనులు నేడు పేరుపేరునా అడగాల్సిన ఆస్థి వివరాలు
తమకు తమ వాటా వస్తే తప్పక కావాలి చప్పట్లు
నీ పక్కన వాడెవరైనా ఏదయినా సాధిస్తే నేడు జీవనం చేదు నిజాలు!
ఎక్కడా కనిపించని ఆత్మ పునర్జన్మ ఎత్తిందనే పోషించుకుందామంటుంది

అరుణ రాగంలో కనిపించే పెదాలు ఆశలకు పునీతం
కలల వెలుగుల మలయ గ్రంథాలకు నాంది కర్తవ్యం!
ఇలవేలుపు నెలవు నిండిని కొలువు ప్రాంతాన
మల్లెజాజులు కలగలిపిన హృదయమవడం సౌందర్యం!

మలయగంధాన్ని తెచ్చుకునే పవనాలన్నీ
ప్రళయ వైభవానికి నాంది పలుకుతుంది
పట్టపగౌయినా అర్ధరాత్రయినా ఎపుడయినా ఏమయినా
అజ్ఞాన తిమిరం ఆవహించే దిశగా అడుగులీనుతుంది

ఎక్కడో వర్తమానాలన్నీ ఒకచోట చేరి
గరళాల కంఠాలన్నింటిని మరోదిక్కున అక్కున చేర్చుకుని

పుడమి దోసిలిలో వంపుకుని తాగితే ఫలితం
అదృష్టం వరించిన మాలోని జీవితాలన్నీ నవ్యంగా ప్రాశనం అయ్యింది

దిగంతాలన్నీ అనుచితంగా ప్రవర్తిస్తూన్న సమయంలో
నిదురించే అనిర్వేదస్థితికి అల్లర్లురేపే ఆకతాయి మూకల మధ్య
జరుగుతున్న ఊహలకు మనుగడైనట్లు ఊహించలేము
ఏమాత్రం దిక్కులేని ప్రాంగణాన్ని సవ్యంగా పలకరించలేము

ఒక్క సైగ చాలు నిముషమాత్రంలో వివరణాత్మకమైనట్లు
మనమనుకున్నది కైలాసమైనా హిమగిరులయినా
తెలుచుకోవడమే తరువాయి పాదాల వాలుతాయి పాటల శ్రావ్యత!
కనుగొన్నది సమిధలయినా మహానగరాలనుండి వచ్చేవి ఊహల నవ్యత!

దగ్ధం చేస్తున్న నిరుటి దృశ్యాలన్నీ కమలనాభుని లీలలయితే
కాంచన శిల్పం ఆనాటిదయితే కనుగొనే విశ్వ ఐశ్వర్యం ముందు
అభివర్ణించగల పదాలే లేవంటే ఎలాగ ఓ ప్రకృతి కాంతా!
నీ నామం ఒక్కసారి వినబడితే చాలు నీ జీవన్మృతికి తరువాయి కాదా?

నిజమే! ఎల్లవేళలా దేశ చిత్రపటంలో కడగంటి దేశాన్ని నేను
ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పడాలంటే ఉందికదా ఏకంగా ఒక కవిత్వం!
ఆకాశ వీధుల్లో విహరించే పక్షులన్నీ  నాకు చరిత్రలో ఏకశిలాతత్వం!
నేను నడిచే నేల కంటకాల మధ్య సంస్కృతిని దాచి ఉంచిన ధర్మం!

నాడయినా నేడయినా నాకు ఒకటే సమీరం
వైషమ్యాలు, కులమతాలు, మతతత్వాలు కాలసమీరాలు అన్నీ
వెనువెంటనే కాటువేస్తూనే సాహసాలకు మహావేదికను చూపుతాయి
స్వప్న సదృశం   ప్రకృతి దృశ్యం! ఒంటరిగానే ఉంటాయి!

ఉదయం లేచి ఆరుబయట వెలుగుతున్న దీపంలా ఒంటరిగానే
నివేదన వినిపించి కాకూడదని కారాదని రెండిరటి మధ్య
అరణ్యరోదనంతా విని విని ఏకంగా అలలా  వ్యాపిస్తుంది
దీనజనోద్ధారకా స్వామీ ఏదయినా నీ ప్రేమలా ఉండిపోనీ !

రెండు పసుపు వన్నెల రెమ్మలపై
గాలిసోకక, నీరు తాకక సందడిని వీడక
మనో ప్రాంగణాల ఎదుట నిలిచిన అతుకుల బతుకుల
చందాన్ని మదిని తలచినాననుకుంటే అలమటించడం కాదా?

జగతిని ఆవహించిన జడత్వంతోనే జీవనయానం అంటే ఎలా?
అహరహమూ ఆత్మతో మమైకమైతే  మది బరువంటే ఎలా?
కదలలేక, మెదలలేక ఆలోచించలేక ఏమీ చేయలేని స్థితిలో ఉంటే ఎలా?
తొలిసారి వేధించు విధాత మదికి నా తోడే ఉందంటే ఎలా?

ఓ ప్రభూ! జీవన్మరణాల సంస్కృతిని చూసాక స్వప్నాలను గమనించాక

బతుకనే చిరువ్యాధిని కడసారిగానయినా వీక్షిస్తున్న కౌ◌ం సహనాన్ని
శాపాన్ని, తిమిరాన్ని ,క్షితిజాన్ని ,సాంగత్యాన్ని అన్నింటిని
కౌగలించుకున్న తీరు ఎంత హృద్యమో గర్వించేందుకు సమయం సరిపోదు!

సత్యమే పలకవలెనని, పెద్దలను గౌరవించవలెనని
కోపం వలదని, ఆవేశం అనర్థదాయకమని ఎందరు
ఎన్నిసార్లు చెప్పడమే ఒక అబద్ధమయినపుడు ఇక చెప్పడం ఎందుకు?
ఆచరించడం వెనుక వెర్రితనం, రాలుగాయితనం ఎందుకు?

విశ్వచిత్రపటంలో ఏపాటివీ జీవితాలు?
సముద్రపు క్రమశిక్షణలో ఏ నాటివీ నడిచే రాణివాసాలు?
మనోరథాకృత మంజరిలో మొలిచే ప్రతి మొక్క ముఖ్యమే నని
జగము మునిగినా లేకున్నా మనం తేలడమే సరైన పని!
కళ్లున్నది నీరు నింపడానికే కాదు!
మనసున్నది కనిపించిన వారందరినీ ప్రేమించడానికి కాదు!
నిట్టూర్పులు, నిరాశాదృక్కులు, లోలోపల అణచుకుని
శిశిరాలు ఆవహించినా సరే ఏకంగా ఓర్పు ఆయుధమైంది!

చంద్రున్ని అయినా, సూర్యుడినైనా  నక్షత్రాలనైనా
రాహువు మింగడం అనేది నిజమే కానీ ఎంతవరకు అనేది ఆలోచన?
భూమి అడ్డం రావడమనే ప్రక్రియను పక్కకు జరిపి అద్దం చూపేరు
అయినా నింగిని వేలెత్తి చూపేటంత ధైర్యమా మనకు అన్నదే వివేచన!

ఎక్కువగా మాట్లాడకు ఎగవేసినట్టు మాట్లాడితే కలిగే నష్టం
పంజరాలనొదిలి చిలకల మాదిరిగా వల్లార్చుకుంటూ
ఎగిరే కాలమా? ఇంకా ఎక్కడుంది? అంటూ నోరుజారిన నైజం
పరిపరివిధాల ఆలోచనామృతమైంది

ఓ సూర్యుడా! ఆదిదేవా!
నాకు తెలుసును తీరని నీ మనోవేదన!
మండిన నీ కాయమును ఎందరు ఎలా వాడుకుంటున్నారో
మరుభూముల సైతం చురఃజిత్తుల్లాంటి నైజాన్ని కాపాడుకుంటున్నారో!

మరుభూముల నిరుటితనము కన్న కలల్లో
అపుడే తీరింది కదా ఆయువు !
హే విష్టుమూర్తీ! మహానుభావా!
ఇంకా ఇంకా జీవించాలనే నా ఆశను కబళించింది కదా మృత్యువు!

వెన్నెలలో ఆడుకునే వయసును కనుమరుగయ్యే కనుల్లో
దర్శించుకుంటూ పసిపాపల పెదవుల తీరున్నట్లుగా
విషాదాంతమైనదేమి సోదరా జీవితం ?
చివరికి ఏమి ఎరుగుదువు కదా నన్ను అనుసరించే నీ వాదన!

ఎన్నాళ్ళకీ ఈ తెరమరుగైన పవనాల ముందు నీ ఆలాపన?

వెన్నెలలో ఆడుకుంటున్న ఆయువు ముందా నీ ప్రేలాపన!
మనదైనా మనిషిగా నేను తెలుసుకున్నాను నీ ఆవేదన
జగమే మునిగినా ఏది జరిగినా ఆసువులు బాసే సమయమా నీ నిర్వేదన!

ముత్యమంత కొత్తదనం ఉంటే చాలును బతికులో నిజమెంతో
గీతల నడుమ గ్రీష్మం తాకెనని నాకు తెలుస్తోంది ఆ ఆవేదన!
ఈ పల్లెలు పట్టణాల నడుమ ప్రపంచం ఒకటే అని తెలుసుకుంటే
ఉపేక్షించడం అనేది కావ్యసృజనతో గానీ తెలియదనేదే నా దీవెన!

ఊహల యానంలో నిత్యం విహరించేవన్నీ పక్షులే కావాలా?
ఉపేక్షించడం తెరలలో సవరించడం అనేది సమమై పోవాలా?
సిరివెన్నెలను సరిచేసుకుంటూ పోతుంటే ఆకాశమేమవ్వాలి?
పురాగమనమో పూజితమో  కానీ ఆవాసం మాత్రం భద్రమే అవ్వాలి!

రంగులలో ఎంత సజావుగా అమరిందో జీవితం!
అందమైన ఇల్లాలుగా ఉండే జీవితంలో గుట్టుగా ఉండేది ప్రకృతి
నిక్షేపమైన జీవితంలో పదికాలాల పాటు కనిపించేది మానవనిధులు!
పురాతనమైన గోడల మధ్య ఊపిరి పీల్చుకునేవి ఇటుక సిమ్మెంటు!

ఎన్ని ఉదయాలు చూసినా ప్రతి ఉదయం కొత్తే!
ఎన్ని సార్లు పలకరించినా నా అనేవారిని పలకరించడం ఎప్పటికీ కొత్తే!
దూరాలకు సాగిపోతున్న కొంగల బారులు, నిలకడగా ఉన్న చెరువు
ఏపుగా పెరిగిన పంట, ఇవన్నీ మనకు మిగిలిన గుర్తులై నిలిచాయి!

వచ్చి ఎంత కాలమయినా మనిషి
ప్రపంచం అనేది పదార్థం అనుకుంటాడు
మనసనేది పదార్థమని, డబ్బుమాత్రమే దైవమని అనుకుంటూ
ప్రతీదీ మసకబారినట్లు కనిపిస్తాయి సృష్టి చిత్రాలు!

మనిషి ఎవరైనా ఎవరి పక్షం వాడిది
ప్రపంచం ఎంత దూరం సాగినా ఎవరి జీవితం వారిది
ఉద్యోగపర్వాన్ని ముందుంచుకుని అలవాటు ప్రకారం
తెల్లవారిరaెమున తల్లిలా తట్టిలేపడం అనేది జరగని పని!

మానవ సాధ్యమైన పనులు పలుకులలో
స్వర్గం చేజారిపోయిందని భయపడుతున్న క్షణాలన్నీ నీవే!
నాకు మిగిలిన జీవితాన్ని మరింతగా పెంచుకునే నిముషాలు
తక్షణం వెడితే అదే జీవితాంతం మిగిలే చేవ్రాలు!

ఆకాశంలో తేలే మబ్బుల్ని వెండి చందమామను
మెడలో వేసుకోవాలని చిన్నారి అడిగితే
వెంటనే గుర్తుకు వస్తుంది పసితనపు కోవెల పొద్దు!
మెడలో పూలదండ ఉన్నట్లే పసితనపు క్షణాల్ని ఏరితెచ్చుకుంటాను

ఏకంగా జీవితకాలం చూస్తాను ప్రకృతి పిలుపుకోసం
నామం మారినా లేక చిరునామా లేకున్నా సరే
పదాలు పదబంధాలు అన్నీ ఒకచోటగా కట్టేసి
భాషలన్నింటి ముందు పచ్చని చాపలా కనిపించే ప్రాసలు!

పీల్చేది గాలి! తాగేది నీరు! శకటం ఒంటరి
ముడిపడే ఉన్నాయి విశ్వం కథ!
మనవైన ఆలోచనలు ఆభిజాత్యాలు అన్నీ కలగలిపి
రోజుకొక వేషం వేసే నింగి సంగతుల వ్యథ!

పోరెందుకు? చీటికీ మాటికీ ప్రశ్నలెందుకు?
అభినివేశంలో ప్రయత్నం ఎందుకు? రక్తపాతం ఎందుకు?
నేల సరిపోదనేదే వాదన కానీ గవ్వలేరుకున్న ధూళి కోసం
బతుకంతా ఏమరుపాటులోనే సాగిపోతుందనేది వాదన!

ఒక జీవితానికి ఈ విశ్వం భారం చక్కగా సరిపోతుంది!
మనదగ్గరున్నది ఒకటి లేనిది ఉందని చెప్పడం ఒకటితో పోల్చుకుంటూ
గుడిప్రాకారాలలో అసలెందుకింత ఆవేశం కలుగుతోందో
తెలియని గ్రాసం నేటి పెద్దలు పేదలు తెలుసుకోవాలి !

ఎన్నో వర్ణాల మధ్య మునుల నివాసం!
కానీ వారి కంటికి కనిపించేది మాత్రం పేదల ద్వారం!
అనాదిగా పెరుగుతోంది మన హిమాలయం
అయినా మంచికీ చెడుకూ పెరగాలి ఒక అడుగు కొంచెం!

రామాయణ గాధలో నాయకులు లేరు మానవత్వం ఉంది !
అమ్మమ్మ తాతయ్య కథల్లో ఎంతో వాస్తవం ఉంటుంది!
రాముడు అరణ్యవాసంలో వినిపించేదంతా మానవత్వం!
రావణుడు లంకలో చేసినదంతా ప్రేమపై యుద్ధం!

కనిపించే వ్యథలన్నీ మన ముందే ఉన్నాయి
వినిపించే కథలన్నీ ప్రశ్నలై నిలదీస్తున్నాయి
కాగితాలలో పరిశీలన రంధ్రాన్వేషణ రెండూ మంచివే!
విన్నవించుకుంటే చాలదా ఆపైన పరిశీలన!

ఏ బాబాలకూ క్షణం తీరికలేదు! ఉండదు
అవలీలగా ఎగసిపడేటంతటి సుఖంలో పరుగుపందేలు ఉండవు
కోట్లకు కోట్లు వ్యయం చేసినంతటి రాజమార్గాలన్నీ
ఒక్క జడివానకో కాటువేయబడిన అవసాలుగా మిగిలాయి!

కాస్సేపు కబుర్లు, కాస్సేపు నవ్వులు
అలసినట్లున్న మేఘాల వలస ప్రాంతాలు అన్నీ
కోరుకున్నవారిని కోరినట్లుగా తిరిగి పంపడంతో
పరిసమాప్తం అనేటందుకు సరైన ఆనవాళ్ళులేవు!

విద్యుత్తు ఉండాలంటే అందుకు విద్వత్తు ఖచ్చితం!
వారాలు నెలలు సంవత్సరాలు
మీనమీసాలు లెక్క పెడుతున్న సాగరతీరాలు
హంసగీతం పాడుతున్న ఒక కవి కనిపించకుంటే కన్నీటి చందాలు!

ఆకలి వేస్తే ఆకాశాన్ని చూస్తే కడుపు నిండదు
నేలతల్లిని, నేల భరించే భారాన్ని చూస్తే కన్నీరుపండని క్షణం లేదు
ఎవరూ ఎవరికోసం రారు! కష్టాలంటే కన్నీరు కాదు
కష్టం ధైర్యానిది! ఖర్మ దైవానిది ! మిగిలినదంతా మనదే!

ఓ సహచరుడా!
ఇపుడెందుకు నవ్యపథం నన్ను కదిలించేందుకు!
అక్షర లక్షలవుతా నీ ముందుకు నిర్జన నిశ్శబ్దాన్ని అవుతా!
తర తరాలకు స్ఫూర్తి ప్రదాతలకు జ్ఞాపికను అవుతా!

దేశం అరవై రెండేళ్ళ యౌవనంలో అస్వస్థతగా ఉంది
ఏనుగు మింగిన వెలగపండు చందంగా గమ్మత్తుగా ఉంది
ఎన్ని అలికిడులున్నా మెదలకుండా పడుకున్న కొండచిలువ
ఊహకందని భావాలను నెమరువేసుకుంటోంది!

నేరగాళ్ళు, నేరం చేసినవారు వేర్వేరు !
రాజరికానికి రాచరికానికి అర్థాలు వేరు!
నోరుమెదపని జీవుల్లో ముదిరిపోయిన చీకట్లు వేరయితే
నిలువెల్లా ఆశ్చర్యపోవడం అనేది నిలువెల్లా కమ్మని ఏరు!

ఓ రావి పురమా! ఓ ఆకాశ హర్మ్యమా ?
భూపాళరాగం పాడుకుంటున్న గళములు జీరబోతే
పక్షులన్నీ ఎండకు కందిపోయేయి!
ధాత్రి నీకు కనిపించే చల్లని కబురైతే ఆత్మలు నిలిచిపోయాయి!

దైవం మనం నడిచే దారిలో నడవదనుకుంటే పొరపాటే
దైవమనేది ఎక్కడైనా నడుస్తుందనేది మరొక గ్రహపాటే!
దైవం అనే శక్తి నీదైన పరంపరలో కనిపించే ఆత్మహాలికులు!
కాశ్మీరయినా కన్యాకుమారి అయినా తెల్లవారితేనే మంచుశిలలు!

అణువులు ఎప్పుడూ అణకువగా ఉండి సృష్టిని శాసిస్తాయి
పెద్ద చేపలు చిన్న చేపను తినడంలా తినడమే ధ్యేయమైతే
దారిద్ర్యరేఖ, అదృష్టరేఖ హస్త రేఖలన్నీ ఒకానొక
ఉద్యానవనంలో విహరించేటంతటి ఆనవాళ్ళు!

ఎన్నో ఏళ్లుగా భూమి బీటలు వారింది
గత కొన్ని నెలలుగా గుండె బండలు ఏకమయ్యాయి
తెలిసిపోయింది భూమికి ఇకపై మనసు విశ్రాంతికోసమేనని!
పొమ్మని అరిచినా కాదని విదిలించినా స్వచ్ఛమైన నీకోసమేనని!

ఎన్ని తెలిపినా ఎప్పటికప్పుడు మళ్లీ మొదలవుతుంది ప్రపంచం
ఎంత కాదన్నా వెన్నంటే ఉండి తీరుతుంది సమాజం!
టపటపా రెక్కలల్లార్చే పక్షిలా సాగుతుంది దశదిశావతరణం!
చిన్నచిన్న విరామాల మధ్య అయోమయంలో పడిపోతుంది జీవితం!

ఏం చెప్పమంటావు ప్రాణమా? సృష్టివి నీవే అయినా
ప్రతి సృష్టిని నేను కాదనగలమా ఏమిటి?
సాగరవతరణానికి అనర్ఘ వాహనాలు ఎన్నయినా సరే
ఫలితం ఊహాతీతం కాదు! కాంతిదర్శనం అసలే కాదు!!

ఆకలి వేయడంలేదు ఎందుకో?
పదాల పలహారం తింటున్నాను కదా ?
భావాల భోజనం! శైలీ పాయసం లాంటివాటితో
నాకు ఆకలి ఉండదు నన్ను వరించిన కవిత్వానికి ఆశ ఉండదు!

చిందర వందరగా గోలచేస్తున్నాయి నాలో భావాలు
వర్తమాన శిఖరంలో బరువైన పదాలేవీ కనిపించడంలేదు
అన్నీ ఒబిసిటీ క్లినిక్‌కు వెళ్ళి బక్కపల్చగా తయారవుతున్నాయి
కరచాలనానికి, కవి సమ్మేళనానికి ముస్తాబు అవుతున్నాయి.

అంటున్నారు కదా? సమయం కాకున్నా సందర్భం లేకున్నా
సీతాకోకచిలకల్లా స్వేచ్ఛావిహారం చేస్తున్నాయి
ఇక్కడ సీతాకోక చిలకలంటే రంగురంగులని అర్థం కాదు
మనిషి విపరీత మనస్తత్వాలకు అద్దంపడుతున్నాయి!
గాలిలో తేలిన ఇసుక రేణువులకు కవితార్థం పడితే కాస్త విలువ పెరుగుతోంది
హృదయాంతరాల నుంచి ఉప్పొంగి వచ్చే భావాలేవయినా గట్టిపడుతున్నాయి
వేకువ వెలుగులు, వెన్నెల జిలుగులుగా మారి
మెల్లగా జారుకోక ముందే సందెవెలుగుల మధ్య సేదదీరుతున్నాయి!

గత కొన్నేళ్ళుగా జగన్మాతా! ప్రకృతికాంతా! వినండి
సమయాలను గ్రహించి సందర్భాలను జతచేసి అమర్చుతున్న క్షణాలన్నీ
మీకు చెప్పి మరీ మీ మెడలో అలంకరించిపోతాను!
వీలనేది నీతోనే ఉండేది కాదు! కానీ ఎవరికి వారు ఏర్పరుచుకునేది !

సామాజిక స్పృహతో నడిచే విన్యాసాలన్నింటికి పాదాలు లేవు!
మీరు మీ సంగత్యాలు కలిసి ప్రపంచానికి తెలిపి
చేసే ప్రత్యేక తరహా ఊరేగింపులో అఖండ మౌనం వహిస్తే
కదిలుతున్న జన ప్రభంజనానికి ప్రకృతి తోడు చాలా అవసరం!

అనుభూతులు బోలెడు. అనుభవాలకు రంగులు
అన్నీ కలగలిపి మంచి బొమ్మలు గీయడానికి అనేక హంగులున్నాయి కాదా?
ఒంటరిగా నా గదిలో కూర్చుని ఒకవైపుగా వంగి
మరోవైపు తొంగి చూస్తూ భిన్నత్వానికి ఏకత్వానికి తేడా చూపుతోంది!

ఒక మహా ఆకృతి మనిషి ఆకారంగా మారితే
అది ఖచ్చితంగా మానవాతీత మానవత్వమే!
ఒక చిన్న వికృతి మానవాకారం పొందితే
ఇక చెప్పడం ఎందుకు అది అప్రస్తుతమే కానీ చెప్పడానికి వీలుండదు మరి!

పరిణామాలు వాటంతట అవే మారుతాయి కానీ
ఆడుకున్నా ఆటవిడుపు లేకున్నా సరే అగ్నితోచెలగాటం ఆడుతాయి
వలదని ఘాటుగా మాటుగా హెచ్చరిస్తున్నా సరే
ప్రయాణానికి సిద్ధం కావలసిందేనంటూ సోది చెబుతాయి!

నేస్తం! రా రా! ఎంతకాలమయిందో కదా మాట్లాడి
ఇద్దరి సమక్షంలో తెల్లవారురఖాము చూసి ఎన్నాళ్లయింది?
గుడి ప్రాంగణంలో కూర్చుని ధ్యానించి ఎంతకాలమయింది?
అలవోకగా కదిలే కవితా గంధాలన్నీ నేలను వీడాయి ఎంత వింత ఇది?

మనిషి ఉండటానికి ఇల్లు కావాలి కానీ
మనసుకెందుకు ఎపుడో దేవుడే చక్కని శరీరమనే ఇల్లు ఇచ్చాడు
ఆత్మ దేవుని ఆస్తి కదా? అందుకేనేమో
ఏ కోనలోనయినా కుటీరమైనా సరే బతకడం అవసరం!

ఇంటికి ఎన్ని ద్వారాలుండాలంటే ఒకటి చాలు
కాదు కాదు మూడు ఉండాలి కాదు నాలుగు లేదు అయిదు
ఇలా ఎంతమంది ఈ ద్వారాల లెక్కలు చెపుతున్నా సరే
మనిషి వెళ్లేది వచ్చేది ఒకటే దారి కదా?

రేయికి పగలుకు ఉండే తీరులో ఒక కోటగా మార్చచ్చు
పెద్దలూ పిన్నలూ అందూ నానాటికీ చేరలేకపోతుండచ్చు
కానీ ఇల్లు పెద్దయిపోతోంది
ప్రపంచం ఇరుకుగా ఉంటోంది మరి!

కాలానికి అతీతంగా స్మృతిపటం నుండి తొలగించాలి
ఆద్యంతం చెరిపివేసిన సంస్కృతి కారాగృహాన్ని
ఊపిరితో నింపి వానజల్లు వాకిట్లో
పూలజల్లు ఇంటికప్పులో చుట్టాలుగా ఉంటే ఎంత బావుండును?

కంచెల మీది స్నేహాలను తాకుతున్న ప్రేమమయీ!
నీ గురించి సంక్షిప్తంగా చెప్పడం కాస్త సులువే కానీ
నీపై నాకున్న ప్రేమకు చిహ్నంగా కథనాన్ని అల్లుతాను
కరుణార్ద్రరూపంతో మహాకావ్యంగా మలుచుతాను నన్ను నమ్ము!

ఉండు ఉండు ఎక్కడినుండో శబ్దం వచ్చి నన్ను పిలుస్తోంది
అదే కటువైన సత్యాల తాలూకు చప్పుళ్ళు!
నాకు తెలుసు సత్యం ఎంత పొడవైనదో చూపరులకు పొట్టిది
కంచెలను కట్టివేసిన నిజాలు ఎప్పటికైనా బయటకు రావా ?

ఇంటికి తలుపు మొదటి చుట్టం!
లోన జరిగే వింత మనస్తత్వాలు, అరుపులూ కేకలు
వాస్తవాలు చూసి చూసి గోడలకు గోడు చెప్పుకుంటాయి
నీవే నయం స్థిరంగా ఉంటావు నేను చూడు ఎలా మరిపోతామో అని !

కంచెనే చేను మేస్తే ఇక ఆపేదెవ్వరు?
ఎవరు కాపలాదారులవుతారు? ఎవరిని నమ్ముతారు?
ఎలా బతుకుతారు? ఎలా గోదారికి చెప్పుకుంటారు
ఎలా ఇద్దరు కలిసిన తర్వాత కబుర్లు చెప్పుకుంటారు?

మనిషి అభిలాషను అనుసరించే
మాట్లాడుకోవడం చూస్తుంటాను ఒక్కోసారి
కానీ నిష్కారణంగా పాటలు పాడుతూ పద్యాలు అల్లేస్తూ
కాపలాదారుడైనా బావుండేది కావలిj[illegible] కదిలి వెళ్ళిపోయాడు !

ఏమయ్యా ఎక్కడున్నావు ఇన్నాళ్లూ ?
అని ఊరు పలకరిస్తుంది కారుగల ఆసామిని
ఆసామికి కళ్లజోడు కదా ఊరు కనిపించదు
చెవిలో వింటున్న పాటల వల్ల పలకరింపు వినిపించదు పాపం!
అవిటితనం శరీరానికే అనుకుంటే పొరపాటు
ఏకంగా మనసుకే రావడం అనేది గ్రహపాటు
సరే గీతలు గీద్దాం! ఎవరు ఎంత మంచివారో తెలుసుకుందాం!
ఎదురుగా ఎంతటివాడైనా వాడు ప్రియభాందవుడని గ్రహిద్దాం!

నీకు నేను, నాకు నీవు
నీతో ఆకాశం నాతో నేల
ప్రతీదీ నీవు నేనుగా రెండు భాగాలయితే
మిగిలేది ఏముంది ? వేదాలకు చోటెక్కడ ఉంది?

ఉన్నన్నాళ్ళూ నాకు ప్రపంచంతో పనిలేదు
ఇక నీవు ఉండవు అనగానే ముచ్చటగా ఏవీ మిగలలేదు
కిటికీ పక్కనే మంచం ఉంది
మంచం మాత్రం ఎపుడు దిగిపోతావు అంటోంది!

ఎదురుచూసి ఎదురుచూసి కళ్ళు కాయలు కాయలేదు
ఒకటే వాన, ఒకటే ఎండ ఏమని అడిగేది ప్రకృతిని
అడిగినా ఒకటే దిగులుతో ఏమిచేయను?
ఆకాశానిదే అసలు తప్పంతా అంటుంది!

నిలదీసి ఆకాశాన్ని కడుగుతాం కదా
అపుడు భూమిపైనే ఆవిర్లు మాత్రమే కారణం అని తప్పుకుంటుంది
ఎండా కావాలి నీడా కావాలి రెండూ తప్పవు
వయసు తారతమ్యం లేకుండా మతి చలించిపోయింది!

ఒక్కోసారి గుండెమంటల్ని చూసి సూర్యుడు చిన్నబోతుంది
మరొక్కసారి ఏదేని వెన్నాడే నీడలకు ఏకంగా కలగంటుంది
ఇంకోసారి మరోసారి ఎదుటివానిని చూసి జాలి తెచ్చుకుంటుంది
ఇక ఆపై తనకు తానే విసిగిపోయి సామంలిస్యాన్ని నిలుపుకుంటుంది!

గుడి చుట్టూ తిరిగితే పుణ్యమని చెప్పగానే అమ్మ
తిరిగి తిరిగి ఏమి చెప్పుకుంటామో తెలుసా? ఆకలేస్తోంది అని
లెక్కలు పత్రాలు సరిచూసుకున్న తర్వాత బలవంతంగా
ఏదో సాధించినట్లు గంటలు గంటలై గుండెలో కొడుతాం!

అసలు గుడి? మసీదు? చర్చి?
ఏదయినా మనుషులే కదా కట్టింది అనిపిస్తుంది
అక్కడ నాలుగు తలల మనిషి
రెండు నాలుకల మనిషి కాదు కదా నేస్తం? ఆలోచించు

ఉదయం అంటే అందరికీ ప్రీతి !కానీ ఆస్వాదించరు!
ఉదయం వానజల్లుగా కురుస్తున్నపుడు
ఉదయం చిరు స్పర్శగా పలకరించినపుడు
ఉదయం పూలరెమ్మలపై కూర్చుని పిలుస్తున్నపడు అందం పెరుగుతుంది

అదే రaాము ను పిచ్చుకలు కిచకిచలాడుతున్నపుడు
గాఢనిద్రనుంచి లేచిన పెద్ద పక్షి తన రెక్కల్ని టపటపా విదుల్చుకుంటూ
హృదయాన్ని ఒక సౌందర్య లేపనంగా మార్చుతుంది
కొవ్వొత్తులన్నీ ఒకచోట సమావేశమై జారిపోయే తమకు ఆసరా కావాలంటుంది

నిన్న కాదు నేడు కాదు ఏకంగా ఒకటే అంటున్నాను
కటిక చీకటిలో దీపం వెలిగించినవాడు దేవుడయ్యాడు
కారడివిలో కాల్చుకు తిన్నవాడు ఆదిమవాసి అయ్యాడు
ఇంట్లో నిత్యం వేధించుకుని తినేవాడు భర్త అయ్యాడు!
మొదటనుండి వేపుడుకే విలువెక్కువ!
దిక్కుతోచక దిక్కులన్నీ పరిభ్రమిస్తుంటే
మొట్టమొదటిసారి వేడుకుంటున్నాను నేను నీకోసమని!
నువ్వు ఉన్నావో లేవో కానీ సారం లేని సంసారం వద్దని!

ప్రకృతిలో అణువణువూ నా గుండెలోంచి పుట్టిన బిడ్డలే!
వారికి ప్రత్యేకమయిన కులంలేదు. మతంలేదు.
వర్గంలేదు వాదనలేదు ఏవీా లేదు అంతా నాకు సాధారణమే
మనిషి ని మనిషిగా బతకనిస్తే చాలు తప్పకుండా మేలు జరుగుతుంది

యుగాలను నేను కొన్నేళ్ళనుండి మెదడులో మోస్తున్నాను
శతాబ్దాలను గుండెలో, దశాబ్దాలను కళ్లలో మోస్తున్నాను
ప్రపంచాన్ని కిటికీలో బంధించాను
ఇంటిని వీధిగేటుకు కట్టేసి తాళం దాచుకున్నాను!

మానవులు నవ్య కేతన సదృశ్యాలు!
చూపులన్నీ జగతిని ఆహ్వానించిన వేళ
అడుగడుగునా తారసిల్లిన కాంతిపుంజాలయిన తర్వాతే
జీవన సంధ్యాసమయానికి కరుణించిన దేవతా సుమాలు!

పిల్లలు ప్రతి ఇంట్లో నూ అంటుంటారు ఏమయిందని?
భాషను పట్టుకుంటారు. భావన దొరకలేదు
వెదుకులాటకు పోతే మిగిలదంతా వెనుకబాటే అనుకొని
నవతరపు పరమహంసలన్నీ  పలరింపుకు తోడవుతాయి!
ఒక్కరోజయినా ఎవరైనా హృదయ స్పందనలు వినివుంటే
తెలిసేది జీవితాల అస్తవ్యస్తం మాటున దాగిఉన్న నిజాలు!
ఒక్కోమారు తెల్లవారినా బతుకు తెల్లవారదు.
అక్కడక్కడా సమీరాలు కదిలి రాగాలు విన్నాక వేస్తాయి లక్షప్రశ్నలు!

సమీరాలు కదిలినా, సమాధానాలు దొర్లినా
ఉన్నట్లుండి ఉలికిపడి నిద్రలేచి చేసేదేముందని?
ఎదుట నిలిచి వేసే ఉదయకిరణం వేసే ప్రశ్నలకు
సమాధానంలేకుండా మిగలినా చూసేది ఏముంది?

ఒక్కసారి ముందుకు కదిలితే ఆ క్షణం తిరిగి రాదు
ఒక్కసారి వెనక్కు తగ్గితే ఆ క్షణాలన్నీ ముందుకు పోవు
నియతిలేని శిలలపైని పరిశుభ్రమైన లేఖనాలు
అసుర సంధ్యలో తప్పని లేకుంటే జీవితమని అంటే ఎలా?

ఏకాంత వాసిగా నివసించి నేడు
ఒంటరితనాన్ని ధైర్యంగా తెచ్చుకున్నాను
నిట్టూర్పులు, పారవశ్యపు ఊర్పులు కలిసి వేసిన రంగవల్లులన్నీ
అందరినీ నిలదీసే సుస్వర మాధుర్య సుమ గంధాలు!

ఒక వొడ్డుపై నీవు! మరొక ఒడ్డుపై నేను!
ఒకచోటకు చేరడానికి నావకావాలి తప్పదు
కానీ మనసనే నావ ఉంటే చాలు నీటిలోనైనా ఈదచ్చు!
నావ వచ్చేదాకా ఆగాలంటే చీకటి కోరలు మెదడును హరించవచ్చు!

వర్షం ఆవేశాన్ని చూపింది
ఇల్లు గుడి తేడాలేకుండా ముంచివేసింది
వాగుల్లో వంకల్లో పొంగిపొర్లుతున్న నీరు
తెప్పఉంది, తేరు ఉంది అవతలి గట్టుకు చేరేందుకు తెడ్డు ఉంది!

ఊహించని ఆ పరిణామానికి మనుషులు కాదు
పక్షులు కాదు అనేకమంది కడలి కడుపుకు ఆహుతి అయితే
శోకతప్త హృదయాలు అనేకం మనుగడకు ముంగిట
నిలువుగా గీచిన బొమ్మగా మారి శోకమై చరిత్రను తాకింది!

పల్లెవాసానికి చేరువలో గుడి  పారదర్శకమైతే
ఎంత తిరిగినా తరుగనట్టి దీర్ఘమైన చరిత్ర ఉంది!
నరులు నరమాంసభక్షకులైతే,            అసురులు వీడని
అపనమ్మకంతో అహింసా వాదులై నిలిచారు!

భూమి ఉంటుంది! భూలోకంలో మనం ఉంటాము
చట్టం ఉంది! చుట్టం ఉంది ! చాలీ చాలని చట్రంలో బందీ అయింది
ఆకతాయి పనులను నిలుపుకుని రాయించల నడుమ
తెలుగు భాష ఉంది! తీయని సంప్రదాయం దాగుంది!

ప్రణయం, ప్రణవం రెండూ వేర్వేరు
బతుకు మిథ్య ప్రత్యణువులన్నీ రోగభూయిష్టులై
చూస్తూ చూస్తూ చూడబోతూ కూడా ఏవీ తెలియనట్లు
పెదవి విరిచి మరీ రచించిన కన్నీటి పాటలు వేర్వేరు!

ఉత్పలమాల, చంపకమాల వచనకవిత పేరంటానికని వెళ్ళి
ఏమాత్రం నచ్చని మత్తకోకిల, తేటగీతి రావడం గ్రహించి
సీస, కంద పద్యాలకు ఏకరువు పెట్టాయిట !
ఇంకాస్సేపట్లో మత్తేభం, శార్దూలం కూడా వస్తాయి అని!
గురజాడ అయినా, శ్రీశ్రీ అయినా
మహాకవుల వేదికపై ఘర్జించి నిలిచిన కంఠాలే!
పడవను నేర్చారు ఈతను నేర్చారు
పదాలు నేర్చారు . పాటల పల్లకీ మోసారు!

బతుకులో అందచందాల్ని ఆసాంతం ఆకళింపు చేసుకుని
బాధతో, భారంతో పంచిపెట్టాయి చందన వృక్షాల తాలూకు నిజం!
కరుణ నీవే! కవిత నీవే అయినపుడు సరసపదముల
కానుకగా ఇచ్చిన అపురూపమయిన కూర్పు ఇదే అది వాస్తవం!

గీతాలు రాయాలి హృదయాల్ని కదిలించాలి
పదాలు రాయాలి ప్రపంచానికి వినిపించాలి!
భాషను కాపాడాలి భాహ్య ప్రపంచానికి కనిపించాలి!
భావాన్ని అర్థం చేసుకోవాలి. ఔదార్యం కనిపించాలి!

మానస సరోవర తీరాన నిలుచున్న శీతల పవనాలు
కొలచుకునుచు నమ్ముకునుచు జారగిలపడుతుంటే
ఇంద్రధనువు నకు ఏడు వర్ణాలు తిరగబడ్డాయట
చివరకు ఏడేడు జన్మలకు కానుకగా మిగిలిపోయాయట!

కనుపాపలలో కనిపించేది ప్రకృతికాంతే!
కంటినిండుగా వినిపించేది పల్లవి ప్రవాహమే!
తెగింపులేని దేహాల తాకిడికి ఉరిమే ఉరుమే సాక్ష్యం!
తెలిహంస రాగానికి యుగళగీతంలా వినిపించే నక్షత్రం!

ఆమని రాగంలో నా హృదయం ఆసాంతం
వలచిన తీరులో దాగుంది కనుకనే వలచేను కదా?
పలువురిలో నేను ఉన్నా సరే పగలూ రేయి ఏకాంత వాసమే కదా?
చుక్కలు చంద్రుడు ఇద్దరికీ చుట్టరికం ఉన్నా దూరదూరమే కదా?

ఈ లోకపు గణిత శాస్త్రంలో కనిపించే లెక్కలన్నీ కొంచెం కష్టమే!
సామాన్యమూ సాంఘిక శాస్త్రంలో వినిపించేవన్నీ మూన్నాళ్ల ముచ్చటే!
కూటికోసం, గుడ్డకోసం కళ్లు తెరిచి చూసే ప్రతి బిడ్డ మన నిర్లక్ష్యమే!
మోదుగులని మురిపాలని ఎన్నో అనుకుంటూ గుర్తుకు తెస్తున్నది మనమే!

అందుకే ఋతువులను బతిమలాడుతూ రారమ్మని
ప్రణయాన్ని పండిరచమంటా జీవితం పెంచుకొమ్మని
కథ రాయడమే కాదు కవిత్వమై రమ్మంటా
నాలోని అందం కంటే నా భావం అర్థం చేసుకొమ్మని అంటుంటాను.

జన్మ అనేది ఈ ఒక్క జీవితానికే సంబంధించినది కాదు
పునర్జన్మ అనేది ఒక్క రోజులో ముగించేది కాదు
పుట్టినవెంటనే వెంటనే నమస్కరించడం లేకుంటే
ఆనందం లేకపోతే జతగాడు జీతగాడైనా పొరపాటే!

నిద్రిస్తున్నావా? నేస్తం? ఎపుడు లేస్తావు?
పడుచువు మానాలు దక్కించుకో!
ప్రౌఢవు ప్రాణాలు దక్కించుకో
వార్ధాక్యపు కిరణాలకు బాల్యంలో ఉంచి రక్షించుకో!

తరాలు తరలిపోతున్నాయి.
యుగాలు మారిపోతున్నాయి
తరం యుగం కలగలిసినపుడు వాపోయాయి
ఏమి మారితేనేమి మానవసంస్కృతి ముందు చిన్నబోయింది

ఊదారంగు ఆకాశంలో తారలాంటి నీ ఉనికి
కిందపడితే ఏముంది? కిరణం తలక్రిందులయ్యింది
నేల వీడని అనురాగం అది! కాదంటే మాత్రం విరిగి ముక్కలయ్యింది
ఎన్ని విల్లులు! ఎన్ని శిఖరాలు అన్నింటికంటే శిరస్సు నిలిచింది

ఎల్లవేళలా తిరిగి తిరిగి సృజనకారులైన నెపంతో
ఆర్పించుకునే పూల రెమ్మల ముందు మన ఆకారాలెంతని?
తపస్సు చేసి గెలుచుకునేందుకు ఒక జన్మ చాలనేదెందుకు?

రేయి అయినా పగలైనా క్షణాలను అలంకరించుకున్నావు భయమెందుకు?

ప్రకృతి పెదాలపై హాస్యరేఖలు కొన్ని మైళ్లుగా చిత్రించి
ఏపుగా ఎదగడంలో ఎగురుతున్న టేకు మద్ది వృక్షాలు
అడుగడుగునా ఎదురయ్యే వెదురు పొదలు
ఒకనాటి అందమైన నీలగిరులు పనిలేనివాటిల్లో ఉంచి స్మరిస్తున్నాను.

చెట్లను అక్కర్లేదనుకునే దున్నలు కొందరు
ఒక్క మబ్బుతునక కనిపిస్తోంది
వయ్యారంగా నాట్యమాడే నెమళ్ళు
తన ఆటలతో మురిపిస్తూ నేలనే తవ్వుకుంటున్న గణాలు!

గాలిలో తేలిపోతూ ప్రయాణించిన రామోరి సీతమ్మ
ఒక్కడో ఒకచోట జలపాతం కోసం వెదికి వెదికి
కనిపించాక గ్రహించి రాచరికం అడవుల్లో పోరాడుతూ
చదువుల తల్లిని సాక్షాత్కరింప జేసుకుంటారు స్వప్నంలోనైనా

ఆశావాది పట్టిక నెరిగి
ఆరంభంలోనే తెలుగు వర్ణమాల
వినువీధిల్లో కీర్తి బావుటాలను
ఏలికతో నిలిచి పర్యాయాలతో పని లేకుండా నిలిచింది!

రాచరికం నగరాల్లో లేదు
అడవుల్లో  ఠీవిగా నిలుచున్న పులుల లో ఉన్నాయి
ఎక్కడో దూరాన కుంతల జలపాతంలో
గల గల పారే చిరునవ్వుల చైతన్య రథంలో ఉంది!

అ,ఆలతో మొదలైన తెలుగు వర్ణమాల
అరవైనాలుగు అక్షరాలతో లక్షలాది మంది సంతానం
ఏమి ఆనందాన్ని చూసారు?
ఎన్ని సార్లు ప్రశ్నించినా సరే తమకు న్యాయం జరగటంలేదని తప్ప!

ప్రకృతి మాత సహనానికి గీతలు ఎలా గీయాలి?
స్వప్నాల నడుమ జీవితానికి సరిహద్దులు ఎలా రాయాలి?
చెట్టును కోరినా, పిట్టను కోరినా ఏదో ఒక దారి చూపేది
ఒక మనిషిని కోరితే ఏమి దొరుకుతుంది ఆవేదన తప్ప!

ఒక ప్రపంచం, ఒక దేశం, ఒక ఊరు, ఒఙజి చౌరస్తా
ఒక సందు, ఒక ఇల్లు ఇన్ని దశలు దాటాక మిగిలేది ఒక మనిషి
కాకుంటే ఎన్ని అడుగులు వేస్తే ఒక ప్రపంచాన్ని చేరాలి?
ఎన్ని వీధులు దాటితే ఒక ఇంటిని చేరుకోవాలి?

వేల వేల యేళ్ళుగా కొండపైన బండలా
తొంగిచూసే తారలు పచ్చదనం కప్పుకున్న దిశలో

వరిపొలాలు ఎండినా మురిసిపోయి పరవశంలో తేలాయి
విరజాజులు, మరువం లాంటివన్నీ మార్పును కోరలేవు

మనసనేది మానవునిదే కాదు సకల జీవరాసులది
మార్పునొందే అనుక్షణమూ కన్నులనుండి మాయం!
మాటిమాటికీ గుర్తొస్తోంది నా జీవితం!
ఎల్లవేళలా ఎల్లలపై నిఘా ఉంచుతూ, నిరూపణలు చేస్తూ

చలికాలపు ఎడారిలో రాళ్ళూ రప్పలూ స్నేహితులు
సమరం నుండి సంఘీభావం వరకు సందిగ్ధావస్థలో చేరిన ప్రస్తుతం
కొట్టుమిట్టాడే ప్రాణాల్లో నేనొకదాన్ని
లేదు నేనే ప్రాణాన్ని నీకేం భయం అనేదానిలో నీవొకరు!

ఈ మధ్య ఋతుపవనాలు ఎర్రగా ఉంటున్నాయి
ఒక్క మాటలో చెప్పాలంటే ప్రైవేటీకరణ అయ్యాయి
అందుకే తూచి తూచి ఎండ, తూచి తూచి నీడ పంచుకుంటున్నాయి
అంతమాత్రాన విర్రవీగుతుందా అంటే దాడి చేస్తావా?

కొత్త చిగురాకుల నడుమ సొగసైన తొడిమెలతో
వయసొచ్చిన భామలా ముస్తాబు అవుతోంది చెట్టూ చేమ!
మల్లియ తెల్లని చీర కట్టుకుంటే , కనకాంబరం అంచు అయ్యింది
చేమంతి గులాబి లన్నీ పంచాయితీ పెద్దలయ్యాయి

గంటలు నిర్విరామంగా మోగుతున్నాయి
అనుసరిస్తున్న చీకట్లు దీపాలకోసం వెదుకుతున్నాయి
సందడి నానాటికీ పెరుగుతోంది
మా గుండె లయ నిత్యం శోభాయమానంగా వెలుగుతోంది!

అసలు నిన్నటిదంతా అతివృష్టి
నేడు అతిసృష్టితో శ్వేతవనము పూర్వరూపం దాల్చుతోంది
బాకీలేవీ లేనందున కోట బలంగానే ఉంది
శీతాకాలపు మేఘాల శకలాలు ఇంకా బంధీగానే ఉన్నాయి

ఓ ప్రాణమా ఒక్కసారి ప్రకృతి శ్వాస విను!
ఒక హంస, ఒక నెమలి రెంటినీ గమనించు!
హంస హృదయాకారమయితే
నెమలి హృదయంలోపల కదలికలను నేర్పుతుంది!

ఎందరో త్యాగధనుల వాగ్మాలాలు వింటూనే
వర్ణాలనీ, వర్గాలనీ నిత్యం స్మరించే
మాటల మంత్రాల్ని దహించు కాకుంటే వర్షించు
రెండు గుండెల నాగాభరణం బతుకులో పాఠం చెబుతుంది!

వర్షంతో హర్షాతిరేకల్ని వేదనలను వడ్డించే నేను

నాలుగు అడుగులు నడిచానో లేదో ఏకంగా
ఆజానుబాహుడై సుప్త చైతన్యాన్ని కదిపింది
కలిసి ఉన్నదల్లా అమృతం పంపించే సందేశాలు!

అనేక ఆకారాలలో ఏకాకిగా ఉన్న కారణంగా
అస్తవ్యస్తమైన పడి ఉన్నది వార్ధాక్యం కాదు వ్యక్తిత్వం!
నేడు నాదై నిలిచిన కొన్ని ఊహలకు
అక్షరాకృతిని కలిపించుకునన సుకృతి నీదే కావచ్చు!

ద్వారంధ్రాల నడుమ ఊగిసలాడే మాటను
తన అస్తిత్వం ప్రకటించుకుంటుంది.
ఉన్నపళంగా ఊరినంతా వదిలి ఇంటికొచ్చేయమని
అంటుంటే ప్రయాసకొచ్చి చేరుకున్నాను నిన్ను!

చెయ్యిలేస్తుంది అందుకోవడానికి
కానీ హృదయం చేతికి రాదుగా! ప్రపంచం చేతిలోకి రాదు!
ప్రకృతి చేతిలోకి రాదు! మనసు లోగిలిలోకి
నేను అనే పదం అడుగిడగానే భళ్లున ద్వారాలు తెరుచుకుంటాయి!

ఎలా నిలుస్తావు నా యెదుట?
కుంచెతో చిత్రం గీసా లేక కంచెతో మనసును బంధీ చేసా?
శబ్దవైభవాన్ని ఒకచోటనే గుర్తించినంతమేర
నేను శిలలా నువ్వు ఒక రాయిలా ఉండాలి తప్పదు!

మనిషి మనిషిగా ఉండకపోతే
మనసు జీరపోతుంది మానవ హారాలను అనుసరించి
దూదిపింజల్లా గాలిలో కలిసిపోతుంది
అపుడంటుంది చుట్టుపక్కల చూసి గుండె అయ్యో అని!

ప్రపంచ ప్రాంగణంలో ముగ్గులుండవు..
భూ లోకాల నడుమ అహర్నిశం
లీలగా కదిలే వినోద వేషాల్ని గమనించి
గాఢాందకారాన్ని ప్రతీకగా యుగాలు ఉండవని నిరూపణ అవుతుంది!

ఒకసారి నవ్వుతూ మరోసారి కోపంగా ఉండే మనిషిలా
అటు విధాతకు, ఇటు సంవిధాతకు మధ్య
అనాకలనీయమైన విశ్వరూప చిహ్నాల్ని
మన అన్నవారందరూ విభజిస్తే మిగిలింది స్నేహవీచిక!

అసురసంధ్యవేళ అనుకోని విషాదం ఆవరించిందని
అనుకోకుండా మనుషులకోసం సమాజంలోకి వెళితే
ఇక మిగిలింది చకోరపక్షిలా అరుస్తూ
తిరిగి వచ్చింది జీవితమే విషాదయయిందని వగర్చుతూ

నేను మనిషిని . నువ్వు మనిషివే!
అందుకు సందేహంలేదు!
కానీ నీవు మనసున్న వాడివి!ఇక్కడ సందేహం ఉంది!
నువ్వొక అద్భుతమైన సృష్టివి! ఇక్కడ మరీ మరీ సందేహం దాగుంది

రాత్రి పగలు ఒకటికొకటి కనిపించకపోయినా
విధుల్లో వాటాలు తమంతట తాము చేసుకుంటూనే ఉంటాయి
సర్వస్వమైనవన్నీ నా చేతికిస్తే అక్షరాలుగా మార్చుకుంటాను
పోగొట్టుకున్నవన్నీ నాకందిస్తే కథలుగా చెప్పుకుంటాను!

నా కళ్ళు అనుకుంటాయి కరుణనే వర్షించాలని
కానీ కన్నీళ్లే వర్షిస్తాయి. నా మెదడు , నా మనసు అన్నీ
ఆనంద తాండవం చేయాలనే అనుకుంటాయి కానీ
ఆఖరి ప్రయాణంలో ఇవన్నీ అవసరమా అని హెచ్చరికలుంటాయి!

పలుకులన్నీ నాకేసి చూస్తూంటే
నాకెంత ఆనందమో నీకు తెలియదు
ప్రపంచాన్ని చూసిన నేను సమాలింలో బాధపడిన నేను
ఏమాత్రం లేమితనాన్ని చూపకుండా అందాల కోవెలను చూపుతాను!

ఎవరిని విడవను? ఎవరితో మాట్లాడను?
ఎవరితో ఏమి చెప్పుకోను? జగన్నాటక వేదిక మీద
జతగా ఎవరితో జీవించగలను?
తెరమాటున దాగిఉన్న తెల్లవారి రaాముని..

ఏరేయి పలికించినా సరే లోతు తెలియని రాత్రి
కష్టం సుఖం మరిచి పనిపై కదిలే అవినీతి పునాదుల్ని
నిజాయితీ శబ్దంతో మనసికోద్వేగ మంజీర నాదాలను
కలగలిపుతూ కుర్చీలోనికి ఒదిగిపోయే ఉద్యోగం చాలనుకుంటాను!

తుఫాను వచ్చినా సరే తరంగాలతో
వినాశన శక్తి యుక్తులతో, స్నేహితులతో , శతృవులతో
చరిత్రకంటిన మాలిన్యాన్ని తుడిచేందుకు
మృదువైన కరాలతో శుభ్రం చేస్తుంది. తీరాలను తాకుతుంది!

రాత్రి కురిసిన నీడ జాడల్ని తెల్లవారే సరికి తుడిచేయడం
సృష్టి కి తెవాటే! యుగయుగాల సంస్కార కళతో
శూన్యదిక్కుల్ని కలుపుకుంటూ ఆహ్లాదం కలిగిస్తుంది
కానీ, అరణ్యమంతా ఆవిర్లు పరుచుకుంటే ఎవరిని బతిమలాడాలి?

జీవితం దిక్కులు తోచకుండా నాతోనే పరుగులు తీస్తోంది
ప్రపంచం ఎన్నోవేల జీవితాలను తనతోనే నడిపిస్తుంది
సృష్టి లక్షల పరమాణువుల్ని తనలోనే కలుపుకుంటుంది
ఏది నిజం? ఏది అబద్ధం? తెలిపేలోగా వెనక్కు తిరిగిపోతుంది!

ఎక్కడో దాగిన భయానక సందర దృశ్యాలను ఎదుట నిలుపుతూ
వర్తమాన జీవన దృశ్యాలో ప్రవహించే పదజాలాలను
నాలో సగం నీలో సగం నింపుకుని
దీర్ఘాయువు చరిత్రలో ప్రకృతి విలీనమవుతుంది!

క్షణాలన్నీ కథల్లో మునిగి ఒక్కదానికీ
పరిష్కారం లేకుండా దొరకకుండా కోరికలతో
బిందువును బిందువును  కలిపి ప్రకృతితో ఏకమై అసంఖ్యాకమై
ఒకే స్వరాన్ని , ఒకే రకం ముఖాన్ని కలిపుతుంది

మానసికోద్వేగ మంజీర నాదాలను వింటుంది
ఒక వంతెన ఉంటే దానిపై ఎందరో నిలుచుంటారు
మా చుట్టాలు, స్నేహితులు మాత్రమే అంటే మానసికద్వేగమైన
ఉపన్యాసం ఇవ్వగలరు! ఇచ్చినా వినగలరు!

మారిన కాలంలో మారని ఆలోచనాలోచనాలు!
వాగులు, వంకలు తెలియక మరుగైన వస్త్ర ప్రపంచాలు
లౌక్యమేలేదని విలపించి అనాగరికంగా వేల్లాడదీసిన ఉరితాళ్ళు!
ఉత్కంఠ బేరసారాల మధ్య నిలుచుని అమానుషమవుతాయి!
గుండె మూగబోయింది
శివశంకరాదులను శిరసువంచి నమస్కరించే
గుండె మూడబోయింది.
త్రిశూల త్రివానను కాదనే వీణా వాయిద్యం లేదు..

ఉండుండీ నాలో మాటల మంటల ఆవృతం
గంట గంటకీ నాలో నివసించే శూన్య దిక్కుల సంవిహారం
ప్రపంచ పరావృతాన్ని నిలదీసే నిఖార్సయిన కలాన్ని
నీ ప్రయాణం నీది , నా ప్రయోగం నీదనే సాంఘీక పాఠాన్ని !
మబ్బుల్లో చందమామ దాగుడుమూతలాడిన చందంగా
సూర్యకమలం ఆకాశ సరస్సులో పయనం ప్రారంభించగానే
లోలోపల ఊగిసలాగే తెరచాప యత్నం ఆగలేదు
ఇంకెక్కడా ఏలోపం జరగలేదట. లోపాన్ని సరిదిద్దాలి!

పొద్దున్నంటే పొద్దున్నే
కడుపు ఆకలికి ఏదేని దొరుకుతుందని
మాటలు మొదలుపెడితే పడాలి! ఏదయినా దొరకాలి !
అంటూ గారాల మిషతో గాలాలను వేసే దిశగా నడవాలి!

ఎక్కడా లోపంలేదు
ప్రయత్నం ఎపుడూ నిరాశనివ్వదు!
ప్రయత్నం ఎపుడూ దుఃఖాన్ని ఇవ్వదు
కానీ ఈ ప్రయత్నమే లేకుంటే నేను నీవు అవ్వను!

ఎవరికైనా దానం చేయాలి !
నిద్రా? లేక డబ్బా? లేక జబ్బా?
ఏదిచ్చినా సరే నీలోని అనామిక చిత్రం
ఏనాడో చెదిరిపోయిఉంటుంది మనం మంచిగానే కనిపిస్తుంది!

బండలు ఎక్కడున్నవి అక్కడే ఉంటాయికానీ మాట్లాడదు!
మాట పుట్టేది ప్రకృతిలో నదులనుండి సముద్రాలనుండి
మాటపుట్టిన ఉపాధి నుండి
అమాయక జనహాసనంతో ఆగిన సృష్టి అంతకంతకు ఎర్రబడుతుంది!

ఓ కవితా సమరాంగణుడా?
స్వతంత్రమైన గళంతో నేను మేధో తంత్రం నడిపి
నీతో కలిసి కలం కదిపానంటే మాటలా?
వినుతించిన విధివ్రాతలను అనుసరించి

అయినా రచించిన ఈకావ్యం
నేలరాలిన పక్షుల్ని ఒకచోట చేర్చినట్లు లేదూ?
శ్వాసించే హక్కుల్ని వెలికితీసిన ఈ తెలుగు కవిత్వం
కరకుబాణంతో విలవిల్లాడుతూ బోయ నుండి వాల్మీకిగా మారింది

ఇది ఎవరి ఆగడాలు? ఎవరి ఆనందాలు?
తెలుసుకుంటే చాలు మాట అమృతమవుతుంది
అయాయక జనహాసనంతో ఆగుతున్న నా అక్షర సృష్టి
ఎగిరే పక్షులకు ఎదిగే పైర్లకు, శ్వాసించే హక్కు మీది!

సరేలే సర్దుకుంటాం అనేదే సైకాలజీ!
మినహాయింపులు మిడిసిపాట్లు రెండూ అనుభవాల ప్రమాణాలు
దూరదృష్టితో చేసే రచనలన్నీ చిలకపలుకుల
చిన్నారి జీవితాలకు, పొంచిఉన్న ప్రమాదాల అంచే తత్వ శాస్త్రం!

పోటెత్తిన వాన గాన కచేరి చేసినట్లు
పులకింతల పురివిప్పిన పుర జనులవద్దే నిరుపికుంటోంది
పంటపొలాలమీద వయోధరాల పంతం లేకుండానే
రాలిన కలలపూత పేరుకున్న నిరాశతో నేను పిలుస్తున్నానంటోంది

ఆశను, కుతూహలాన్ని చంపుకోవడం అంటే మాటలా?
ఆశయాన్ని ఆనందాన్ని వ్యవసాయదిక్కుగా పాలించి
సిరులు కురిసే వానజాలం సుమధుర వాణిగా ఆలపించి
సకల జనులకు సర్వకాలాలు వినిపించేటట్టుగా నిలిచింది!

కలచివేసిన కలలలో తొలచివేసిన పదాలను జతచేర్చి
జ్ఞాన హృదయాల లోగిలిలో ముసిరిన భావాలన్నీ
ఎల్లలు లేని ఉత్సాహంతో, ఎగసిపడే ఆనందంతో
నిర్హేతుకమైన శైలీజాడలను అందుకుని ఊజిళ్ళుమూసాను

ప్రపంచం అరుదుగానో అలవాటుగానో
మారినప్పుడు ఎవరిని అడగాలి ?
ఉరిమిన కాలుష్యమేఘం తడవని దృఢసంకల్పం!
పొత్తిళ్ళలో పాపాయిలా మారి ఓటమిని మరిచిపోయింది

పరీక్షలు రాయాలంటే ఆకాశానికి భయమా?
ఏది సరైన సమాధానం అని వెదకాలంటే అవనికి భయమా?
కవిపై రాగద్వేషాలుండని ప్రతీప శక్తుల జాడలున్నాయి
ఊపిరి సలపనంత పనిలో సమాజానికి నిప్పుల పూలజాడలున్నాయి!

చీకట్లు, వెలుగు, వెన్నెలలు విరివిjై◌◌ు
వెలుగు గింజలు రాళ్ళలా చేతికి దొరుకుతున్నాయి
గట్టుమీద తుమ్మచెట్టు  గేటు వద్ద రెమ్మగాలి
మధ్యతరగతి సందేహాలు మాత్రమే కాదు నాది కూడా

వీధులన్నీ గుంపులుగుంపులుగా చేరి
నడిచే అగ్నికాండాలకు వేల్లాడుతున్నాయి
వివిధ వర్ణ సమరభావ నిలయాలకు
పచ్చిమెగ్గలు ఆమోద ముద్రకు తొంగిచూస్తున్నాయి

ఒక్క రూపాయి ఇస్తే పనివాడు
అరచేతిలో బిగించి పారిపోతాడు
ఒక్క అక్షరం అందుకంటే చాలు
కవి తనంతట తానుగా ఎవరికీ కనిపించకుండా దాక్కుంటాడు

ఏమి ప్రయోగశాల ఇది ?
ఎంతటి మహోత్కార్యమిది?
ఒక్కసారి నీ వున్న స్థానాన్ని వదిలిరా!
నీదే అనుకున్న విషయాన్ని మరలిరా!

ఈ కవిత్వపు నేలమీద పాదమోపిన క్షణాలు
ఆహారం ఎందుకు? ఆహార్యపు విహారం ఎందుకు?
అనుకోని ఘటన కాదు అరుదైన సంఘటనగా
మారి నీకు నువ్వే నాకు గమనానికి లెక్కలు చెబుతావు!

వివిధ వర్ణాల ప్రభలతో మొదలుపెట్టాను ఈ కావ్యాన్ని
ఎన్నో ఎదురుతిరిగిన సంఘటనలు!
ఎన్నెన్నో ఎదురీదిన సంఘటనలు!
చివరకు గెలుపొందిన గుబురుపొదల్లోంచి దూసుకొచ్చిన
బాణాన్నయ్యాను.

ప్రతి అక్షరం చరిత్ర కాకపోవచ్చు!
ప్రతి నిముషం సంఘటిత ప్రయోజనమే రాకపోవచ్చు!

ఇది నా భావమాల!
నన్ను నన్నుగా నిలిపిన అక్షరధార!

సమాప్తం!!